


సంపుటము 19
సంచిక 10

భారతి

చిత్రభాను ఆశ్వయుజం
1942 అక్టోబరు

పరమేశ్వరా!

= శ్రీ బులుసు వేంకటేశ్వర్లు =

౧

భవదీయం బగు సత్కటాక్షమునకుం బాత్రుండు కానట్టి మా
నవుఁ డెన్నన్ శిశిరర్తువందుఁ బడు పర్ణప్రాయుఁ, డాపర్ణమున్
జవముం జీవము వాసి రాలిపడి నిస్సారంబునై పోవు న
వ్యవసంతంబునఁ గుల్కు భాగ్యమును సంపాదింపఁగాఁజాలమిన్.

౨

ఘనపక్షంబులఁ దాల్చి పొంగిపడుచున్ గర్వప్రవృత్తాత్మ భా
నునివంకన్ బరతేఱ నాతపను తీక్ష్ణోదగ్రకీలావళిం
గని పక్షంబులు బుగ్గిగా నొడలు దగ్ధం బౌటకున్ సిద్ధమై
నను భూమిం బడు పక్షిపోల్కిఁ గను నిర్వర్ణించు కష్టాత్ముఁడున్.

3

కలలోఁగాంచిన దుఃఖముల్ మనము స్రుక్కంజేయ భ్రాంతంబుగాఁ
దెలియ న్నేరక క్రుంగిపోయి నిజ మన్దృష్టిం బ్రలాపించు, నా.
కలలోఁ గాంచిన వెంత సుస్థిరములో గాంచున్ మనుష్యుండు నా
వల మేల్కాంచినయంత, నిట్టివియపో భావింప సంసారముల్.

౪

దినములు కావు మాసములు దీఱును పోవును వత్సరంబులున్
జననము మారణంబు నను చక్రనిబద్ధములై నిరంతరం
బును సుఖదుఃఖసంజనితమోహజుగుప్సల నెన్న వెన్నఁడున్,
మనుజులు వ్యర్థపుచ్చెదరు మాన్యములైన యనేక జన్మముల్.

౫

మును నీచే నపవర్గరాజ్యసుఖసమ్మోదంబు నిత్యత్వ మం
దిన పుణ్యాత్ములు నిన్ను సారథిగ మైత్రీభూతుఁగాఁ బ్రాపుగాఁ
గొని కామ్యంబులు మంటఁగల్పి వ్రతసద్గోష్ఠిన్ త్వదీయప్రకా
శనిరూఢాత్మ విశాలవిశ్వమునఁ గాంచంజాలి రత్యంతముక్.

౬

ఉత్తముఁడైనవాఁడు పరమోత్తమధర్మ మెఱుంగువాఁడు దాఁ
జిత్తము నీపయి న్నిలిపి చింతలపొంతకుఁ బోక నిత్యమున్
హత్తుకొనుక్ ప్రశాంతహృదయంబున నీదగు పాదపద్మముల్
బత్తిని గ్రోలు నీదయిన పావననామసుధాప్రవాహముల్.

౭

అతఁడ యెఱుంగు నీదగు చరాచరభూతనివాసలక్షణం,
బతఁడ గ్రహించు నీదగు దయాపరిపూర్ణఘనాంతరంగమున్,
అతఁడ త్యజించు సర్వము త్వదన్యమహోన్నతవస్తుసంపదల్,
అతఁడ సుఖించు త్యాగజనితాద్భుతదివ్యహృదంతరస్థితిక్.

౮

సకల చరాచరాత్మక విశాల ధరాస్థల సంస్థితప్రకా
శక పరమాద్భుత ప్రబల శాశ్వత దివ్యభవత్స్వరూపమున్
సకలము నందుఁ గాంచు నిజశాంత మహాత్త్వ పటిష్ఠనిష్ఠఁ దా
సకలము నీవుగాఁ దలఁచి శాశ్వత సౌఖ్యమహాబ్ధిఁ దేలెడుక్.

దక్షిణదేశభాషలు-అందలి ప్రాచీన సారస్వతము

❁

= శ్రీ కోరాడ రామకృష్ణయ్య =

దక్షిణ హిందూదేశమున వ్యవహారములో నున్న భాషలలో ప్రధానమైనవి నాలుగు: అఱవము, తెనుగు, కన్నడము, మళయాళము అనునవి. ఇవి వ్యాకరణసంస్కారమును బొందుటయే కాక, వివిధ శాఖలతో గూడిన సారస్వతముల కాకరములై దిన దినాభివృద్ధి గాంచుచున్న వగుటచే సంస్కారయుక్తము లని చెప్పబడుచున్నవి. అవ్యాకృతములై సారస్వతము లేని వగుటచే సంస్కారహీనములని చెప్పబడుచున్న తుళు, కొడగు మొదలగునవి మఱికొన్ని యీ దక్షిణదేశమున వ్యవహారమున గలవు. వీని కన్నిటికిని సంస్కృత ప్రాకృతములతోడి సంసర్గము విశేషముగా నున్నను, ప్రత్యేకలక్షణములుగా గ్రహింపబడుచున్న కొన్ని భాషాసంప్రదాయములను బట్టి యీ దక్షిణదేశభాషలొక ప్రత్యేకకుటుంబమునకు జెందినవని కొందఱు భాషాతత్త్వవేత్తల యభిప్రాయము. ఇట్లివి యొక్క కుటుంబమునకు జెందినవగుటచేత భాషాసంప్రదాయముల విషయముననే కాక, వీనియందలి ప్రాచీన సారస్వతచరిత్ర నన్వేషించి పరిశీలించినచో, వీనిలోని కవితాసంప్రదాయముల విషయమున గూడ కొంత సామ్యము కనబడవచ్చు ననుటకు సందేహము లేదు.

ఆంధ్రభాషాసారస్వతము నన్నయభట్టారకుని భారతరచనతోడనే ప్రారంభించినట్లు సామాన్యముగా దలంపబడుచున్నది. ఆతనికి బూర్వకాలమున రచింపబడిన గ్రంథ మేదియు లభింపకపోవుటయే దీనికి ముఖ్యకారణ మైనదనుట నిశ్చయమే కాని, యట్టి యుద్గ్రంథ మీభాషలో రచింపబడుటకు బూర్వ మీదేశములో నెట్టి సాహిత్యసంచలన ముండియుండవలెనో యన్న విషయముకూడ మన మాలోచింపవలసియున్నది. భాష యెట్టి సంస్కారమును బొందనిది, దానిలో నెట్టి కవితాసంప్రదాయములును నిరూఢిగాంచనిది యట్టి గ్రంథము రచింపబడుట సాధ్యము కాదుగదా. భాషాసంప్రదాయములు, సాహిత్యసంప్రదాయములు నొక్కసారిగా నొక్కరిచే సృష్టింపబడునవి కావు. దేశకాలస్థితిగతులనుబట్టి యొక ప్రతిభావంతుడు భాషాకవితాసంప్రదాయములలో గొన్ని మార్పులను బ్రవేశపెట్టి నూతనమార్గములను దీయవచ్చును. కావున నన్నయభట్టారకు డాంధ్రభాషలో నట్టి యుద్గ్రంథమును రచించునప్పటికి దేశమున గల భాషాసాహిత్యపరిస్థితు లెట్టివో, తద్రచనకు ద్రోవ జూపిన పూర్వకాలపరిస్థితుల పరిణామ మెట్టిదో, వాని నాత డెట్లెట్లుగాని సమన్వయించుకొనెనో మనము పరిశీలించి తెలిసికొనవలసియున్నది.

నన్నయకుబూర్వ మాంధ్రభాషావాఙ్మయప్రపంచ మంధకారబంధుర మేకదా. తరువాతి వాఙ్మయజ్యోతివెలుగున గొంతవరకు తడవులాడవచ్చునేమో! ఆంధ్రభాషారచిత శాసనరూపములగు నుషఃకాంతుల జాడలు మఱికొంతదూరమువరకును మనకు మార్గదర్శులు కాగలవు. ఇంకను వెనుకకు బోవలయునన్న చిమ్మచీకటిలో తడవులాటయే. ఇచ్చట నితరసన్నిహిత భాషావాఙ్మయపరిణామపరిస్థితుల జాడలు తప్ప ఇతరాధారము లేదు. క్రీస్తుశకము తొలిదశశతాబ్దములు నాంధ్రవాఙ్మయమున నజ్ఞాతయుగమే. కాని క్రీస్తుశకారంభకాలము నాటికే తమిళవాఙ్మయ ముచ్చస్థితిలో

నున్నది. క్రీ.శ. ౫,౬ శతాబ్దములనాటికే కన్నడవాఙ్మయ ప్రజాడ లగపడును గాని యా భాషలో నిప్పటికి లభించి నంతలో తొలిరచన యెనిమిదవశతాబ్దము నాటిది. అదియు గావ్యలక్షణమును దెలుపు లక్షణగ్రంథము. ఇందు ప్రాచీనకవుల నామములు, కావ్యభేదములు, వాని లక్షణము మొదలగునవి తెలుపబడియుండుటచే నంతకు బెక్కు శతాబ్దములు పూర్వమే కన్నడభాషాకవిత పెంపొందియుండినట్లు తెలియవచ్చుచున్నది. ఇట్లే దక్షిణదేశమునందు సోదరభాష లనదగిన తమిళకన్నడ భాషలలో దాదాపు క్రీస్తుశకారంభకాలమునుండియు సాహితీవృక్షము పెంపొంది ఫలించుచుండగా, నాంధ్ర సాహిత్య మట్టిది కాకుండెనా. అట్లే యైనచో సుమారు వేయిసంవత్సరములవఱకు నిది ఫలింపకుండుటకు గారణ మేమైయుండును, క్రీ. శ. తొలి దశశతాబ్దికాలమున నిది యెట్టి పరిణామావస్థను బొందియున్నది అను నీసమస్యలు బయలు దేరకమానవు.

బాగుగా పరిశీలించినచో నీదక్షిణదేశమందు భాషాపరిణామమునకువలెనే, తద్భాషాసాహిత్యపరిణామమునకును మూలబీజము లొక్కటే యనదగినట్లగపడుచున్నది. ఇవి భిన్నప్రదేశముల, భిన్నములగు పరిసరపరిస్థితులలో బెంపొందిన వగుటచే భిన్నజాతివృక్షములుగ గనబడుచుండెనే కాని వాస్తవముగ నట్టివి కావు. ఈ భాషల కన్నిటికిని మూలములగు ప్రధాన బీజములు ఈ దక్షిణదేశీయమగు నొక్క ప్రాచీనభాషావృక్షమునుండి యేర్పడినవే యని యెట్లు తలంపబడుచున్నదో, అట్లే యీ భాషాసాహిత్యముల కన్నిటికిని సమానములగు మూలబీజము లా ప్రాచీనభాషాసాహిత్యమునకు జెందినవే యని చెప్పదగును. నారుగా బోసిన బీజము లొకజాతివే యైనను, అవి నాటబడిన ప్రదేశముల సారమునుబట్టియు, నచ్చటి శీతోష్ణపరిస్థితులు, చేయబడిన దోహదము, నీటి సౌకర్యములు, సంరక్షణ మొదలగువానిలో గల భేదమునుబట్టియు భిన్నరీతుల వృద్ధినొందినవై వేరువేరు రుచులు గల ఫలముల నిచ్చుచుండు ననుట మన కనుభవసిద్ధమే కదా. ఒకటి ముందుగా ఫలించుట, మఱియొకటి యాలస్యముగా గాపునకు వచ్చుట సంభవించుచుండును. ఒకదాని ఫలములు రుచిలోనే కాక యాకారమున గూడ భిన్నములై యుండును. ఒక చెట్టును మఱియొకదానితో నంట (టు) గట్టుట తటస్థించినచో నాయంటు విజాతీయములు, రుచ్యతరములు నగు ఫలముల నిచ్చుచుండును. ఈసామ్యము దక్షిణదేశభాషాసాహిత్యములపట్ల నన్వయించినచో వాని సామ్యభేదములకు గల కారణములు వ్యక్తము కాకపోవు.

ఆంధ్రభాషాసాహితీవృక్షమువలన మనము బడయగలిగిన తొలిఫలము క్రీ.శ. ౧౧-వ శతాబ్దిదగుటచే తమిళకన్నడభాషావృక్షములకంటె నిది మిగుల నాలస్యముగా ఫలించిన దని చెప్పవలసియుండును. కాని ఈ యాలస్యమునకు గారణము లేకపోలేదు. ఇది సంస్కృతభాషాసాహిత్యశాఖతో నంటగట్టబడినపిదప నది మన కొసంగిన మహాస్వాదుఫలము. అంతకుబూర్వ మీవృక్ష మెట్లు పెరిగి యెట్టి ఫలముల నిచ్చుచువచ్చినదో మన కిప్పుడు తెలియుట లేదు. బహుశః సంస్కృతసాహితీశాఖతో నంటగట్టబడినపిదప నీ వృక్షపు ఇతరశాఖల యేపు తగ్గిపోయి యవి నశించి యుండును. లేదా రుచ్యతరములగు నీ నూతనశాఖాఫలముల పంట యధికమగుటకుగా తొలిమాని శాఖ లొకప్పుడు ఖండింపబడుటయు దటస్థింపవచ్చును. కాని యొకప్పు డీప్రాతమాను కొమ్మలను దొడిగి చిగిర్చి పూచి కాచి ఫలించినను ఫలింపవచ్చును. ఇందు నూతనశాఖాసారము కొంత చేరుటయుగలదు. ఎట్లైనను వాని స్వరూపలక్షణము లితరసన్నిహితభాషాసాహితీ ఫలములతో బోల్చిచూచిననే కాని సుబోధములు కావు. వాని పరిణామక్రమమును దెలిసికొనలేము.

నన్నయకు బూర్వమున గల యాంధ్రసారస్వత స్వరూపలక్షణములను గూర్చి సూచింపగల సాధనములలో నన్నయాదికవుల గ్రంథములే యొకవిధమగు సాధనము కావచ్చును. ఏలయనగా, కన్నడమున తొలిగ్రంథముగా గ్రహింపబడిన కవిరాజమార్గ మా భాషలోని గద్యపద్య కావ్యరచయితల నామములను గూర్చియు, పద్యకావ్యములలోని భేదములు, వాని లక్షణములనుగూర్చియు బ్రశంసించుటచే నంతకు జిర పూర్వమే భిన్నరీతులు గల కవితాశాఖలు కన్నడ

భాషలో వెలసియుండె నని తెల్లమగుచున్నది. తెనుగులో నన్నపార్యుని గ్రంథమున నట్టివిషయ మేమియు గానవచ్చుటలేదు. పైగా తరువాతి తెలుగుకవులలో బెక్కండ్రు ఆతనిని ఆంధ్రభాషావాగనుశాసనుడు, అజ్ఞాసనకల్పుడు అను నిట్టి విశేషణములతో బ్రశంసించియుండుటచే నీతడే యాంధ్రభాష ననుశాసించి అందు కవితను సృష్టించినా డను భావము ప్రబలుట కవకాశము గలిగినది. పౌరాణిక బ్రాహ్మణమతాభిమాన ప్రోద్బలకములగు పురాణేతిహాసములను, లేదా యందలి కథలను దెనుగున రచించుటలో నన్నపార్యుడు చూపిన మార్గమునే యభిమానించి యనుసరించిన తరువాతి తెలుగుకవుల మూలముగా వ్యాప్తి గాంచిన భావమే కాని యిది మఱియొకటి కాదు. ఏలయనగా, నన్నయకు దరువాత నొకటి రెండు శతాబ్దములలో గల శైవకవు లెవ్వరు నీతని పేరైన నెత్తిన వారు కారు. భిన్నమతాభినివేశముచేతనే శివకవులు భవికవులపై క్లిత్తపండి రనియు జెప్పవచ్చును. కాని మతాభినివేశముచేత గాని, మతప్రచారముకొరకు గాని వా రవలంబించిన పద్ధతులు, వ్రాసిన వ్రాతలు నన్నయకు బూర్వమునుండియు వచ్చుచుండిన ప్రాచీనాంధ్రకవితారీతులను, సంప్రదాయములను గొంత వరకు సూచించుచున్న వనక తప్పదు. ఇట్టి రీతులు, సంప్రదాయములను ప్రధానముగా మనకు పాల్కురికి సోమనాథుని రచనలనుబట్టి కొన్ని తెలియవచ్చుచున్నవి. నన్నపార్యునితరువాత సుమారు రెండు శతాబ్దములకాలములో నున్నవా డగుటచేతను, నన్నయాది శిష్టకవు లవలంబించిన తత్సమభూయిష్ఠమగు పురాణకవితామార్గమును గాక సర్వసామాన్యమగు జాను దెనుగున దేశీయమగు ద్విపదకవితామార్గము ననుసరించినవా డగుటచేతను నాతనిచే బేర్కొనబడిన కవితారీతులు, కావ్యభేదములు మొదలగునవి నన్నయకవితా పద్ధతికంటె బ్రాచీనములును, భిన్నములు నగు పురాతనాంధ్రదేశికవితారీతులే యని మనము తలంపవచ్చును. మతవిషయమున గలిగిన భేదమును బురస్కరించుకొనియే భాషావిషయమునను, కవితారీతుల విషయముననుగూడ నీతడు భిన్నమార్గమును ద్రొక్క ననుటకు సందేహము లేదు. ప్రాచీనకాలమునుండియు శిష్టకవులచే నిరసింపబడినను, జనసామాన్యమున కనువై యుండి వారిచే నాదరింపబడుచుండిన కవితామార్గములనే చేపట్టి, తన ప్రతిభాశక్తిచే వాని కొక 'నూత్న సంగతి దనరజేసి' 'సత్కృతు'లనే రచించి యాతడు నన్నయాదులను తలదన్న దొరకొనెను. 'తేటతెనుంగున ద్విపదలనే' యాతడు రచించినను అవి 'తొమ్మిదిరసములతో దులుకాడునవి', 'ఇమ్మడి వర్ణనలతో నెసంగు' నవి, ద్విగుణములగు నలంకారములతో నసలారునవి, ద్విగుణార్థ భావములతో దీటుకొనునవి. ఇంతకు బూర్వము నన్నయాదులు రచించిన

"ఆరూఢ గద్యపద్యాదిప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ఠరచన
మానుగా సర్వసామాన్యంబు గామి"

నీతడు గ్రహించిన "జానుతెనుగు విశేషము ప్రసన్నతకు" అని తలంచియే తేటతెనుంగున ద్విపదలు రచింపబూనుకొనెను. అనాగరక, జనసామాన్యము పాటలు పాడుకొను ద్విపదలలోనా నీవు 'వరకవుల్ గొనియాడ వర్ణన కెక్క' గల కృతిని రచింప దలచిన దని శిష్టకవు లీసడింతురేమో యని కాబోలు "ఆదిప్రాస నియతి దప్పకుండగ ద్విపదలు రచింతు' నని ప్రతిజ్ఞ చేసియు, "ఒప్పదు ద్విపద కావ్యోక్తి నావలవదు" అని తానే యాక్షేపించుకొని, ద్విపదకు కావ్యప్రౌఢిని తన నేర్పరితనముచే గల్పింపదలచినట్లు వ్యక్తము చేసినాడు.

"అట్టులుగాక కావ్యప్రౌఢి పేర్మి
నెట్టన రచియింపనేర్చిన జాలు
నుపమింప గద్యపద్యోదాత్తకృతులు
ద్విపదయు సమము భావింప"
"అటుగాన యభినుతానందితోక్తి
బటుగద్యపద్యప్రబంధసామ్యముగ
గావ్యకళాప్రౌఢి గల్పింతు. ద్విపద
కావ్యంబు భావ్యంబుగాన......
....
జెనకక యింతొప్పజెప్పనే యనుచు
సన్నుతిసేయుచు సత్కవు లలర
దిన్నని సూక్తుల ద్విపద రచింతు"

అని చెప్పినాడు. నన్నయాదు లవలంబించిన గద్యపద్యోదాత్తకృతులకు బదులు ద్విపదలు, వారి సంస్కృతభూయిష్ఠరచనకు బదులు జానుతెనుగు నవలంబింపదలచితి నని చెప్పుటకు సోమనాథు డిన్నివిధముల సమర్థించుకొనవలసినవా డైనాడు. దీనినిబట్టి నన్నయ గ్రహించిన చంపూకావ్యపద్ధతిని, తత్సమభాషాబహుళమగు రచననే యీతడు మనమం దిడుకొని చెప్పియున్నా డనుటకు సందేహము లేదుగదా. కావున ప్రాచీనాంధ్రకవిత్వమున ద్విపదలకు, జానుతెనుగునకు విశేషప్రాముఖ్య ముండియుండవలయును. సంస్కృతభూయిష్ఠము, లేదా తత్సమబహుళము కాని తేటతెనంగే జానుతెనుంగు. అది 'తిన్నని నుడుల'తో గూడినది; 'ఉరుతరగద్యపద్యోక్తులకంటె సరసమై పరగు'నది; సర్వజనసామాన్యమైనది. నన్నెచోడమహాకవి చెప్పినట్లు "సరళములైన భావములు జానుదెనుంగున నింపుసొంపుతో బిరిగొనును." కావుననే దేశిమార్గములను దేశీయములుగ జేసి రచించుటయే యిటీవలి 'వరకవీశ్వరులు' సాధింపదగిన విషయ మన్నట్లుగా నాతడు కుమారసంభవమున హెచ్చరించినాడు. ఇట్టి జానుదెనుంగుభాషలో, ద్విపదాది దేశీయచ్ఛందస్సులలో రచింపబడిన కృతులే నన్నయకు బూర్వమున సర్వజనసామాన్యము లైన దేశిరచన లైయుండునని మన మూహింపవచ్చును. ఇంతవరకును బయలువడిన నన్నయకు బూర్వకాలపు తెలుగుశాసనములలోని పద్యరచన లన్నియు ద్విపద, తరువోజ, సీసము, అక్కర మొదలగు దేశీయచ్ఛందములలో గూర్పబడినవేకాని, నన్నయభారతములో గానవచ్చు సంస్కృతవృత్తరచన గానరాకుండుటచే ప్రాఙ్నన్నపార్య యుగమునందలి ప్రాచీనాంధ్రకవిత్వమున సంస్కృతవృత్తములు చేరలే దని గ్రహింప దగియున్నది. ఎనిమిదవ శతాబ్దినుండియు గానవచ్చు కన్నడ శాసనపద్యములు స్రగ్ధర, శార్దూలాదిసంస్కృత వృత్తములలో రచింపబడియుండగా తెలుగుశాసనములలోని పద్యములు దేశీయ ఛ్ఛందస్సులకుమాత్రమే సంబంధించినవగుట యొక్క ముఖ్యవిశేషమే. తెలుగున నప్పటికింకను వృత్తరచన ప్రచారములోనికి రాలేదేమో! నన్నపార్యుడే వీనిని తొలుత తెలుగుకవితలో ప్రవేశపెట్టి యుండవచ్చును. శాసనములే దేశీయచ్ఛందస్సులలో రచింపబడియుండుటనుబట్టి యాకాలపు కవితారచనలు నట్లే యుండునని తలంపవచ్చును. అట్టి రచనలనుగూర్చి యింకను దెలిసికొనుటకు సోమనాథుడే మన కాధారము.

పాల్కురికి సోమనాథుని మూలముననే మన కెఱుకపడిన ప్రథమశైవకవి మల్లికార్జున పండితారాధ్యులు. ఈతడు సోమనాథునికి బూర్వుడు; నన్నయ కొక శతాబ్దము తరువాతివాడు. ఈతడు రచించిన శివతత్వసార మను కృతి మన కిటీవలనే లభించినది. ఇది కేవలము కందపద్యమయము. జాతులలో జేర్పబడిన యీ కందపద్యములు నన్నయాదుల కృతులలో నచ్చటచ్చట గానవచ్చినను, వారి కృతులు కందపద్యబహుళము లనిరైనను చెప్పుటకు వీలులేదు. తరువాతికాలమున కందపద్యములలో జెప్పబడిన శతకము లనేకము లాంధ్రమున గలవు. వాని కీశివతత్వసారము మార్గదర్శి యని చెప్పవచ్చును. నన్నయకుబూర్వమున గల శాసనములలో నయితము కందపద్యరచన యింతవరకు గానరాలేదు. కాని కన్నడభాషలో నిప్పటికి లభించిన తొలిరచనలలో కందపద్యబాహుళ్య మున్న ట్లగపడుచున్నది. ఆభాషలో తొలిగ్రంథము, తొలిలక్షణగ్రంథము ననదగిన కవిరాజమార్గము కందపద్యబహుళ మై యున్నది. కొన్ని సంస్కృతవృత్తములును, కొద్దిగీతికలునుగూడ లేకపోలేదు. అందు పేర్కొనబడిన ప్రాచీనకావ్యభేదములగు చత్తాణె, బెదండె అనునవి కందపద్యబహుళము లై యుండినట్లే కనబడుచున్నది. ఒక కందపద్యము తరువాత నొక వృత్తమును రచించి అచ్చటచ్చట 'జాతుల'ను పొదిగిన నది 'బెదండె' కావ్యమనునట.[1] చత్తాణకావ్యమును కందపద్యబహుళముగా జేసి అందక్కడక్కడ సుందరవృత్తములను, అక్కర, చవుపది, గీతికె, తివది మొదలగువానిని అందముగా

1. "కందముమమళినవృత్తము,
మెందొందెడెగొందు జాతిజాతె సెయెబెడం
గొందివరిళమరెపేల
ల్సుందరరూపింబెదండెగబ్బమదక్కం."

జేర్చవలయునట.[2] ఇట్లు ప్రాచీనకాలములోని కన్నడ కావ్యములలో కందపద్యములకు గల ప్రాధాన్యము తరువాతికాలమున తగ్గిపోయిన ట్లున్నది. పంపాదికవుల కావ్యములలో నవి నన్నయాదికవుల కావ్యములలో వలె నచ్చటచ్చట వాడబడినవే కాని, అందు కంద పద్యములకు ప్రాధాన్యము లేదు. దక్షిణదేశభాషాచ్ఛంద స్సంప్రదాయములకు సరివచ్చు మాత్రాగణచ్ఛందము లోని ఆర్యాజాతిభేదమే యీ కందపద్య మగుటచేత ప్రాచీన దేశీయకవిత్వములో దీనికి ప్రాధాన్యము కలిగి యుండవచ్చును. ఆర్యాగీతియే ప్రాకృతమున 'ఖందనీ' యను పేరు గల దై యుండుటచే నాంధ్రకన్నడముల లోని కందము ప్రాకృతము మూలముగా నీభాషలలో జేరినట్లు తలంపదగియున్నది. కాని కన్నడాంధ్రము లందలి కందపద్యములలో సంస్కృతమున నార్యాజాతు లలో లేని ద్వితీయాక్షరప్రాసనియమ మొకటి కలదు. మఱియు నీ కందాదిజాతులలో

"గురులఘువులలో నెయ్యది
మురసంహార ప్రథమపాదముఖమున నిలిచెన్,
ధర నుపజాతులు దక్కగ
బరగ నిలుచు నవియె నాల్గుపదముల మొదలన్."

ఇదియేకాక తెలుగులో రెండునాలుగు పాదము లలో యతినియమముకూడ గలదు. క్రీ. శ. ౧౦—వ శతాబ్దినాటికే కన్నడకందములు ప్రాకృతఖందనీ పద్యములకంటె విలక్షణములై కనబడుచున్నవి. ప్రాకృత ఖందనీల ప్రాచీనత యెట్టిదో పరిశీలింపవలయును. ఎట్లైనను దక్షిణదేశభాషాసంప్రదాయసిద్ధమగు విలక్ష ణత వీని కుండనేయున్నది.

క్రీ. శ. ౧౧—వ శతాబ్దికి బూర్వమే కన్నడ సాహి త్యమున చత్తాణ, బెదండె మొదలగు కావ్యభేదములు, అక్కర, గీతికె, చౌపది, త్రిపది మొదలగు దేశీయ చ్ఛందోరచనలును ప్రచారములో నున్నట్లు తెలియు చున్నదిగదా.

తెలుగులోను అట్టి రచనారీతులు లేకపోలేదు. తెలుగున శివతత్త్వసారమును రచించిన పండితారా ధ్యుడే కన్నడమున 'బసవగీతి'లను గ్రంథమును రచిం చెను. ఇంక నీతడు 'పంచగద్దెలను' 'శంకరగీతభాష్య త్పదావళిని' 'ఆనందగీతంబు' లను పదంబులచేతనేకాక యింకను బ్రాక్తన నూతన భవ్యగీతములచేగూడ ఈశ్వరుని బొగడె నని సోమన చెప్పుటచే వీనిలో గొన్ని తద్రచితములే యనియు, నిట్టి గద్యరచన, పద కవిత్వము నాకాలమున సామాన్యజనప్రచారములో నుండె ననియు తలంపవచ్చును. కవిరాజమార్గమున విమలోదయ, నాగార్జున, సునీతి, జయబంధు, దుర్వి నీతుడు మొదలగువారు కన్నడమున బ్రాచీనగద్యకవితా రచయితలుగ జెప్పబడిరి. వారి గద్యరచనలకును, నీ శైవగద్యలకును సంబంధ ముండినను ఉండవచ్చును. ఇట్లు దేశీయగద్యపద్యకవిత్వముమాత్ర మాంధ్రకన్నడ దేశములలో నాకాలమున విశేషప్రచారములో నుండె ననుటకు సందేహము లేదు. పండితారాధ్యుడు వెల నాటిచోడుని బౌద్ధగురువుతో వాదించుటకుగా నా రాజసభకు బోవుసందర్భమున నాతనివెంట వచ్చు శిష్యులు, సద్భక్తసంఘములు పాడుచు బాడిన పద ములు మఱికొన్ని కలవు.

"పదములు, తుమ్మెదపదముల్, ప్రభాత
పదములు, శంకరపదముల్, నివాళి
పదములు, వాలెకుపదములు, గొబ్బి
పదములు, వెన్నెలపదములు, సంజ
వర్ణన మఱి గణవర్ణనపదములు
బాడుచు నాడుచు........."

నేగుదేరిరి.

శివరాత్రియందు శ్రీశైలమున మల్లికార్జును సేవించుటకై చేరిన భక్తగణములు రాత్రి జాగరణము చేయు సందర్భమున చదువు గ్రంథములు—

"శతకంబు శివతత్త్వసారంబు, దీప
కలిక, మహానాటకము, నుదాహరణ
ములు, రుద్రమహిమయు, ముక్తకావళులు
గీతనూక్తములు, భృంగిస్తవంబులు, బు

---

2. "కందగళ్ళలవాగిరె
సుందరవృత్తంగళక్కరంచవుపదెమ
త్తందర్గీతికె త్రిపదిగ
ళందంబెత్తెసెయె పేళ్దొడదు చత్తాణం."
—కవి రా. ౧—౩౭,౩౫.

రాతనమునిముఖ్య రచితాష్టకములు
అరుదొంద జదువుచు నంకించువారు."

మఱియు అరువత్తుమూఁడు చరితంబును ఏలలు వెట్టుచు జదివిరట. ఇంకను సకలపురాతనచారుగీతములు ప్రకటించి ప్రకటించి పాడెడువారు కొందరు. దీనిని బట్టి శతకము, దీపకళిక, నాటకము, ఉదాహరణము, ముక్తకము, అష్టకము మొదలగు కావ్యరచనాభేదములు క్రీ. శ. ౧౨-వ శతాబ్దికి బూర్వమే సుప్రసిద్ధము లై యుండె నని తెలియవచ్చుచున్నది. కళికోదాహరణ ముక్తకాది రచనాభేదముల లక్షణములను లక్షణగ్రంథములలో తరువాతిలాక్షణికులు కొందరు చెప్పినను, అట్టి రచనలు తరువాతి గద్యపద్యాది ప్రబంధ సంస్కృత భూయిష్ఠరచనల ధాటి కాగలేక తెలుగుకవితలో వెనుకబడిపోయినవి. శతకవాఙ్మయము తరువాతికాలమున గూడ తెనుగునాట బాగుగనే వృద్ధి నొందినది. కాని యుదాహరణగ్రంథములు మచ్చున కొకటి రెండుతక్క విశేషముగా బయలుదేరలేదు. మహానాటకస్వరూప మెట్టిదో తెలియదు. శివలీలలను బ్రదర్శించు నెంచితి,లేదా నెంచు నాటకమును బోలినదై యుండునేమో! 'దీపకళిక' అనునది ప్రత్యేకరచనా భేదముగా జెప్పబడినది. కాని యిటీవల నిది 'యుదాహరణ' గ్రంథములలో నొక పద్యభేదముగా నుండెనే కాని, ప్రత్యేకరచనాభేదముగా గానవచ్చుట లేదు. అరుదగు దాసయ్య అఱువత్తుమూఁడు చరితంబులును, బసవపురాణంబును ఏలలువెట్టుచు నింపుసొంపారు శైలిలో జదివినారట. ఏలలువెట్టుచు చదువుట యనగా రెండేసి పాదములకో, మూడేసి పాదములకో నడుమ నేమహాదేవుని పేరో రాగవరుసతో నుచ్చరించుచు జదువుట కావచ్చును. ఏలపాట లనునవి తరువాతి యక్షగానగ్రంథములలో జేర్చబడియున్నవి. ప్రత్యేకరచనలు గాగూడ కలవు. సుగ్రీవవిజయములోని యేల యొకటి యిట్లున్నది:

"భానువంశమూన బుట్టి,
దానవకామిని గొట్టి
పూని మఖము నిర్వహింపావా, ఓ రామచంద్ర
మౌనివరులు సమ్మతింపంగాన్.

రాతి నాతి జేసి పూరా
రాతిచేతి విల్లు విరిచి
భూతలేంద్రూ లెల్ల మెచ్చాగా, ఓరామచంద్ర
సీతనూ వివాహమాడావా."

ఇట్టియేలలలో నడుమనడుమ వచ్చు 'ఓరామచంద్ర' అను సంబోధనలను బోలిన సంబోధనలతో గూర్చి బసవపురాణాదులను జదివియుందురు. బసవగీతములు, ఇంకను సకలపురాతనచారుగీతములు మొదలగునవి పాడబడుచుండెనని చెప్పుటచే నవి పాటలలో భేదములేకాని గీతపద్యరచనలు కావని తోచుచున్నది.[3] ఇట్టి యనేకవిధములగు పాటలు, స్తోత్రములు, గీతములు మొదలగు రచనాభేదము లాకాలమున జనసామాన్యమున ప్రచారములో నుండెడివనుట నిక్కము. ఇక నాశివరాత్రిజాగరమున వేడ్కలు, ప్రదర్శనములు భిన్నరీతులుగ నున్నవి[4]. బహునాటకము లాడుట, తోలుబొమ్మల నాడించుచు భారతాదికథలను

---

3. పార్వతి తపశ్చరణకై కాంతారాంతరాళంబునకు బోయినప్పు డచ్చట నెలుగులేములు

"జీజీకకల్లు ద్రావి మద
సింధురగామిను లన్ని కేరియల్
వ లుచు గౌడుగీతములు
వాడుచు బొల్పుగ గ్రాలియాడు"

చున్నట్లు నన్నిచోడుడు కుమార సంభవమున వర్ణించియున్నాడు. మఱియొకచో (పండితా. పర్వ. పే 3౬౫)"భరతోక్తనేలలు పాడెడువారు" అనియు జెప్పుటచే ప్రత్యేకముగా నేలపాటలనుగూడ పాడెడివారన్నట్లు తెలియుచున్నది. కాని యీఏలలు 'భరతోక్తము' లా, దక్షిణదేశీయములా యన్న విషయము పరిశీలనార్హమైయున్నది. 'భరితోక్తి' యను పాఠాంతరము కలదు.

4. "ప్రమథపురాతనపటుచరిత్రములు
గ్రమ మొంద బహునాటకము లాడువారు
భారతాదికథల జీరమరుగుల
నారంగ బొమ్మల నాడించువారు
ఆదట గంధర్వయక్షవిద్యాధ
రాదులై పాడెడు నాడెడువారు
పురములు గాల్చినపోల్కి యాడుచును

ప్రదర్శించుట, వీథిభాగవతములనుబోలు ననేకవిధము లగు ప్రదర్శనములలో శివుని బహువిధ చరిత్రములను నాటకములుగా జేసి యాడుట మొదలగు వేడ్కలు జరిగినవి. దీనివలన నాటకరచనయు, ప్రదర్శనమునుగూడ నాకాలమున జనసామాన్యమున ప్రబలముగనే యుండె నని తెలియుచున్నది. అది యిటీవలి కాలమున ప్రదర్శింపబడుచుండెడి వీథిభాగవతములను బోలియుండు నని సోమనాథునివర్ణనలనుబట్టి మన మూహింపవచ్చును. ఆవేషములు, చర్యలు, ఆటలు పాటలు, గంతులు, చిందులు మొదలగువాని వర్ణనము చూడ సోమనాథుని కాలమునుండి యిప్పటివరకు నీవీథినాటకప్రదర్శనము లొకరీతినే యున్నవా యని యాశ్చర్యము కలుగకమానదు. ఆంధ్రలోకమున నిట్టి నాటకప్రదర్శనములు పండితపామరజనుల కాకాలము నుండియు నానందమును గూర్చుచున్నవి గనుక నే కాబోలును శిష్టకవులు ౧౫-వ శతాబ్దివరకు నాంధ్రమున నాటకరచనాభారమును వహింపలేదు. ప్రాచీనమగు నీరీతి నాటకరచనకు దక్షిణదేశమున నాయకరాజుల కాలమున రాజావలంబనము కలుగుటచే గొంత సంస్కార మేర్పడి యక్షగానరూపమున నెక్కుగ్రంథములు రచింపబడుట తటస్థించినది. ఈ యక్షగానములయందే యనేకరీతులగు దేశీయచ్ఛందోబద్ధములగు రచనావిశేషములు నిలిచియుండుటచే దాని స్వరూపములనైనను మన మిప్పుడు తెలిసికొనుట కవకాశము కలుగుచున్నది. ఇందలి దేశీయచ్ఛందోరచనాభేదము లనేకము లిప్పటికిని పామరజనులును, ముసలమ్మలును పాడుకొను పాటలలో నిలిచియుండుటచే నివి ప్రాఙ్నన్నపార్యయుగమునుండియు మనకు సంక్రమించిన దేశీయాంధ్రకవితావైభవమే యని గ్రహింపవలసియున్నది. ఈపదములు, పాటలు,గీతములు మొదలగునవే యాంధ్రకవితావైభవమునకు మూలధనము; ఆంధ్రవాఙ్మయ మహాసౌధమునకు పునాదులు; ఆంధ్రభాషా సారస్వతమహావృక్షమునకు మహత్తరమూలములు, తల్లి వేళ్లు.

ఆంధ్రకన్నడ సారస్వత వృక్షము లింకను లేత పరువున నుండగనే సంస్కృతసాహితీమహావృక్షముతో నంటుగట్టబడినవి. కావుననే యాయంట్లు శీఘ్రకాలముననే యతుకుకొని క్రొత్తవృక్షములై యతిరుచ్యము లగు నూతనస్వాదుఫలముల నొసంగ మొదలిడినవి. ఈ ప్రయత్నము సుమారు క్రీస్తుశకారంభముననే జరిగి యుండును. అప్పటికే తమిళసారస్వతవృక్షము ముదురుబారి ఫలవంత మగుటచే నాంధ్రకన్నడములందువలె సరియైన సమ్మేళనము కుదురలేదు. అంటుకట్టుటలోను, దోహదక్రియలోనుగూడ కొంత భేద మేర్పడిపోయినది. ఆయాదేశములం దప్పటి సాంఘిక రాజకీయపరిస్థి

సతి కర్ధమిచ్చిన పోల్కి యాడుచును
యతులు గొల్వగ నున్న యంద మాడుచును
గంధగజాసురు గడపుటాడుచును
జన్నంబు ద్రుంచినచాళి నాడుచును
వెన్నుండు గన్నిచ్చువేళ నాడుచును
గరళంబు దాల్చినకరణి యాడుచును"

5. "భసితంబుపూతపై బరగు బచ్చెనలు
నసలారు చిరుగద్దియలు నందియలును
గర మొప్పు తొంగళ్లు గల చల్లడములు
బొల్చు దంతావళుల్ పువ్వమాలికలు
దాల్చి యత్యద్భుతోత్సవలీల దనర
జనులు హర్షింప నాస్థానముల్ సొచ్చి
యనుకూలవివిధవాద్యసమేళనమున
నార్భటం బిచ్చి యొయ్యన జవనికల
గర్భంబు వెడలి యక్కజము వర్తిల్ల
నిక్కుచును ద్రిభంగి నిలుచుచు నట్ల
చొక్కుచు సభ జూచి యొక్కింత నగుచు,
అలరి శిరఃకంప మాచరించుచును
తనుపాదఘట్టన దనరు నుద్ఘటన
లనునయించుచు నందియల్ గదల్చుచును
జతులు పాడుచు దాళగతుల కాడుచును,
గంతులు వైచుచు ......
నొడ్డోలగంబులో నొఱసి తిర్గుచును
బురములు గాల్చినపోల్కి యాడుచును
సతి కర్ధమిచ్చిన చంద మాడుచును
గరళంబు దాల్చినకరణి యాడుచును
వెండియు భవు బహువిధచరిత్రముల
ఖండితగతి నాటకంబు లాడుచును."

తులే దీనికి ముఖ్యకారణము. కావుననే తమిళసంస్కృత భాషావృక్షముల యంటు సరిగా నంటుకొనకుండుట. నూతనవృక్షఫలముల కొక వింతరుచి కలిగినను మొదటి తమిళభాషాసారస్వతఫలముల పాంకము, వాసన, రుచియు పోకుండుట తటస్థించినది. కన్నడాంధ్రములలో క్రొత్త అంట్లు చక్కగనే యేర్పడినవిగాని, అవి నాటబడిన క్షేత్రములందు కలిగిన దోహదభేదముచే గాబోలు నొకదానికంటె మఱియొకటి యతిశీఘ్ర కాలములోనే ఫలవంత మగుట తటస్థించినది. క్రీస్తు శకము నాలవశతాబ్దమువరకు సామాన్యముగా హిందూదేశమం దంతటను బౌద్ధమతప్రాబల్యము కలిగినది. అందు దక్షిణాపథమున, ముఖ్యముగా నాంధ్ర కన్నడ దేశములందు పాలకులు బౌద్ధ మతాభిమానులే యగుటచే నాకాలమున ప్రాకృతమే రాజకీయ భాషగా నేర్పడుటయు దటస్థించినది. ఆకారణముచే జనసామాన్యవ్యవహారములో నున్న యాంధ్ర కన్నడ భాషల కప్పుడు గలిగిన సన్నిహిత ప్రాకృతభాషా సాహిత్యసంపర్కమువలన తత్పదజాలము, సాహితీరీతులు కొంతవర కీ భాషలలో సంక్రమించినవి. సంస్కృత ప్రాకృత భాషాపండితులు దేశభాషా సాహితీరీతులను గనిపట్టి వానిని సంస్కృతప్రాకృత భాషాసాహితీరీతులతో సమన్వయించి దేశభాషలకు లక్షణము నేర్పరుప దొడంగిరి. సంస్కృత భాషా సాహిత్యము లప్పటికే లక్షణసహితము లై యుండుటచే తల్లక్షణ దృష్టితో నేర్పరుపబడిన దేశభాషా సాహిత్య లక్షణములు నాదృష్టికి ప్రతిబింబములే యగుటలో నాశ్చర్యము లేదు. ఆంధ్ర కన్నడ భాషలలో వెలసి యున్న దేశికవిత యప్పటి పండితకవులకు సంస్కృత సాహిత్యమునందు విశేషముగా నచ్చకపోవుటచే వారు దీనియెడల ననాదరభావము కలవారైనను, సంస్కృత భాషారూపములను, సాహిత్యరీతులను, ఛందోరచనలను దేశభాషలలోనికి దింపి వీని కొక విధముగ గౌరవము కలిగింపజూచిరి. వీరి యీ యుద్యమము కారణముగా నప్పటినుండియే యీ భాషలలో దత్సమపదజాలము విశేషముగా జేర మొదలుపెట్టినది. సంస్కృతపదభూయిష్ఠమగు నీభాష శిష్ట జనసంఘమునందుమాత్రమే వ్యాప్తిలోనికి వచ్చి జనసామాన్యములోని కంతగా దిగియుండలేదు. కావుననే యంతకుబూర్వము జనసామాన్యమునందు వ్యాప్తిలో నున్న తెలుగుకన్నడభాషలకును, శిష్టజనసంఘమునందలి యీ సంస్కృతభూయిష్ఠమగు తెలుగుకన్నడభాషలకును గల యంతరము విశేషము కాజొచ్చినది. రాజాస్థానములయందలి సంస్కృతప్రాకృతాది భాషాపండితు లయిన శిష్టకవులు తత్సమభూయిష్ఠమగు నీశిష్టభాషలో రచించిన గ్రంథములకే రాజావలంబనము కలుగుటచే నీశిష్టభాష కొక ప్రామాణ్య మేర్పడు స్థితి గలిగినది. ఈశిష్టకవులకు సామాన్యజనుల భాషయందుగాని, ఆ భాషలో రచింపబడిన కవితయందుగాని యాదరము లేకపోవుటచే నవి వీరి యీసడింపులకుమాత్రమే గురి యగుచువచ్చినవి. ఈస్థితి కన్నడభాషలో ౮,౯ శతాబ్దములనాటికే వచ్చిన దని 'కవిరాజమార్గము'వలననే తెలియుచున్నది. ఆంధ్రకన్నడభాషాసాహిత్యములలో నీకవిరాజమార్గమే మనకు లభించిన మొదటి గ్రంథ మగుటచే, తద్భాషాసాహిత్యచరిత్రాన్వేషణసందర్భమున నిది మిగుల తోడ్పడగల దనుటకు సందేహము లేదు. ప్రస్తుతము కన్నడములో తత్సమభాషారచనను ప్రోత్సహించుచు నంతకుబూర్వము, లేదా ఆతని కాలముననుగూడ సామాన్యజనవ్యవహారములో నుండిన పఱగన్నడములో కావ్యరచననుగూర్చి యాత డేమి చెప్పియున్నాడో చూడుడు :

"అరిదాదంకన్నడదోళ్
తిరికొఱెగొండటియె పేళ్వోనెంబుదినాగ్గఁం
పరమాచార్యరవోల్
ఱ్ఱిరల్ అఱియర్ కన్నడక్కె నాడవరోజర్."

(కన్నడభాషాస్వరూపమును నేను బాగుగా చెప్పగలుగుదు ననుట మిక్కిలి అసాధ్యము. అది పరమాచార్యులకే బాగుగా తెలియదు. కన్నడదేశీయులగు జనులే ఆవిషయమున సమర్థులు.)

"దోసమిని తెందుబగెదు
ద్భాసిసితటిసందుకన్నడంగళొ ళెందుం
వాసుగియుమఱియలారద
బేసఱుగుం తేశిబెళెబేఱప్పుదటిం "

దేశి వేరువేరువిధములుగా నుండుటచేత కన్నడ భాషలోని దోష మింత యని విచారించి నిశ్చయముగా జెప్పుటకు వాసుకికికూడ సాధ్యముకాదు. వేసటకూడ కలుగునట. కావున దానికి,అనగా నీకన్నడ దేశీయమునకు లక్షణము చెప్పుట సాధ్యముకాదు అని తెల్పినాడు. అయినను అప్పటికి నిలిచియున్న కావ్యములనున్నూ, కావ్యముల లక్షణమునున్నూ సతతముగా — అవశ్యాదరణీయములుగా నెంచి శాస్త్రమును, లేదా లక్షణమును బాసుగా నెఱుగనివారు ఆ పఱగన్నడమును పాడుచేసి చెప్పెదరు. అది అందముకాదని వారికే తెలియును. 6 ఆ ప్రాతకన్నడము పురాణకావ్య ప్రయోగమున నాకాలమునందు సొగసుగా నున్నను (ఇప్పటి) అందమునకు జరద్వధూవిషయ సురతరస రసికతను బోలి విరసం కర మగును 7 అని యిట్లు ప్రాచీన కన్నడభాషలోని కవితారచనాప్రయత్నమును నిరసించి కవిరాజమార్గకర్త సమసంస్కృతమును కన్నడభాషలో మిశ్రమము చేసి చెప్పుటనుగూర్చి ప్రశంసింప దొడగినాడు. అనగా ప్రాచీనకన్నడభాషను త్రోసిపుచ్చి సంస్కృతభూయిష్ఠమగు తత్సమభాష నెట్లు కల్పించుకొనవలెనో, ఎట్లు వాడుకొనవలెనో చెప్పినా డన్నమాట. ఈదేశభాషలలో సంస్కృత శబ్దముల నెట్లు చేర్చుకొనవలెననుదే యాకాలపు శిష్టకవులను, లక్షణకర్తలనుగూడ బాధించిన ప్రధాన విషయము. కొందరు సంస్కృత వ్యయములను, విభక్త్యంతములు మొదలగు శబ్దములనుగూడ దేశభాషా శబ్దములతో జేర్చి ప్రయోగించి, వానికి సమన్వయము కల్పించి మణిప్రవాళశైలిని రచింప దొడగియుందురు. కాని యిది శిష్టకవులకు గొందరకు రుచించినట్లు లేదు. కావుననే యిది యాగమకోవిదనిగదిత మార్గము కా దని కవిరాజమార్గకర్త దీని నాక్షేపించినాడు. 8 అహరహః, ఉచ్చైః, నీచైః, ముహుర్ముహుః, ఇతస్తతః, అంతః, బహిః మొదలగు సంస్కృతావ్యయములను కన్నడమున బ్రయోగింపగూడదు. అట్లు చేసినచో గరడెయ మద్దళెయు కలిపి వాయించినప్పుడు కలుగు జర్ఝరధ్వనివలె పరుషతరమై యుండును. "బహిరంతరుపవనంగళొళహరహమా పరభృతంగళు లివరవంగళ్" అని చెప్పగూడదు. "బహిరుద్యానాంతరదొళ్ సహసోదితమత్తకోకిలోచ్చైర్ధ్వానం" అని సంస్కృతసమాసములుగా జేసి చెప్పవలయును. అరసకుమారనం, ఆయతతరకడెగణ్ణ - ఈరీతి అరిసమాసములు కూడ పనికిరావు. 'నరపతితనయనం, ఆయతతర శాపాంగం' అని చెప్పవలెను.

ఇట్టి సంస్కారమే తరువాతికాలమున నన్నపార్యు డాంధ్రభాషకును జేసి యాంధ్రభాషావాగనుశాసను డైనాడు. కాని యాతనికిని నృపతుంగాది కన్నడలాక్షణికులు, కవులునే మార్గదర్శకు లైయుందురనుటకు సందేహము లేదు. తరువాతి కేశనాదిలాక్షణికులుగూడ తత్సమభాష యెట్లు కల్పింపవలెనో యను విషయము దెలుపుటలోనే చాల శ్రద్ధ వహించినారు. వృక్షేణ, దశాయేత్యాది సంస్కృత విభక్తులు, పచతీత్యాది క్రియలు, అపి, చ, తు, హీత్యాది అవ్యయాదులు తెలుగున జొనిపి చెప్పకూడ దని కేశన ప్రత్యేకముగా నిషేధించినాడు. కావున నాకాలమున సంస్కృతమును తెలుగుచేయుట యెట్లా యను విషయమే లాక్షణికులను బాధించినట్లగపడుచున్నది. ఈలక్షణము సంస్కృతపండితులకొఱకే చేసిరా యనునట్లే యాంధ్రకన్నడ భాషాలక్షణములను గొందరు సంస్కృతభాషలోనే రచింపదొడంగిరి. ఇట్లే దేశభాషలు తత్సమభూయిష్ఠము లైనకొలది పఱగన్నడము, దేశితెనుగు అనునవి, వానిలో రచింపబడిన కవితయు వెనుకబడిపోయినవి. ఇది భాషావిషయము.

---

6. నెఽసిదకావ్యం కావ్య
కెక్కలక్షణం సతతమెందె పఱగన్నడమం
పొల(గె)డిసి నుడివరాగమ
బలహీనర్ దేసియల్ల దెందఱిదిర్దుం ౧-౪౭

7. దొరకొండి రెసొగ యిసుగుం
పురాణకావ్యప్రయోగదొళ్ తత్కాలం
విరసంకరమప్పు దేసిగె
జరద్వధూవిషయసురతరసరసికతవోల్. (౫౦)

8. సమసంస్కృతంగళొళ్ త
త్సమదీఱెకె కన్నడమనఱిదు పే(ర్గ్గెం)బుదిదా
గమకోవిదనిగదితమా
ర్గమిదం బెరసల్కమాగదీ సక్కదదొళ్."

ఇక కవితాసామగ్రియగు గుణదోషాలంకారాదు లనుగూర్చిన రచన లన్నియు సంస్కృతాలంకారికుల రచనల యనుకరణములే. ఆకాలమున దండిభామహా దుల ననుసరించి గుణదోషాలంకారప్రకరణములను రచించిన కవిరాజమార్గమే దీనికి నిదర్శనము. తెనుగున విన్నకోటపెద్దనాదులు నట్లే చేసిరి. సంస్కృతమున ప్రతాపరుద్రీయమునకు బదులుగా తెలుగున నరస భూపాలీయము వెలసినది. అందలి ధ్వనిభేదములకు, రీతి గుణాలంకారాదులకు మూలగ్రంథములనుబట్టి యాయా లక్షణకర్త లుదాహరణములను స్వయముగ కల్పించిరే కాని, తెలుగుకవుల రచనలలోనుండి యుదాహరించి వాఙ్మయముతో లక్షణసమన్వయము చేసి చూపుటకు వారు యత్నింపలేదు. సంస్కృతపదములను, సమాస ములను దెనుగున జేర్చుట యెట్లో యను విషయమున వైయాకరణులు తాపత్రయము పడినట్లే, సంస్కృతా లంకారపద్ధతిని తెనుగులోనికి దెచ్చుటయే వీరు తమ విధ్యుక్తధర్మమని తలచి దానిని నెరవేర్చిరి. ఈ లక్షణ మునుబట్టి ముందెవ్వరైనను వ్రాయవచ్చునుగదా యని కాబోలు. కన్నడమున కవిరాజమార్గకర్త కన్నడఛంద స్సునుగూర్చి వ్రాయలేదు. తెలుగున కవిత్రయమువలెనే కన్నడమున రత్నత్రయము భారతాదిప్రసిద్ధగ్రంథ ములను రచించినతరువాతగాని ఛందోలక్షణమును గూర్చిన గ్రంథము బయలువెడలలేదు. క్రీ. శ. ౧౦-వ శతాబ్ద్యంతమున 'ఛందోంబుధి'యను ఛందోలక్షణ గ్రంథమును రచించిన మొదటినాగవర్మ రత్నత్రయ మునకు దరువాతివాడే. మరియు నీకన్నడకవు లందరునుగూడ నన్నయకు బూర్వులే. నాగవర్మ ఛందోంబుధి వ్రాయుటకు చిరపూర్వమే, అనగా 3 వందల సంవత్సరములకు బూర్వమే కన్నడ భాషలో సంస్కృతవృత్తరచన ప్రారంభమైనది. క్రీ. శ. ౭౦౦ నాటి శ్రావణ బెళగొళశాసనములలో సంస్కృతవృత్తములలో రచింపబడిన చక్కని కన్నడ పద్యములు గలవు. అంతకు బూర్వపు శాసనములు వచ నమునందే యున్నట్లగపడుచున్నవి. తెనుగునందును ఇప్పటికి లభించిన ౭, ౮ శతాబ్దులనాటి శాసనము లన్నియు వచనరచనలతో గూడినవే. శాసనములలో పద్యరచన ౯-వ శతాబ్దినుండియు గానవచ్చుచున్నది. అయితే ౮-వ శతాబ్దినుండియు కన్నడశాసనములు సంస్కృతవృత్తబహుళము లైయుండగా, తెనుగు శాసనములలోని పద్యములు — నన్నయకాలము వరకును, అతనికాలమున గూడ — దేశీయఛందోరచనలే యై యుండెనుగాని సంస్కృతవృత్త రచన లింతవరకు గనబడలేదు. ప్రాచీన కన్నడశాసనములలో దేశీయ ఛందోరచన లత్యల్పముగానున్నవి. దీనినిబట్టి సంస్కృత భాషాచ్ఛందోలంకారలక్షణప్రభావ మాకాలమున, అనగా (నన్నయకుబూర్వము ౪ శతాబ్దములు) చాళుక్య ప్రభువుల కాలమున నాంధ్రభాషాకవితలపై- కన్నడ భాషాకవితలపైవలె- నంత ప్రబలమై యుండలేదని తోచుచున్నది. దీనికి దగిన కారణమును లేకపోలేదు. కన్నడవాఙ్మయమునందలి తొలియుగము జైనయుగము. ఈ యుగమునందలి ప్రసిద్ధకవులు కవిరాజమార్గకర్త పంప, పొన్న మొదలగువారిచే ప్రాచీనకవులుగా నెన్నబడిన సమంతభద్ర, పూజ్యపాద, కవిపరమేష్ఠి, విమలోదయ, నాగార్జున, జయబంధు, దుర్వినీతాదులు జైనులు, జైనమతాభిమానులైనను గొప్ప సంస్కృత పండితులు. అందు వ్యాకరణాది గ్రంథములనుగూడ రచించినవారును కొందరు గలరు. వీరందరును క్రీ. శ. ౫, ౬ శతాబ్దములవారుగా దలంపబడుచున్నారు. కావున నప్పటినుండియు గన్నడభాషలో బండితకవులు కవితారచనను ప్రారంభించియుండినయెడల ౭, ౮ శతాబ్దములనాటి శాసనములలోగూడ సంస్కృతవృత్త ములలో రచింపబడిన కన్నడపద్యము లగపడుటలో నాశ్చర్యమేమున్నది? క్రీ. శ. ౮-వ శతాబ్దినాటి శ్రావణబెళగొళశాసనములలో నొకటి (Ep. car. II. 88): మహాస్రగ్ధర—

"సురచాపంబోలె విద్యు
ల్లతెగళ తెఱవోల్ మంజువోల్ తోఱిబేగం
పిరిగుం శ్రీరూపలీలా
ధనవిభవమహారాశిగళ్ నిల్లవార్గం
పరమార్థం మెచ్చెనా నీ
ధరణియుళ్ ఇరవా నెందు సన్న్యాసనంగె
య్దురు సత్వన్ నందిసేన
ప్రవరమునివరన్ దేవలోకక్కె సన్దాన్".

ఇందలి "శ్రీరూప....రాశిగళ్", "నంది.... వరన్" ఇత్యాది దీర్ఘసమాసములు కన్నడముపై సంస్కృత భాషాప్రాభవమును దెలుపుచునేయున్నవి గదా. ఇట్లే మత్తేభము, శార్దూలము, వసంతతిలకాది వృత్తము లనేకములు శాసనములలోనికే యెక్కినవి. కాని యీవృత్తముల కన్నిటికి నేదోవిధముగా నొక దేశీయతాముద్ర వేయనిది వీరు కన్నడమున గ్రహింప లేదు. వీని కీదేశీయత ద్వితీయాక్షర ప్రాస నియమమువలన గలిగిన దనవచ్చును. ఇది దేశీయములగు అక్కర, చౌపది, త్రిపది మొదలగు పద్యములందువలెనే సంస్కృతమునుండి గ్రహింపబడిన వృత్తములందును బాటింపబడినది. ఇంతేకాక సంస్కృతమందలి విశ్రమరూపమగు యతినియమ మిందుల్లంఘింపబడినది. ఈ యతివిలంఘన మనునది కన్నడ కవితావిశేషలక్షణములలో నొకటిగా కేశిరాజు శబ్దమణిదర్పణమున మఱికొన్నిటితో జేర్చి యిట్లు చెప్పినాడు :

"గమకసమాసదిం అలఘుళక్షళదిం
శ్రుతిసహ్యసంధియిం
సముచితమాగి బర్పసతి సప్తమియిం
సమసంస్కృతోక్తియిం
వమహాపభేదదిం విరహితావ్యయ
సంస్కృత లింగదింపదో
త్తమ శిథిలత్వదిం యతివిలంఘనదిం
దరిదత్తెకన్నడం."

సంస్కృతమునందలి యార్యాజాతిభేదమగు ఆర్యాగీతి ప్రాకృతమున 'ఖందనీ' అను పేర బరగినదై, కన్నడాంధ్రములలో 'కంద' పద్యమైనది. ఈ రెండు భాషలలోనుగూడ నీ దక్షిణదేశభాషాసంప్రదాయసిద్ధమగు ప్రాసనియమ మీకందపద్యమునగూడ బాటింపబడినది. ఇట్లు సంస్కృత ప్రాకృత వృత్తములలోనికిగూడ నెగబ్రాకిన యీ ప్రాసనియమము కన్నడాంధ్రభాషా సామాన్యములగు అక్కర, చౌపది, రగడ, ఉత్సాహ, షట్పది, తరువోజ మొదలగు దేశీయపద్యములన్నిటిలోను సహజముగా నున్నదే. కన్నడాంధ్ర లక్షణకర్తలు పై దేశీయపద్యములకు జాతు లని పేరు పెట్టియున్నారు. కన్నడమున 'గీతికె' అనుదానికి గూడ నీ ప్రాసనియమ ముండుటచే నిది జాతులలో జేరినది. తెనుగునందలి 'గీతము'నకు బ్రాసనియమము లేదు కాని వడినియమమమాత్రము కలదు. ఇంతేకాక పద్యలక్షణమందే యీరెంటికిని భేదము కలదు. తెనుగున సీసమనునది ప్రాసనియమములేని మఱియొక దేశీయ పద్యభేదము. ఈ గీతమును, సీసమును చేర్చి యుపజాతులను నొకతెగ కల్పించినారు తెలుగులాక్షణికులు. వీనిభేదము నప్పకవి యిట్లు వివరించినాడు:

"జాతులు కందాదిక ముప
జాతులు గీతాదికములు సరసిజనయనా"

"గురులఘువులలో నెయ్యది
మురసంహర ప్రథమపాదముఖమున నిలిచెన్,
ధర నుపజాతులు దక్కగ
బరగ నిలుచు నదియె నాల్గుపదముల మొదలన్.
ధరణిన్ జాతుల కాదివర్ణ మ్మొకడే
తప్పంగ రా దెల్లెడన్
హరి తజ్జాతిగణంబులైన సరి యి
ట్టట్లైన గావచ్చు మం
దరధారీ యుపజాతులం బ్రథమవ
ర్ణంబున్ యథేచ్ఛంబుగా
సారిదిం జెప్పగవచ్చు బ్రాసములు ని
ల్పన్వల్లకై యొక్కచోన్."

ఇట్లు తెలుగుకవితలోని పద్యరచనలలో సంస్కృతమందు గాని, కన్నడమందుగాని లేని వడి నియమ మొక ప్రత్యేకవిశేషముగా గనబడుచున్నది. కన్నడకవులు సంస్కృతవృత్తములలోని విచ్ఛేదరూపయతినే యుల్లంఘించియుండగా, తెలుగు కవులు కన్నడాంధ్రములకు సమానమై దేశీయ సంప్రదాయసిద్ధమగు ప్రాసమునే కాక యతిస్థానమున వర్ణసామ్యరూపమగు వడినిగూడ బ్రవేశపెట్టినారు. ఇది కన్నడాంధ్రములకు సమానములే యగు అక్కరాది దేశీయచ్ఛందోరచనలలో గూడ కన్నడమున బాటింపబడక తెలుగులో బాటింపబడుచుండుటను బట్టి యతి చిరకాలముక్రిందటనే కన్నడాంధ్రములలోని దేశీయకవితారచన భిన్నమార్గములనుబట్టి

పాడుచున్నదని తలంపదగియున్నది. ఈవడి, ప్రాసనియమములు రెండునుగూడ సంస్కృతప్రాకృత కవితా సంప్రదాయసిద్ధములు కావుగనుక, నవి ప్రాచీనదేశీయ సంప్రదాయసిద్ధములే యైయుండవలయును. ఈభాషల లోని ప్రాచీన శాసనయుగమునకు బూర్వస్థితి యంధకారమయమే కావున, వీనికి సన్నిహితమగు తమిళ భాషావాఙ్మయమందలి కవితాసంప్రదాయములను బట్టి పరిశీలించిన నొక మార్గ మేర్పడునేమో పరిశీలింతము. తమిళభాషావాఙ్మయము తక్కిన దక్షిణదేశ భాషలలోనిదానికంటె నతిప్రాచీనమైన దని యిదివరకే తెలుపబడినది. అందు సంఘవాఙ్మయ మనునది క్రీస్తు శకారంభమునకే మిగుల నుచ్ఛస్థితిలో నున్న దనుటకు సందేహము లేదు. ఈ వాఙ్మయమునుబట్టియు, నాకాలపు ప్రధానలక్షణగ్రంథ మగు 'తొల్కాప్పియ' మును బట్టియు దత్కవితాసంప్రదాయములను మనము గ్రహింపవచ్చును. వానిమూలమున నాంధ్రకన్నడ కవితాసంప్రదాయములయందలి విశేషలక్షణములు కొన్ని సమన్వయము కాగలవు.

ప్రస్తుతము కన్నడాంధ్రములందు విశేషలక్షణములుగా గనబడుచున్న యీప్రాసవళ్లనునవి తమిళము నందలి 'తొడై' అనుదానికి సంబంధించియున్నవి. 'తొడై' అనగా మైత్రి; అక్షరమైత్రి. ఇది యైదువిధములుగా నున్నది. అందు మొనైత్తొడై, యెదుగైత్తొడై అనునవే ఆంధ్రకన్నడములందు యతిప్రాసరూపములుగా పరిణమించిన వని చెప్పవచ్చును. వీనిలో నొక్కొక దానిలో నెనిమిదేసి రీతులు గలవు. అందు—పొటిప్పు మోనై – అనగా నొక పద్యములోని యొక్కొక్క పాదములోని మొదటిగణముయొక్క మొదలియక్షరము, మూడవగణముయొక్క మొదలియక్షరము మైత్రి గలదై యుండవలెను. రెండవగణము నాల్గవగణముల తొలియక్షరములుకూడ మైత్రి కలిగియుండవలెను. ఇది సామాన్యముగా పాదమునకు నాలుగుగణములు గల పద్యములనుగూర్చి చెప్పినట్లు కనబడుచున్నది. కావున మన దేశీయపద్యములలో ప్రధానములగు ద్విపద, తరువోజ, సీసము, రగడ మొదలగువానినుండి మన ముదాహరించుట కవకాశము కలదు.

ద్వి. సురపతిత్రితయంబు-సూర్యు డొక్కండు
విరమంబు రెంటిపై - వెలయు నొక్కటికి.

తరువోజ. నలనామకంబులు నగణాంతములుగ
నాలుగంఘ్రులయందు నాలుగు గూర్చి
వళులు మూడేసలను వరుసతో నిల్ప
వలయు మూడవ గణవర్ణంబు మొదల.

ద్విరదగతిరగడ—

కరమొప్పు పంచలఘు-గణచతుష్టయముచే
విరమంబు రెంటిపై-ద్విరదగతి పేరిచే.

సీ. విజయసారథిగాని-వినుతింపగా నొల్ల
గిరినాయకుని గాని-కీర్తిసేయ...

పైవానిలో మొదటిగణము మూడవగణముల మొదటి యక్షరముల మైత్రి కలదుగాని, రెండవగణము నాలవగణముల మొదటియక్షరముల మైత్రి పాటింపబడలేదు. కాని యీపద్యము లిటీవలికాలము నాటివి. ప్రాఙ్నన్నపార్యయుగములో నట్టివే యుండియుండవచ్చును. ఇప్పటికిని దేశీయములగు పాటలలోను, పద్యములలోను రెండవవిధమగు మైత్రి పాటింపబడినవి పరిశీలించిన లభింపవచ్చును.

ఒరూఉ మోనై:— ఒకపద్యములోని నాల్గుపాదములలోను ఒక్కొక్క పాదమునందలి మొదటి గణముయొక్కయు, నాలవగణముయొక్కయు మొదటి యక్షరములకు మైత్రి యుండవలెను. తెనుగునందలి యాటవెలది, తేటగీతి మొదలగు పద్యములలో నిట్టి నియమము పాటింపబడుచున్నది.

ఆ-వె. మూడు నగణహగణములు రెండు నలనామ
కములు హగణపంచకంబు గూర్ప
నాటవెలదియగు లంబునిభులపట్ల
ప్రాలు వళ్లు జెంది వఱలెనేని.

గీ. నగణ మొక్కండు వాటి నలనామకములు
రెండు నగణంబులును దుద రెండునాలు
గడుసులును దేటగీతికి నద్ధివిరతి
వలయు వర్ణైన ప్రాసైన వరుస నిలుప.
"పువ్వు పేరే జాజి-పువ్వు

పురము పేరే అయోధ్య పురము
దేవి పేరే సీతా దేవి"

ఈ రెండురీతుల మోనై తప్ప తమిళమునందలి తక్కిన ఆరురీతుల మోనైలును తెలుగు శిష్టకవితలోని పద్యములలో గానరావు. వానికి ప్రాచీన దేశీయకవితలో నుదాహరణములు దొరకిన దొరకవచ్చును.

కూళై మోనై :— తుదిగణముతప్ప ఒక పద్య పాదములోని అన్నిగణముల మొదటి అక్షరములును మైత్రి గలిగియుండవలయును.

గుడుగుడు గుంచం గుండే రాగం
పాముల పట్టం పడగా రాగం
చమ్మ చక్క చారెడేసి మొగ్గ
అట్లుపొయ్యంగ ఆలకించంగ.

ముట్రుమోనై:— అన్ని గణములలోని మొదటి యక్షరములును మైత్రి గలిగియుండవలయును.

ఉత్కళిక – గొల్లలెల్ల దల్లడిల్ల – జెల్లు జల్లులల్లి రాళ్ల
సోనవాన మానపూని – కానరాని కోనలోన
చుట్టు పట్టి గట్టి దిట్ట – రొట్టు గట్టు మట్టు గట్టు
నూచిలోచినోచిమోచి–బ్రోచినట్టి వామనునకు.
(అప్పక. ౫–3౨౫)

ఆంధ్రకన్నడములలోని ప్రాసమును తమిళమున 'ఎదుగై', లేదా 'ఎదుగైత్తొడై' అని యందురు. పద్యమునందలి ప్రతిపాదములోని రెండవ యక్షరము మైత్రి కలిగియుండుట. ఇదియు నాభాషలో ననిమిదిరీతులు గలిగియున్నది. వీనిలోను అన్నిటికి దెనుగులో నుదాహరణములు దొరకుట సులభసాధ్యము కాదు.

'అడియెదుగై':—అనగా నొకపద్యము అన్ని పాదములలోని మొదటిగణము రెండవయక్షరములు పరస్పరము మైత్రి కలిగియుండుట. ఇదియే యాంధ్రకన్నడములలోని జాతులను పద్యము లన్నిటిలోనే కాక సంస్కృతప్రాకృతములనుండి గ్రహింపబడిన పద్యము లన్నిటిలోనుగూడ బాటింపబడుచుండినది. తెలుగున నుపజాతిగణములో జేర్పబడిన గీతసీసపద్యములలో మాత్రము లేదు. కాని వీనిలో యతికి బదులుగా దీనిని వాడుట కలదు. కావున నాలుగుపాదములలోను ప్రాసయతి వేసినయెడల నాపద్యముకూడ 'అడియెదుగై' కల దగును. కన్నడమున గీతికలలో నీప్రాసనియమమే కలదు. తెలుగునందలి సర్వతఃప్రాససీసమున నీ 'అడియెదుగై' పాటింపబడిన దని చెప్పవచ్చును.

ఇణై యెదుగై:— అన్ని పాదములలోని మొదటి రెండుగణములలోని రెండవయక్షరములు మైత్రి గలిగియుండవలయును. వృత్తప్రాససీసము, లేదా అక్కిలిప్రాససీసము అనునది దీని కుదాహరణము కావచ్చును.

శిక్షించె నెవ్వాడు చేటుకై సభలోన
జెడుమాట లాడిన చేదివిభుని
రక్షించె నెవ్వాడు ద్రౌణిబాణముచేత
జిదియకుండగ బరిక్షిన్నృపాలు
భక్షించె నెవ్వాడు పర్వతాకృతిచేత
నాభీరు లర్పించు నారగింపు
వీక్షించె నెవ్వాడు వేడ్కతో సేవకుల్
బ్రతుకునట్లుగ కృపాపాంగదృష్టి...

పొఱిప్పెదుగై:– అన్ని పాదములలోను గణములలో నొకటి విడిచి యొకదాని రెండవ యక్షరములు మైత్రి గలిగియుండవలయును.

సర్వతఃప్రాససీసము దీని కుదాహరణము కాగలదు.

వేదండవరదుండు వేధోండగాంగుండు
కాదేనశయనుండు యాదవేంద్రు
డాదిత్యవంద్యుండు నాదాససులభుండు
వేదాంతవేద్యుండు కాదనీలు
డాదితేయుడు బిందు నాదకళాతీతు
డాదిత్యకులజుడు బాధితారి
మేదినీశ్రీసుండు భూదరగాత్రుండు
శ్రీదమిత్రసఖుండు ద్వాదశాత్మ.

ఒరూఉవెదుగై:– అన్ని పాదములలోని ఒకటవ నాలవ గణములలోని రెండవయక్షరములు మైత్రి కలిగియుండవలయును.

అర్ధచంద్రికలు : అక్షర హరివిక – చాంబురుహాక్షుణ్
యక్షపసఖునుత – యదుకులదక్షుణ్
రక్షకసురవిభు – రద్విపరక్షుణ్
రాక్షసవిదళన – ప్రరుచిగవక్షుణ్.

ముఱ్ఱెతుగై:- అన్ని పాదములలోని అన్ని గణముల రెండవయక్షరములు మైత్రికలిగియుండవలెను.

మధురగతిరగడ —

కరధృతకరుహుని — గరిహితకరణుని
గరుహాసఖరుచిని — గరుడఖగధరుని
ఖరఘనకరవిని — ఖరతరకరగుని
గరళముఖరిపుని — గరధరకరతుని.
(అప్పకవీయము, ౫ — ౧౮౨)

పొటిప్పిఱయెప్పు అనునది ఇయైప్పుత్తొడై అనుదాని యెనిమిది భేదములలో నొకటి. ఇందు ఒకటి విడిచి యొకటిగా గణముల తుదినుండు అక్షరములు మైత్రి గలిగియుండవలెను. దీని కప్పకవి గుచ్ఛబంధమున కుదాహరణముగా నిచ్చిన మాణవకవృత్త ముదాహరణము కాగలదు.

గాదిలితో మాలదిగా —గా దిలకించెం బదిగా
గాదిబకృష్ణుండదిగా — గాదిడవా చాలిదిగా.

ఇంకను వీనిలో భేదములు కలవుగాని వాని కుదాహరణములు తెనుగుకవితలో లభించుట దుర్లభముగా నున్నది. ఇంతవరకు తెనుగుకన్నడములలో నక్షరసామ్య రూపముగ నున్న యతిప్రాస లనునవి యేదో యలంకారముకొరకై మధ్యకవులు కొందరు తెచ్చిపెట్టుకొన్నవి కాక క్రీస్తుశకమునకు మున్నే తమిళవాఙ్మయమున బరిపాటిలోనున్న ప్రాచీనద్రావిడ కవితాసంప్రదాయసిద్ధమైన 'తొడై' అనుదాని రెండు రీతులతో సంబంధించినదే యని తెలుసుకొన్నాము.

తొడై అనుదానిలో మఱియొక భేదము కలదు. ఇది ఇయైప్పుత్తొడై. ఇది పాదములలోని తుదిగణముల యొక్కగాని, అక్షరములయొక్కగాని మైత్రితో సంబంధించినది. దీని కుదాహరణముగా నొక కళిక.

"మఱియు బ్రహ్మమాయ గెల్చి-మసలుమంత్రవాదిచేత
నెఱిగి సాంథకునకు వరము-లిచ్చి మెఱయుమోదిచేత"

లాలిపాట—"లాలి శంకరసదాలాలితకుమారా
లాలి పటుతాండవోల్లాస ఘనధీరా"

"భూదేవికూతుర్ని కోయిలారో
జనకునికూతుర్ని కోయిలారో
దశరథుకోడల్ని కోయిలారో
శాంతకు మరదల్ని కోయిలారో"

"వద్దనకూడదమ్మా — వినవమ్మ
ఎఱ్ఱావుపాలుసుమ్మా,
ఎఱ్ఱగా గాచిరమ్మా — మాయమ్మ
జుఱ్ఱవే ముద్దుగుమ్మ
సుదతి భుజియించలేకా — నిజప్రసవ
వేదనకు నిలువలేకా
నొప్పులని చెప్పలేకా — చెప్పకను
చెలుల కనుగప్పలేకా."

దీనిలో ననేకభేదములు కలవు: అడియియైపుత్తొడై — ప్రతిపాదములోని మొదటిగణము తుదియక్షరముల మైత్రి.

"గుమ్మడేడే గోపిదేవి
గుమ్మడేడే కన్నతల్లీ
గుమ్మడిని పొడచూపగదవే
అమ్మ గోపెమ్మ"

'తొడై'లో మఱియొక భేదము అళపెడైత్తొడై. పద్యములలోని గణములకొరకు కొన్ని అక్షరములను పొడిగించుట. ఒకపదము ఆదియందుగాని, మధ్యనుగాని, అంతమందుగాని ఒక దీర్ఘాచ్చుకు హ్రస్వాచ్చును చేర్చవచ్చును. హ్రస్వాక్షరములతరువాత పదమధ్యమందుగాని, పదాంతమందుగాని అనునాసికాక్షరములకు, అంతస్థములకు ద్విత్వము కల్పించుట. వీనిని కొన్ని పాటలలో గుర్తింపవచ్చునేమో.

"శ్రీరామభూపాలు-డూ (ఉ)-పట్టాభి
షేకుడై యుండగానూ (ఉ)"

"గుడుగుడుగుంచం-గుండేరాగం
పాములపట్టం పడగారాగం
........................"

"నీ(-ఇ) గుఱ్ఱం నీళ్లకు పోతే
నా(-అ) గుఱ్ఱం పాలకు పోతే"

"కొండామీదా కొక్కిరాజా
గుండూ విరిగీ పా(-అ)డే .
దాని (-ఇ)కేమి మం(మ్)దూ"

ఇట్లీయతిప్రాసాదినియమవిశేషములవలెనే తెలుగుకవితకు విశేషలక్షణములుగా గనబడుచున్న సీసగీతాదులును, ఇంక నితరములగు ఛందోరచనలును తమిళమునందలి నేర్ నిరై శీర్లను గణములతో గూడిన ఛందోరచనలతో బోల్చి పరిశీలించిన, నివి యన్నియు ప్రాకృతభవములు గాక ప్రాచీనద్రావిడకవితాసంప్రదాయసిద్ధములే యని యేర్పడవచ్చునని తోచకమానదు. వీనినిగూర్చి మరియొకవ్యాసమున బరిశీలింతును.

అన్నిటికిని శ్రీ శాస్త్రిగారి ఛందము ననువర్తించిరే వారి వాదము సరి కాదని ప్రమాణపురస్సరముగా నిరూపించుచున్న నేనైనను రామాయణము మహాకావ్యము కాదనుకొనియే పాణినీయమునాఁటి కావ్య వాఙ్మయ మేదియో నిరూపించెదను. కావ్యపరిభాషలును, నాటకపరిభాషలును విపులముగాఁ బాణినికిఁ బూర్వమే స్మృతిపురాణాదులలోఁ బ్రసిద్ధికెక్కి యున్నవని నాఁటి వాఙ్మయమే చాటిచెప్పుచున్నది. ఇట్టి పరిభాషలు లక్ష్యవాఙ్మయము లేక యేనాఁడును జగద్విదితములు కానేరవని విమర్శకులగువారికి వేఱుగాఁ జెప్పవలసిన యంశము కాదు. పై నిదర్శనములఁబట్టి పాణినీయమునకంటెఁ జాలఁ బ్రాచీనముగానే కావ్య వాఙ్మయము ప్రసిద్ధమై యున్నదని మన మనుకొనవచ్చును. ఇఁకఁ బాణినీయమునకు మూల పురుషులగు మునిత్రయమువారిని, గ్రమక్రమముగా నుదాహరించుచు వారు సాధించిన కావ్యప్రయోగములు, పేర్కొనిన కావ్యములు, నిపతించిన శబ్దములు మున్నగు నిదర్శనములఁబట్టి వారినాఁటికిఁ గల కావ్యవాఙ్మయ మెట్టిదియో దానినిపయిత మొకింత పరికింతము.

పాణిని

ఇతఁడే వ్యాకరణమును మొట్టమొదట సూత్రరూపముగాను, గణరూపముగాను ననుశాసించినవాఁడు. ఈతని నాఁటి వాఙ్మయమును బరిశీలింపవలయునన్న నితఁడు రచించిన సూత్రములు, నిర్దేశించిన గణములే మన కిప్పుడు ముఖ్యముగా నాధారము లగునవి. వాని నాధారముగాఁ జేసికొనియే యీ క్రింద నతని కాలమున శ్రవ్యకావ్యములే కాక దృశ్యకావ్యములు సయితమెట్లు విస్తరిల్లినవియో తిలకింతము.

పాణిని సూత్రించిన 'పారాశర్య శిలాలిభ్యాం భిక్షునటసూత్రయోః', 'కర్మందకృశాశ్వా దినిః' అను సూత్రములవలన 'శైలాలినః'— శిలాలిప్రోక్తమగు నాట్యగ్రంథమును జదువువారు, 'కృశాశ్వినః'— కృశాశ్వప్రోక్తమగు నాట్యగ్రంథము నధ్యయనించువారు అను రూపములు సిద్ధించుచున్నవి. పై సూత్రములను బట్టి 'కృశాశ్వుఁడు', 'శిలాలుఁడు' అనువారు నాట్యగ్రంథములను రచించి రనియు, నటు లవి చదువుకొనువా రనియు స్పష్టమగుచున్నది. 'ఛందోగౌక్థిక యాజ్ఞిక బహ్వృచనటాఞ్ఞ్యః' అను సూత్రముచే "నటానా మామ్నాయః—నాట్యమ్, నటానాం ధర్మః నాట్యమ్" అనురీతి నర్థద్వయమందును బ్రత్యేకముగా నటశబ్దమును నిర్దేశించి నాట్యశబ్దమును సాధించెను. మఱియొకచో 'కర్మవేషా ద్యత్' అను సూత్రముచే 'వేషేణ సంపాదీ = వేషముచే ధనము నార్జించువాఁడు' అను నర్థమున నటపర్యాయముగా వేష్యశబ్దమును సాధించెను. దీనినిబట్టి నటు లానాఁడు వేషధారులై నాటకము లాడుచు ధనము నార్జించుట సయితము సుప్రసిద్ధ మనియు, నాట్యలక్షణ గ్రంథము లానాఁటికే యనేకములు సుప్రసిద్ధములై యున్న వనియూ మన మూహించుట కవకాశ మేర్పడుచున్నది. ఇదిగాక "నటస్య స్త్రీ = నటుని భార్య" యను నర్థమున 'పుంయోగా దాఖ్యాయామ్' అను సూత్రముచే 'నటీ' అను జీషంతరూపము సిద్ధించినను, నాట్యపరిభాష కిది తగినది కాదని గౌరాది గణములో 'నట' శబ్దమునకుఁ గంఠోక్తముగాఁ బ్రత్యేకపాఠ మొనర్చి 'నటీ' శబ్దమును నిష్పన్న మొనర్చినాఁడు. చూచితిరా! పాణినీయము కావ్యవాఙ్మయమున నెంత జాగరూకత వహించినదియో! ఇది యొక్కటియే కాదు. శైలూషాదిశబ్దములకు సయితము ప్రత్యేకముగా గణపాఠ మొనర్చి యితఁడు సాధించిన నాట్యపరిభాష లిట్టివి యనేకములు. ఇంకొక విశేషము. గౌరాదిగణమున 'నాట'[1] శబ్ద మొకఁడు పాణినిచేఁ బఠింపఁబడినది. ఈగణపాఠమున నీ నాటశబ్దమునకు జీష్ప్రత్యయము రాఁగా 'నాటీ' యని యగును. ఈ నాటీశబ్దముచే 'నాటిక', 'ప్రకరణిక' అను రెండు దృశ్యకావ్యములును వ్యవహరింపఁబడుచున్నవి. ఈ నాటీశబ్దమును వ్యాఖ్యానించుచు గణరత్న మహోదధికారుఁ డిట్లు వ్రాసియున్నాఁడు:

1. కాముదిలో నిది 'నోట' శబ్దముగా మన కిపు డగపడును. ఈపాఠము ప్రామాదికము (చూ: కాశికా, గణరత్నమహోదధులు).

"నాటీ-నాటీసంజ్ఞయా ద్వే కావ్యే,ఏకో భేదః ప్రఖ్యాతో నాటికాఖ్యః, ఇతర స్త్వప్రఖ్యాతః ప్రకరణికాసంజ్ఞకః" దీనికిఁ బ్రమాణముసైత మీతఁ డిట్లుదాహరించుచున్నాఁడు:

> " అనయోశ్చ బంధయోగా
> దేకో భేదః ప్రయోక్తృభిర్జ్ఞేయః,
> ప్రఖ్యాత స్త్వితరో వా
> నాటీసంజ్ఞాశ్రితే కావ్యే"
> (గణరత్నమహోదధి, నామగణాధ్యాయము, ౨౨)

ఈనిదర్శనమునుబట్టి కావ్యములేకాక, దృశ్యకావ్యములుసయితము పాణినినాఁటికేకాక పాణినికిఁ బూర్వమందును గలవనుట కభ్యంతర మేమైనఁ గలదా? పాణినినాఁటికిఁ గావ్యములు కలవని నిరూపించుట కీ నిదర్శన మొక్కటియే చాలినను గొన్ని విశేషములు పాఠకలోకమున కెఱుకపఱుమకొనఁ దలఁచి మఱికొన్నివిషయములఁగూడ నిటఁ బ్రదర్శించెదను.

'శిశుక్రందయమసభద్వంద్వేంద్ర జననాదిభ్యశ్ఛః', 'అధికృత్య కృతే గ్రంథే' – ఇంద్రజననమును గూర్చి వ్రాయఁబడిన గ్రంథము అను నర్థమునఁ బైసూత్రముచే ఛప్రత్యయమును విధించి 'శిశుక్రందీయము','యమసభీయము','ఇంద్రజననీయము', 'ప్రద్యుమ్నగమనీయము', 'సీతాన్వేషణీయము' అనురీతిని నాఁటి కావ్యనామముల ననేకములఁ బాణిని సాధించినాఁడు.'ఇంద్రజనన' 'ప్రద్యుమ్నగమన' 'సీతాన్వేష' ణాదు లింద్రజననాదిగణమునఁ బాణినిచేఁ బఠింపఁబడినవి.'శిశుక్రంద,యమసభ'శబ్దములు సూత్రముననే కలవు. ప్రాచీనముగా నేర్పడిన యీకావ్యనామములఁ జూచియే భారవి తన కావ్యమునకు 'కిరాతార్జునీయ'మనుపేరిడెను. ఇప్పటికైనను బాణినికాలమునకుఁ గావ్యవాఙ్మయము శ్రుతచర మని శ్రీశాస్త్రిగా రంగీకరింపరా? ఇఁక నది యిది యననేల? పాణినిమహర్షి రచించిన మహాకావ్యమునే యుదాహరింతును. జాంబవతీపరిణయ మనునది దీనికి నామము. పాతాళవిజయ మనునది దీనికి నామాంతరము. ఇందలి పద్యములు కడు హృద్యములు. ఇట్టి సరసకావ్యరచన యేర్పడవలయునన్న నాఁటికెంత కావ్యవాఙ్మయము ప్రబలియుండవలయునో బుద్ధిమంతులగువా రూహింపఁగలరు. మచ్చున కీకావ్యమునుండి రెండు పద్యములుమాత్ర మిట నుదాహరించెదను.

> "అస్తి ప్రతీచ్యాం దిశి సాగరస్య
> వేలోర్మిగూఢే హిమశైలకుక్షౌ,
> పురాతనీ విశ్రుతపుణ్యశబ్దా
> మహాపురీ ద్వారవతీచ నామ్నా" (౨స.)

> "త్వయా సహార్జితం యచ్చ
> యచ్చ సఖ్యం పురాతనమ్,
> చిరాయ చేతసి పున
> స్తరుణీకృత మద్య మే" (౧౮స.)

ఈకావ్యము శాస్త్రకర్తయగు పాణిని రచించినదని లక్షణకర్త లెందఱో యుదాహరించినారు. రాజశేఖరుఁడు తన సూక్తిముక్తావళియందును, హారావళియందునుగూడ స్పష్టముగా నిట్లు చెప్పియున్నాఁడు:

> "స్వస్తి పాణినయే తస్మై
> యస్య రుద్రప్రసాదతః,
> ఆదౌ వ్యాకరణం కావ్య
> మను జాంబవతీజయమ్"

ఈకావ్యము తత్కర్తృకము కాదను కొందఱివాద మపరిశోధనమూలకము. ఇతరమహాకావ్యకర్తలతోపాటు పాణినియు మహాకావ్యకర్త యని సదుక్తికర్ణామృతమునఁ జేర్పఁబడినాఁడు :

> "సుబంధౌ భక్తిర్నః
> క ఇహ రఘుకారే న రమతే
> ధృతి ర్దాక్షీపుత్రే
> హరతి హరిచంద్రోఽపి హృదయమ్..."

దాక్షీపుత్రుఁ డనునది పాణినికే నామాంతరము (చూఁ త్రికాండి – 'దాక్షీపుత్రస్య పాణినేః' అనుసంజ్ఞామాత్రమహాభాష్యము).

పైశ్లోకమునఁ జేర్పఁబడినవా రందఱును మహాకావ్యకర్తలగు కవులు. ఇఁకఁ బాణినిమాత్రము మహాకావ్యకర్త కాఁడనఁగలమా? ఈ రీతిని బరిశోధిం

చినఁ బాణినికాలమున కనసేల, అంతకుఁ బూర్వమే యెన్ని శతాబ్దములనుండియో శ్రవ్యకావ్య ప్రచారమే కాక దృశ్యకావ్యప్రచారముసయితి మప్రతిహతముగా నున్నదని యితరనిదర్శనము లటుండ పాణినివాక్యములఁబట్టియే మనకుఁ దెలియవచ్చుచున్నది.

ఇఁక వార్తికకారుని వర్తన మెట్టిదియో తిలకింతము.

వరరుచి

ఇతఁడు 'ఆఖ్యానాత్కృత స్తదాచష్టే కృల్లుక్ ప్రకృతివచ్చ కారకమ్' 'ఆఖ్యానాఖ్యాయికేతిహాస పురాణేభ్యశ్చ', 'లుబాఖ్యాయికాభ్యో బహుళమ్' అను వార్తికములను విరచించి తన కాలమునకుఁ బూర్వమే కావ్యములు ప్రసిద్ధిచెందిన వనియున్నాఁడు. ఆఖ్యానాఖ్యాయికలు కావ్యవిశేషము లని లక్షణకర్త లిట్లుదాహరించినారు :

"అపాదః పదసంతానో
గద్య మాఖ్యాయికా కథా,
ఇతి తస్య ప్రభేదౌ ద్వౌ ......
తత్కథాఖ్యాయికే త్యేకా
జాతి స్సంజ్ఞాద్వయాంకితా,
అత్రై వాంతర్భవిష్యంతి
శేషా శ్చాఖ్యానజాతయః"

(కావ్యాదర్శము, ౧:౨౭–౨౮)

ఇదిగాక యీతఁడు 'వారరుచ' మను మహాకావ్యమునుగూడ వ్రాసినాఁడు. మహాభాష్యకర్త స్పష్టముగాఁ దన మహాభాష్యమున నీ మహాకావ్యమును బేర్కొనినాఁడు. పీటర్సన్ ప్రభృతులగు పాశ్చాత్యవిమర్శకులు సైత మీకావ్య మీతనిదిగానే యుదాహరించి కొనియాడినారు. ఈ కావ్యమునుండి సుభాషితరత్నభాండాగారమున ౧౭ పద్యము లుదాహరింపఁబడినవి. అశ్వఘోషాదులు సైతము తమ లక్షణగ్రంథములలో దీని నుదాహరించినారు. ఈ మహాకావ్యసారస్య మొకింత తేటపడుటకు మచ్చునకు రెండు పద్యము లీ పట్టున ముచ్చటింపకతప్పదు.

"అపి స దివసః కిం స్యా ద్యత్ర ప్రియాముఖపంకజే
మధు మధుకరీవాఽస్మద్దృష్టి ర్వికాసిని పాస్యతి,
తదనుచ మృదుస్నిగ్ధాలాపక్రమాహితవర్మణః
సురతసచివై రంగై స్సంగో మమాఽపి భవిష్యతి"

"అస్యా మనోహరాకారకబరీభారతర్జితాః,
లజ్జయేవ వనేవాసం చక్రు శ్చమరబర్హిణః"

ఈ వరరుచి మహాకావ్యకర్త యని సూక్తిముక్తావళిలోఁగూడ నీ క్రిందిరీతిని స్తుతింపఁబడినాఁడు :

"భాసో రామిలసౌమిలౌ వరరుచిః
శ్రీసాహసాంకః కవి
ర్మేంఠో భారవికాళిదాసతరళాః
స్కంద స్సుబంధు శ్చ యః,
దండీ బాణదివాకరౌ గణపతిః
కాంతశ్చ రత్నాకర
స్సిద్ధా యస్య సరస్వతీ భగవతీ
కే తస్య సర్వేఽపి తే."


ఇఁక నీవిషయమున మహాభాష్యకర్త పాటించిన పరిపాటి యెట్టిదియో గమనింతము.

పతంజలి

ఇతఁడు వ్రాసిన మహాకావ్యము లేవియో మన కిప్పుడు తెలియరాకున్నవి. కాని 'ఆఖ్యానాఖ్యాయికేతిహాసపురాణేభ్యశ్చ' అను వార్తికోదాహరణసందర్భమున నితఁడు "ఆఖ్యాన – యావక్రీతికః, ప్రైయంగవికః, యాయాతికః. ఆఖ్యాయికా–వాసవదత్తికః, సౌమనోత్తరికః" (మహాభాష్యము ౪-౨-౧-౬౦) అని కొన్ని యాఖ్యానాఖ్యాయికలఁ బేర్కొనినాఁడు. మరల 'అధికృత్య కృతే గ్రంథే' అను సూత్రవ్యాఖ్యానసందర్భమునఁగూడ "వాసవదత్తా, సుమనోత్తరా" (మహాభాష్యము ౪-౩-౧-౮౭) అని యుదాహరించినాఁడు. ఇవిగాక 'కంసవధము', 'బలిబంధము' అనువానినిగూడ నీతఁడు పేర్కొనినాఁడు. ఇఁక 'వారరుచ' మను మహాకావ్యమును గంఠోక్తముగా నుడివినవాఁ డితఁడే-

"వారరుచం కావ్యమ్" (మహాభాష్యము, ౪-౩-౧౦౮). ఈ కావ్యమునుగూర్చి మఱియొకచో ముచ్చటింతును. ఇవిగాక కొందఱు కవుల మహాకావ్యముల నుండి కొన్ని పాదములుసైత మనుకరించి వానిని పాణినీయమునకు లక్ష్యములుగాఁ బ్రదర్శించినాఁడు. ఆ కావ్యములు కొన్ని మన కిప్పుడు దొరకుచునేయున్నవి. ఈతఁ డొనర్చిన మఱికొన్ని ప్రసంగములఁబట్టియు, మఱికొన్ని నిదర్శనములఁ బట్టియు దృశ్యకావ్యప్రచారమసయిత మీతనికాలమునకు సుప్రసిద్ధముగా నున్నదని యింకను విశదముగా మనము నిర్ణయింపవచ్చును.

వస్తుస్థితి యిట్లుండఁ బాణినీయమునాఁటికిఁ గావ్యములే లేవని పరిశోధకు లనుట పరిహాసాస్పదము కాదా ?



ధర్మోపదేశము

[*DIDACTICS*]

●

= శ్రీ బొడ్డపాటి కుటుంబరాయశర్మ =

ప్రపంచ వాఙ్మయములం దెచ్చటనైనను ప్రథమమున పద్యరచనయు, పిదప వచన రచనయు నుద్భవించుట సత్యసమ్మతము. చరిత్రకు తెలిసినంతలో మన యాదికవి నన్నయ భట్టారకుడుమాత్రము చంపువున నీ రెంటిని జడి యెడములుగ నడపుటచే నీ సత్యమున కాంధ్రమున నొక యపవాదము ఘటస్థించుచున్నను, జగద్విశాలమైన దృష్టితో పరిశీలించినపుడు సమస్త దేశ భాషా సాహిత్యములు నీ సత్యమునకే 'సాక్ష్యమొసగుచున్నవి. ఋగ్వేదము దేవేంద్రుని "పిబ త్వస్య గీర్వణః" (viii ౧-౨౬) అని సంబుద్ధ్యంతముగ నాహ్వానించుచున్నది. దేవేంద్రుడు ఛందఃప్రియుడనుటచే ఋషుల కాలమునుండియు దీనికి గల ప్రభావము మనము గ్రహింపగలము. కరుణ రస తరంగిత హృదయుడైన వాల్మీకిమహర్షి —

"మా నిషాద ప్రతిష్ఠాం త్వ
మగమః శాశ్వతీ స్సమాః,
యత్ క్రౌంచమిథునా దేక
మవధీః కామ మోహితమ్."

అని ప్రప్రథమమున గీర్వాణభాషా కన్యకు 'అనుష్టుప్'ఛందస్సు గరపుటెల్లరకు విదితము. మొత్తముమీద ఛందోవిశేషము భావావేగము నిండియున్నపుడుద్భవించుట స్వాభావిక మని తోచును.

కవు లాదికాలమునుండియు నిట్టి ఛందోరీతికి కట్టుపడుటకు రెండు ముఖ్యకారణము లూహ్యము లని పూర్వమే 'కవిత్వము-విమర్శ' అను వ్యాసమున చెప్పియున్నాను. పాఠకుల జ్ఞాపకశక్తికి తోడ్పడుట యందు మొదటికారణము. భావమును తలుకొత్త జేయుటయే కాక, దాని కొక స్వాదుభావము నొసగుట రెండవది. "వచస్స్వాదీస్వ దీయో రుద్రాయ వర్ధనమ్" (ఋగ్వేదము, i ౧౧౪-౬, ii ౩౫-౧). వేదఋక్కులు మధువుకన్న మధురమనుటచే వేదకాలమునాడును ఛందస్సునకు గల గౌరవము మఱింత సువ్యక్త మగుచున్నది. ఇందుచేతనే కొన్నికొన్ని చరిత్రాంశములు, దేశనాయక సంకీర్తనములు, సత్ప్రవర్తనాధర్మములు, లోకోక్తులు మొదలైనవి ప్రతివాఙ్మయమునందును ఛందోబద్ధములై యున్నవనికూడ పూర్వమే చెప్పితిని. పద్యరచనాశక్తి వృద్ధియగుచువచ్చిన కొలదియు దీర్ఘాఖ్యాన పద్యకృతులెల్లెడను పొడసూపుట సహజము.

ఏయే యావశ్యక కారణములచే నవలంబింపబడినను కారణ మనునది చిరస్థాయిగ నుండు ననుటకు విశ్వవాఙ్మయమున పద్యమునకు సిద్ధించిన జ్యేష్ఠతయే సాక్ష్యము నిచ్చుచున్నది. మహానుభవజ్ఞులు, మహానుభావులు నగు కవులు పద్యమూలమున ధర్మోపదేశము చేయుటయు గతానుగతికముగ వచ్చుచున్న విషయమే! పద్యము ప్రథమవాఙ్మయ రూప మగుటచేతను, ఆదికవు లుత్తములగు స్వానుభవముల నీరూపమున వ్యక్తపరుప మరులొక్కనకతీరమిచేతను పద్యకృతులే ధర్మబోధ కధికసహాయకారులుగ పరిగణింపబడుటయం దాశ్చర్యము లేదు. కాని నీతిబోధకు గడగు కావ్యము ధర్మసౌందర్యముచే (*Moral beauty*) నిండారియు, కళాసౌందర్యమున (*Artistic beauty*) కొరవడుననియు, నందుచే నుత్తమకావ్యము కాజాలదనియు 'కళాసిద్ధివాదులు' (*Art for art's sake school*) ఊహింతురు. ఇట్టి వివాదముల సత్యాసత్య నిరూపణ మసాధ్యము. ఇది యాయా విమర్శకుల దృష్టి ననుసరించియుండును.

తెనుగుకవుల ధర్మోపదేశము నొకింతగ పరిశీలింతును.

ఎందేని శాస్త్రమత నీత్యాది స్థాపనగాని, లేక దూషణగాని యాద్యంతమో, మరికొన్ని ఘట్టములందునో అభిముఖముగగాని,యంతర్వాహినిగ గాని పొడసూపుచో దానిని ధర్మోపదేష్టృభావన గల కావ్యమనవచ్చును. ఇట్టిదిగాని కావ్యమో, లేక ఖండకావ్యమో తెలుగుసారస్వతమందు అధునాతనయుగారంభము వఱకు లేనే లేదనవచ్చును. వేదమతోద్ధరణము సత్యాశ్రయ శ్రీ పులకేశికాలమునుండియు జరుగుచు రాజరాజు నాటికి బౌద్ధ జైనాది వేదబాహ్య మతములు విజృంభణ దక్కుటచే పూర్తియైనను, "తన వంశమున ప్రసిద్ధులై విపుల సద్గుణ శోభితులైన పాండవోత్తముల చరిత్ర" విన నభీష్టము గల్గుటచే నాంధ్రమున నొక యుద్గ్రంథమును వెలయింపజేయుటయే కేవలము రాజరాజు సంకల్ప మైనను, 'వేదప్రోక్తమైన సమస్తవర్ణాశ్రమధర్మరక్షణమహామహిమ'చే వెలుగొందినవాడతడు. నన్నపార్యుడు సంహితాభ్యాసుడు; బ్రహ్మాండాది నానా పురాణ విజ్ఞాన నిరతుడు; మత విషయమున త్రికరణశుద్ధిగ కర్మపరుడు; సంపూర్ణవైదిక వాఙ్మయనిష్ణాతుడును. అందుచే కృతికర్తృ, కృతిభర్తల యాశయము గాకున్నను, భారతాంధ్రీకరణముచే వేదమతస్థాపన యవాంతరముగనైన కొంత జరిగినది. నన్నపార్యు శ్రోత్రియప్రియత్వము ప్రతి ఘట్టమునను గోచరించును. బ్రాహ్మణసంతర్పణలును, గోభూదానములును, సమస్తవర్ణాశ్రమాచారసంతతనిష్ఠయు నితని భారతభాగమున నిత్యముగ ప్రత్యక్షమగుచున్నది. కొన్ని యుదాహరణలు పరిశీలింపుడు :

"అమితాఖ్యానకశాఖలం బొలిచి.........
మహాభారతపారిజాతమమరున్ధాత్రీసురప్రార్థ్యమై-"

భారతామ్నాయమును గుఱించిన నన్నపార్యుని ప్రశంస యిది.

"త్రేతాగ్ను లెల్లను దేజరిల్లమి జేసి
క్రతు కృత్యములు వినిర్గతములయ్యె."

ఇది యగ్ని యాత్మసంహారము గావించు సందర్భము. ఇట్టి యుత్సాహపూరితమగు వర్ణన మూల గ్రంథమునకు విపర్యాసము.

"అలయక యేను దేవయజనాధ్యయనవ్రత పుణ్యకర్మలన్
సలుపుదునేని........."

ప్రమద్వర సర్పదష్టయై మరణించినపుడు ఇది రురుని ప్రతిజ్ఞ.

"ద్విజవరులం గుమారుల న
తిప్రియదర్శను లైనవారి ఋ
గ్యజుషపదక్రమంబులు..............."

తక్షకుడు కశ్యపుని క్రమ్మఱచి నాగకుమారుల పరీక్షితునొద్దకు పంపు సందర్భ మిది.

"పెంచితి ధర్మమార్గమున
బ్రీతియొనర్చితి ధారుణీప్రజన్"

ఇది పరీక్షితుని మరణానంతరము. మూలము నుండి యివి యన్నియు విపర్యస్తములు. కేవల మివి నన్నపార్యుని ధర్మనిరతిని సూచించును. అనేకము లిట్టి వింకను గలవు.

"............... విప్రకులము నెల్ల
బ్రోచుచు, శరణన్న గాచుచు, భీతుల
నగ్రజన్ములకు ననుగ్రహమున
చారుతరమహాగ్రహారము లిచ్చుచు ......"

"ఇది యేనున్ సతతంబు నాయెడ గరం
బిష్టంబులై యుండు, బా
యవు భూదేవకులాభితర్పణమహీ
యఃప్రీతియున్ సంతత
శ్రవణాసక్తియు..............."

"............ మనుమార్గ ధర్మనిరతా!"

"............ ధర్మధురంధరా!"

"..................... ఉర్వీలోన
ననఘమై, శిష్టాగ్రహారభూయిష్ఠమై
ధరణీసురోత్తమాధ్వరవిధాన
పుణ్యసమృద్ధమై పొలుచు వేగీదేశ
విభవంబు ...."

ఇంత దూర మేల? రాజరాజు ' సమస్తవర్ణాశ్రమ ధర్మరక్షణ మహామహిమున్ ' బద్ధకంకణు డని యవతారికలో నన్నపార్యుడు సూటిగ చెప్పెను. పై నుదాహరించినట్టి రచనలు నన్నపార్యునందు కుప్పలు తిప్పలైయున్నవి. కొన్ని ఘట్టములం దీకవికి ధర్మోపదేశమున గల యతిశ్రద్ధవలన కొందఱకు విసుగు కూడ జనించును. లాక్షాగృహదహనానంతరము పాండవుల మృషామరణవార్త విన్న కౌరవులు, పాపము, కావించిన తిలోదకశ్రాద్ధక్రియాకలాపాదికము మనకు నవ్వుగొల్పును. చావని పాండవులకు ప్రేమలేని శ్రాద్ధము జరిపిన కౌరవుల యెడకన్న, నట్టి యప్రస్తుతము, నసత్యము నైన విషయమును విస్తరించి వర్ణించిన నన్నపార్యుని యెడ మనము మఱియు నవ్వుదుము. ఈ యీ యుదాహరణలచే నత డాశింపకున్న, నవాంతరముగనైన నిట్టి ధర్మశాస్త్ర ప్రసంగము నన్నయభట్టారకునియందు పొడసూపు నని నిరూపితము.

అద్వైతదృష్టిగల తిక్కయజ్వ యెడకూడ కొంతవఱ కిట్లే జరిగినది.

" వైదికమార్గనిష్ఠ మగు
వర్తనమున్ దగ నిర్వహించుచు
న్భేదము లేని భక్తి మది
నిర్మలవృత్తిగ జేయుచుండ, మ
త్పాద నిరంతరస్మరణ
తత్పరభావముకల్మి నాత్మస
మ్మోదము బొంద గావ్యరస
ముం గొనియాడుచునుండు డెప్పుడున్."
(విరాట. ౧-౧౫.)

స్త్రీ, ఆనుశాసనిక, స్వర్గారోహణాది పర్వములత్యధికముగ నిందుకు లక్ష్యమనవచ్చును. ఇదియేకాక యితరపర్వములందు కూడ యథాసందర్భముగ నితడు వేదాంత ధర్మశాస్త్రోపదేశము జరిపెను. గీతా ఘట్టము క్షిప్తమయ్యు నిష్కామకర్మయోగము బోధించును. అసలిత డొనర్చిన భారతప్రశంస యితనికి దాని యెడ నేవిధమైన గౌరవము కలదో చెప్పకయే చెప్పుచున్నది.

" వేదములకు, నఖిలస్మృతి
వాదములకు, బహుపురాణవర్గంబులకున్
వాదైన చోటులను, దా
మొదల, ధర్మార్థకామమోక్షస్థితికిన్ "
(విరాట. ౧-౮)

ఇందుచే తిక్కయజ్వకును ధర్మోపదేష్టృభావమున్నదనుట సత్యము.

ఇట్లే పోతనయందును. కాల మహత్త్వమున నవతరిల్లిన ప్రవక్త యనదగు పోతనామాత్యుడు భక్తిమార్గము బోధించెను. కవిత్వము రచించు సందర్భములో తీరని హేతువులచే సగుణోపాసన సల్పినను తిక్కన, సోమన, పోతనాదులు " ఏకమేవాఽద్వితీయం బ్రహ్మ " అను శ్రుతివాక్యమును త్రికరణముగ ననుష్ఠించి, యనుష్ఠింపజేయు నిర్గుణ బ్రహ్మోపదేశకులే యగుదురు. పురాణకవితయందు నీతిబోధ కిట్టి ప్రముఖుల యుదాహరణలు చాలును.

శైవకవు లని ప్రత్యేకముగ పేర్కొనబడుట వలననే నన్నెచోడ, పండితారాధ్య, పాలుకురికి సోమనాథాదులు మతోపదేశకులని స్పష్టమగును. స్వతస్సిద్ధముగ నన్నెచోడుడు శివభక్తిపూరితుడగు కవి. అన్నిచోటులయందును శివమాహాత్మ్యమునే నిరూపించెను. ప్రథమాశ్వాసమున నిష్టదేవతాప్రార్థనారూపమగు ప్రారంభపద్యమున మహాదేవుడు, నాద్యుడు నైన విశ్వైకావాసుని, ద్వితీయపద్యమున నుమాధవుడైన శంకరుని, తృతీయమున పరమేశ్వరుని స్తుతించుటయేకాక చతుర్థమందైన " పరమేశ్వరోరువామాంగమునందు మున్నుదయ " మయ్యెనని వేదాంగు, ననంతుని, విష్ణుని ప్రార్థించెను. ఆశ్వాసాంతపద్యములలో కృతిభర్తయగు జంగమమల్లికార్జునబుధునకిని, శివునకు నభేదము చెప్పుటయందుకూడ నీతని యపార శివపాక్షికము, తన్మతప్రచారధర్మపరత్వము గోచరించుచున్నవి. కాని పండితారాధ్యునివలె నితడు పరమతములను నిర్దయముగ ఖండించుటకు పూనుకొనలేదు. ఇతని కుమారసంభవమునం దంతర్వాహినిగ పొడగట్టు శివపారమ్యమే పరమధర్మముగాగల కాలాముఖుల శాఖాధర్మములు మొదలైనవి

మాత్రమే మనము బాగుగ గ్రహింపగలుగు దుము. పండితారాధ్యుడు బ్రాహ్మణశైవుడు కావచ్చునుగాని వీరశైవముతో సామరస్య మపే క్షించును. ఇతని 'శివతత్త్వసారము' చాటు నది యద్వైతాదిపరమతనిరసనము, స్వమత స్థాపన మును. తదన్యము శూన్యము.

"తనకంటె వేఱె యీశ్వరు
డని లేదని పలుకునట్టి యద్వైతవిమూ
ఢునకును, లోకాయతునకు
వినగా భేదమ్ముగలదె విష్ణువరేణ్యా!"

"ప్రాజ్ఞులు, వేదజ్ఞులు, లో
కజ్ఞులు చేకొండ్రె? గతశిఖాగాయత్రీ
యజ్ఞోపవీతనాస్తిక
లజ్ఞులు చేకొండ్రుగాక యద్వైత మజా!"

"స్వేచ్ఛాచారులు, మిథ్యా
విచ్ఛేదన వేదశాస్త్ర విప్లవకారుల్
ప్రచ్ఛన్నదోషు లజ్ఞా
నాచ్ఛాదితదుష్టచిత్తు లద్వైతు లజా!"

అన్యమతహేళన యిట్లుండెను. ఇక దూషణ పరిశీలింపుడు:

"ఆదివరాహము పెరిగిన
యాదంష్ట్రిలు వెఱికి, తన నిజాస్యంబున సం
పాదించుకొని నటించు, మ
హాదర్పముతోడ నొక నగాధిపుడు శివా!"

"నరసింహుని కంఠంబును
అరుణజటాకేసరంబు లంబికపాదాం
బురుహమణిపీఠమున పా
ల్పరుడుగ రచియించు నొక గణాధిపుడు శివా!"

స్వమతస్థాపనము, భక్తిభావమున నూమ్రలత (Fervour) యు పరీక్షింపుడు.

"దేవా! సంసారాంబుధి
లో, వెలువడజేసి ప్రమథలోకం బెరుగన్
నావాడు వీడు సుండీ
నావే! నన్నుంపవే గణంబులలోనన్."

ఈకవికి కావ్యదృష్టి యసలు లేదు. కావ్యము విశ్వజనీనము, విశ్వసమ్మతము గాదు. ఇది కేవలము శైవస్మృతి. అసలు కవిత్వమును సూటిగ మతప్రచా రమునకు వినియోగించినవారిలో నితడు ప్రథముడు, నగ్రగణ్యుడు నగుటచే, నిట్టి శాఖను జెందిన శతకకవుల గూర్చి యిక నతివిస్తారముగ నుడువనక్కర లేదు. ఉదా హరణ కితడే చాలును. అయ్యు, ప్రతిశతకము నేదో ప్రచారము నే లక్ష్యముగా గలదనుట యప్రకృతము గాదు. గోసులపాటి కూర్మనాధకవి నృసింహశతకమున దుష్టసంహారధర్మమును బోధించెను. చోడప్పాదులు దూషణరూపమున సంఘసంస్కారధర్మము వెల్ల డించిరి. భాస్కరశతకాదులు ప్రపంచానుభవము బోధించును. కాళహస్తీశ్వరశతకాదికము స్వాతంత్ర్య ప్రియత్వము నుద్బోధించును. సుమతిశతకాదులు నీతి ప్రబోధకములు. కలువాయి, కాంతాలలామశతకములు శృంగారారాధన నభినందించును. ఇవి యన్నియు నన్నివిధముల నుపదేష్టృభావముగలవే యనదగును.

ఇక విపులకావ్యయుగకర్తయగు శ్రీనాధుని పరి శీలించినచో నాశాఖాకవుల యుద్దేశముల గ్రహింప వచ్చును. పురాణఖండముల కావ్యములుగ నాంధ్రీక రించు తలపునందే యసలు కొంత ధర్మప్రచారబుద్ధి గోచరించును. పది, పదునొకండవశతాబ్దులలోని మత విప్లవ మెల్లరకు విదితము. అపుడు నానామత శక్తులు విజృంభించెను. తపశ్శాలి, యోగశీలియు నైన తిక్క యజ్వ జగద్ధితముగ సృజించిన హరిహరనాథ తత్త్వ మందు దాయా సమస్తశక్తులు కేంద్రీకరింపబడినవి. అతని యనంతర మట్టి శక్తిసంపన్నుడు జన్మింపమి చేత, నవి విడివడి బహుముఖముల చెలరేగెను. మహే శ్వర ఘట్టు విడిపోయి శైవకవిశాఖలనదగు నన్నెచోడు నంగు చిగిరించి, పండితారాధ్యునెడ చిలువలువేసి, పాలుకురికి సోమనయందు కుసుమాకృతమై, శ్రీనాధుని సిరిపూలని వీరవ్రతముచే ఫలవంతమైన దనవచ్చును. ఇక వైష్ణవము నాచనసోమనాథులచే ప్రవర్ధితమై, పరమభాగవతుడైన పోతనకవితాధార యను బుంగ పోతచే ప్రోదిచేయబడి వపుర్విజృంభణ మందినది. ఇమ్మట వీరశైవలక్షణలక్షితు డనదగు హిరణ్యాకశ్య

పుని భక్త్యావేశమున నరసింహమూర్తిచే చీల్పించి జీవన్ముక్తుడైనాడు పోతనదేవుడు. ముహుర్ముహుర్విజిత శైవమైన వైష్ణవము 'ఆనిష్టానిధిగేహసీమ' మార్గోన్మగి రామలింగని రామకృష్ణుని జేసి, అల్ల నల్లన కంకంటి పాపరాయనివఱకు బ్రాకినది. అంతటితో సత్త్వయుతమైన కవితకే స్వస్తివాచకము ప్రాప్తించెను. తరువాతిమార్గము వేరు. శ్రీనాథుని కృతులన్నియు శివభక్తిపరములైనవి యనుటయే మనకు ప్రకృతాంశము. భీమేశ్వరపురాణ, కాశీఖండ, హరవిలాసములలో క్రమముగ వ్యాసాగస్త్య సంభాషణమందలియు, గుణనిధి కళింగాధీశుడైన వృత్తాంతమందలియు, చిరుతొండని కథ మొదలైనవానియందలియు శివమహత్త్వప్రతిపాదన పరిశీలింపుడు:

"చాటించె కళింగేంద్రుడు
 వీటను, దేశమున, శంభువేశ్మంబులలో
 బాటించె దీపకళికా
 కోటు లసంఖ్యములు మెండుకొని
 యుండుటకున్."

"ఇలువరుస చంద్రశేఖరు
నిలయంబున దీపకళిక నిలుపనివారిన్
దల ద్రెవ్వగ వేయుం డని
తలవరులను బంచె రాజు తనదేశమునన్."
(కాశీ. ౪-౧౩౫, ౧౩౬.)

హరవిలాసమున శివభక్తి గనుడు:

"భైరవయోగి కొడుక్కనికి
 బాశుపతవ్రతచర్య తీరునం
బారణకై నినుం బలల
 పాకముగా నొనరించి పెట్టుచు
న్నారము భోజనంబు, ప్రియ
 నందన! నీ హృదయంబునందు సం
సారము బాయజాలని వి
 చారము లేదుగదా యొకింతయున్."

శ్రీకృష్ణరాయలును విష్ణుచిత్తీయమున విష్ణుభక్తిని బోధించెను.

"ఆ నిష్టానిధి గేహసీమ నడురే
 యాలించిన్ మ్రోయు నెం
 తే నాగేంద్రశయానుపుణ్యకథలున్" (౧-౨౪.)

తెనాలిరామలింగకవి యుద్భటారాధ్య చరిత్రలో ప్రస్తావనావశమున జెప్పిన మదాలస చరిత్రయందు దక్క దక్కిన ఘట్టములందు కథాచమత్కృతియే లేదు. కవి శైవుడుగా నున్ననాటి కృతి యిది. ఇది కేవలము శివమాహాత్మ్యము. శైవప్రచారమే దీనికి గుఱి. చూడుడు:

"అచలసుతాభర్త కర్పించి మఱిగాని
 మృగములు లేబూరి మేయ వచటు."
పద్యము తుదివఱ కిట్లే సాగును.

"అభ్రగంగాప్రవాహమ్ము లెన్నియొ కాని
 తల ధరియింతు రందరును నదులు..."

ఇదియు వైపద్యమువంటిదే! కొన్నిపట్టుల నీ కృతిలో దురాచారనిరసనమును గలదు.

"పాటమరించిన పీటి విటుల యల్కలు దీర్పు
 పోరించు తమలోన వారసతుల...
సంధ్య వార్వడు, వేల్వడు, చర్చసేయ
డాగమంబులు."

"ఇట్లు తగువారు సన్మార్గ మెద్దియైన
వివరమును దేటపరచిన విన డతండు
హెచ్చి మూడవ పురుషార్థమే యిహంబు
పరము నీజాలునది గాగ పజిలపరచి."

ఈ కృతికే కొన్ని ఘట్టముల సహోదర మనదగి, కవి వైష్ణవము స్వీకరించిన పిమ్మట రచియింపబడిన పాండురంగమాహాత్మ్య మను క్షేత్రమాహాత్మ్యము నందును నిట్టి మతప్రచారము, దురాచార నిరసనము మొదలైనవి పాడకట్టి గ్రంథము మత ధర్మోపదేశార్థము నిర్మింపబడినదిగ స్ఫురించును. అందలి నిగమశర్మ దినచర్యావర్ణనను పరికింపుడు:

"కంబుభృత్పాదోదకంబు గ్రోలడు గాని
 యావతాధరసీధు వాని చొక్కు."(3-౧౨)

ఇతనికి విష్ణుభక్తి లేమి ఇట్లే పద్యమంతయు వర్ణితము. సున్నితరీతిని కాముకవర్తనను హేళన చేయుట కీ క్రిందిపద్య మొక యుదాహరణము:

"అత డనూచానసంతతి నవతరిలియు,
సకల నిగమశిఖారహస్యములు గనియు,
మనసు దార్తీయపురుషార్థమునకె తార్చి
దైవఘటనావశంబున నొవశింద్ర."
(పాండురంగ. 3-౮.)

నీతిబోధ పరికింపుడు:
"పరమేష్ఠినుండి నీ తరముదాక విశుద్ధ
తరమైన వంశంబు దలచవైతి."
(పాండు. 3-30)

పద్యము చివరవట క్లిష్టే యుండును. కనుక ప్రత్యక్షముగ ధర్మోపదేశము విపులకావ్యకవితలోను జరిగినది. ఇక రసవత్తను గడించిన సత్ప్రబంధములకు మార్గదర్శకముగు మనుచరిత్రలో ప్రవరుని సృష్టి యేత దుద్దేశము గలది. మాయాప్రవరుని ప్రతిఘాతశీలము వ్యతిరేక పద్ధతిని కవియభీష్టప్రచారమును సాగించు చున్నది.

"వాని చక్కదనము వైరాగ్యమునఁజేసి
కాంక్ష సేయు జారకామినులకు
భోగబాహ్యమయ్యె బూచిన సంపెంగ
పాలుపు మధుకరాంగనలకుబోలె." (౧-౫౨.)

ఇత్యాది పద్యములందు కవిముఖతః నీత్యుపదేశము పుష్కలముగ జరిగినది. కాకతీయ యుగము వాడగు శివదేవయ్య మొట్టమొదట 'పురుషార్థసార' మను నొక గ్రంథమును సృజించెను. నాటినుండి తెలుగుల సారస్వతమున కొంత నీతిబోధ జరుగుచునే యున్నది. అసలీ స్వారోచిషమనుసంభవ మను ప్రబంధమే సత్ప్రవర్తనాశీలాదుల నెరప నుద్దిష్టము. నంది తిమ్మన, పింగళిసూరన, చేమకూరకవి ప్రముఖులు నిట్లే ప్రత్యక్షముగనో, పరోక్షముగనో తమ గ్రంథములందు సందర్భానుసారముగ నేదో విధమగు నీతిబోధ గరపుచునేవచ్చిరి. కనుక సమస్తాంధ్ర కావ్యవిశేషములందు నిట్టి యభిరుచి యత్యాజ్యముగ వాసించుచున్న దనుట సాహసము కాదు. ఇక నిట్టి పద్ధతి యందలి సాధుత్వాసాధుత్వముల నరయుదము.

కావ్యమునందు ధర్మోపదేశప్రభావము సాధువగునా, కాదా యని ప్రత్యేకముగ విమర్శించిన గ్రంథాల మేదియు మన మెఱిగినంతలో నాంధ్రమున గన్పింపదు. కాని గీర్వాణసాహిత్యమం దీ యభిరుచి యనివార్యముగ దోచుచుండును.

"కావ్యం యశసేఽర్థకృతే
వ్యవహారవిదే శివేతరక్షతయే,
సద్యః పరనిర్వృతయే
కాంతాసమ్మితతయోపదేశయుజే"
(కావ్యప్రకాశము.)

విద్యానాథమహాకవి ప్రతాపరుద్రీయములో —
"కాంతాసమ్మితయా యయా సరసతా
మాపాద్య కావ్యశ్రియా
కర్తవ్యే కుతుకీ బుధో విరచిత-
స్తస్యై స్పృహాంకుర్మహే."

అనెను. దీనినే పాశ్చాత్యులు '*Delightful instruction*' అని వ్యవహరింతురు. పైన చెప్పినట్లు పేరు కీర్తి సంపదల నార్జించుటకును, ఐహికాముష్మిక భోగముల నాపాదించుటకును కావ్య మనుకూలపడునని కావ్యప్రకాశకారాదులు నుడువుచుండుటచే సంస్కృతాలంకారికు లీ విషయమును చర్చించిరని తేటపడుచున్నది. కావ్యాత్మ రసమని గుర్తెఱింగిన కళాసిద్ధివాదులలో కొందఱుకూడ నుచితమగు ధర్మబోధ రసమునకు భంజకము కాదని దీనిని మన్నింతురు. శాస్త్రాభ్యాసము రుచింపనివారికి రసావహముగ ప్రబంధమును రచించి ధర్మార్థకామమోక్షాదుల నుపదేశింప వచ్చునని రుద్రటాదులు విశ్వసించిరి. దీనికి భిన్నముగ కొందఱు పాశ్చాత్యుల నవలోకించినచో పరతత్త్వమే రసమనియు, తన్నిరూపణమే కావ్యప్రధాన ధర్మమనియు, లౌకికమగు నీతిబోధ కాదనియు నెంచు జర్మన్ తత్త్వజ్ఞులును, ఎమర్సన్, కార్లయిల్ ప్రభృతి వేదాంతవేత్తలును గలరు. మొత్తముమీద నిట్టి వివాదము పాశ్చాత్యదేశములందు పరకోటి నంటిన దనవలెను. మన మీచర్చయొక్క పాతునకు బోయి పరిశీలించినచో 'సోక్రటీజ్' యోగీంద్రుని శిష్యగణమునకు జెందిన 'ప్లేటో' తత్త్వజ్ఞుడు ప్రప్రథమమున నీ విషయము విమర్శించినట్లు తోచును.

నీతిబోధ కలదే రససంపద నొప్పు సత్కావ్య మనియు, సత్పురుషుడే సత్కావ్యనిర్మాణ సమర్థుడనియు 'ప్లేటో' తత్త్వవేత్త వచించెను. సద్ధర్మ సదాచార ప్రతిపాదనమే నీతి యనియు, నిదియే కావ్యశిల్పాదులకు రసైశ్వర్యమును సంపాదించుచున్నదనియు నీతని యభిప్రాయము. కొందఱు 'రసానందము కొఱకే కళ' (*Art for art's sake*)—అనగా లలిత కళలు నీతిబోధనను ప్రయోజనముగ గలవి కావనియు, ఫలహేతురహిత మగు నలౌకికానంద సంపాదనమే వాని ప్రధానోద్దేశమనియు, నిశ్చలసంతోషమే వాని ప్రయోజన మనియు నూహించిరి. ప్లేటోమహాశయుని మొదలుకొని పాశ్చాత్యుల వాఙ్మయమునం దెల్లెడ నిట్టి చర్చ జరుగుచున్నే వచ్చినది. కావ్యమందు ధర్మోపదేశ మావశ్యకమనుట కవిత్వతత్త్వమును విప్పి చెప్పుటయే! కావ్యమున రసభంగము గానట్లు ధర్మనీత్యుపదేశములు జరుగుట విశ్వసమ్మతము. కవిత్వ తత్త్వమును వివరించుచు 'మాథ్యూ ఆర్నాల్డు' పండితు డిట్లు చెప్పెను: "సత్సారస్వతము రసపిపాసను, సదాచార నిరతిని పోషించుచున్నది."1 అనగా కావ్యమందు రస పోషణయు, నీతిబోధయు సమప్రాధాన్యము వహించుచున్న వని యర్థము. ఇట్టి రసనీతివిభేదము జేయక 'అజారియస్' అను వాఙ్మయతత్త్వవేత్త "మానవ జీవితమందలి సరససద్భావముల నుత్తమవాఙ్మయము ప్రకటించుచున్న"2 దని స్థూలముగ పలికెను.

మొత్తముమీద కవిత్వము రెండు ఘనకార్యముల జేయుచున్నది. వాస్తవజగత్తును సృష్టించుట మొదటిది. భావనాప్రపంచమును నిర్మించుట రెండవది. సత్కవు లిట్టి లౌకికవిషయముల కావ్యములందు హృద్యముగ మేళగించి పఠితల మానసముల సంతుష్టి పరతురు. 'డ్రైడన్' మహాకవి యీ విషయమును గుఱు తెఱిగినవాడు. "ప్రీతిదాయకక్రమమున నీతి బోధించుట కావ్యోద్దేశ"3 మని యతడు నిర్ణయించెను. నీతిబోధపక్షమున నతివాదులును గలరు. 'షూయీ' పండితుడు వారిలో నొకడు. "ఉత్కృష్టము వేదశిఖారహస్యార్థములదీపింపజేయు కావ్యమే పరమోత్తమమైన"4 దని యీతని విశ్వాసము. 'ఎమర్సన్' మహాశయుడును "నైతికసంస్కరణ వ్యాపారముచే కావ్యముల ముఖ్యప్రయోజనము" గ నుగ్గడించెను. 5 'సర్ థామస్ ఇలియట్' అను విమర్శకాగ్రేసరుడు "మానవుని తత్త్వాన్వేషణప్రయత్నములు కావ్యకలనతో నారంభింపబడినవి" 6 యని పల్కెను.

మొత్తముమీద మన తత్త్వవేత్తలగు కవివిమర్శకు లిట్టి విషయములపై నధికారులు. పైనుదాహరించిన పాశ్చాత్య పండితులవలెనే సంస్కృతాలంకారికులును శ్రుతి స్మృతి పురాణేతిహాసములవలె కావ్యము కూడ ధర్మబోధకు సాధనమని మన్నించి, పైవాని యందు దీనికి గల స్థానమును కీర్తించిరని పూర్వమే చెప్పితిని. దీనిని ఖండించు కేవల 'రసానంద' వాదుల వాదనను సంగ్రహముగ రెండుమూడు వాక్యములలో చెప్పవచ్చును. "కళలు రసజనకములు. అగుటయు, రసము లౌకికమర్యాదల కతీతమై యాత్మస్వరూపమున ప్రకాశించు నిత్యతత్త్వము. నీతియన్ననో దేశకాల వ్యవస్థలచే విధింపబడిన నైమిత్తికానిత్యమర్యాద. కాగా, కళలకును, నీతికి నెట్టి సంబంధమును లేదు"

---

1. *"Literature gives nourishment to the sense of beauty and the sense of conduct."* (*Matthew Arnold.*)

2. *"Literature is the expression of humanity."*

3. *"Its end (the end of poetry) is to teach man by way of pleasing him."* (*Dryden*)

4. *"The best poetry is that which is informed by the soundest philosophy."*

5. *"Poetry is the piety of the intellect, morality is the test of its value."*

6. *"Poetry is the best Philosophy that ever was known."* (*Sir Thomas Eliot.*)

ప.రా:— ఇట్టి యుదాహరణానువాదములకు క్రీ. శే. పురాణము సూరిశాస్త్రిగారి విమర్శకపారిజాతమును కొంతగ ననుసరించితిని.

అని వారి వాదము. కళారచయితలు స్వేచ్ఛానుసారముగ రససౌందర్యోపాసన జేయుట యవసరమని యిట్టివారి యూహ. కాని నీతిబోధ కళాప్రధానోద్దేశము కాకపోయినను నవి యాత్మస్వరూపమును, భగవత్స్వరూపమును నిరూపించి వినయౌదార్యాది సద్భావముల నెలకొల్పి, దేశకాల వ్యవస్థాతీతములగు నిత్యధర్మముల బ్రతిపాదించుట యనాదిసిద్ధము. ఇది భారతదేశ సారస్వతములందైన జరుగుచున్నదని ప్రాచీమనీషు లంగీకరింతురు. ఇచ్చట రసానందవాదులు పొరబడు విషయ మొకటి గలదు. అది నిత్యములగు నీతిధర్మములకు, ననిత్యములగు నీతిధర్మాదులకును వేర్పరుపక పోవుట యని యనవలెను. దేశకాలాచారములవలన నుద్భవించు బాహ్యవేషములే నీతి సద్ధర్మములని యెంచి, వానియందు నిత్యానిత్య విభేదము లేదని యెంచుటయే వారి పొరపాటు.

సత్కవులు సూటిగ నీతిని బోధింపకున్నను నాత్మ స్వరూప నిరూపణవలన పఠితల నాత్మవంతులుగ జేయుచున్నవని పాశ్చాత్య ప్రాచ్య సాహిత్యములు రెండు నంగీకరింపక తీరదు. ఆత్మవంతుడు తాత్కాలికాచారముల నతిక్రమించినను నిత్య సద్ధర్మముల నాశ్రయించియే ప్రవర్తించును. ఇందుచే కావ్యము పఠితల నీతివంతులుగ జేయుననుట సత్యము. ఇట్లనుటచే ఎంపిడాకిల్సు, లుక్రిషియస్, మిల్టన్, కోల్రిడ్జ్[1] మహాకవులవలె గ్రంథమునం దాదినుండి యంతమువఱకు పరతత్త్వబోధ సాగింపవలెననుట కాదు. లేదా, శైవకవి పండితారాధ్యునివలె సూటిగ నెడతెంపు లేక గ్రంథమందంతటను స్వమతప్రచారము, పరమత నిరసనము జేయవలె ననియు గాదు. యథార్థ మూహించినచో నాకవులు తమ గ్రంథములలో నేవిధమగు పరతత్త్వమత నీతిబోధాదులునులేని ఘట్టములందే మహాకవిత్వమును వెలారించిరి.

మనవలెగాక గ్రీకువిమర్శకు లతివాదులు. కవి యుపాధ్యాయునివలె బోధింపవలె నని విశ్వసింపని సారస్వతవిమర్శకుడే వారియందు లేడనవచ్చును. కవు 'లీల్లాయిపదముల'తో దినముల వృథాపుచ్చువా[2]రని గ్రీకుకవులు విశ్వసింపరు. తాము కారణజన్ములమనియు, సహృదయు లైనవారికి తమ సందేశము నందింప స్వాతంత్ర్య మున్నదనియు వారి నమ్మిక.

ఆంధ్రమహాకవులలో తిక్కయజ్వ కున్నతస్థానము ప్రతిపాదించిన యంశములలో నీధర్మోపదేష్టృభావ మొక ముఖ్యాంశము. ఆంగ్లేయులలో షేక్స్పియరు మహాకవిని అగ్రస్థానమున బెట్టుట యెందుచేత? అత డనంతమైన విజ్ఞానము గలవాడు. అతనియందు కూడ నుపదేశకత్వ మేమాత్రమును కొఱవడదు. కాని యాయుపదేశించు పద్ధతి వేరు. అది యంతర్వాహినిగ నుండి, చదువరుల నొవ్వజేయదు. అంతరకును తెలియరాని విధాన మది.

ఇంతకు, నెంతవఱకు తత్త్వమత ధర్మనీతి బోధాదులు రసాస్వాదజానందమునకు భంగకరములు కావో నిర్ణయించి చూపిన విమర్శకశిఖామణి గాని, యంత నేర్చి బ్రతుకు కవులుగాని యెచ్చటను లేరనవచ్చును. నీతిబోధ కొంత మర్యాద దాటినపిదప కావ్యానందమును చెరుపుచున్న దనిమాత్రము మన మనుభవముచే చెప్పగలుగుచున్నాము. కాని యామేర నిర్ణయింపలేము. కవిత్వము గూరుడైన యుపాధ్యాయునివలె గాకుండునిమిత్తమై సూచనగ, నిపుణముగ బోధించుట మేలనిమాత్రము చెప్పవచ్చును. కావ్యమునందు ప్రత్యక్షముగ నాద్యంతము వేదాంతబోధ జరుగరాదు కాని, చదువరుల యాత్మకు గుణగ్రహణశక్తి యేర్పడి, యది విస్తరిల్లి, ఘనమై, యున్నతి వహించువఱకు కొంత యుపదేష్టృభావ మావశ్యకము.

కవిత రసభావముల (*Emotions*) రేపు ననుట సత్యము. అయ్యును, బుద్ధిచే స్థిరీకరింపబడిన రసభావముల రేపునదియే సత్కవిత యనుట సత్యాతిసత్యము. కనుక బుద్ధిమంతులగు చదువరులకు బోధకరపు నుద్దేశముగల కవిత్వము విస్పష్టమై, నిసర్గమై, గాంభీర్యమును గోల్పోని వ్యక్తీకరణశక్తి గల్గి (*Plain, natural, and yet majestic*) యుండవలెను. ఇది తెనుగుకవులలో తిక్కయజ్వయం దారూఢముగ

---

1. *Empedocles, Lucretius, Milton, Coleridge.*

2. *"Idle singers of empty days."*

వెలసియున్నది. వ్యక్తీకరణ మిట్లుండవలె ననుటకు కారణములు లేకపోలేదు. ధర్మోపదేశకు డగు కవిని ఒకవిధముగ న్యాయశాస్త్రవిధాయకు డనవలెను. పైన జెప్పిన విస్పష్టత, స్వాభావికత, గంభీరత యను గుణత్రయము ధర్మశాస్త్రముల బంధించు ధీరులు సేకరించు శైలీవైలక్షణ్యము. అలంకారమహనీయము, నుచ్ఛ్రాయము నైన శైలిని కామక్రోధాదిమనోవికారముల భావనజేసి రచించు కవు లనుసరింతురు. ధర్మమును, సత్యమును బోధించు రచయిత విస్పష్టము, స్వభావరమణీయము, గంభీరము నగు పద్ధతియందు నుడువుట సమంజసము. శృంగార వీర రసాదిచిత్రణమందు శైలీచమత్కృతిచే చదువరుల వంచింపదగును కాని సద్ధర్మసదాచారవిచారణలందు స్పష్టత యత్యావశ్యకము. (***A man is to be cheated into passion, but to be reasoned into truth.***)

ఈ ధర్మోపదేశాభిరుచి పురాణవిపులకావ్యకవిత్వలపై నధికముగను, ప్రబంధకవితపై నల్పముగను తన ప్రభావమును చెలాయించినది. దీనికి సాంప్రదాయికబల (***Force of tradition***) మొక హేతువు. కాలకామిని క్షణమున కొక వాసనను నిశ్వసించి, వేఱొక వాసన నుచ్ఛ్వసించుచుండును. ఈయుచ్ఛ్వాసనిశ్వాసములలో చెదరుచుండు సాహిత్యజ్యోతి నానావర్ణకిమ్మీరితమై కన్పడును. ఏవర్ణమును స్థిరముగ నుండదు. ఒకదాని నొకటి తరుముచు క్షణప్రభవలె మాయమగుచుండును. నేటి భావకవితాయుగమునందు పురాణకాలమునాటి ధర్మోపదేశకత్వ ముండకపోవచ్చును. కావలెనని మనము తెచ్చిపెట్టుకొనినచో నది ముసలితాతదుస్తులను ధరించి మురియుచుండు మనుమని కొంటెచేష్టవలె నుండును.

నేటి ప్రతికవితావిహారము నొక్కొక్క కులాయము. వానినుండి పికోలాపాదులు గాకున్న శుకాలాపాదులైన వినవచ్చును. పికపికీగాన మభావమైన కాలమునందు శుకశుకీగానమే శ్రావ్యముగదా! అలబ్ధమగు దానినే కోరువాడు వెఱ్ఱివాడు. కాలవాతావరణప్రభావములచే కవి యధోగతిపా లయ్యెనని విమర్శకుడు వగచునేకాని, యతడు మాత్రము తత్ప్రభావవిముగ్ధుడు గాక దాని నధఃకరింపగలడా? విమర్శకు డసలు కాలవాతావరణప్రభావములనుండి తేరనే తేరలేడు. కనుక పూర్వ మొక విశేషాభిరుచి యుండుట తప్పుకాదు. నేడు లేకుండుటయు తప్పుకాదు. ఒకచో నది తిరిగి వెలయుట లోపమనరాదు. పురాణవిపులకావ్యకవితలు ధర్మోపదేశము జేయుట యెంత యవసరమో, ప్రబంధభావకవితలు తదభిరుచి తిరిగి వెలసినచో దాని నసహ్యించుకొనుట యంత యనవసరము. గుణాగుణనిర్ణయము చేయక కాలము దేనిని పరిగ్రహింపదు. సున్నితముగ ధర్మోపదేశము పొందుపడినచో దానిని నివారింప యత్నించుట సమంజసము కాదనిమాత్రము మన మిప్పటికి నిర్ణయింపవచ్చును.





కథ:

తన్మయత

= శ్రీ వేలూరి శివరామశాస్త్రి =

[గతసంచిక తరువాయి]

౭

ఆమఱునాఁటి ప్రొద్దున నారదుఁడు రహో దేవిని రచ్చసావడి కీడ్చెను. ఇరుగు పొరుగులవా రందఱును "మలయమాలి లేచి పోయె"నని చెప్పుకొనిరి. వారి యిరుగుపొరు గులవా రందఱును "మలయమాలికి పిచ్చి యెత్తిన" దని చెప్పుకొనిరి. కోమటివాడ యంతయు కోటీశ్వరునియింటికి వచ్చి పరా మర్శ చేసిపోవుచుండెను.

విజయమాలి ప్రాణములు ప్రాణము లలో లేవు. గోరుచుట్టుపై రోఁకటిపోటు వలె ఈజనఘోష యేమి? లోకులు మంచి కంజలి పట్టక చెట్టనిటులు చెవాకులు చేసి కొందు రేమి?

"మలయమాలి లేచిపోయె" నను వార్త పామరులలో విషమువలె వ్యాపించెను. "తండ్రియే వెడలనడచె" నని ఒకగుంపను కొనెను. "మలయమాలికి పిచ్చి యెత్తె" నని ఇంకొక గుంపనుకొనెను. "అది మదనో న్మాద"మని మఱియొక గుంపనుకొనెను. దానిమీఁద చిలవలు పలవలు వికసించెను. "మలయమాలిని బ్రహ్మచర్యమున బంధిం చుట తలిదండ్రులదే త" ప్పని మహాజనము తీర్పిచ్చెను.

ఈతీర్పుచే విజయమాలికి వగర్పు పుట్టెను. తాను కొడుకునకు పెండ్లి చేయ ననెనా? కొడుకు చిన్నవాఁడా చితకవాఁడా? చదివిన్నవాఁడా చదువనివాఁడా? అతని కే వధువును నచ్చదు. తా నేమి చేయఁగలఁడు? ఈమాట లెవరు విందురు? లోకము మూయ మూఁకు దున్నదా? విజయమాలి తలుపులు మూసికొని మరణదండనమును నిరీక్షించుచు మంచ మెక్కెను.

మలయమాలితల్లి గ్రామదేవతలకు మ్రొక్కుబడులు చెల్లింపఁ జనెను. అచటివారందఱు నామెను గాంచి "చేతులు కాలిన పిదప ఆకులు పట్టుకోడ మెందుకు? ఎన్నఁడూ లేంది ఇతర దేవుళ్లను—ఈబుద్ధుళ్లనూ ప్రబుద్ధుళ్లనూ కొలిస్తే బెడిసికొట్టదూ?" అని అనిరి. ఈవల కుమారునిమీఁది వాత్సల్యము, ఆవల రాజదండమువలని భయము! ఇటు చూచిన నూయియు, అటు చూచిన గోయి యునుగా ఆమె ఏమియు మాటాడఁజాలక మ్రొక్కుబడు లచటనే విడిచిపెట్టి యిలు దూఱి సిద్ధు నంగడినుండి రావించి కుమారుని కనిపట్టియుండుటకుఁ దోఁటకుఁ బంపెను.

విజయమాలిగృహాంతరాళమున పగటి పూఁటనే రాత్రిదేవత కాఁపురము పెట్టెను. లక్ష్మీదేవి కలకలలాడుచుండఁగనే జ్యేష్ఠాదేవి సివాలాడఁజొచ్చెను.

"తలుపు."

"ఎవరు వారు ?"

"పలుకకువే పలుకకువే" యని విజయమాలి సన్నగా అనెను.

"నేను-రాజ్యలక్ష్మిని."

"అమ్మో! కొంప ములిఁగినది. నూయి యెక్కడనే?" యని విజయమాలి తడుములాడఁజొచ్చెను.

"తలుపు తీయవమ్మా."

"తీయకే. ఇం కేమున్నది ? బ్రతికి యుండఁగనే బండకొయ్యలో దుర్మరణము!"

"ఎందుకండీ అంత భయము ? పిల్లవానికి పిచ్చి యెత్తఁగా పైన ఈ పరియాచకమా ? మన మేమి తప్పు చేసితిమి ?" అని భార్య పోయి తలుపులు తెఱచెను. విజయమాలి రాజ్యలక్ష్మిని ముసుగులోనుండి చూచి గడగడలాడిపోయెను. రాజ్యలక్ష్మి "ఇవ్వేళ కొట్టు తీయలేదేం ?" అని చిఱునగవును పెదవులలోనే అడఁచిపట్టుకొనెను.

విజయమాలి గుండెలు పట్టుకొని "ఆహా! మలయమాలికి పిచ్చి." అని ఆవురుమని యేడ్చెను.

అతని భార్య—"మేము బిగ్గఱగా నేడ్చుటకుఁగూడ నోఁచుకొనలేదు. చూచితివా రాజ్యమూ! నాకుర్రవాఁ డందఱి కుర్రవాండ్ర వంటివాఁడు కాఁడు. నీ వెఱుఁగుదువు. వాఁడు బ్రాహ్మణులతోపాటు చదువుకొన్నవాఁడు; రాజులతోపాటు డబ్బుగలవాఁడు. ఇట్టి మా యేకైకపుత్రునకా యీ దురవస్థ? ముం దిఁక మాకర్మ మింకెంత యున్నదో" అని వలవల యేడ్చెను.

"ఈపిచ్చిని నేను మొదటినుంచీ గమనిస్తూనే వున్నాను. తీరా దగ్గరి కొచ్చేసరికి ఏమీ మాటాడలేకపోయేదాన్ని. బుద్ధదేవుణ్ణి తీసుకుని రాచకుమార్తగారిముంగలికేనాడు వచ్చాడో ఆనాడే ఈయనకీ పిచ్చనుకోండి." అని రాజ్యలక్ష్మి అనెను.

"ఆఁ. ఏమి ఏమిటి ?"

"నాకును దెలియును. అతఁ డుద్రిక్తుఁడగుచుండినపు డెల్లనే నేదో మిషమీఁద వారించుచునే యుంటిని. వాఁడును నన్ను కంటగించుకొనుచునే యుండెను. నిన్నొక మాట యడుగుదును. ఈవార్త రాజకులములో తెలిసినదా ? నిక్క మాడినచో నీకు బహుమతి యిత్తు" నని విజయమాలి ప్రత్యుత్తరమున కెదురుచూచెను.

"రాచకులాని కేమిటయ్యా - రాచకు మార్తెగారికే తెలుసు. ఆమె వేణువనంలోకి దయచేస్తూవుంటే ఈయనగారు పచ్చడం పఱచడమూ, తీర్థ మాడబోతే పూలు విన రడమూను! ఆమె దేవత కాఁబట్టి పూరు కుంది. ఐతే, ఇవ్వాళటి పుకారునుబట్టి చూస్తే రాచకులం అనంగా ఏమిటి—పది పెట్టా పెడుతుంది; పది కొట్టా కొడుతుంది. అందులో ఇసుమంటి సాహసమా ? ఎంత అప్రతిష్ఠ! అమ్మో అమ్మో" అని రాజ్యలక్ష్మి గుండెలు బాఁదుకొనెను.

విజయమాలి మొగము తడిపాఁత యాయెను.

అతని భార్య రాజ్యలక్ష్మిచేతులు పట్టు కొని "నీ వడిగిన దిత్తును. మలయమాలికి నిజముగా పిచ్చి యెత్తిన దని రాజకుమారికి నీవు నచ్చఁజెప్పవలెను" అనెను.

"నరే. నే చెపతాగాని అబ్బాయిగారి వెర్రి ముందు కుదర్చండి."

"ఆలాగే. నీవు బహుమతి కోరుకో" అని విజయమాలి అనెను.

"లేని త్యాగికన్న ఉన్న లోభి మే లనడం ఇదే"నని లోపల ననుకొని, రాజ్య లక్ష్మి ఒక తారహారము మెడలో వేయిం చుకొని, సుగంధద్రవ్యములమాట మఱచి వెళ్లిపోయెను. విజయమాలియు వానిమాట మఱచి తలుపు మూసికొనెను.

మఱికొంత సేపటికి వీరలక్ష్మి వచ్చి తలుపు తట్టెను. ప్రాణములు బిగియఁబట్టు కొని విజయమాలి తలుపు తెఱచెను. వీర లక్ష్మి లోపలఁ బ్రవేశింపఁగనే అతఁడు మరలఁ దలుపు మూసివయిచెను.

"నరేకాని, మీ తండ్రిబిడ్డలకు ఆడవా ళ్లను చెరబట్టడమేనా యేమిటి పని?"

విజయమాలి నాలుక కొఱుకుకొనెను.

"నే నుండఁగా అంత పని జరుగుటయే?" అనుచు విజయమాలిభార్య వారికడకు వచ్చెను.

"ఏమిటమ్మా నీకొడుకు తెలివి? నక్క యెక్కడ, నాకలోక మెక్కడ?" అని వీర లక్ష్మి యనెను.

"వెఱ్ఱికి వేయి విధా లని నీకు తెలియ దటే ? మన కీ వాద మెందులకుఁగాని రాజ కుమారికి కోపము రాకుండఁ జేయుదువేని నీకడుపునఁ బుట్టుదును."

"నరేకాని ఆయన ఆవరనగా 'ఇందు కీర్తి ఇందుకీర్తి' అని స్మరణ చేస్తూవుండగా ఎవరి మంచిమాట ఏం చెలామణీ ఔతుంది?"

"నీవుమాత్రము పిచ్చి యని చెప్పుము, చాలు. నీమాటకు అంత విలువ ఉన్న" దని విజయమాలి భార్యదెసఁ జూచెను. ఆమె తన మెడలోని కాసులపేరు తీసి వీరలక్ష్మి మెడలోఁ బడవైచెను.

వీరలక్ష్మి సంతసించి "ఈ పూఁట కొట్టు మూస్తిరాయె. ఎట్లా?" అని అడిగెను.

"ఔరా! మఱచితిని. నేను వచ్చి యి చ్చెద" నని విజయమాలి వీరలక్ష్మిని వెంటఁ బెట్టుకొని అంగడికిఁ బోయి వలసిన ద్రవ్యము లిచ్చి దానినిఁ బంపివయిచెను.

కొంతకొమటులు కొందఱు విజయ మాలికడకు వచ్చి "మామా! నీవు రాజు గారి వియ్యంకుఁడవు, ఇఁక నీ కీ యంగడి యెందుల" కని వితగా నాతని నొవ్వనాడిరి.

మఱికొందఱు "శుద్ధబొద్దుఁడ" వని దూయఁ బట్టుకొనిరి. కొందఱు "వెలివేయుదు" మని బెదరించిరి.

విజయమాలిగుండెలు రాలుగా మాఱెను. అతఁ డంగడి మూసి యిలు మోమూయెను. దారిలో అల్లరిపిల్లకాయలు "అడుగో రాజుగారి వియ్యంకుఁడు, రాజుగారి వియ్యంకుఁడు" అని అఱవఁదొడఁగిరి. విజయమాలి చెవులు మూసికొని యింటికిఁ బరుగెత్తెను.

అతఁ డా పగలంతయు నెట్టులో గడపి రాత్రి మలయమాలిని ఉద్యానగృహమున బంధింపించి, తోఁటలోమాత్ర మతఁ డటు నిటు తిరుగుటకు వీలగునట్లు కట్టుదిట్టము చేసెను. ధన మంతయు నచటనచట నేలలో పాతిపెట్టెను. స్థిరాస్తి నంతయు వారి వీరిపేరఁ బెట్టెను.

విజయమాలి దాఁచమఱచిన రవ్వయో యన వేగుఁజుక్క పొటుక్కునఁ బొడిచెను. తూర్పుతెలపొలమున ఉషాదేవి రవ్వల కొట్టు పెట్టెను.

విజయమాలి మోఁకాలుదిగని కొల్లాయి యొకటి కట్టుకొనెను. వాకిట గడ్డిపా న్పొకటి పఱచెను. దానిప్రక్కనే వంకరకఱ్ఱ యొకటి పెట్టుకొనెను. భార్యను బోసి చేసెను. వేలకన్నులు గల ఉత్తరీయ మొకటి కప్పుకొని ఆ దర్భశయన మలంకరించెను. భార్యను కాళ్లకాడఁ గూర్చుండు మనెను. ఊరెరిగిరి పోవునటు లేద్వా మనెను.

౯

వెఱ్ఱివానిని చూడ వేడుక. కావున మలయమాలితోఁట మనుజాకీర్ణ మాయెను.

మలయమాలి కా వనమే నందన వనము. ఆ యుద్యానకుటీరమే వైజయంతము. మలయమాలి కానందనమున స్వేచ్ఛగాఁ దిరుగాడ వీ లుండెను. ఐనను ఇపుడతఁ డా వైజయంతము దాఁటఁ దలఁచుకొనలేదు.

హంసపది యను దాది చాటుగా నాతనిఁ జూడఁబోయెను. మలయమాలి ధ్యానములో నుండెను. హంసపది కనుల నీరు పెట్టుకొని "కోటికి పడగెత్తిన కోమటి కొంటిబిడ్డవు. కన్న కడుపుకు చిచ్చుపెట్టావు. చిన్నప్పుడు నే నిచ్చిన పా లిల్లా వెఱ్ఱిపా లవుతా యని కలలో నయినా అనుకోలేదు నాయనా!" అని ఆక్రందించి వెళ్లలేక వెళ్లలేక వెళ్లిపోయెను.

బట్టుకవి బాలరాజు వచ్చి చూచి —
"బంగారువంటి కోమటి
సంగీతముచేత బేరసారము లుడిగెనూ"
అని దీర్ఘము తీసి వెళ్లెను.

కలకంఠి యను పేరు గల కలహాకంఠి యొకతె వచ్చి కొంచె మాచి చూచి నెటిక విఱిచి - "పిచ్చట? డబ్బుంటే సరి - అది లేకుంటే మదపిచ్చి" అని గద్దరించెను.

అలివేణి వచ్చి "పిచ్చికి మం దేమయినా వేస్తున్నారా?" అని అడిగెను.

"నీకూ పిచ్చి. ఆయన కేం పిచ్చే? మదపిచ్చికి మం దేమిటే? లొటిపిటశూల రోఁకళ్లకు గాని లొంగదు." అని కలకంఠి యనెను.

అలివేణి నోటికి గుడ్డ అడ్డముపెట్టుకొని కలకంఠిని చేబూని వెనుదిరిగెను.

మలయమాలిసహాధ్యాయుఁ డొకఁడు వచ్చి ఆకుటీరము ప్రదక్షిణించుచు —

"మా దిగుడుబావిలో నొక
చేదస్తపుహంస తపము చేసెడి; అది దా
మోదరనాభీకాసా
రోదితపద్మినినిఁదక్క నొల్లదు దేనిన్."

అని పఠించుచు వెడలిపోయెను.

ఇటులు గురువులును, సహాధ్యేతలును, మిత్రులును, బంధుగులును, పరిచితులును, పరిచారకులును వచ్చి చూచి నివ్వెఱను, కోపమును, దయను, విచారమును, అమర్షమును, విషాదమును పొంది యెవరి యిండ్లకు వారు వెడలిపోయిరి.

వెనుక రాజకుమారి యిచ్చిన యాజ్ఞ యిపుడు మంథరకున కర్థ మాయెను. అతని కలమును, కుంచెయు రాజకుమారిని పరివేషించెను. అతని హృదయభ్రమర మామెరూప కుసుమ గుచ్ఛములోఁ దిరిగినకొలఁదియు నతనికలము మధుపూరిత మగుచువచ్చెను. అతని లోఁజూపునకు నమ్మిన బంటగు వెలిచూపు చూచినటులెల్ల నతని చేతిలోని కుంచె యాడెను. అతని మానస మామె రూపదేశమును ప్రదక్షిణించుచుండఁగా నతని కల మొక లావణ్యామృతమును పటకలశమున నింపెను. అతఁడంతరంగసముద్రమును మథించి తూలికాగ్రముచే రంగరించి అపూర్వమగు నొక నేత్రాలంకారమును పటాగ్రమునకుఁ దెచ్చి పొడవుగా నొక నిట్టూర్పు విడిచెను.

విజనముగా నున్నపుడు మలయమాలి యేమి చేయునో చూడఁదలఁచి కాఁబోలు సూర్యుఁడు నేలమీఁద మోము మోపి తన కిరణముల నా కుటీరములోనికిఁ బంపుచు, ఇటు మంథరకుని ప్రతిభను కొనియాడఁ గాఁబోలు తన కరములచే నొకతూరి ఆ చిత్తరువు నంటి దిగుచుకొనెను.

మంథరకుఁ డాచిత్తరువును చేలము చాటునఁ బెట్టుకొని మలయమాలికుటీరమునకుఁ గొంపోయెను. చూడవచ్చినవా రందఱును వెడలిపోయినతరువాత మసకమసక చీఁకటిలో మెలకువగా అడుగులు వేసికొనుచు పిల్లివలె నతఁడు లోని కేగి మలయమాలి కూరుచున్న కుటీరముచుట్టును దిరిగి లోపలను, వెలుపలను బరీక్షించిచూచెను. మలయమాలి మహాసమాధిలో నుండుట గనుఁగొని కుటీరములోని కడుగు దీసి యడుగు పెట్టుచుఁ జని యతని యెట్టెదుట నాచిత్తరువును నిలిపి యటనుండి దొంగవలె మెలమెలగా వెడలిపోయెను.

కృష్ణద్వితీయ ఆకాశమున మంచుదీప మెత్తెను. భూధేనువు నాక్రమించిన దోమలో యన చీఁకటులు పాఱిపోఁ దొడఁగెను. కోటి కోటి వెలుఁగుగుత్తులతో కలకలలాడు నాకాశము మానవులకు వస్తుప్రదర్శనశాలయో యన భాసించెను. వెన్నెలపులుఁగులు వెంపరలాడెను.

అపుడు మలయమాలి కనులు దెఱచెను. అతఁ డెదుటఁ జూచి — "సహస్రబోధిజ్యోతులకు కేంద్రమయినది నీమోము. ఒకసారి నాకడకురమ్ము. ఈప్రదేశ మలంకరించి యెంత సేపయినది? ఆహా! ఎన్నాళ్లకు నాతపము ఫలించినది?" అని యెదురు చూచెను. కాని- ఆ యిందుకీర్తి అతనికిఁ బ్రత్యుత్తర మీలేదు. దాన మలయమాలి కొంచెము వికలుఁ డాయెను.

అపుడు దక్షిణనాయిక మలయమాలిని జూచి నిట్టూర్చినదో యన మలయానిలము ప్రసరింపఁ దొడఁగెను. లతలు మలయానిలుని రాకకు సంతసించి తామై బిగ్గన కౌఁగిలి గొనుటచేతనో యన నెత్తావు లుబికి నాసికా పుటములకు తలమునక లాయెను. ఆచిత్ర పటము కొంచెము ముందుల కూఁగి గాలి కొల్లగొట్టుకొని వచ్చిన తావిని తనదిగాఁ జేసికొనెను.

మలయమాలి సంతోషభరితుఁడై - "నేను సింహళమునం దున్నపుడు బుద్ధుని త్రోవనుబట్టి సన్న్యాసదండమును చేఁబూని నిర్వాణనగరమునకు పోవఁ దలపోసికొంటిని. కాని యిందూ! నేను మొదట నిన్నుఁ జూచినపుడు నిర్వాణమునే చూచితిని. నే నపుడు నన్నే మఱచితిని. అది నిర్వాణము కాక మఱేమి?

"కాని తరువాతఁదరువాత ననుభూతి చేఁగాని తృప్తిచెందని కామక్షుధ నా ప్రాణములలోఁ బ్రవేశించుట కనుఁగొంటిని. అగ్నిజ్వాల నాయింటి నాలుగుమూల లంటుకొనెను. కొందఱు దానిని రోగ మనిరి. మఱి కొందఱు వెఱ్ఱి యనిరి. సరకు మంచిది కాదని తెలుపుటకు లోకు లొక పాడుపేరు పెట్టి దానిని హింసింతురు. నా పని యటులే యయినది.

"తరువాత నే నా యగ్నిలో నాహుతి యగుదు ననుకొంటిని. కాని యటులు కాలేదు. నన్నది బూడిద చేయుటకుబదులు నాలోని మాలిన్యమును భస్మీకరించెను. ఇపుడు నాలో మహామైత్రి పదాఱువన్నె బంగారమై మెఱయుచున్నది. ఇందూ! ఇఁక రమ్ము. స్కంధపంచకము దాఁటి ఈ మైత్రీ భూమలో మునిఁగిపోవుదము." అని అనెను.

మలయవాయు వతని మాటల నాలకించుటకో యన నిలుచుటచే ఆ ప్రతికృతియు నిశ్చల మాయెను. మలయమాలి యిందుకీర్తి ప్రతివచనమునకు కనిపట్టుకొనియుండెను గాని వృథా.

మలయమాలి నపు డనుమానపిశాచ మావహించెను. "ఇది యిందుకీర్తి ప్రతికృతియా?"

అతఁడు కొంచెము దక్షిణమునకును, కొంచె ముత్తరమునకును వంగి చూచెను. ఆమె తనను చూచుచున్నటులు, కలకల నవ్వుచున్నటులు, మాటలాడఁ బోవుచున్నటులు, కదలుచున్నటులు అతనికిఁ గానిపించెను. అతఁ డెటు వంగి చూచినను ఆమె యతనినిఁ జూచుచునే యుండెను. ఈ దెస ఆ చిత్రపటము తన సృష్టికి సాఫల్యమును సంపాదించుకొనెను.

"ఇందుకీర్తి మౌనవ్రత మవలంబించెనా?" మలయమాలి మఱి యాఁగక యా చిత్రపటమును సమీపించెను. మీఁదఁ జేయి వైచినపిదపఁగాని యతని కది చిత్తరువని తెలియకపోయెను.

౧౦

"ఈచిత్తరు విచటి కెటులు వచ్చెను?"

ఈ ముడి అతనికి విడలేదు.

"ఇందుకీర్తియే పంపెనా?"

ఏమో. ఎటులో వచ్చెను. వచ్చెనుబోఁ జాలు. అది అతని భాగ్యము. మలయమాలి ఆ చిత్తరువును దెచ్చి యెదుట నిడి

కొని కూరుచుండెను. కొంతసేపు కన్నులఁ గాంచెను. కొంతసేపు మోమును దిలకించెను. కొంతసేపు కంఠమును కనుఁగొనెను. ఇటులు నఖశిఖాపర్యంతమును, శిఖానఖపర్యంతమును మరలమరలఁ గనుఁగొనెను. అతఁ డిటు లవలోకించుచుండఁగనే తెలవాఱెను.

అతఁ డాచిత్తరువుతోఁ బ్రసంగించును. తా నా చిత్తరువుమాటలు వినును. అతఁ డా చిత్తరువు నలంకరించును. తాను దాని తృప్త్యతృప్తుల గమనించును. అతఁడు వలయు వస్తువులఁ గనుఁగొనును. వానిని సమర్పించును.

అతని కిందుకీర్తితోఁ బ్రణయకలహములు సంభవించెను. వెరవేఁకి జనించెను. సమసిపోయెను. అతఁ డిందుకీర్తిని బతిమాలెను. బతిమాలించుకొనెను. మాటలాడక కూరుచుండెను. మాటలాడెను. ఆమె బదులుమాటలు వినెను. ఈరీతిగా నతని కా చిత్తరువే యిందుకీర్తి యయిపోయెను.

అతని కిందుకీర్తికిఁ గాను సత్యప్రపంచము నుండి కావలసిన వస్తువులు లేవు. సంకల్పముచే సృజింపఁబడిన వస్తువులే యామె కుపాహారములు. కాని ఒకానొకనాఁడు ఇందుకీర్తి నలంకరించుటకు చెట్లు పూచిన పూవులే మలయమాలికిఁ గావలసివచ్చెను. అంతట నామెతో వనవిహారము చేయు తలఁపు కలిగెను. అతఁడు వెంటనే యిందుకీర్తితో కుటీరము వీడి వనములోనికిఁ జనెను!

ఆ యుద్యానమున నున్న ఆ వృక్షస్తంభపర్యంత మిందుకీర్తి కొఱకే మొలిచినటు లతనికిఁ గానిపించెను. అతడు కనఁబడిన చెట్టుక్రిందనెల్ల ఇందుకీర్తిని దింపి అచట నామె కుపచారములు చెప్పెను. అచట నొక్కొక్క పిట్టనే చూపెను. ఆ పిట్టకూఁత లిందుకీర్తియుం దొక గానసభగా నానందించెను.

ఇటులు వనవిహారము చేసిచేసి మలయమాలి యిందుకీర్తి నొక సురపొన్ననీడను డించి యామె నలంకరించుటకు పూవులు తేఁబోయెను.

రాజకుమారిచేఁ బ్రేరితుఁడై వినయజ్యోతి మలయమాలిని కనిపట్టియుండెను. మలయమాలి పూలకని అటు వెళ్లఁగనే వినయజ్యోతి యిటు వచ్చెను. అతఁ డా చిత్తరువును దీసి యావల నుంచి దానికి బదులుగా నచట మఱియొక చిత్తరువు నుంచి తా నొక చెట్టుచాటున దాఁగియుండెను.

ఈ చిత్తరువున బ్రహ్మాండమైన ఒక నల్లత్రాఁచు. అది పడగ విప్పి యిందుకీర్తిని గాటువేసెను. ఇందుకీర్తి నేల కొఱగెను. ఆమె పెదవులును, దంతములును, మోమును నల్లఁబాఱెను.

మలయమాలి తోఁట యంతయుఁ దిరిగి తిరిగి వసంతునిపంట యంతయుఁ గోసెను. ఆపటముముందులకు వచ్చి రంభాపలాశములఁ బఱచి వానిమీఁద నాపూలఁ గుమ్మరించెను. పలుమాఱులు కోసికొనివచ్చిన ఆ పూలన్నియు నచట నుండఁగా అది యొక పూల యంగడి యాయెను.

ఆ పుష్పరాశినుండి దోసిళ్లకొలఁది పూలతో నతఁ డిందుకీర్తి నభిషేకింపఁదొడఁగెను. అవి ముత్తియములవలె నెగసి నక్షత్రములవలె నేల రాలెను. క్రింద రాలిన పూలన్నియు నొక పాలమడుఁ గాయెను.

పూలతావిచే నతఁ డున్మాదము చెందెను. ప్రేమచే సొడ్డుగుడుచుకొనెను. ఏకాంతతచే నితర మంతయు మఱచెను. అతఁ డిందుకీర్తిని కౌఁగిలించుకొనఁబోయి మోమెత్తి చూచెను. ఇందుకీర్తి చచ్చిపడియుండెను. ఆమె ప్రక్క బ్రహ్మాండమైన ఒక నల్లత్రాఁచు. అతని మేనిచట్ర మంతయు చలించెను. కనుల నీరు గ్రమ్మెను. అతఁ డెగదిగఁ జూచెను. అతని మతి చెదరెను. అతని కనులు ముకుళించెను. అతని యవయవములు పట్టుదప్పెను. అతఁ డెగురవయిచిన మట్టిముద్దవలె చదికిలఁబడెను. మూర్ఛలో మునిఁగెను.

మలయమారుత మాతని వదనమండలమంతటి స్వేదబిందువులను తుడిచివైచెను. గరువముతో నిట్టనిలిచిన ఆ సురపొన్న పట్టని గోడు గాయెను. మలయమాలి కొంతసేపటికి ప్రక్కనుండి యాప్రక్కకు దొరిలెను. మాఁగువాఱిన మోముతో లేచి యిందుకీర్తిని జూచెను. బాష్పప్రవాహ మతని నంధు నొనరించెను.

"ఇందుకీర్తి అస్తమింపఁగా, ఓరి మలయమాలీ! నీ జీవ మేల పోదు?" అని అతఁడు కనులు తుడుచుకొని రివ్వున నాసురపొన్న నెక్కఁదొడఁగెను.

దానిచాటుననే దాఁగియున్న వినయజ్యోతి రాఁబోవు నాపదను ఊహించి వెంటనే కొంతమంది భటులను సైగచే రావించి ఆ యాపదను నివారించు ప్రయత్నమునం దుండెను.

మలయమాలి స్కంధము లన్నియు దాఁటెను. దిగంతమును జూచుటకుఁ బ్రయాణము కట్టినటు లున్న యొక కొమ్మ కతఁడు చేతులను, కాళ్లను లంకెవయిచి తలక్రిందుల పిట్టవలె వ్రేలాడి యిందుకీర్తిని ధ్యానించుచు చేతులను, కాళ్లను వదలివైచెను. అతఁడా చెట్టునడుమ నేదేని కొమ్మమీఁదఁ బడియుండునేని వేయిమలయమాలు లైపోయెడివాఁడు.

మలయమాలి కనులఁ దెఱచి చూడఁగలిగినంతలో తాను వినయజ్యోతిచేతులలో బ్రతికియున్నటులు తెలిసికొనెను. మలయమాలి రిచ్చపడి యిటు లనెను: "అయ్యా, నా కుపకార మనుకొని అపకార మొనరించితిరి."

"ఎటులు?"

"ఇందుకీర్తి చనిపోయినపిదప నా బ్రతుకేల?"

"ఓయి మూఢుఁడా! నీ వలెనే బ్రతికియున్న యిందుకీర్తిని చచ్చిన దనుచున్నావు. నీ వెవరిని పూలఁ బూజించుచుంటివో, నీ వెవరిని ముద్దాడుచుంటివో, నీ వెవరిని కౌఁగిలించుకొనుచుంటివో అది చిత్తరువు. నీవు రాగివి. ఇది యెల్లయుఁ గల్ల. ఇది నీ సంకల్పసృష్టి, భ్రాంతి, మాయ."

"ఇందుకీర్తి బ్రతికియుండుట కల్ల."

"ఓరి మూర్ఖుఁడా, అదిగో చూడుము, వేణువనమున బుద్ధుని విహారమును బరికించి తన ప్రాసాదమున కదె పోవుచున్నది."

మలయమాలి కరకంతలలోనుండి యిందుకీర్తిని జూచెను. వెంటనే యతనికి పూర్వస్మృతి కలిగెను. తల వంచుకొనెను.

"నాయనా, నీవు ధ్యానసిద్ధుఁడవు. నీ ధ్యానమును సిద్ధింపఁజేయుట కిందుకీర్తి

ఆచార్యా. నీ వీధ్యానబలముచేఁ దత్త్వమును దెలిసికొనఁగోరుదువేని అమృతుఁడ వయ్యెదవే. పామరులు పైదలులకొఱకు శరీరము నైన నొడ్డుదురు. తత్త్వముకొఱకే శరీరము నొడ్డుదురేని మఱి శరీరము నెఱుఁగరుకదా. మనోబల ముపయోగించి నీ వెవరికొఱకు ప్రాణముల నొడ్డితివో ఆమనోబలమునే యుపయోగించి తత్త్వముకొఱ కిపుడు ప్రాణముల నొడ్డఁగలవేని కోటికోటి యిందు కీర్తుల మూలమును కనుఁగొనఁజాలుదువే” అని వినయజ్యోతి యనెను.

“ఏమేమి?” అని మలయమాలి డిల్లపడెను. అతని కనుబొమ లుత్కోచము లాయెను. ఒడలు కర్రబాఱెను. కొంచెము సేపటిలో నతని మోము పిండిన వలువయ్యె వెంటనే సగము విఱిగి వ్రేలాడు నాకువలె నేలకు వ్రాలెను. కనులు నీటిముద్ద లయిపోయెను. అతని మానస మేకాగ్రతచే కరడుగట్టెను. ఇంతవఱకును శిశువువలె వినయజ్యోతిచేతులలో నున్న మలయమాలి యిపుడు లేచి అతనిముందు శిష్యునివలె నిలువఁబడి “కుండచిల్లిని బంగారపుపొడిచే పూఁడ్చుచుంటిని” అని వినయజ్యోతిముందు మోఁకారించెను.

“త్రిశరణములు నిన్ను రక్షించుఁగాక.”

౧౧

తలిదండ్రులు మలయమాలి పునర్జన్మ మెత్తినటులు సంతసించిరి. గురువులు “చదువుల కిది ఫల”మని తృప్తి సనిరి. “క్షీరవాని తిక్క తిరిగిన” దని ప్రజ శాంతి పొందెను. మిత్రు లందఱును ప్రత్యక్షమయిన దైవమును స్తోత్రముచేసినటులు ఇందుకీర్తియాచార్యమును స్తోత్రముచేసిరి. ఇందుకీర్తి వినయజ్యోతిని ప్రశంసించి మలయమాలికి మంగళము కలుగవలయు నని మనసులో కోరుకొనెను.

మలయమాలి యిటు లందఱను సంతోషసముద్రమున ముంచి మాయ మయిపోయెను.

ప్రేమను పాథేయముగాఁ గొని మనీష మలయమాలికొఱకు గృహత్యాగ మొనరించెను.

మనీష కాలువెట్టిన మొదటి యూరి సందులో నొక యింటిముంగల సందడిగా నుండెను. ఆ యి ల్లొక మంగలవానిది. అతఁడు తాగి కొంచెము మత్తుగా నుండెను. ఆ యింటియెదుటి వేఁపక్రింద దారి నరికట్టి పలువు రొక గుంపుగా కూర్చుండిరి. ఆ గుంపులో నొకఁడు “ఒరేయ్, తల తడిపి పోయావ్, తొందరగా రా” అనెను. ఇంకొకఁడు-“ఒరే నాకు సగం గొఱిగిపోయావ్; నీ వాకిలే తిరుపతి చేశావ్” అనెను. “ఈవేళ యెవరి అదృష్టమూ తిన్నగా లే'' దని ఒకఁడనెను. ఇటు లందఱు నిన్ని మాట లనుచుండఁగా ఆమంగలవాఁడు-“కోటీస్వరుడికొడుకు నిన్న సొగరం చేపించుకోని ఇదుగో! ఈ బంగార మ్మొలతా డిచ్చిపోయిండు. నీవుకూడా తే ఓతాడు. నీకూ చేత్తా నున్నగా సొగరం” అని యనెను.

మనీష యీ మాటలు వినుచు వారిని-తప్పించుకొని వెళ్లి ఊరబసివి కతిథియాయెను.

ఆ పగ లంతయు నామె రాత్రివలె వెడలఁబుచ్చెను. గూండ్లకుఁ జేరు పిట్టల

కలకలారావములు ఆమెస్వప్న సేతువును శిథిలమొనరించెను. పడమటికొండమీఁది సూర్యుని చరమకాంతి ఆమెమనసుమీఁద రక్తాక్షరముల ముద్రించిపోయెను.

మనీష యపుడు ఆ మంగలవాని యింటి కేగి పది దీనారములచే నాతని ఆశ్చర్యమున ముంచి మలయమాలికేశపాశమును గొని మిళనతీర్థమునకు మహాప్రస్థాన మొనరించెను.

మనీష గ్రామసీమ దాఁటి దానిని దీసి చూచెను. చంచల మయినను నిబిడమయిన యొక్క మదిరానుభవ మామెమానసమును స్పృశించిపోయెను. ముఖరమై పోటు పొడిచిన మున్నీటి ముత్తరఁగతలపై పుష్పించిన బుద్బుదమై, గిరులఁ దిరుగు మహాకాలుని రథచక్రమునుండి తునిసిపడిన మణిదీప్తియై మలయమాలి యామె కా కేశపాశమునఁ గనఁబడెను. ఆమె దానిని ముద్దిడుకొని కనుల కద్దుకొని తన కేశపాశములో కలిపి చుట్టుకొనెను. కృష్ణరాత్రి వక్షస్స్థలమును భేదించుకొని వచ్చిన రోమాంచమో యన నున్న నక్షత్రముల వెలుఁగులో "ఇటు పో, ఇటు పో" అని చెప్పి చూపుచున్న భూదేవితర్జనిఁబోలు బాటఁబడి యామె తెలవాఱులును నడచెను. ఊషాదేవి కావిచీరలతో నామె కెదురాయెను. సంసారభారముచే క్రుంగిన ప్రకృతిమాత బిడ్డలు చెట్టుచేమలు అయత్నపాలితములైనను ఆమె గుప్తవాత్సల్యమును పొందియోయన ఛాయాతపముల నిత్యక్రీడలో పాలుగొని అడ్డదిడ్డముగా తెగఁబెఱిఁగి ఆకసముదెస దేనినో చూచుచు నామెకుఁ గనఁబడెను. వానిని దాఁటినతరువాత ఎత్తయిన మేడలు. మిద్దెలు. నాలుగిండ్ల బవంతులు. రాజవీథులు.

మనీష ఆ నగరపు రచ్చచావడిముందు నుండి చనుచు నచట వెనుకటి విటులను జూచి తల వంచుకొనెను. ఒకానొకపుడు పూలవలె తనమీఁదఁ బడిన వేనవేల చూపులిపుడు ముండ్లవలె నామెకు గ్రుచ్చుకొనెను. ఒకానొకపుడు విషమే యమృత మగును, మఱియొకానొకపుడు అమృతమే విషమగును.

ఆమె యున్న యీ యునికికిని, ఆ రాకకును అచటివా రందఱును ఆశ్చర్యపడిరి. ఒకరొకరే యామెకు స్వాగత మిడిరి. అది యటుండ ఏలికయే రమ్మని ఆమెకు వార్త పంపెను. కాని మనీష యేటియొడ్డున నొకచెట్టున కతిథి యాయెను. ఏలయన, అది సరసము లాడఁబోదు; తనదారి కడ్డురాదు.

ఆమె యానాఁడచట నాఁడుదాని యసహాయతను, విశేషించి గణికల దుర్గతిని, మగవాని ప్రాబల్యమును, విశేషించి రాజుల యత్యాచారమును లెస్సగాఁ దెలిసికొని తన తెలివితేటలచే కామవైతరణిని దాఁటి తన రూపసంపదను నిందించుకొనుచు మరల భూషించుకొనుచు మధురకుఁ జనెను. ఆమె యచటఁగల విహారమునఁ బ్రవేశము సంపాదించెను. అందు ధర్మభగిని యాయెను. కాని యామె యెందుల కచటఁ బ్రవేశించెనో దానికి ఇసుమంతయు ఫలము కానరాలేదు.

ఆమె కచటఁ దాను చేయుచున్న పని తనకే విపరీతముగాఁ బొడగట్టెను. మఱియు తాను తిరిపె మెత్తుకొని తిని యిడుమలు గుడుచుచున్నను తన సౌందర్యభాండారమునకు పెంపేకాని టూం పేడను కానఁబడుట లేదు. విహారమున తాను ధర్మభగినిగా నున్నను పురుషసంఘమునుండి యామెకు

నిర్భయత లేదు. ఆఁడుదానికి స్వేచ్ఛగా బ్రతుకుటకు వీలే లేదా ?

ఆమె యిటులు సముద్రమున తెప్పవలె నటు నిటు కొట్టుకొనుచుండఁగా బౌద్ధ సన్న్యాసుల మారజయోత్సవము వచ్చెను. వెనుక నొకానొకనాఁడు బుద్ధుఁడు కామక్రోధాదులకు నెలవగు మారుని జయించెను. దానికీ పండువు గుర్తు.

శ్రమణు లందఱును ముండనము చేయించుకొనిరి. ఆఱవయిచిన కావివలువలఁ దాల్చిరి. త్రిశరణములకు శరణు జొచ్చిరి. పిమ్మటఁ గామాదిదుర్గుణములను చిత్రించి ఆచిత్తరువులను దెచ్చి ఒకటొకటే తగులఁబెట్టిరి.

అటుపిమ్మట "సర్వం దుఃఖం దుఃఖ" మ్మనియు, "సర్వం శూన్యం శూన్య" మ్మనియు దిక్కులు మాఱుమ్రోఁగెను.

ఈ భావనామంత్రముల నవగతము చేసికొని కాంబోలు పశ్చిమదిశ కాషాయాంబరములు కట్టి సూర్యకమండులువు చేకొని బౌద్ధధర్మ మవలంబించెను. నాయికాహృదయ మెఱుఁగని దుష్టవటువువలె చంద్రుఁ డామెను వెంటాడవచ్చెను. ఈ విడ్డూరమును జూడవచ్చిన జనసముదాయమో యన నాకసమునఁ జుక్కలు కిటకిటలాడెను.

మారజయమువలనఁ గలిగిన శాంతిచేవలె విహారవాసు లందఱును ఒడలు మఱచి నిదురించిరి. మనీషమాత్రము మారునకు జయవెట్టుచు కల్పనాకులాయమునఁ గూరుచుండి మలయమాలిని ప్రతీక్షించుచుండెను. ఆమెభావనాపటము ద్రౌపదికోకలవలె గుట్టలు పడుచుండెను. కొంతవడి కామె లోలోపల నిటు లనుకొనెను :-

"నవ్వు మున్నటు లున్న యీనడికిరేయి
నేలచివరను మేటిమున్నీటిముందు
వలపుదేవతగా బిట్టు వెలసిన నను
వింతవింతగ నెవ్వరే వెదకువారు ?"

ఆమె యిటులు ఎవరిచేతనో వెదకించుకొనుచుండఁగా అటు మారునిఁ దగులఁబెట్టిన చేయి యొకటి ఇటు మనీషపాదమును వెదకుచు ఆమెకుఁ దగిలెను. ఆమె మలయమాలిదే యని భ్రమసెను. ఆమె సంతోషముతో నాపున్నమవెలుఁగున నోరగంట నా చేతిని జూచెను. క్రమక్రమముగా నాచేయి తీఁగవలె నామెశరీరమును బెనఁగొనెను.

మనీష చివాలున లేచి కూరుచుండెను. ఆచేయి యామెను గట్టిగా దాపునకు లాగుకొనెను. ఆమె మెల్లఁగా "అయ్యా, ఇది మారుని తగులఁబెట్టిన చేయియేనా ?" అని యనెను.

"నిన్నీచేయి మైత్రీమయ మయిన సృష్టియొక్క కారణభూమిలోనికిఁ గొంపోవఁగలదు" అని ఆ శ్రమణాచార్యుఁ డనెను.

"కారణభూమియా, మారణభూమియా ? చెప్పెడివి శ్రీరంగనీతులును, దూరెడివి దొమ్మరగుడిసెలునా ?" అని మనీష అతని నొక తాపు తన్ని తన దుర్గతికి వగచుచు మలయమాలిని తలఁచుకొనుచు అచటనుండి లేచిపోయెను.

౧౨

మనీష కెచటను శాంతి దొరకలేదు. ఆమె గ్రామము విడిచి గ్రామము, నగరము విడిచి నగరము, అరణ్యము విడిచి అరణ్యా

ముగా దేశ మంతయుఁ దిరిగెను. మలయమాలిసంగతి యామె కిసుమంతయుఁ దెలియలేదు.

ఆమె విసుపును, విరామమును లేక మలయమాలి నన్వేషించుచు ఒక కొండ దరిని సిద్ధపురుషుల వేషములో నున్న కొంతమంది దొంగలను గనుఁగొనెను. ఆ పురుషులలో పురుషత్వ మెచటను అగపడక పోవు టామె కక్కజము కలిగించెను. అచట నొక ముసలియవ్వ యామెకు స్వాగత మిచ్చెను. మలయమాలి తెరువు కనుఁగొనుట కామె వారిని సేవింపమొదలిడెను.

వారిలో నొకఁ డిటు లనెను: "మలయమాలా? వాడికి నీవు భార్యవా?"

"ఔను."

"తన్ని తే పోయి పరుపుమీద పడ్డావ్."

అవ్వ యిటు లనెను: "వా డా గుహాలో దీక్షలో ఉన్నాడు."

అతఁ డిటు లనెను: "నడిరాత్రికి గాని వాడి దీక్ష కాదు."

అవ్వ యిటు లనెను: "అప్పుడు నీ వక్కడికి పోయి మాటాడుకోవచ్చును."

మనీష కాశాజ్యోతి యొక్కమాటు ద్వాదశాదిత్యులవలె వెలిఁగెను. హిమప్రళయము వచ్చినటులు వెంటనే ఆఱిపోయెను.

"త న్నతఁడు పరిగ్రహించునా? పరిగ్రహింపకపోయిన నేమి? అతనిని గొలుచుచు ప్రేమరాజ్యములో పౌరత్వము సంపాదించుకొనవచ్చును."

ఇటు లామెభావన సముద్రములోఁబడు నదివలె ఆటుపోటులకు క్రీడారంగమాయెను.

ఒకసారి మనీష మలయమాలిని తానే చూడఁదలఁచును. ఒకసారి తా నతనికొఱకు వచ్చినటులు ఆయవ్వచేఁ జెప్పింపఁదలఁచును. తానొకసారి మలయమాలికి నమస్కరించిన పిదప తన మౌనమే తన భవితవ్యతను నిరూపించు నని ఇంకొకమాఱు అనుకొనును. ఇటు లనేక సంకల్ప వికల్పముల పునఃపునరావృత్తులచే చంచలమైన యామెచిత్తమునుందు రాత్రి రెండవయామము ఒకసారి స్వర్గమును, ఒకసారి నరకమును కానఁబఱిచెను.

అపుడు మనీష చాటుగా నాయవ్వను బిలిచి "అవ్వా, నేను నీ కడుపునఁ బుట్టెదను. నీ వా గుహాలోనికి వెళ్లి—"

ఆ ముదియ అర్ధోక్తిలోనే అందుకొని— పిచ్చిదానా, నేనూ ఆడపుటకే పుట్టాను. నీసంగతి నా కర్థమయింది. చల్లకు వచ్చి ముంతదాచడ మెందుకు? నీకు మేలు కలుగుతుంది. ఆనందం కలుగుతుంది. కళ్లు మూసుకుని వెళ్లు సూటిగా" అనెను.

మనీష కొంచెము సందేహించి, ఎట్టకేలకు తా నొకతెయే ఆ గుహాలోనికి దారి తీసెను. అచట చిమ్మచీఁకటి. ఆమె వెను దిరిగి చూచెను.

"ముందరికి" అని ఒక ధ్వని వినఁబడెను.

మనీష పదియడుగులు ముందరికి వైచెను. చీఁకటి అచట గోడ కట్టుకొనెను. ఆమె మరల వెనుదిరిగి చూచెను.

"ఇంకా కొంచెం ముందరికి."

ఆమె పదియడుగులు వైచి మరల వెనుదిరిగి చూచెను. ఆమెముం దొక దివ్వె వెలిఁగెను. అచట మలయమాలికి బదు లొక బలాఢ్యుఁడు నిలువఁబడి యుం

డెను. అతఁడు చల్లగా నవ్వి "ఇటు రా" అనెను.

"దయ యుంచి మలయమాలి—"

"నాకంటె వాఁడే మంత చక్కని వాఁడా? అదుగో కల్లు. కాస్త తాగిచూడు."

తాను బోనులో పడిపోయినటు లపుడు మసీషకుఁ దెలిసెను. వెంటనే ఆ గజదొంగ చేయి మసీషకుఁ దగిలెను.

ఆమెభావనానేత్రముముందు మలయమాలి స్ఫురించెను.

ఆమె ఆఁడుపులి యాయెను.

పెద్దచేఁప చిన్నచేఁపను మ్రింగును. చిన్నమబ్బు పెద్ద చందమామ నాక్రమించును.

బలము గలవానిదే రాజ్యము. ఎవఁడీ బలమును నిర్ణయించును ?

కొంతసేపటికి చిన్న చుక్కలలో వేగుఁజుక్కయే చంద్రుఁడై ప్రకాశించెను. భూదేవియాధారచక్రమునుండి వెలుఁగురవ్వలు పైపైకిఁ బ్రసరించుచున్నవో యన తూరుపురేకలు కానిపించి ఇంద్రుని వైజయంతపు మోసాలముందు ముగ్గులు తీర్చెను. పిట్టలు ప్రకృతిదూతలవలె దిశాంచలముల కెగిరిపోఁజొచ్చెను.

ఆ దొంగలశేనిబారినుండి తప్పించుకొని వచ్చినవారిలో మసీషయే మొదటిది. అది వానికిని, ఆమెకును అక్కజము కలిగించెను.

మసీషమృత్యువుతో పన్నిదము చఱచి పరువెత్తిపరువెత్తి సముద్రముముందు నిలిచిపోయెను. ఆమెమనశ్శరీరములు రెండును అవసాదము చెందెను. ఆమె యచటి యిసుకలోఁ బడిపోయెను.

సూర్యుఁడు నడినెత్తికి వచ్చెను. అపుడామెకు చైతన్యము కలుగఁదొడఁగెను. బెస్తలు కొందఱు దవుదవ్వులలో నామెకుఁ గనఁబడిరి. "నాయుసురు తగిలి చావక యింకను మగజాతి బ్రతికియున్నదా?" అని యామె యనుకొని, ఒక్క మలయమాలి తక్కఁ దక్కిన పురుషజాతి యంతయుఁ జావవలయు నని కోరుకొనెను.

ఆమె కచట కొంత విశ్రాంతి దొరకెను. ఆమె తనసంగతి యంతయు వెనుదిరిగి చూచుకొనెను. ప్రపంచస్వభావము నవలోడించెను. తాను గణికయై సేకరించిన అనుభవముచే సంఘము చేయు నేలుబడిని తఱచితఱచి చూచెను. ఈప్రపంచమునందు బలమునకే కాని దౌర్బల్యమునకు తావు లేదని తలపోసెను.

వ్యక్తిగతము లగు, స్వతంత్రము లగు తలఁపు లను సెలయేఱులు బలాత్కారముగా సంఘసముద్రమునఁబడి ఉప్పబడి మునుఁగుచుఁ దేలుచు ఒడ్డుకుఁ గొట్టఁబడుచు నడిమికిఁ గొంపోఁబడుచు ఆకసమున కెగురవేయఁబడుచుఁ బాతాళమున కదుమఁగొట్టఁబడుచు నామెకుఁ గానిపించెను. స్వాతంత్ర్యముయొక్క సంకోచవికోచములు సంఘముచేతనే నిరూపింపఁబడవలయునేని వ్యక్తికి స్వాతంత్ర్యమే లేదని యామె యొక నిగమనమునకు వచ్చెను.

"ఎపుడో ఒకపుడు వ్యక్తుల యాశయములే ప్రకృతసంఘమును పరిపాలించుచో ద్వంద్వములచే నవష్టబ్ధమైన యీ చీమ

నడకపరిణామము అల్పజీవితముకల యీ వ్యక్తుల కేమి యుపకరింపఁగలదు? వ్యక్తి సంఘమునకు బలి యగుటకంటె వేఱుపాయము లేదా? చైతన్యమునందలి యిచ్ఛయొక్క గమనమునకును, ప్రకృతియొక్క మందాతిమందగమనమునకును గల వైపరీత్యమును జూచి గణితము తెల్లఁబోవదా? ఇసీ! పాడుసృష్టి! పాడుపరిణామము! ఆనాఁటి సీతమ్మతల్లికడనుండి యీనాఁటి మనీషమ్మముండవఱకు ఆఁడు దజగరమా? దీని యవయవములమీఁద, దీని యభిరుచిమీఁద దీని కధికారము లేదా? దీని సృష్టిమీఁద దీని కధికారము లేదా? ఛీ! ఆఁడుది బానిస.

"లోకమునందు తన మహిమమీఁదనే నిలువఁబడిన ఇచ్ఛాశక్తి మగవానికిని లేదు, ఆఁడుదాని కంతకన్న లేదు. అటు లోకవేళనుండునేని అది మఱొకవ్యక్తి కనిష్టమైనచో మరల నది నిరంకుశమైపోవదా? కావున లోకమునందు స్వేచ్ఛయనునది, స్వాతంత్ర్యమనునది బండిసున్న కాదా?

"నానంగతిమాత్ర మేమంత సంగతముగా నున్నది? నన్నొకరు ప్రేమించిరి. నేనో మలయమాలిని ప్రేమించితిని. మలయమాలి యిందుకీర్తిని ప్రేమించెను. ఆమె యింకొకరిని ప్రేమించును. ఇం దెవరిది తప్పు?

"ఇంకొకరి యిచ్ఛచే నిండవలసిన యీ ప్రేమకు స్వాతంత్ర్యసిద్ధి యెటులు? సృష్టికి కారణభూతమయిన మైత్రీభూమకును, ఈ ద్వంద్వములకును ఏటి మైత్రి?"

ఇటు లాలోచించియాలోచించి యామె మనస్సు తర్కమునకు చచ్చి "ఇఁక నాకు దిక్కు లేదు. దిక్కు లేనివారికి దేవుఁడే దిక్కు. ఇఁక నీలోకము మలయమాలితోఁ గూడ పురుషజాతిశూన్య మగుఁగాక! ప్రేమ దుంపనాశన మగుఁగాక" అని వాపోయెను.

ఆమెను మృత్యు వొకవంకను, మానభంగ మొకవంకను పట్టుకొని శూన్యము ముందు నిలువఁబెట్టెను. ఆమెహృదయము ఫట్టని పగిలెను. ఒక కిరణ మచట వెలిఁగెను.

౧౩

వేణువనమున విహారనిర్మాణము పరిపూర్ణ మాయెను. సున్నముచే గారచేయఁబడిన గోడ లన్నియు బుద్ధదేవుని మానసమునకు ప్రతినిధులవలె నుండెను. వేదికమీఁద నెలకొలుపఁబడిన బుద్ధుఁ డందఱికును ధ్యానముద్ర నుపదేశించుచు విహారమునెదుటఁ గల తటాకజలమునఁ బ్రతిబింబించి సాధకుల భావనాతటాకమునఁ బ్రతిబింబించిన బుద్ధు ననుకరించెను.

విహారముముందు నిలువఁబడిన ప్రతివానిహృదయమును అపారము, నగాధము నగు నొకానొక తత్త్వమునఁ బ్రవేశించెను. అట్టి తత్త్వమునఁ బ్రవేశించి లోకులకు దానిఁ దెలిపిన యొక మహాపురుషుఁ డెట్టెదుటఁ గానిపించి హాసముతో నిపు డాతత్త్వమును మరల నాదేశించుచున్నటు లుండెను.

బుద్ధునిఁ జూచిన వృద్ధుఁడొకఁడు బాలుఁడాయెను. ఒక బాలుఁడు వృద్ధుఁ డాయెను. మధ్యమవృద్ధుఁ డొకఁడు బుద్ధునిఁ జూచుచు జందెములు పుటుక్కునఁ దెంపివయిచెను. సిగలో నలంకారముగాఁ బెట్టుకొనిన యొక నగచేతనే యొకతె తన సిగను కత్తిరించుకొనెను. శ్రమణకుఁ డొకఁడు తన వేసము

నకు రోసెను. ఒక వేదసన్న్యాసి ధ్యానముద్ర దాల్చి మఱియొక బుద్ధవిగ్రహమును బ్రతిష్ఠించెను.

వినోదమును జూడవచ్చిన వైదికోత్తములకు మంత్రతంత్రములును, పూజాప్రతిష్ఠలును లేని యావిహారము బోసినోరివలె నుండెను. ఆలోచనలో మునిఁగి తేలుచున్న యొక వైదికోత్తముఁడు "ఇఁక ముందు కలియుగ మంతయు నిట్టి యేడూకములచేత నే నిండిపోవు నని పురాణములు లోఁగడనే మనకు చెప్పిపెట్టె" నని నవ్వెను.

యజ్ఞము చేయుటకు ధనము లేని కర్మిష్ఠి యొకఁడు "ఎటులయినను బుద్ధుని దహింసామతము సుమండీ" అనెను.

"అహింసామత మనఁగా నేమో నే నెఱుఁగను కాని కడుపునొప్పికి బుద్ధుఁడే సూకరమాంస మారగించె" నని వేదమత ప్రవక్త యొకఁ డనెను.

భక్తుఁ డగు వైదికుఁ డొకఁడు నోరు కఱచుకొని "బుద్ధదేవుఁ డొక యవతారముసుమీ" అనెను.

విహారము నాలుగుమూలలును విహరించివచ్చిన అద్వైతవాది యొకఁడు "బ్రహ్మము నంగీకరింపని బౌద్ధులకు బుద్ధుఁడే బ్రహ్మమై కూరుచున్నాఁడు." అనెను.

"అద్వైతము తెరచాటుబౌద్ధ" మని మఱియొకఁ డనెను.

"శూన్యవాది అశూన్యము నంగీకరించుచున్నాఁ" డని తార్కికుఁ డొకఁడు తలపడెను.

"కర్మమే తెలియకుండ నిటులు చేయించుచున్న" దని జరన్మీమాంసకుఁ డొకఁడు ముక్కుమీఁద వ్రేలు వేసికొనెను.

ఇటు లెవ రేమనుకొన్నను ఆ రాతి విగ్రహ మందఱను "నీ వెచటినుండి వచ్చితివి? మఱి యెచటి కేగుచుంటివి" అని నిలువఁబెట్టుచుండెను.

దూరమునుండి కోలాహల మొకటి వినఁబడఁ దొడఁగెను. క్రమక్రమముగా నది మూఁడు విరామములతో విననాయెను. కొంతవడికి

"బుద్ధం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి"

అను ఘోష వినఁబడెను.

దిక్కు లన్నియు నా త్రిశరణములతో ప్రతిధ్వనించెను. జను లందఱును లేచి యెదురేగఁ జొచ్చిరి. బుద్ధధర్మమునందు నమ్మకము లేని అతివాదు లందఱును నిర్గమింపఁ జొచ్చిరి.

మహారాజాధిరాజ పరమేశ్వరుఁడు ఇందుకేసరియు, అతని ప్రక్క నిందుకీర్తియు, వారి ముంగల వినయజ్యోతియు పాదచారులయి వచ్చిరి. వారివెనుక మానవారణ్యము.

సాధకు లగువా రందఱును విహారమునఁ బ్రవేశించి కూరుచుండిరి. అచట సనాయి లేదు. డోలు లేదు. మేళము లేదు. తాళము లేదు. ఇంతియకాక-బోగముమేళ మసలే లేదు. ధ్యానమునఁ బ్రవేశించుటయే అచట కర్తవ్యము.

సాధకు లందఱును గూరుచుండి ధ్యానసాగరమునఁ బడిరి. ఏకాగ్రత లేని సాధకుఁ

డొకఁడు తన ప్రక్కవానినిఁ జూచి కనులు మూసికొనెను.

మఱియొకఁడు దొంగచూపులు చూచి కనులు మూసికొనియున్న అందఱ మోములను నిరాఘాటముగాఁ జూడఁ దొడఁగెను. అంతలో మఱియొకఁడుకూడ నటులనే చేయఁ దొడఁగెను. తుదకు వారిరువురును ఒకరినొకరు చూచుకొనిరి. వారిమోములు మొదట నగవునకు నెలవులై, పిదప సిగ్గుచే చీకురించుకొని పోయెను.

ఒకఁడు తన మనోనేత్రముముం దొక శ్రమణను సాక్షాత్కారము చేసికొనెను.

ప్రక్కవా రేమనుకొందురో యని ఒక శ్రమణకుఁడు ధ్యానబాధను సహింపఁ జొచ్చెను.

విహారమును జూడవచ్చిన బాలకు లందఱును వినోద మేమియు లేకపోవుటవలన నచటి కొలఁకునఁ బడి "నీట మునిఁగి యెవ రెక్కువసే పుందురో" యని పందెము వయిచుకొనిరి. అందఱు నొక్కసారి మునిఁగిరి. ఊపిరి పట్టఁజాలని బాలకుఁ డొకఁడు ముందు లేచి నీరిపయిని దొంగతనముగా గాలి పీల్చుకొనెను. ఈ లోపుగా మఱియొకఁడు లేచెను. ఆ సవ్వడి విని మొదటివాఁడు మరల మునుక వేసెను. అందఱు నటులనే చేసి ఒడ్డెక్కిరి.

బాలశ్రమణకులు కొందఱు లేచి భిక్షకు వెడలిరి. మఱికొందఱు తమతమ పర్ణశాలలకుఁ జనిరి. ఇంకకొందఱు బుద్ధునకును, ధ్యానమునం దున్నవారికిని వందన మొనరించి వెళ్లిపోయిరి.

సాయంకాల మగువఱకు పోయినవారు పోవఁగా మిగిలినవా రయిదుగురు. వారిలో మొదట కనులు తెఱచినవాఁడు వినయజ్యోతి. వినయజ్యోతి లేచి మిగిలిన నలువుర నుద్దేశించి మోఁకారించియుండెను.

కొంతసేపటికి ఇందుకేసరి మెలకువ గనెను. అతఁడు లేచి మిగిలిన మూవుర నుద్దేశించి మోఁకారించెను.

పిదప కొంతసేపటికి ఇందుకీర్తి కనులు విప్పెను. ఆమె లేచి మిగిలిన ఆ యిరువుర ముందును మోఁకారించెను.

తరువాత మనీష జాగ్రదవస్థ చెందెను. ఆమె లేచి నిలువఁబడి ధ్యానసిద్ధుఁడును, తన్మయుఁడును నగు నొక పిన్నవానిముందు మోఁకారించెను.

అతఁడు మలయమాలి.



శంభుదాసుని 'సారంగధర'

= శ్రీ కొండూరు వీరరాఘవాచార్యులు =

ఆంధ్రి గీర్వాణవాణికిఁ జెల్లెలో, మఱి కన్నబిడ్డయో యని మనవారు తలంచుటంబట్టి కాఁబోలు తెలుఁగులో ద్విపదలో వ్రాయఁబడిన కావ్యములు వ్రేళ్లపై లెక్కింపఁదగినవై యున్నవి. నన్నయాదుల గ్రంథములు స్వతంత్రములు గామిని, మఱి వారారంభించిన మార్గము సంస్కృతీయుల సమాదరణమునకుఁ బాత్రము కావలసియుండుటను వారు ద్విపదచ్ఛందము నాదరించుట యుక్తమ యగు. తరువాతి కాలమున స్వతంత్రముగా కబ్బములు వెలయించిన కవులను పెక్కురు రసభావానుగుణవృత్తవైచిత్రి నపేక్షించియో, ద్విపదపైఁ గల యీసడింపుననో గతానుగతికతనే ప్రకటించి ద్విపదకుఁ బట్టాభిషేకముఁ గట్టరైరి. ప్రాచీనులలో బహుసంఖ్యాకుల యభిమతమేదరైనను, తెలుఁగుజాతికి సాజములైన ద్విపద సీసాదిచ్ఛందములకే తెలుఁగువారిలోఁ గలయికపలుకుబడి యెక్కువని చెప్పవచ్చును. ఆబాలగోపాలము ద్విపదలను, జంగముకథలను, యక్షగానములను వినుటయందును, జూచుటయందును గనఁబఱచు వేడుకను బట్టికూడ మన మవ్వాని స్థానమును నిరూపించుకొనవచ్చును. నానావిధపద్యభేదములందువలె, ఒక్కటే పోతగా నుండు ద్విపదలో వివిధరసభావములను బ్రదర్శింప వీలుండదని యనరాదు. కవి ప్రతిభాశాలియైన ద్విపదయందును భిన్నభిన్నరసభావములను మనోజ్ఞముగఁ జూపఁగలఁడు. దృశ్యకావ్యమైన వృత్తవిభేదమావశ్యకమగును గాని శ్రవ్యమున కట్టి భేదము లేకున్నను బాధ లేకపోవుట పలు ద్విపదకావ్యముల పఠనముచే మనము తెలిసికొనుచున్నారము. వృత్తనిబద్ధములగు కృతులందుకన్న ద్విపదకావ్యములలో తెలుఁగువారి సామెతలు, తెనుఁగుజాతీయత, తెనుఁగుదనము—ఇంతేల, తెలుఁగుజీవమే యెక్కుడుగా మూర్తీభవింపఁజేయు వెఱవులు మెండు. ఈవిషయము పెక్కు ద్విపదకావ్యముల పఠనసందర్భమున రసజ్ఞులారయఁ గలరు. పులుఁగుఁబడఁతికి మింటనేయు వాహ్యాళి, చేప కన్నెకు నీటఁ జరించు వెఱవు నెట్లు సాజములో, యట్లే తెలుఁగుఁగైతకును ద్విపద సాజమై వెలలేని తన యందచందములను, ఆత్మౌన్నత్యమును వెలార్చుకొన వీలు మెండుగాఁ గుదురుకొన్నది.

తేనెవాకలఁ జాలువార్చు ద్విపదకృతులను వ్రాసిన పుణ్యాత్ములను—రంగనాథుఁడు, పాల్కురికి సోమన, కోనేరునాథుఁడు, పిడుపర్తి సోమన, శ్రీనాథుఁడు, గౌరన, శంభుదాసుఁడు, రాఘవార్యుఁడు, కంకంటి నారసింహరాజు మున్నగువారు కొలఁది మందియే కన్పట్టుచున్నారు. ఇందుఁ బెక్కురు పురాణగాథలనే ద్విపదలో వ్రాసిరి. పల్నాటిచరితమును వ్రాసిన శ్రీనాథునివలె శంభుదాసుఁడును తెలుఁగుగడ్డపై జరిగిన కతనే గ్రహించి ద్విపదలో దిద్దినాఁడు. ఇదియు నొక యౌచిత్యమే. తెలుఁగునేలకు సంబంధించిన కథను తెలుఁగువారి కింపగు ద్విపదలో దిద్దితీర్చిన బాగుండునని కవి తలంచియుండును.

శంభుదాసుఁడు

శంభుదాసుఁ డేకాలమువాఁడో చెప్పుటకు సరియగు నాధారములు దొరకుటలేదు కాని జాత్యాదులనుగూర్చిమాత్రము కవియే చెప్పుకొన్నాఁడు. ఈతఁడు విశ్వబ్రాహ్మణుఁడు. పెద్దాడగ్రామనివాసి. గౌతమగోత్రభవుఁడు. ఇంటిపేరు బాణాలవారు. అయ్యప్ప, నాగమాంబ అను దంపతులకు శంభుని వరమున జన్మించినవాఁడు. కొండపల్లిగోపాలుని కరుణచేత కవిత్వప్రౌఢి మెఱసి సారంగధరచరిత్రమును ద్విపదగాఁ గూర్చితి ననుచున్నాఁడు:

"వాలాయముగఁ బెద్దవాడనివాసి
నీలకంఠుని సేవ నిరతంబు చేసి
శాశ్వతంబుగను భూచక్రంబునందు

విశ్వకర్మసమానవిజ్ఞానమూర్తి
తలఁపఁగా మేటి గౌతమగోత్రభవుఁడు
వలనొప్ప బాణాలవంశాబ్ధిచంద్రుఁ
డనఁనొప్పు గురుమూర్తి; యాతని సూనుఁ
డనఘాత్ముఁ డయ్యప్ప యను పుణ్యశాలి;
అతనికిఁ గులసతి యగు నాగమాంబ
పతిహిత యయ్యె; దంపతుల కిద్దఱకు
శంభుని వరమున జన్మించినాఁడ,
శంభుఁడ, బుధకవిజనమనోహరుఁడ;
పరమాత్ముఁడగు కొండపల్లిగోపాలు
వరమున వరకవిత్వప్రౌఢి మెఱసి,
తగుభంగి సారంగధరుని చరిత్ర
జగతిని ద్విపదగా సమకూర్తు వినుఁడు."

ఇందుఁ దన కులమునుగూర్చి వాచ్యముగాఁ జెప్పకున్నను, దన తాతయగు గురుమూర్తిని 'విశ్వకర్మసమానవిజ్ఞానమూర్తి' యని చెప్పుటచేతను, ఇంటిపేరు బాణాలవా రగుటచేతను ఈతఁడు విశ్వకర్మబ్రాహ్మణుఁడే యనుట నిర్వివాదము.

బాణములు చేయుటయందు వీరు నేర్పరులగుటచే నీవంశమువారికి బిరుదవాచకముగా బాణాలవా రని పేరు వచ్చినది. 'బాణాల', 'బండికట్ల' మొదలగు నింటిపేరులు విశ్వకర్మజాలలో నిప్పటికిని గలవు. మఱియు శతకకర్తలలో నొక్కఁడై కాళహస్తిశతకమును రచించిన బాణాల వీరశరభేంద్రుఁ డీవంగడమువాఁడే కదా! ఈకవి విశ్వబ్రాహ్మణుఁ డగుట కావ్యమున నీతఁడు చేసిన వర్ణనఘట్టములందును నయ్యైతావులఁ బ్రస్ఫుటము కాఁగలదు. ఈగ్రంథమును బ్రకటించిన కీ. శే. వేదము వేంకటరాయశాస్త్రిగారును దమ విన్నపములో "ఈ సారంగధరద్విపదను పెద్దాడగ్రామనివాసియు, విశ్వకర్మమతస్థుఁడు నగు బాణాల శంభుదాసకవి రచించినాఁడు" అని జాతినిర్ణయము చేసియేయున్నారు. కవికాలమును నిర్ణయించు భారము చారిత్రకులపై నున్నదని మనవి.

ఈతఁ డీగ్రంథమును మూఁడాశ్వాసములుగా వ్రాసెను. ఇదిగాక యింక నితరగ్రంథములు వ్రాసెనో లేదో తెలిసికొనుట కాధారము లీకావ్యమున లేవు. దీనితరువాత వ్రాసిన కృతు లేవియు నిప్పటికి లభింపను లేదు. కావ్యరచనాప్రాగల్భ్యమునుబట్టియు, కవిత్వపరిణతినిబట్టియు నిదియే తొలికబ్బ మని చెప్పుటకు వలనుపడకున్నది. ప్రస్తుతచరితమును 'అప్పన్న' యనునాతఁడు తనకుఁ జెప్పినచొప్పున వ్రాసితినని గ్రంథాంతమునఁ గవి ప్రస్తావించియున్నాఁడు:

"అప్పన్న చెప్పిన యాప్రకారమున
నొప్పుగా నీకృతి యొనరించినాఁడ
శంభుని వరమున జగతి బాణాల
శంభుదాసుండ నీసచ్చరిత్రంబు"

కావ్యము సర్వవిధముల నుత్కృష్టముగా నున్నది. రచనావిధానమునుబట్టియు, రసభావముల రామణీయకమునుబట్టియు రావలసినంత ప్రసిద్ధి ఈ కావ్యమునకు రాకుండుట రసజ్ఞులకు విచారము. వేదమువారే దీనిని రసోత్తరమనియు, మృదుమధుర మనియు, నీతిధర్మజ్ఞాన ప్రదమనియుఁ గొండాడియున్నారు. కవి సహజముగా శిల్పి యగుటచేతను, పాండిత్య, లోకవ్యవహారము లందు నేర్పరి యగుటచేతను గథానిర్మాణమునందును, ఆయావర్ణనములందును శిల్పకౌశలము, లోకజ్ఞత మిక్కిలిగాఁ గుదురుకొన్నవి. తెనుఁగు నేలలో సర్వసాధారణముగా వాడు సామెతల నీతఁ డేఁబదికి పైఁగా నీచిన్నిపాత్రమున వాడియున్నాఁడు. చక్కనగు జానుతెనుఁగునుడికారము, ఆబాలగోపాలమున కర్థమగు సులభశైలి హృదయమోహనము, శ్రవణపేయము నై యున్నవి. ఈకవికి పెద్దనయందు మంచి గౌరవము కలదని నిర్వివాదముగాఁ జెప్పవచ్చును. చిత్రాంగీసారంగధరులను దీర్చుటలో నీతఁడు పెద్దన్నకుద్దిగా నుంకించినట్లు గన్పట్టును. ఆతని వరూథినికిని, ఈతని చిత్రాంగికిని జాల పోలిక లున్నవి. కాని స్వభావములు వేఱగుటచేత తీర్పునేర్పులు భేదింపవలసి వచ్చెను. సారంగధరను వ్రాయఁబూనుకొన్న కవి లలితములగు శృంగారకరుణరసములం దసమానుఁడు కావలయును. సంస్కృతములో నీయుభయరసప్రాగల్భ్యమును జూపినవాఁడు భవభూతి. తెలుఁగులో నీతఁడు కూడఁ గృతకృత్యుఁ డైనాఁ డనుట యసత్యము కాదు. కథయొక్క యల్లికపొందికలోఁ గవి చూపిన చాతుర్యము పరికింపఁదగినది.

సారంగధరుఁడు ముక్కంటివరమున మురిపానఁ గన్న చక్కని పుత్రుఁడఁట! ఇంక నెట్టివాఁడో చూడుఁడు:

"మాణిక్యముల మూట మల్లెపూఁదోఁట
ఏణాయతాక్షుల కెన్నికమాట
కందులేని పసిండి కమ్మ్రయై నిండు
చందమామను బోలు సారంగధరుఁడు"

ఇట్టి యాతఁడు సంగడీండ్రను గూడి బొంగరా లాడుచుండఁగాఁ జూచిన తండ్రి, ముచ్చటై "ఈచక్కఁదనముల కెనయజోడైన రాచకూఁతును జూచి రాఁదగు" నని యెంచినాఁడు. మంత్రులును దిగ్దేశములు తిరిగి 'మనసిజు నేలయించు మాయాకురంగి' యన నొప్పు నవమోహనాంగిఁ జిత్రాంగిని జూచినారు. చిత్రాంగి సోయగమును గూర్చి కవి చెప్పిన వర్ణనమంతయు మనకుఁ దడవఁ బనిలేదు. రెండుమాటలలోఁ జెప్పుకొనవలె నన్న-

"అంగజునకుఁ గల యాత్మసంజీవి
సింగారముల దీవి చిత్రాంగి దేవి
....
సంపెగపూబంతి సామజయాన
చిగురుటాకుఁగటారి చిత్తరుబొమ్మ."

పూలబంతిమీఁదనే మనకు మోహ మగ్గలము. ఈమె సంపెగపూబంతియఁట. ఇట్టియామె సారంగధరునకు సరివచ్చుటలో నబ్బుర మేమి? రాజరాజు గూడ చూచినాఁడు. చూచుటే కాదు, వలచినాఁడు కూడను. కాఁబట్టియే కత్తికిఁ బెండ్లి జరిగిన దాచార మను నెపమున. కొత్తకోడలు కావలసిన బిత్తరి కొత్త పెండ్లమైనది. కాని చిత్రాంగి పిచ్చిదా? పటములో వ్రాసిన బాలుఁడు గాఁడాయె. చెలికత్తెలచేత పటములోని నవమన్మథుఁడు రాకుమారుఁ డని యెఱింగినది. మనసులోని తమకము పైకొన,

"అటువంటివాని కిల్లాలఁ గానైతి
పటుగతి తల్వ్రాఁతఫల మిట్టు లుండె
నరసుతంబైనట్టి నాచక్కఁదనము
కొఱగానియటు చేసె కుటిలదైవంబు."

అని చింతించినది. దైవముయొక్క ఈ నేఁతకుఁ దలయొగ్గవలసిన దేనా? దీని కేదైన మాఱునేఁత కలదా? మాఱునేఁత యాతనిఁ దనమేడకు రావించుకొనుటే.

రాజు వేఁట కేగినాఁడు. రాకుమారుఁ డారక ప్రొద్దుపో నుపమేమి లేక చెలికాండ్రతో పావురాలాటకుఁ గడంగినాఁడు. పారావతము మింటి కెగసినది. మింటి కెగసిన పోతునకు మన మొలకప్రాయపు చిన్ని ముద్దులగుమ్మ ముంజేతిమీఁది రాచిల్కను జూప నది చిల్కను దన పెంటి యనుకొని చిత్రాంగి మేడమీఁద వ్రాలినది. చిత్రాంగియు మెఱయుచు సారంగధరుఁడు రా సందాయెనని పావురమును మఱుగున దాఁచి కూర్చుండెను.

సారంగధరుఁడు నెయ్యంపుఁ బావురముమీఁది మక్కువచేత "పినతల్లి యింటికి బిడ్డలు ప్రేమఁ జనుట ధర్మం బవశ్యం"బని తలఁచి పయనమైనాఁడు. కాని పూర్వోదంత మెఱిఁగిన సుబుద్ధి యంగీకరింపక—

"అదిరిపాటున నొంటి నరిగితివేని
ముదిత నీపైఁ జాల మోహింపఁగలదు.
ఓ,జగాదని నీవె యొసరితేని
రాజుతోఁ జెప్పి వైరమ్ము సాధించు
పాపతోఁ దలయంటి బాస చేసినను
స్త్రీల నమ్మఁగరాదు చిత్తంబులోన"

అని నివారించెను. అయినను బూర్వకర్మము నెట్టుకొనిపోవుచుండ, మఱ్ఱిమాట మోరత్రోపునఁ ద్రోసి చిత్రాంగినగరి కేతెంచినాఁడు. చెలులచే నీతని రాక విన్నది చిత్రాంగి. వారాశివిధమునఁ బొంగి, గమకించి ముత్యాలగద్దెపైనుండి దుమికి తత్తఱపాటు త్రోదోపులాడఁ జనుదెంచి సారంగధరుని జూచి వర్ణింపఁదొడఁగినది.

"చందురుఁడో లేక సారంగధరుఁడో
సుందరుం డెక్కడఁ జూడనివాఁడు
అవతారమన్మథుం డనవచ్చు వీని
నవరదనంబు లక్షవరాలు సేయు
పోఁడిమి వీనితో భోగింపకున్న
నాఁడుజన్మముకన్న నడవైన మేలు"
ఆఁడుదై పుట్టినదెల్ల వీనితో రమించినఁగాని

కృతార్థ గాదని కాఁబోలు చిత్రాంగితలంపు. లేకున్న ఆఁడుజన్మమని జాతివాచకము నేల ప్రయోగించును? స్త్రీజాతి కెల్ల వరణీయుఁడైన యాతనిని దాను గామించుటలో విరోధమును లేదు. ఇట్లాతని రూపమును మనసుకఱవుదీర వర్ణించుకొని వర్ణించుకొని కనుఱెప్ప వేయక కనుఁగొనుచున్న పినతల్లిని జూచి దండముపెట్టినాఁడు సారంగధరుఁడు. కాని యీపిచ్చిపిల్లని వెఱ్ఱిచేష్ట యీకామినికి నచ్చునా? వ్యంగ్యగర్భ సంభాషణము మొదలుపెట్టినది:

"రాజంతవాఁడవు రాజకుమార
నేఁ జెల్ల ప్రమొక్కెదు ని న్నేమనందు
స్త్రీలకు ప్రమొక్కఁగఁ జెల్లునటయ్యా
బాలుఁడా నీబుద్ధి బంగారుగాను
నీచక్కఁదనమును నీవిలాసంబు
చూచినవారు మెచ్చుచుఁ జెప్పఁగాను
ననుఁ జూడరావని నాలోన నేను
అనుమానపడఁగ నేఁ డనుకూలమాయె
పున్నమచంద్రుండు పొడిచినయట్లు
కన్నులు చల్లగాఁ గంటి నీప్రొద్దు.

మనసునఁ జవిదీరె మాకు నీవున్న
జనపతి రాఁడని శంకింపనేల
అన్ని కార్యముల నీ వనుకూలమైన
వెన్న యుండఁగ నేయి వెదుకనేమిటికి?"

ఈ ప్రియోక్తులు పల్కుచు పన్నీరు దెప్పించి పాదాలుకడిగి పైఁటచెఱఁగుతోఁ దుడిచి, ఆకులు పోఁకలు అగరు జవ్వాజి కప్పుర మాదిగాఁ గానుకలు దెప్పించి, తీసికొమ్మన్నది. బహుమానాలకు వచ్చిన వలపుకాఁడు కాఁ డీతఁడు. మఱి పారావతముకోసము వచ్చిన పాపఁడాయె. దానినే యిప్పింపుమని యడిగినాఁడు. ఇంతకు ముందు ప్రయోగించిన తన వ్యంగ్య మంత్రము పాఱినది కాదు. ఆయా భోగసామగ్రిని జూపి క్రొత్తవానిమనసు త్రిప్పవలె ననుకొన్నది.

"మచ్చిక నినుఁ గూడి మనసు రంజిల్ల
ముచ్చటించెదఁ గాక మోహంబుదీర,
జనపతియును నీవు సమ మింక నాకు."

అని మెలచుచు బంగారుమేడలోనికిఁ దోడ్కొని పోయి, నవరత్నపీఠమునఁ గూర్చుండఁబెట్టి చిత్తరువుల వింతఁ జూపు నెపమున కృష్ణుని గోపికావస్త్రాపహరణమును, ఎనుబదినాలుగు బంధములతో నొప్పు బొమ్మలను జూపినది. మఱి నోరార వివరించి వర్ణించినది గూడను. కాని వానిమనసు కరఁగలేదు. ఇదియంతయు శిల్పియొక్క హస్తకౌశల మన్నాఁడు. పైపెచ్చు వసుదేవసుతుఁడు వెలయంగఁ బదియాఱువేల గోపికలఁ గలసినట్టే యుండు కపటనాటకమని, యివి కృష్ణలీలలని వేదాంతము లోనికి దించెను. ఇంతకన్న నేమి సేయఁగలదు, పాపము, చిత్రాంగి. చేయవలసిన చేఁతలు, చెప్పవలసిన మాటలు అయిపోయినవి. ఇట్లనుకొన్నది:

"చాతుర్యముల నెంచ శక్యంబుగాదు
జాతికి సరివచ్చురా! వీని మనసు
కరఁగఁబో దుమ్మెత్తకాయకుఁ జిలుక
పొరసినవిధ మాయెఁ బో తనవలపు.

....

చలికూటిపై వెన్న సారంగధరుని
మనసు కరంగదు మదిలోని మాట
యనవలసినదె నేఁ డనుమాన మేల?
రమణులం దెవ్వరు రా రీవలనికి
సమయమైయున్నది చల్లకు వచ్చి
ముంత దాఁపఁగనేల? మోమోటమునకు
నంతంత కాలస్య మన్నృతమే విషము.
కదిసి కోపించినఁ గార్యనాశనము
కదిసెద నేమైనఁ గాని మ్రొక్కుచు
చనుబంతు లదరంగ సారంగధరుని
జెనఁగుచు నిట్లని ప్రియముతోఁ బలికె."

ఇం దామె కడలేని మోహమునకుఁ జనుబంతు లదరుటే సాక్ష్యము. "బహుదినములనుండి నీపైప్రేమ నిలుపుకొంటిని. నేఁటికి దైవయోగమున నాడఁబోయిన తీర్థ మెదురైనట్లు నీవ వచ్చితివి. మనయిద్దఱి చక్కఁదనములను జూచి యోర్వలేని విధి నాపై పగసాధింప వేఱుచేసెను. ఇఁక నిప్పు డాతఁ డేమి సేయఁగలఁడు? నీ వాలసించిన విరహవేదనకుఁ దాళఁజాల. కాన నిప్పటి

పని దీర్పుమని జవ్వాజి మొదలగునవి యిచ్చి బలవంతము చేసినది.

పాపము, సారంగధరుఁడు పాపభయమున గడగడ వణఁకినాఁడు. మంత్రిమాటలు మనసులో మెదలినవి. "తల్లీ,

ఎనయ ముజ్జగముల నెందుఁ జూచినను
తనయుల మోహించు తల్లులు గలరె
....
కమలాక్షి తుచ్ఛభోగముల కాసించి
యమునిచేఁ గోతల కమ్మనే నోర్వ"

నని వేడుకొన్నాఁడు. ఈ నీతులు, ప్రార్థనలు నామెకు నచ్చునవి కావు. చేఁ జిక్కిన మేలు చేజాఱవిడుచుకొను శీల కాదు చిత్రాంగి. ఇట్లన్నది: "ఎంత చెప్పితివి కాసంతటి పనికి. యముఁ డని పేరు సెప్పి నన్ను బెదరించుచున్నావు. మబ్బులోని నీళ్లు నమ్మి దోన నీళ్లు తెగఁగొట్టుకొను వెఱ్ఱు లుందురటోయి? చే దొరకిన మేలు చేజారవిడిచి మీఁద వచ్చెడు కీడు మేలెవ్వఁ డరయు? వావు లెంచఁగ నేల వలపున్న చోట?" అన్నది. పెద్దనవరూథిని డెందము గందళించు నింపు పరబ్రహ్మ మని సిద్ధాంతీకరించినట్లు, శంభుదాసుని చిత్రాంగియు "వలపున్న చోట వావులఁ దలపెట్టరా" దని సిద్ధాంతము చేసినది. ఆమెకు నీమెకు శతాబ్దుల తరబడి కాలవ్యవధి యుండుటచే వరూథిని 'ఆనందో బ్రహ్మ' యటన్న శ్రుతిని బ్రమాణీకరించెను. ఈమె యీ కాలపుది కాఁబట్టి స్వతంత్రయై క్రొత్తత్రోవను ద్రొక్కినది. ఇన్నియు నని కడకు తలుపు మూసి కవయనుంకించినదిగూడను.

సారంగధరుని పని దేవుఁ డని ప్రొక్కవచ్చిన మిత్తి దప్పి గుడి వచ్చి మీఁదఁ బడ్డట్లయినది. ఇంక నిచ్చట నిలువఁగలఁడా? సాగిపోవ చిట్టాడినాఁడు. చిత్రాంగియు మొలదట్టి గట్టిగాఁ బట్టి పెనచి పోనీయక పెనగులాడినది. వనిత పట్టిన దట్టిని చించుకొని బయటపడినాఁడు. 'పోయినచో అవనీశు నాన' యని ఒట్టు పెట్టినది. 'నా కన్నులతోడు నిన్నే మిఱుము నన'నని బాస చేసినది. 'భయము లే'దని ధైర్యము చెప్పినది. కడకు 'మారైన విను' మన్నది. ఎన్ని యన్న నేమి? ఆతఁడు చలికూటిపై వెన్న గదా! తరలిపోఁ జూచుచున్నాఁడు.

ఇఁక చిత్రాంగికి ఆసపోయి కోపము వచ్చునని వేఱె చెప్పనేల?

"ఆఁడుదానిది యుసు రంటకపోదు.
జనపతి రానిమ్ము చలము రెట్టించి,
ఓజగా నీతప్పు యుక్తితోఁ జెప్పి,
చేసీత రేపు నీ చేతులు గాళ్లు
కఱకఱ క్రొవ్వాఁడికత్తులచేత
తఱిగింపకున్న నింతటినుండి నన్ను
పేరుమారిచి పిల్వవే"

యని తన ప్రజ్ఞను వినుపించినది. ఏమి స్త్రీ సాహసము!

ఈ ప్రతిజ్ఞను విన్న సారంగధరుఁడు డిల్లపోయి "నీవు రాజుతోఁ జెప్పినను అతఁ డేల నమ్మను? నమ్మనెపో, ఆకాశవాణియు భూదేవియు జీవుల పుణ్యపాపములఁ గానరా? కావున పిచ్చుకపైని బ్రహ్మాస్త్రమేయ నేల తలంతువు? దయ యుంపు" మని ప్రొక్కి పులినాకి విడిచినపోలికగా తరలిపోయినాఁడు.

తన వలపును బూదిపాలు చేసి యాతఁడు పోయినది తడవుగా చిత్రాంగి కారాటము బలసినది. ఒడిలోనఁ గట్టిన హొన్నులమూట పోడవు నూతను బడిపోయినయట్లు విలపించినది. తనకుఁ జిక్కిన దట్టిని సాధనముగాఁ జేసికొని సారంగధరుని సాధింపవలెను. ఇందుకుఁ దన వేసముగూడ మాఱవలెనుగదా?

"అని కడలేని కామాంధకారమున
మునిఁగి సొమ్ములు దీసి మూలఁగాఁ గట్టి,
ముఱుముఱమని పట్టు పుట్టంబు విడిచి
ఱుఱుమాసియున్నట్టి కోకను గట్టి,
గబ్బిగుబ్బలఁ జేతిగాజులఁ జీఱి,
తబ్బిబ్బుఁ జేతలఁ దలకొంగు గట్టి
బాలిక పువ్వులపానుపు విడిచి
మూలను బవళించి మూల్గుచునుండె"

అడవులకు వేటకై పోయిన రాజు వచ్చునప్పటికి పైవేషము సిద్ధము. ఇఁకఁ దన్నంటవచ్చిన రాజునకీ ప్రత్యుత్తరము:

"రవితేజ నన్నంటరాకు రాజేంద్ర
అవనిలోపల నవ్వులాయె నా బ్రదుకు?

ఏమందు నీ సుతుఁ డెనయ నన్నంటె
మామ వైతివి నాకు మండలాధీశ."

ఈమాటలు రాజు చెవిలో నారసములుగా నాటినవి. ఆమె చెప్పినచొప్పున నాలకించినాఁడు. అయినను ఈపాడిమాట లాతని నమ్మింపఁజాలవేమో యని గుర్తులు గూడఁ జూపుచున్నది:

"తల్లినిరా యిట్లు దగదు పొమ్మనిన
బల్లిదుఁడై పట్టి బలవంతమునను
వగఁగుల్కు నా లేతవయసుఁబాలిండ్లు
పగిలి కష్టుని గోళ్ల పాలాయెఁ జూడు.
పగడంపుఁ గంబాల పసమించు తొడలు
ఒగి నఖములఁ జీలు నొఱపులఁ జూడు.
కరములఁ దప్పింపఁగా వాఁడు పట్టఁ
జెరిగిన ముత్యాల పేరులు చూడు.
పాతకుఁ డిటు నన్ను బట్టి పోరాడ
భీతిల్లి నిన్ను నేఁ బిలిచితి రాజ
అప్పటి నాపాటు లన్నియు మీకుఁ
జెప్పంగ నేల యాశివునికే తెలియు."

కనుఁగొను మని పైఁట కడకుఁ బోఁ దీయఁగా రాజు స్వయముగాఁ జూచినాఁడు. చక్కని గజనిమ్మపండ్లు కసిగాటుగాఁ జిల్కగఱచినట్లున్న ప్రియురాలి పాలిండ్లను, అందలి రక్తధారలను జూచినవాఁడు వెఱగందుట వింతయా? రాజున కీవిషయము నిక్కమని చెప్పుట కింకేమి సాక్ష్యము కావలెను? ఇంకను నమ్మఁడో?

"కష్టాత్ముఁ డంటిన కాయ మీవఱకె
నష్టంబు నేయుదు నాథ యిందాఁక
నినుఁ జూడఁ బ్రాణంబు నిలిపితిఁగాని"

అని తనను మాన్పవల దనుచు బిఱబిఱ నాతని కత్తిని దీసికొని ఱొమ్మునఁ బొడుచుకొనఁబోయినది. రాజు భయమందు టబ్బురమా? కత్తిని బట్టి యామె నాఁపి "నిన్నుఁ బట్టినవాని నిముసంబులోనఁ గన్నపుత్రునినైన ఖండించివైతు"నని యాస్థానమునకు వచ్చి చేరెను.

చిత్రాంగిపాత్ర నీరీతి మనసిజు నెలయించు మాయామురంగిగఁ జిత్రించుటలోను, తాటోటుకత్తెగఁ జూపుటలోను గవి మంచినేర్పును జూపియున్నాఁడు.

ఈతఁడు శృంగారమునందువలె కరుణమునందును బ్రగల్భుఁ డనుట కొండురెం డుదాహరణములఁ జూపింతును. సారంగధరుని నఱకుటకై తలారు లాతని పెడకెక్కలు విఱిచికట్టి తీసికొనిపోవునప్పటి రత్నాంగి విలాపము:

"గోమున నిన్నాళ్లు కొడుకని పెంచి
కోమలికిని బారిగోరి యీనాయె
నగమించు మల్లెపూవంటి రుమాలు
సిగయూడి వెంట్రుకల్ చిందాయె నటర
....
పాలు వెన్నలు ద్రావి బాగుగాఁ బెఱిగి
బాల్యప్రాయము నేలపాలాయె నటర
కన్న పెంచినవారు కలరు లోకమున
నెన్నంగ నిట్టిపా టెవరికి లేదు."

సారంగధరుని కాలుఁ జేతులు ఖండించిన తావునకు వచ్చి విలపించు రత్నాంగి యేడ్పు:

"చనుఁబాల ధారలు చనవుగాఁ గొన్న
తనువులోపలి రక్తధారలా యివియు
పారావతము వెంటఁ బడి వీథులందుఁ
బారాడు నీమృదుపదములా యివియు
తలిదండ్రులే యిష్టదైవంబు లనుచుఁ
జెలువారఁగా మ్రొక్కు చేతులా యివియు
మత్తుగాఁ దొమ్మిది మాసముల్ మోసి
కత్తులపాలుగాఁ గంటినా నిన్ను."

"అపి గ్రావా రోదిత్యపి దళతి వజ్రస్య హృదయం" అన్నట్లుగా కరుణము నీతఁడు వర్ణింపఁగలఁడు. ఈతఁడెట్టిదానిని వర్ణించినను సాజముగు జాను తెనుఁగులోఁ బెట్టుటచే బాస ముద్దులమూటఁగట్టుచుండును. మన నిత్యజీవనములోని మాటలనే, సామెతలనే యీతఁడు తన కవితాకర్మశాలలోనికిఁ దీసికొని రంగారు బంగారు నగలుగా తయారుచేసి జీవముపోసి మెఱపించఁగలఁడు. ఇరుగుపొరుగుతెరువులు రత్నాంగి నాఱడించుతఱి—

"ఆడలకుమమ్మ రత్నాంగిదేవమ్మ
యొడలువాసినమీద నెవరి కెవ్వారు?

సత్య మెవ్వరికైన సతమౌనుగాని
నిత్యమౌ దేహంబు నీటిపైబుగ్గ
నిర్దయుం డననేల నీప్రాణవిభుని
అర్ధాయువను పిండమాయె నీకొడుకు
పుట్టినదే కల్ల పుత్రుండు నీకు
చెట్టుఁ గనుఁగాయ చెడిపోదటమ్మ
పుట్టుట గిట్టుట పుడమి జీవులకు
కట్టిన యిది వట్టి కపటనాటకము."

ఈమాటలన్నియు అచ్చుగా మన యూఁడువారు పలుకునట్టివే. మఱి యీవేదాంతమును శ్మశానవేదాంతమే. ఇంకను చిత్రాంగి రత్నాంగినిగూర్చి యాడు నీమాటలును పైజాతిలోనివే:

"వెఱవక నోటిలో వ్రేలు పెట్టినను
గఱువనేరఁడుగదే కాంత నీసుతుఁడు
అడ్డపట్టులపాప యవునఁటే లేక
గుడ్డులోపలి చిన్నికూన యోయమ్మ
ఎన్ని నేర్చితి వమ్మ యెలనాగ 'వాఁడు
నిన్నుఁ బట్టినఁ గల్ల నిజము గన్పించు."

కావ్యమునం దెల్లయెడలను నీవిధమైన పాత్రోచితసంభాషణము, భాష, భావము పరస్పరము పెనవేసికొన్నవి. పలువిషయములం దీతఁడు గౌరన హరిశ్చంద్ర (అదియును ద్విపదయే) కంటెను దన సారంగధర నుత్కృష్టముగాఁ జేసి చూపినాఁ డనుట యత్యుక్తి కాదు. హరిశ్చంద్రలోని చంద్రమతీవిలాపమును, సారంగధరలోని రత్నాంగీవిలాపమును బోల్చిచూచిన నుభయకావ్యములయందలి యెచ్చుతగ్గులు మనకుఁ గన్పట్టఁగలవు. ఈయంశము పెక్కు వర్ణనాసందర్భములందును, కథాకథనసందర్భములందును విస్పష్టముగా నిరూపింపవచ్చును. పెద్దనార్యునితోఁ దులయనునట్లు కావ్యము నల్లనంకించిన చతురకవి వ్రేలఁజూపించుకొనునా మఱి? సారంగధరుఁ డేగినపిమ్మట చిత్రాంగి విరహము, అమ్మలక్కలు సారంగధరుని గుణములఁ బ్రశంసించుట, సూర్యోదయ సూర్యాస్తమయ వర్ణనలు, చిత్రాంగి మేడ, అందలి భోగసామగ్రివర్ణనలు కనులకుఁ గట్టినట్లు, అప్పటికాలమునకుఁ దగినట్లు ఔచిత్యయుతముగఁ జేయుట శంభుదాసునకే చెల్లె. కావ్యమంతయు నంగప్రత్యంగములఁ బరిశీలించినను అనౌచిత్యదోష మావంతయుఁ గన్పట్టుట లేదు. ఒక మంత్రి రాజుతొందరపాటును వారింప 'చిలుకను చంపుకొన్న రాజుకథ'ను జెప్పును. అదియు కావ్యమునకు వెలలేని తొడవై కథైక్యమును భంగింపక కలసిపోయినది.

విస్తరభీతి వివరింపనైతిఁ గాని పలు దొడ్డగుణములకును, ఉత్తమకావ్యలక్షణములకును ఈ గ్రంథ మిక్కయై రసజ్ఞామోదమునకుఁ బాత్రమగుచున్నది. 'తుదఁ బాముకాటెంత తుడిచినఁ బోదు', 'తెరదీసిన నాటి తీర్థము,' 'చెప్పెడివారికి చెవుడైనఁగాని విన్నవారికి నైన వివరంబు లేదె', 'తల్లి కుండని దయ దాదికేమిటికి,' 'వేడుక కొన్నాళ్లు వెతలు కొన్నాళ్లు', 'కలిపోవగను నట్టి గనుఁగొన్నయట్టు', 'ముగ్గురు విన్నము జ్జగము విను' మొదలగు సామెతలీకబ్బమునకు మెఱుఁగులవంటివి. 'మామంచిది', 'తంటపని', 'తలయున్నఁ గుళ్ళాయి తగిలింపవచ్చు', 'ఆర్భాటము' మున్నగు సామాన్యజనుల మాటల నుపయోగించుటలో నీతఁడు చక్కని చాతుర్యము నగపఱచినాఁడు. వేయేల? కావ్యము సదువ నారంభించిన పతిత తుదిముట్టఁ జదివివైచుదనుక విశ్రాంతి నపేక్షింపఁడు.



నక్షత్రాల తూనిక, కొలత

= శ్రీ వసంతరావు వెంకటరావు =

ఏదైనా ఒక వస్తువును తూచడానికి ఒక త్రాసు నుపయోగిస్తారు. త్రాసులో ప్రధానమైన భాగం తులాదండము. దాని కిరువైపులా సమానభారం గల తక్కెడలుంటాయి. తులాదండానికి మధ్యనున్న ఆధారంమీద అది తిరుగుతుంది. రెండు తక్కెడలూ శూన్యంగా నున్నప్పుడు తులాదండం సమంగా ఉంటుంది. ప్రమాణ పాత్రములైన కట్టెలను ఒక తక్కెడలోను, తూచవలసిన పదార్థాన్ని రెండవ తక్కెడలోను వేసి తులా దండం మొగ్గు చూపక సమంగా ఉండునంతవరకు పదార్థాన్ని చేరుస్తారు. అప్పుడు కట్టెల భారంతో పదార్థం యొక్క భారము సమానమని సంకేతము. ఇనుము, పిత్తలము మొదలగు లోహాలతో కట్టెలను చేస్తారు. అవి అనేక పరిమాణాలలో ఉంటాయి. అరతులం, తులం, సేరు, పౌను, వీశ, మణుగు. ఒకే విధమైన లోహపు కట్టెలతో బియ్యం, పప్పు, పంచదార, చెక్కలు, వంటచెఱకు మొదలగు వివిధ పదార్థాలతూనిక జరుగుతూంది. ఈ క్రియలో వస్తుస్వభావంతో సంబంధం లేదు. ఒకేమణుగు కట్టెలతో ఇనుమూ, దూది, పంచదార తూచవచ్చును. వాటి ఘనపరిమాణంలో వ్యత్యాస మున్నప్పటికీ, వాటి వెలలో వ్యత్యాస మున్నప్పటికీ వాటి ద్రవ్యపరిమాణంలో భేదం లేదు. దీని అంతరార్థం గ్రహించడానికి కాలవాహినిలో సుమారు 3 శతాబ్దాలు తిరోగమించి న్యూటన్ (Newton) మహాశయుని మనస్తత్త్వం గ్రహించాలి.

సర్ ఐసేక్ న్యూటను (౧౬౪౨-౧౭౨౭) ఒకనాడు క్రిందపడుచున్న పండును చూచి దాని తత్త్వ విచారణలోనిమగ్నుడై సార్వత్రికమైన గురుత్వాకర్షణ నియమాన్ని ప్రతిపాదించేడని ప్రతీతి. అనావలంబన వస్తువు భూతలంపై పడుతున్నదంటే ఆ వస్తువును భూమి ఆకర్షిస్తున్నదని భావించవచ్చును. ఆ ఆకర్షణాన్ని 'గురుత్వాకర్షణ'మన్నారు. భూమిపైనున్న వస్తువులను భూమి ఆకర్షించడమేకాక, జగత్తులోనున్న ప్రతివస్తువు ప్రతి వస్తువును ఆకర్షిస్తున్నదని న్యూటను నిర్వచించేడు. సార్వత్రికమైన అట్టి గురుత్వాకర్షణబలము వస్తువుల యొక్క ద్రవ్యరాశిని, వాటి మధ్యనున్న దూరాన్ని అనుసరించి ఉంటుంది. '$ద_1$','$ద_2$' అను ద్రవ్యరాశిగల 'అ' 'ఇ' అను రెండు వస్తువులు ఒకదాని కొకటి 'దూ' దూరంగా ఉంటే వాటి అన్యోన్యాకర్షణబలము '$ద_1$' × '$ద_2$'కు యథానుపాతంలోను, 'దూ' యొక్క వర్గానికి విలోమ అనుపాతంలోను ఉంటుంది. అనగా, వస్తువుల ద్రవ్యరాశి అధికమైనకొద్దీ వాటి ఆకర్షణబలం అధికమౌతుంది; వాటి దూరం అధికమైన కొద్దీ ఆకర్షణ బలం తగ్గుతుంది. 'అ', 'ఇ' లలో 'ఇ' ని ఎంతబలంతో 'అ' ఆకర్షిస్తుందో 'అ'ను కూడా 'ఇ' అంత బలంతోనే ఆకర్షిస్తుంది. 'అ' 'ఇ' లకున్న గురుత్వాకర్షణబల మన్నప్పుడు 'ఇ' మీద 'అ' యొక్క బలంగాని, లేక 'అ' మీద 'ఇ' యొక్క బలంగాని కావచ్చును. ఆ రెండును సమానమే.

ఇక, వస్తువులకున్న గురుత్వాకర్షణబలం వాటి ద్రవ్యరాశి ననుసరించియే ఉంటుందిగాని, ద్రవ్యస్వభావంతో నిమిత్తం లేదు. ఒక టన్ను ఇనుమును ఎంత బలంతో భూమి ఆకర్షిస్తూందో అంత బలంతోనే ఒక టన్ను దూదినిగాని, ఒక టన్ను నీటినిగాని, ఒక టన్ను రాళ్లనుగాని ఆకర్షిస్తూంది. ఈ సూత్రంపై ఆధారపడి తూనిక జరుగుతూంది. సమానద్రవ్యరాశిగల రెండు వస్తువులమీద భౌమ్యాకర్షణం ఒకే పరిమాణం కలిగి ఉంటుంది. రెండు వీశల ద్రవ్యరాశిగలవస్తువుపైనున్న భౌమ్యాకర్షణము ఒక వీశ ద్రవ్యరాశిగల వస్తువుపైనున్న భౌమ్యాకర్షణానికి రెండింతలు.

వస్తువుల ద్రవ్యరాశితోపాటు వాటి గురుత్వాకర్షణబలం అధికమౌతుందిగదా! నిత్యజీవితంలో మనకు సందర్భించు వస్తువులకన్న భూమి అత్యధిక భారం గల దగుటచేత భౌమ్యాకర్షణమే ప్రధానంగా మనకు తెలియునది. గురుత్వాకర్షణం భూమికిమాత్రమే స్వాభావికమైనదని భావించుకొంటాము. కాని, ప్రతివస్తువుకు గురుత్వాకర్షణబలం కలదని సూక్ష్మతమమైన ప్రయోగాల వల్ల పరిశోధనాగారాలలో నిరూపించవచ్చును. అంతేకాక, జగత్తను ఈ బృహత్తమ పరిశోధనాగారమందు అమానుషపరిమాణంలో అనుక్షణం ప్రకృతి చేస్తూన్న ప్రయోగాలను విమర్శనాదృష్టితో చూచి, విజ్ఞానులు తత్ఫలితాలను గ్రహిస్తున్నారు. సూర్యుని చుట్టు నియత మార్గాలలో గ్రహాలను గిరగిర త్రిప్పుచున్నది, భూమికి చంద్రుని కట్టివుంచినది, మన సముద్రాలలో కెరటాల నుప్పతిల్లచేస్తున్నది ఈ గురుత్వాకర్షణబలమే. శీతలాకాశకుహరాలలోనికి భూమి పరుగెత్తిపోకుండ సూర్యునికి దగ్గరగా ఉంచి, జీవాన్ని కట్టుడుగట్టనీక దినదినప్రవర్ధమానంగా సంరక్షిస్తూన్నది ఈ బలమే.

ద్రవ్యంయొక్క సహజలక్షణమే గురుత్వాకర్షణము. ఏవస్తువునైనా భూతలంనుండి మనం పైకెత్తినప్పుడు భౌమ్యాకర్షణం దానిని క్రిందకు లాగుతుంది. అందుచేతనే ప్రతి అనావలంబన వస్తువు భూముఖంగా పడుతుంది. ఒకటన్ను బరువును మనం పైకెత్తలేము; భౌమ్యాకర్షణం ఆటంకపరుస్తుంది, భూమి లాగుతుంది. భూబలంముందు మనబలం అక్కరకు రాదు. ఒక రాయిని సూటిగా విసరుదామన్నా గురుత్వాకర్షణం సహించదు. ఆరాయిని భూతలానికి లాగుతూనే ఉంటుంది. కొంతదూరం పోయేసరికి ఆరాయి భూమిమీద పడేటట్లు నిరంతరంగా దానికి అధోగమనం కలిగిస్తుంది. మన మెంతవేగంతో రాయిని విసిరినా గురుత్వాకర్షణం లేకపోతే అదేవేగంతో రాయి సూటిగా పోతుంది. గంటకు ౧౦ మైళ్ళవేగంతో మనం రువ్వినట్లైతే ఆరేసినిమిషాల కొకమైలు చొప్పున ఆరాయి పోగలదు. అట్లు పోయిపోయి, ఒకసంవత్సరమయేసరికి భూమిని విడిచి ఆకాశంలో ౮౭౬౦౦ మైళ్లు ప్రయాణం చేయగలదు. కాని, సామాన్యంగా, ఆరాయి కొలది దూరం పోగానే భూమిని తాకుతుంది. దానిని భూమికి డ్చేవరకూ భౌమ్యాకర్షణం ఊరుకోదు.

గురుత్వాకర్షణను గురించి చంద్రుని ప్రశ్నించినా ఒకటే జవాబు. మనకు సుమారు ౨౹ లక్షలమైళ్ల దూరంలో ఉండి గంటకు ౨౩౦౦ మైళ్లత్వరతో భూమిచుట్టు తిరుగుచున్న చంద్రగోళమే గురుత్వాకర్షణబలాధీనం కాకపోతే ౨౦ రోజులలోనే మరొక ౨౹ లక్షలమైళ్లదూరం పోతుంది. భూమిచుట్టు వృత్తమార్గంలో తిరుగుచున్న చంద్రుని విషయమై యోచించి, చంద్రుడట్లు భ్రమణమొనర్చడానికి కారణము భూమియొక్క నిరంతరాకర్షణమే అని న్యూటను నిశ్చయించేడు.

రెండు వస్తువులను దూరం చేసినప్పుడు వాటి గురుత్వాకర్షణబలం తగ్గుతుంది. ఏనియమానుసారంగా ఆబలం తగ్గునో మనకు తెలియును. కాబట్టి, గురుత్వాకర్షణబలంబట్టి వస్తువులదూరం కనుగొనగలము. ఒక టన్ను ద్రవ్యానికి కొంతదూరంలో నున్న మరొక టన్నుద్రవ్యానికి గల గురుత్వాకర్షణబలం పరిశోధనాగారంలో ప్రాయోగికంగా కనుగొనవచ్చును. దీనిని బట్టి, భౌమ్యాకర్షణబలమంత బలంతో ఒకబంతినిగాని, చంద్రునిగాని ఆకర్షించుటకు భూమి దెంత భారమైయుండవలెనో గణించగలము. ఏవిధంగా భూమియొక్క భారం లెక్కకట్టినా సుమారది ౬,౦౦౦,౦౦౦,౦౦౦,౦౦౦,౦౦౦,౦౦౦,౦౦౦ టన్నులని తెలియవచ్చింది.

ఖగోళశాస్త్రంలో గురుత్వాకర్షణంయొక్క సార్వత్రికత స్పష్టమౌతుంది. యావదాకాశంలో ఎక్కడెక్కడ ద్రవ్యం ఉంటే అక్కడ గురుత్వాకర్షణం ఉండితీరుతుంది. నక్షత్రాలెంతెంత దూరంగానున్నప్పటికి గురుత్వాకర్షణబంధములచే బంధింపబడే ఉన్నాయి. పతనవస్తువుయొక్క ఆకర్షణశక్తి భూమిపై వర్తించుటేకాక ఆకాశంలోని నక్షత్రాలగతులను సంస్కరిస్తుంది. నక్షత్రగతులను ప్రతిబంధించకుండా మన మొక్కవేలైనా కదపలేమంటే అతిశయుంకాము.

గురుత్వాకర్షణనియమానుసారంగా సౌరకుటుంబంలోని గ్రహాలు, తోకచుక్కలు సూర్యునిచుట్టు తిరుగుతున్నాయి. భౌమ్యాకర్షణంబట్టి భూమియొక్క భారం కనుగొన్నట్లే, భూమిగాని, ఇతరగ్రహాలుగాని శూన్యాకాశంలోనికి పారిపోకుండ వాటినిపట్టి తనచుట్టు త్రిప్పుకొంటూన్న సౌరాకర్షణంబట్టి సూర్యుని భారం గణించడానికి వీలౌతుంది. అవిషయమై గ్రహాలన్నీ ఒకేఫలిత మిస్తున్నాయి. భూమికన్న సూర్యునిభారం 33౨,౦౦౦ రెట్లని నిశ్చయంగా సూచిస్తున్నాయి. భూమిలోనున్న ప్రతితులం ద్రవ్యానికి సూర్యగోళంలో సుమారు 3 3/౮ టన్నులద్రవ్య ముంది. ఇంత విపరీతభారంగల సూర్యునియొక్క గురుత్వాకర్షణబలంకూడ విపరీతంగానే ఉంటుంది. సూర్యలోకంలో మనవంటి మానవు లుంటే, వారిభారానికే వారు క్రుంగిపోతారు. ఒకవేళ ఆబలాన్ని నిభాయించి నిలువగలదృఢశరీరులైతే ౨ వీశలబరువునైనా పైకెత్తుట దుష్కరం. ఒకకమలాఫలాన్ని 3 గజాలు పైకెగుర వేయుటే మహాకష్టమైనపని.

సౌరకుటుంబంలోని గ్రహాలు అన్యోన్యంగా గురుత్వాకర్షణ మనుభవిస్తున్నాయి. అన్నిగ్రహాలలో గురుగోళం పెద్దగ్రహం; భారమైన గ్రహం. గురునికి దగ్గరగా వచ్చిన ఉపగ్రహాలుగాని, తోకచుక్కలుగాని వాటి నియతమార్గాలు తప్పునట్లు గురునిచే ఆకర్షింపబడతాయి. దీనికొక తార్కాణ ముంది. గురునిచుట్టు తిరుగుతున్న ఉపగ్రహాలలో అతి దూరస్థమైనవి గురునికి అపసవ్యప్రదక్షిణాలు చేస్తున్నాయి. కాబట్టి, అవి గురునిలోనుండి పుట్టలేదని, కొన్ని గ్రహశకలాలు గురునిచే ఆకర్షింపబడి వాటి మార్గాలను విడిచి గురునికి ప్రదక్షిణాలు చేస్తున్నాయని విజ్ఞానులు అభిప్రాయపడుతున్నారు.

ఒక శతాబ్దంక్రితం సౌరకుటుంబంలో యురేనసే సూర్యునికి దూరస్థగ్రహ మని భావించేవారు. సౌరాకర్షణము, తదితర గ్రహాల గురుత్వాకర్షణము గుణించి యురేనసుయొక్క మార్గం నిర్ణయించేరు. కాని, యురేనసు ఆమార్గ మవలంబించలేదు. అంత, మరొకగ్రహంయొక్క గురుత్వాకర్షణబలమే యురేనసును తప్పుత్రోవ త్రొక్కిస్తున్నదేమో అని శంకించేరు. ఏడమ్సు అను ఆంగ్లేయుడు, లేవెరై అను ఫ్రెంచి విజ్ఞాని ఈక్రొత్తగ్రహంయొక్క ఉనికిని గణితపూర్వకంగా కనుగొనప్రూనుకొన్నారు. తత్ఫలితంగా నెప్ట్యూను అను గ్రహాన్ని కనుగొన్నారు.

నెప్ట్యూనుయొక్క ఆకర్షణకు చోటిచ్చినప్పటికి యురేనసు తనమార్గ మవలంబించలేదని సూక్ష్మావలోకనలవలన తెలిసింది. అంటే, మరొకగ్రహం యురేనసుపై ప్రవర్తిస్తూన్నట్లు భావించి దానికై ఆకాశాన్ని శోధించ మొదలుపెట్టేరు. ౧౫ ఏండ్లు వెతికినతరువాత, సుమారొక పుష్కరంక్రిందట, ౧౯౩౦ సం.లో అమెరికావిజ్ఞాని పెర్సివాల్ లొవెలు ఆగ్రహాన్ని కనిపెట్టేడు. అదే ప్లూటో. ఇట్లు, ఖగోళజ్ఞులకు గురుత్వాకర్షణనియమంపై నున్న దృఢ విశ్వాసంచేతనే నెప్ట్యూను ప్లూటోలు కనుగొనబడ్డాయి. వాటి ఉపలబ్ధి గురుత్వాకర్షణనియమాన్ని బలపరిచింది.

ఇంతవరకు సౌరమండలమనే చిన్నగ్రహకూటం గురించి విచారించడ మయింది. నెప్ట్యూను ప్లూటోల కావల, సౌరమండలాని కతిదూరంగా నున్న ఆకాశగహనాలలో అనేక నక్షత్రకూటా లున్నాయి. ఇవి బహుదూరంగా ఉన్నాయి. సూర్యచంద్రు లట్లా నక్షత్రబింబాలు కనుపించవు. ఎట్టి పెద్ద దూరదర్శినిలోనైనా నక్షత్రాలు చుక్కలట్లే కాని బింబముల ట్లగుపడవు. నక్షత్రాల కొకవేళ గ్రహా లున్నా అవి కనిపించుట కవకాశమే లేదు. నక్షత్రాలు కొన్ని కూటములుగా చేరి ఒక్కొక్కకూటం ఎల్లప్పుడొకే విధంగా కనిపించుచుండుటచేత అవికూడ గురుత్వాకర్షణబలంచే బంధింపబడి ఉన్నాయని ఊహించుకోవచ్చును.

నక్షత్రగణాలలో సామాన్యంగా జంటచుక్కలు (**Binary stars**) అధికము. ఇట్టి గణంలో రెండు నక్షత్రా లుంటాయి, అవి ఒకదానిచుట్టు ఒకటి తిరుగుచుంటాయి. ఇద్దరుపిల్లలు చేతులు పట్టుకొని గిరగిర తిరుగుచు 'ఒప్పులకుప్ప, లేక రాధాకేళి' ఆడుచున్నట్లు చుక్కలజంట ఒప్పులకుప్ప తిరుగుచుంటాయి. చేతులవంతు గురుత్వాకర్షణంచే ఒకదానినొకటి పట్టుకొన్నట్లు

స్థానభ్రంశం పొందకుండ రెండునక్షత్రాలు తిరుగు చుంటాయి. ఖగోళజ్ఞు డీనక్షత్రభ్రమణాలు గమనించి అన్యోన్యంగా అవి విడిపోకుండ ఉండుటకు ఎంత గురుత్వాకర్షణబలం వాటి మధ్య నుండవలెనో గణించి, తన్మూలంగా వాటిబరువు కనుగొనగలడు.

ఈవిధంగా తెలిసికొన్న ఫలితాలవల్ల మన సూర్యు డొక సామాన్యనక్షత్ర మని విశదమయింది. నక్షత్రాల సరాసరి భారమంత బరువుగల గోళమే సూర్యుడు. భారంలో నక్షత్రాలందు అధికమైన వ్యత్యాసం లేదు. సూర్యుడు సరాసరిభారంగల మనిషి అనుకొంటే నక్షత్రాలబరువులు ఒక సామాన్యబాలుని భారంనుండి ముప్ఫైరమానవుని భారంవరకు ఉంటాయి. అంతమించిన భారంగల నక్షత్రాలు లేకపోలేదు. ఒక జంటచుక్క అను ప్లాస్కెటు నక్షత్రం సూర్యునికి ౧౮౦ రెట్లు బరువైనదని విజ్ఞానుల అభిప్రాయము. కాని, ఇట్టి నక్షత్రాలు అరుదు. సూర్యునికి ౧౫౦ రెట్లుకన్న అధికభారంగల నక్షత్రాలు గాని, సూర్యునిలో పదియవవంతుకన్న తక్కువభారం గల నక్షత్రాలుగాని సామాన్యంగా కనిపించవు.

నక్షత్రాలభారంలో అంతగా వ్యత్యాసంలేనప్పటికి వాటికాంతిలో చాలవార ఉంది. మృగవ్యాధునికి క్రింద సిరియను అను మహోజ్జ్వలతార గలదు. నక్షత్రాలన్నిటిలో అది చూపరుల నాకర్షించగల తేజోవంతమైనది. అది జంటచుక్కలలో నొకటి. దానితో ఒప్పులకుప్పలాడుచున్న సహచారి అతి కాంతిహీనమైన నక్షత్రము. సిరియసు ఇచ్చేకాంతిలో దాని సహచారి పదివేలయవభాగంకన్న అధిక మీయ లేదు. ఆ సహచారి సిరియసుకాంతిలో మునిగిపోవుట చేత ౧౮౬౨ వరకు దానిని కనుగొన లేకపోయేరు. రాధాకేళితో నున్న ఈచుక్కలజంట సుమారు మన లోకేదూరంలో నుంది. కాబట్టి, భూమినుండి వాటి కున్న దూరాల వ్యత్యాసంచేత ఆజంటలో నొకటి కాంతిహీనంగా కనుపించుటలేదు. సిరియసుకన్న దాని సహచారి నిజంగా కాంతిహీనమైన నక్షత్రమేగాని, వేరేకారణంచేత అది అట్లు గోచరించుటలేదు.

ఇంతకన్న అమిత వ్యత్యాసంగల నక్షత్రాలున్నాయి. ప్రోకియాను (Procyon) అను భాసుర తార కొక సహచారి ఉంది. అది ప్రోకియానులో శత సహస్రాంశం వెలుగైనా ప్రసరించలేదు. అట్టిదే మీరా సెటి (Mira ceti) అను జంటచుక్కలు. వాటిలో ఒకటి మహోజ్జ్వలమైనది; రెండవది అతిహీనకాంతి గలది. "తారకును తార కెంతవ్యత్యాస ముండె!" అను కవివాక్యములు యథార్థములే.

నక్షత్రాలదూరం తెలిస్తేగాని వాటి స్వాభావికాజ్జ్వల్యం (Intrinsic brightness) చెప్పుట కష్టము. ఒకే స్వాభావికాజ్జ్వల్యంగల రెండు నక్షత్రాలు మనకు వేరువేరుదూరాలలో నుంటే దూరతరంగానున్న తార దగ్గరతారకన్న కాంతిహీనంగా గోచరిస్తుంది. స్వల్ప స్వాభావికాజ్జ్వల్యంగల నక్షత్రమే మన కతిసమీపంగానున్నప్పుడు అతి భాసురంగా కనిపిస్తుంది. కాబట్టి, నక్షత్రదూరాలు నికరంగా తెలిస్తేనేగాని వాటి స్వాభావికాజ్జ్వల్యం నిర్ణయించలేము.

సూర్యుడు మనకు ౯౨,౮౦౦,౦౦౦ మైళ్లు దూరంగా నున్న గోళము. అంతదూరంనుండి భూమి నీ విధంగా ప్రకాశింప చేస్తూన్న సూర్యునిదీప్తి ఎన్ని క్రొవ్వొత్తుల వెలుగు (Candle power) ఉండవలెనో గణించవచ్చును. అట్లు గణించగా సూర్యుని ఔజ్జ్వల్యం 3,000,000,000,000,000,000,000, 000, 00౦,౦౦౦ క్రొవ్వొత్తుల వెలుగు అని తెలిసింది. సూర్యుని కన్న సిరియసు మనకు ౫౦౦,౦౦౦ రెట్లు దూరంగా ఉంది. సూర్యరశ్మి ౮ నిమిషాలలో భూమిని చేరుకొంటే సిరియసుయొక్క కాంతి ౮౨ ఏండ్లు ఆకాశయానంచేసి భూమిని చేరుకోవాలి. ఈ విషయాలనుబట్టి సిరియసుయొక్కయు, దాని సహచారి యొక్కయు నిజమైన క్రొవ్వొత్తి వెలుగు గణించడానికి అవకాశముండె. సిరియసు సూర్యునికన్న మహోజ్జ్వలమైన నక్షత్రమని తెలిసింది. సూర్యునికి ౨౬ రెట్లు క్రొవ్వొత్తులవెలుగు కలదు. ఆవెలుగుకు తగినట్లే వేడిమి కూడా ప్రసరిస్తుంది. సౌరమండలంలో సూర్యునిస్థానే సిరియసు నుంచినట్లైతే మననదులు, సముద్రాలు, ధ్రువాల దగ్గర మంచుకొండలు త్వరలోమరగి ఆవిరిగా మారిపోతాయి; యావజ్జీవం భగ్గున మండిపోతుంది.

సూర్యుని స్థానమే సిరియసుయొక్క సహచారి కిచ్చిన పక్షమందు మననదులు, సముద్రాలు ఘనీభవించిపోతాయి; వాతావరణంలో గాలి ద్రవపవనం(Liquid air) గా ద్రవించిపోతుంది. ఏమంటే, ఈ నక్షత్రంయొక్క క్రొవ్వొత్తి వెలుగు సూర్యునిదానిలో ౮౦౦-వ భాగము.

S-డొరేడను అను వృద్ధిక్షయ (Variable) తారయొక్క స్వాభావికౌజ్జ్వల్యం సూర్యుని దానికి సగటున ౩౦౦,౦౦౦ రెట్లుంది. వృద్ధిక్షయ తారలు కాంతిలో మార్పు చెందుతూ ఉంటాయి. S డొరేడసు మహోజ్జ్వలంగా నున్నప్పుడు దాని క్రొ.వె.(క్రొవ్వొత్తి వెలుగు) సూర్యుని క్రొ.వె. కు ౨౦౦,౦౦౦ రెట్లుంది. మన సూర్యుడే ఆ నక్షత్రమంత శక్తివంతమైనచో భూగోళంలో నున్న పదార్థాలన్నీ జీవంతోసహా మాడి వాయువై పోతాయి.

సూర్యతలవైశాల్యం భూతలవైశాల్యానికి సుమారు ౧౨౦౦౦ రెట్లుంది. సూర్యతలం యావత్తు మహోగ్రంగా శక్తిని ప్రసరిస్తూంది. అయితే, సూర్యునికి అనేకవేల రెట్లుశక్తిని ప్రసరిస్తూన్న నక్షత్రాల పరిమాణం ఎంత ఉంటుందో అని సందేహం కలుగుట సహజమే. సూర్యునికి ౨ లక్షల రెట్లు మహోజ్జ్వలంగా నున్న S డొరేడసుయొక్క వైశాల్యం సూర్యగోళవైశాల్యానికి ౨ లక్షలరెట్లుండవచ్చును; లేక S డొరేడసుయొక్క ప్రతిచదరపు టంగుళము సూర్యగోళపు చదరపుటంగుళంకన్న ౨ లక్షల రెట్లు శక్తిని ప్రసరింపవచ్చును. ఇందులో ఏది యథార్థమో నిర్ణయించడానికి రెండుమార్గాలున్నాయి. S డొరేడసుయొక్క పరిమాణాన్ని కనుగొనుట ఒకటి; లేక ఆ నక్షత్రంయొక్క ఒకచదరపుటంగుళంనుండి ఎంత శక్తి ప్రసరింపబడుతూందో గమనించి తద్వారా దాని పరిమాణం గణించుట రెండవది. అందులో మొదటి మార్గం కష్టసాధ్యమైనది. నక్షత్రాలు విపరీత పరిమాణంగల గోళాలైనప్పటికి, అవి ఊహాతీతమైన దూరాలనుండబట్టి వెలుగుచుక్కలకన్న పెద్దవిగా ఏ దూరదర్శినిలోను కనుపించవు. సాపేక్షంగా అతి చిన్నవైన గ్రహాలు సామాన్య దూరదర్శినిలో సైతము స్వచ్ఛంగా గోళాకారం చూపిస్తాయి. కాని, నక్షత్రాల నంత స్పష్టంగా చూపు సాధనం లేదు. కాబట్టి వాటి పరిమాణం కనుగొనలేము.

కాని, నక్షత్రాలరంగునుబట్టి వాటి స్వభావం అవగాహన చేసికొనగలము. కొన్ని నక్షత్రాలు ఎర్రగాను, కొన్ని పచ్చగాను, కొన్ని నీలంగాను ఉన్నాయన్న విషయం ఆకాశాన్ని రాత్రి చూచినవారి కెవరికైనా తెలియగలదు. ఆకాశంలో ఒక భాగం యొక్క ఛాయాచిత్రం తీసి నక్షత్రచిత్రాలను, ఆ నక్షత్రాలను సరిచూచినట్లైతే కంటికి పెద్దవిగా కనుపించిన నక్షత్రాలు ఛాయాచిత్రంలో చిన్నవిగాను, దృష్టికి చిన్నవిగా తోచినవి చిత్రంలో పెద్దవిగాను అగుపడతాయి. ఒక ఉదాహరణగా మృగవ్యాధ మను నక్షత్రకూటాన్ని తీసికొనవచ్చును. మృగవ్యాధుని ఒక జబ్బదగ్గర బిటిల్‌గూస్, లేక ఆర్ద్ర అను నక్షత్రముంది. ఆ తారాకూటమంతటికి అదే మహోజ్జ్వలమైన తార. కాని, ఛాయాచిత్రంలో మాత్రము ఆర్ద్ర చిన్న నక్షత్రమట్లు కనిపిస్తుంది. మృగవ్యాధుని పటకాలో నున్న మూడునక్షత్రాలు ఛాయాచిత్రంలో అతి శోభాయమానంగా ఉంటాయి. ఈ వ్యత్యాసానికి కారణం నక్షత్రకాంతి స్వభావంలోను, ఛాయాఫలక లక్షణంలోను కనుగొనగలము. నీలకాంతిని గ్రహించినంత త్వరగాను, సులభంగాను ఎరుపుకాంతిని ఛాయాఫలకం గ్రహించలేదు. సామాన్యంగా ఫొటోగ్రాపులలో నీలంబట్టలు తెల్లగాను, ఎర్రబట్టలు నల్లగాను పడతాయన్న విషయం అందరెరిగినదే. నీలకాంతి ఛాయాఫలకాన్ని నల్లపరుస్తుంది; ఎరుపుకాంతి అట్లు చేయలేదు. ఇదే నక్షత్రాల ఛాయాచిత్రాలలోను సంభవిస్తుంది. అత్యధిక శోణకాంతితో దీపించు ఆర్ద్రను దీనతారవలె ఛాయాచిత్రం చూపుతుంది. నీలకాంతిని ప్రసరించు పటకాలోని మూడునక్షత్రాలను అతి శోభాయమానంగా చూపుతుంది. వివిధ వర్ణకాంతులకు ఛాయాఫలకం చూపు పక్షపాతమునే శాలకర్రగా నుపయోగించి, తద్వారా నక్షత్రంయొక్క కాంతిని నిర్ణయించగలము.

నక్షత్రాలు వివిధతాపక్రమాలలో నున్నకారణంచేత అవి వివిధవర్ణకాంతులను ప్రసరిస్తున్నాయి. వాటి

కాంతియొక్క వర్ణంబట్టి తాపక్రమం చెప్పకొన గలము. కొలిమిలో లోహాలను కాల్చు కమ్మరి కొలిమి యొక్క రంగునుబట్టి స్థూలంగా తాపక్రమం చెప్ప గలడు. కొలిమియొక్క కాంతిని పరిశీలించి దాని తాపక్రమాన్ని చెప్పగల ఉపకరణా లున్నాయి. ఆ విధంగానే ఖగోళజ్ఞుడు నక్షత్రాల తాపక్రమాలను నిర్ణయించగలడు. మొద్దు ఎరుపుకాంతిగల నక్షత్రాలు తక్కువ తాపక్రమంగలవి. వాటి తాపక్రమం సుమారు ౧౪౦౦° సెం. పసుపుకాంతిగల నక్షత్రాల తాపక్రమం సుమారు ౩౦౦౦° సెం. తెల్లని కాంతిగల వాటి తాపక్రమం ౬౦౦౦° సెం. ఉష్ణతమమైన తారల తాపక్రమం సుమారు ౪౦,౦౦౦ °సెం. ఇట్టి తాపక్రమాలు ఊహాతీతమైనవి. ౩౫౦౦° సెం. కన్న అధికమైన తాపక్రమాన్ని మన భూమిలో ఎరుగము. కాని, నక్షత్రతలంనుండి బహిర్గమిస్తూన్న ప్రసారంయొక్క లెక్క కట్టవచ్చును. అత్యల్పతాపక్రమం గల నక్షత్రంయొక్క ఒక్క చదరపుటంగుళంనుండి వెలువడుశక్తితో ఒక చిన్న పడవను నడపగలము. ఉష్ణతమతారలయొక్క ఒక చదరపుటంగుళంనుండి ప్రసరింపబడుచున్న శక్తి ౩౫,౦౦౦ టన్నులు బరువుగల యుద్ధనౌకలను మహా వేగంతో తీసికొనిపోతుంది. ఇట్లు, ఉష్ణతమ (౪౦,౦౦౦°) తారయొక్క చదరపుటడుగునుండి వెలువడు శక్తి శీతలతమ (౧౪౦౦°) తారయొక్క చదరపుటడుగునుండి ప్రసరింపబడుతూన్న శక్తికి ౩౦౦,౦౦౦ రెట్లుంటుంది. కాగా, ఉష్ణతమ తారకన్న శీతలతమతార వైశాల్యంలో ౩౦౦,౦౦౦ రెట్లుంటేనే గాని రెండుతారలు ఒకే పరిమాణంలో శక్తిని ప్రసరించలేవు.

ఆర్ద్రి ఎరుపుతార. దానినుండి వెలువడు ప్రసారం తక్కువ. కాని, ఆర్ద్రినుండి ప్రసరింపబడుతూన్న మొత్తపు ప్రసారం సూర్యుని మొత్తపు ప్రసారానికి ౬౦౦౦ రెట్లుంది సూర్యునికన్న తక్కువ తాపక్రమంగల ఆర్ద్రియొక్క ప్రసారం సూర్యప్రసారమంత తీక్ష్ణంగా ఉండజాలదు. అయినప్పటికి అది ౬౦౦౦ రెట్లున్నదంటే ఆర్ద్రియొక్క వైశాల్యం సూర్యతల వైశాల్యానికి ౬౦౦౦ రెట్లుకన్న అధికంగా ఉండాలి. ఆర్ద్రి బృహత్తరతార.

ఆర్ద్రియొక్క వర్ణంబట్టి దాని తాపక్రమం కనుగొన గలిగినట్లైతే ప్రతి చదరపు టంగుళంనుండి ఎంత శక్తి ప్రసరింపబడుతూందో గణింపవచ్చును. అది కనుగొన్న తరువాత ఆర్ద్రియొక్క మొత్తపుశక్తికి సమానమైనశక్తిని వెలువరించడానికి ఎన్ని చదరపుటంగుళాల వైశాల్య ముండవలెనో కనుగొనవచ్చును. అప్పుడు ఆర్ద్రియొక్క పరిమాణం తెలియగలదు. ఈ ప్రకారంగా నక్షత్రంయొక్క రంగును బట్టి తాపక్రమం నిర్ణయించి, తాపక్రమంవల్ల చదరపుటంగుళంనుండి వెలువడు శక్తిని గణించి, దానిచే ఆనక్షత్రంయొక్క మొత్తపు శక్తిని భాగించగా లభించిన వైశాల్యంనుండి దాని పరిమాణం కనుగొనగా, నక్షత్రాల పరిమాణాలలో అత్యధికవ్యత్యాస మున్నట్లు తెలిసింది. సూక్ష్మతమమైన నక్షత్రం భూగోళంకన్న అట్టే పెద్దది కాదు. అట్టి నక్షత్రాలు శతసహస్రంగా సూర్యగర్భంలో ఇమిడిపోతాయి. ఆర్ద్రివంటి బృహత్తమతార శతసహస్ర సహస్రంగా సూర్యునివంటి తారలను పొట్టనిడుకొంటాయి.

నక్షత్రాల బరువు, పరిమాణం, ఔజ్జ్వల్యం గురించి తెలిసిన సంగతులను విమర్శిస్తే ఒక్క విషయం విశద మౌతుంది. బరువులో నక్షత్రాల కట్టే వ్యత్యాసం లేదు. పరిమాణంలో నక్షత్రాల కున్న వ్యత్యాసం అత్యధికము. ఔజ్జ్వల్యంలో సైతము అమితభేద ముంది. దీనికి కారణం నక్షత్రోద్భవ చరిత్రలో కనుపించవచ్చును.

---o---

అక్షమాల

[గీతికా స్వగతము]

— శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి —

ఈ పవిత్రభాగీరథీహిమజలమ్ము
దేవతాభిషేకము చేయ దెత్తు నాథ!
నేను పంచమయువతినే నైన నేమి —
జననిమాత్రము బ్రహ్మవంశప్రసూత.

అర్చనలు లేక గతియింప ననుదినమ్ము
ప్రకృతికాంతకు నొక్కింత ప్రభయె తరిగె
విస్మరింపగ వలదు దేవీపదాబ్జ
పూజ శుక్రవారము నేడు పుణ్యచరిత!

మరచినారు ప్రాతఃకాలమహితగీతి!
ఏల సంధ్య నుపాసింప నేర రింక?
నిర్మలాంభఃప్రపూర్ణ మీ నిరుపమాన
జహ్నుకన్యాస్రవంతి సుస్నాతు లగుడు.

భవ్య యుష్మదీయాశ్రమోపాంతవాటి
కరుగుదెంచిననాడె మీయక్షియుగళి
సాంద్రభక్త్యరుణజ్యోతి చనెను స్వామి!
ఆగమనపాపఫల మిది యగునొ యేమొ?

త్వన్మనస్సను సంతృప్త చిన్మయార్ద్ర
వేదకాసారపద్మమ్ము; అది నితాంత
మానవిజ్ఞానదీపమ్ము; అఘపరీత
నగుచు జేరితి మీ ప్రాపు; అరుగుదాన!

ఏల వల దందురో నాథ? ఏటిపలుకు?
సంధ్య ననురాగదీప్తితో సవనక్రియల
నాదరాంతరమాలతో నాలపింప
నేను ప్రతిబంధకమ్మునై యిచట నుంటి.

సైకతస్థలి నిర్మింపరో కరండ
మకుటధారిని? జాహ్నవీచికురకేశ
పాశసంలగ్నముగ్ధాంబుభరముతోడ
చేయరో నాథ నే డభిషేచనమ్ము?

సురనదీనూపురారవ సరళగాన
మదిగో హంసల బిలుచు నీ యామమందు
వేళ యయ్యెడు పరిణీత వేది జేర
భాను డరుదెంచె; పోయె ప్రాభాతఘోష.

ఆకమండలునీరము నందికొనక
చల్లెద రదేల నామీద స్వామి యిటుల?
శక్తిహీనత తోడురా నెరుగనైతి
ఏదు మాహాత్మ్య సంస్థిత హేమరవము.

నిత్య సంలగ్న రాగార్ద్ర నీమహాహృదయ
జోతులముగాన కలసితి మీతటమ్ము!
అక్షమాలిక రుద్రుని అక్షమాల
ఇది జగద్వంద్యనితపోవ నేందిరమ్ము.

హోమరేఖల దిద్దెడి యూహవీడి
అక్షమాలను గైకొని యనవరతము
జపతపంబులనుండ నీ సరళకుసుమ
కేసరమ్ములకు ప్రబోధ క్రీళనొసగె.

కర్మవిజ్ఞాన మవగత కావ్యమయ్యె
నీ నదీతీరమందలి మునులకెల్ల;
జ్ఞానరూపమ్ము అక్షమాలాననమ్ము
నంద, చాండాలినైతిగా నంతలోన.

అరుగుదెంచుడు అభిషేచనార్థులగుచు
నిర్మలాంభఃస్రవంతి గాణిక్యవాటి
కిపుడు; నేనకారాదియై యేగుదెంతు
నా ప్రణవయోగమాహాత్మ్య మాలకింప.

కథ:

తీర్పు

= శ్రీ ధనికొండ హనుమంతరావు =

సూర్యుని లేతకిరణాలు కిటికీలోంచి ముఖం మీద పడి, కల్యాణిని అప్పుడే మేల్కొల్పినయ్. ఆమె ఒళ్లు విరుచుకొని, బద్ధకంగా పక్కమీద లేచి కూర్చొని పక్కగదిలో జరిగే సంభాషణను వినసాగింది—

"...ఏమిమ్మంటావ్?"

"మీ ఇష్టం—"

"అదెట్లా? ఇదివరకతనికి ముప్పై ఇచ్చేవాళ్లం"

"నాకూ అలాగే ఇప్పించండి"

"ఎప్పటినుంచీ రాగలవు?"

"ఇవాళ్టినుంచీను."

"సరే... ఆఫీసువేళకల్లా రా—"

ఒక గొంతు భర్తది. రెండోగొంతు ఆమెకు కొత్తదైనా, అందులో ఏదో విశేషం ఉన్నట్టుగా ఆమెకు తోచింది. ఆ రెండోవ్యక్తి ఎవరో చూడాలని ఆమెకు కుతూహలం కలిగింది. సంభాషణ అయిపోయేవేళకల్లా ఆమె గదిగుమ్మందగ్గరకు వచ్చి, గుమ్మానికి కట్టివున్న తెరను కొద్దిగా తొలగించి చూసింది. ముప్పై ఏళ్లపై వయస్సువ్యక్తి అప్పుడే లేచి వెళ్లబోతున్నాడు. మాసిన అతని బట్టలూ, చిక్కిన అతని శరీరమూ బీదరికాన్ని చాటుతున్నయ్. మంగలి కత్తికోసం ఎదురుచూసే అతని గడ్డం అతనికి జీవితం మీద ఏర్పడ్డ నిర్లక్ష్యతను చెప్తోంది. లోతుగా ఎర్రపడ్డ అతని కళ్లు జీవితంలో అనుభవించిన బాధ క్రూరతగా మారికూర్చోవటాన్ని చూపుతున్నయ్. ఆ కళ్లలోని ఎరుపు లోకంమీద అతనికి కలిగిన కోపంలా వుంది. ఆ పెద్ద బొచ్చుటోపీకింద అతని తల భయంకరంగా వుంది. ఒక్కక్షణం కల్యాణిచూపుల్తో అతని చూపులు కలుసుకున్నయ్. అసలు ఆవ్యక్తిని చూడగానే కల్యాణికి ఎందుకోగాని భయం వేసి, ఒక్క క్షణమైనా ఆ ప్రదేశంలో నిలబడలేక వెనక్కు వచ్చేసింది.

భర్త వచ్చి, "అబ్బాయి ఏడీ?" అనేదాకా కల్యాణి ఆ కొత్తవ్యక్తిని గూర్చిన ఆలోచనలోంచి బైటపడలేకపోయింది.

ప్రసాద్ ప్రశ్నకు జవాబుగా బైట కారుహారన్ మోగింది. కల్యాణి నవ్వి "మూడురోజుల్నుంచీ డ్రైవింగు నేర్చుకుంటున్నాడు—" అంది.

ప్రసాద్ నవ్వి, కారుదగ్గరికి వెళ్లి, "ఏం చేస్తున్నావ్ వేణూ?" అన్నాడు.

"కార్లో ఎక్కానాన్నా! షికారువెళ్దాం"

"ఇందాకటినుంచీ నువ్వు కార్లో తిరిగివచ్చావుగా? చాల్లే—" అని ఆ ఎనిమిదేళ్ల కుర్రాణ్ని చెయ్యిపట్టుకు నడిపించుకొని తీసుకువెళ్లాడు.

ఆమధ్యాహ్నం ప్రసాద్ ఆఫీసుకు వెళ్లబోతూ, "డ్రైవరు వచ్చాడు; నన్ను కోర్టులో దింపి కారు తీసుకువస్తాడు...ఎక్కడికైనా వెళ్లివస్తే వెళ్లిరా—" అన్నాడు.

"నేనూ, అమ్మాను—"అన్నాడు కుర్రవాడు.

"ఊఁ. మీ ఇద్దరూను" అని వాడి బుగ్గ గిల్లి, ప్రసాద్ వెళ్లిపొయ్యాడు.

మరో అరగంటకల్లా కారు తిరిగివచ్చింది. దాసీది వచ్చి, "అమ్మగారూ! ఎక్కడికన్నా వెళ్తారా?" అని అడిగింది.

కల్యాణి విసుగ్గా "ఊహుఁ" అని సమాధానమిచ్చి దాసీదాన్ని సాగనంపింది.

ఉదయాన ఆ కొత్తవ్యక్తిముఖం చూసినప్పటి నుంచీ కల్యాణికి ఎందుకోగాని కష్టంగా వుంది. అంత పెద్ద బంగళాలో కూర్చొని ఏం చెయ్యాలోకూడా ఆమెకు తోచడంలేదు. ఏదో చదువుకోబోయింది; కాని ఆ చదివేది ఆమెకు అర్థమవనేలేదు. కిటికీదగ్గర కుర్చీ వేసుకొని బైటి తోటలోకి, దూరాన ఆకాశం భూమితో కలిసే ప్రదేశంలోకీ చూడటంతో ఒక గంట గడిపింది.

కుర్రాడు వచ్చి తల్లిచీరకొంగు పట్టుకొని వేళ్లాడుతూ, "అమ్మా! కారెక్కి వెళ్దామే!" అని నసగసాగాడు.

ఊరువచ్చిన నాలుగోరోజిది. ఈ నూతన వాతావరణం ఎలా వుంటుందో, ఇక్కడి ప్రజలు ఎలా బతుకుతూంటారో, ఇక్కడి గాలి ఎలా వుంటుందో మొదలైన అనేకవిషయాల్ని ఆమె ఇక్కడికి రాకపూర్వం ఆలోచించింది. కాని ఆమెఊహకేమీ తట్టలేదు. ఇప్పుడు యేమీ తోచకపోవటంవల్ల, కారులో నాలుగుబజార్లూ తిరిగివస్తే కాలం కొంత సాగుతుంది. ఈ ఉద్దేశంతో, కుర్రాణ్ని ప్రోత్సహిస్తూన్నట్టు, "సరే...బట్టలు వేసుకో" అంది.

ఆమె దాసీని పిలిచి, "డ్రైవరు ఏం చేస్తున్నాడు?" అంది.

"కారుషెడ్డులో కూర్చున్నాడమ్మా!"

"కారు సిద్ధంచెయ్యమను" అని మొహం కడుక్కొని, తన హోదాకు సరిపడే దుస్తుల్ని ధరించి, కుర్రాడితోపాటు పోర్టికోలోకి వచ్చింది. ఉదయాన ఆమె చూసిన వ్యక్తే దుస్తులమార్పుతో డ్రైవరుగా నిలబడి, వెనుకసీటుతలుపు తెరిచాడు. అతన్ని చూడగానే ఆమెలో ఏదో బలహీనత్వం ప్రవేశించింది. కారణం ఆమెకే తెలియదు. తను అనవసరంగా ఇలా భయపడటంలో అర్థమేమీ లేదనుకొని, ఒకసారి అతని ముఖంలోకి ధైర్యంగా చూడటానికి ప్రయత్నించింది. కాని అతని కళ్లు! ఆచూపును, ఆ అగాధాన్ని ఆమె భరించలేకపోయింది. మళ్లీ చూద్దామన్నా ఆమెకు ధైర్యం చాలలేదు.

కుర్రాడు తన చేతిపట్టును తనకు తెలియకుండానే వదిలించుకొని వెళ్లి కార్లో కూర్చొని, "రా అమ్మా!" అంటున్నాడు. ఆమె ఒక్కసారిగా నిద్రనుంచి మేల్కొన్నట్టు కళ్లెత్తి చూసి, మెల్లిగా వెళ్లి వాడిపక్కనే కూర్చుంది.

డ్రైవరు ముందుసీటులో కూర్చొని ఇంజను స్టార్టుచేసి,ముందుచూపుతోనే అడిగాడు: "ఎక్కడికి—అమ్మగారూ?"

ఆమె వెంటనే సమాధానం చెప్పలేకపోయింది. అతని గొంతుకూడా ఆమెనరాలపటుత్వంమీద దెబ్బతియ్యగలదన్నట్టుంది! కొస్త తడబడుతూ సమాధానమిచ్చింది: "పోనీ...ఊళ్లోకి...ఊరంతా తిప్పు!" చివరిమాటకు కుర్రాడికి చాలా సంతోషంగా వుంది!

కారు బయలుదేరింది. అతివేగంగా వెళ్తూన్న కారులో — కుర్రాడు ఒకచివరకు జేరి, తల బైటికి పెట్టి చరచరా సాగిపొయ్యే దృశ్యాల్ని చూసి ఆనందిస్తున్నాడు. కాని ఆమెను బైటిదృశ్యాలేమీ ఆకర్షించటం లేదు. గాలికి రెపరెపలాడే పైటకొంగును తీసి కంఠానికి చుట్టుకుంది. ముంగురులు తమ ఇష్టం వచ్చినట్టు ముఖంమీద ఆటలాడుకుంటూన్నా ఆమెకు లక్ష్యమే లేదు. అసలు తను దేన్నిగూర్చి ఆలోచిస్తోందోకూడా ఆమెకే తెలియదు...

ఒక్కసారిగా ముందుకు చూసింది. ముందున్న అద్దంలో తన ప్రతిబింబాన్ని డ్రైవరు పరీక్షగా చూస్తూన్నట్టు ఆమెకు అనుమానం కలిగింది. పురుషులు అనేకమంది తనవైపు చూడటం ఆమెకు కొత్తకాదు. ఇదివరకుండే డ్రైవరు రోడ్డుమీదికి ఒకకన్నుంచి, రెండోకంటితో తన పాపను చూస్తూండటంకూడా ఆమె మరిచిపోలేదు. అప్పుడు ఆమెను బాధించని ఏచూపూ ఇప్పుడు యీడ్రైవరుపాల పడి, తనకు కోపంకూడా తెప్పించింది.

కాస్త పెద్దగా, అధికారస్వరంతో, "స్పీడు తగ్గించు- తొందరేమీ లేదు" అంది.

వెంటనే కారువేగం తగ్గింది. కుఱ్ఱాడికి ఇది నిరుత్సాహంగా తోచి, ఏమీ అనలేక, తల్లివైపు ఒక్క క్షణం బిక్కమొగం వేసి చూశాడు.

ఆమె మళ్లీ, "బజారుకు...... బట్టలకొట్టుకు పోనీ" అంది.

కారు వెంటనే మలుపు తిరిగింది. అతను లోపల ఏమనుకున్నాడో కాని, ఆమెమాటలుమాత్రం వెంటవెంటనే క్రియారూపం తాలుస్తున్నవి. ఒక్కొక్క వ్యక్తికి ఎంత అధికారం వుంటుంది! మాటలు ఒక్కొక్క నోట ఒక్కొక్క అర్థాన్నికూడా ఇస్తుంటయ్ కాబోలు.

బట్టలకొట్టుముందు కారాగగానే, ఆమె కుఱ్ఱాడితో కొట్లోకి వెళ్లి, అరగంట బేరమాడి, బట్టలన్నీ మూటకట్టించి, డబ్బు చెల్లించి బైటికి వచ్చింది. డ్రైవరు తలుపు తెరవగానే కార్లో కూర్చొని, అతని వైపు చూడకుండానే, "లోపల మూట వుంది—" అంది అస్పష్టంగా.

అప్పటికే కొట్టువాడు బైటిదాకా మోసుకొచ్చిన మూటను అందుకొని కారులో పెట్టి, ఒక నిమిషంసేపు డ్రైవరు ఆమెముఖంలోకి చూశాడు. ...ఎంత ధైర్యం! ఆమె యీచూపును గమనించనట్టు నటించినా, ఏదో మనస్సులో ఆందోళనగానే వుంది.

డ్రైవరు తన సీటులోకి వెళ్లగానే ఆమె అప్రయత్నంగా, "ఇదుగో— నీ పేరేమిటి?" అంది.

అతను వెనక్కు తిరిగిచూడకుండానే "శర్మ" అన్నాడు.

ఈమాటతో అతని గడ్డాన్ని పట్టి మహమ్మదీయుడా, హిందువా అన్న ఆమెఅనుమానం పూర్తిగా తేలిపోయింది. "శర్మ-శర్మ" అనుకుంది మనస్సులో. ఆపేరు ఎక్కడో విన్నట్టు సుర్తు. జ్ఞాపకం చేసుకోవాలని ఆమె చాలా ప్రయత్నించింది. కాని ఆమెకు తగిన సహాయమేమీ దొరికేట్టు కనిపించలేదు.

ఇక యీ కారులో కూర్చొని తిరగాలన్నే కుతూహలంకూడా ఆమెకు బాగా తగ్గిపోయింది. ఊరు చూడకముందుండే ఆదుర్దా, చూస్తూన్నప్పుడు లేకపోవటం సహజమేనేమో ?

"ఇంటికి పోనీ—"

ఇంటి గుమ్మంలో కారాగగానే ఆమె దిగి, ఇంట్లోకి వెళ్లబోతూ, ఒకసారి వెనక్కు తిరిగి డ్రైవర్ను చూసింది. అతను పెదిమలు బిగబట్టి, పరుసుగా తనవైపే చూస్తున్నాడు. ఆమె విసుగుతో కోపంగా నేలను తన్ని తన గదిలోకి వెళ్లిపోయింది. అప్పటికి కాని ఆమె కేదో ఒత్తిడి తగ్గినట్టుగా తోచలేదు.

చాలాసేపటివరకూ యీ డ్రైవర్ను గూర్చి ఆలోచించింది. అతని ప్రవర్తన, ఆకారమూ, గడ్డమూ, కంఠమూ— అన్నీ ఏదో వింతవస్తువులుగా కనిపించినయ్. అతని ముఖం మరిచిపోతూన్న ఏదో విషయాన్ని జ్ఞాపకం చేసేందుకు ప్రయత్నిస్తూన్నట్టు తోచింది.

అసలు యీ ఆలోచనతో బాధపడటంకూడా ఆమెకు అనవసరంగా తోచింది. మనస్సును తనకు తానై మెలేసుకొని మనశ్శాంతిని పాడు చేసుకుంటూన్నట్టనిపించింది.

చప్పున కుఱ్ఱాడు జ్ఞాపకం వచ్చాడు. తనకు తోచనప్పుడల్లా కుఱ్ఱాడితోనే ఉత్సాహంగా ఆడుకోవటం ఆమెకు అలవాటు. వాడికోసమని గదంతా కలయజూచింది; లేడు. దూరాన నవ్వులు విని, కిటికీలోంచి తోటలోకి చూసింది. అక్కడ డ్రైవరువీపుమీద ఎక్కి వాడు గుఱ్ఱంఆట ఆడుకుంటున్నాడు. డ్రైవరుముఖంలో తనకు కనిపించే క్రూరత యేదీ వాడికి కనిపించటం లేదు కాబోలు! కొత్తవాళ్లదగ్గర చప్పున అలవాటుపడని వీడు డ్రైవరుతో ఇట్టే కలిసిపోవటం ఆమెకు ఆశ్చర్యంగానే వుంది. డ్రైవరు తన యీడు నంతట్నీ మరిచిపోయి యీచిన్నకుఱ్ఱాడితో ఆడుకోవటం మేమిటి? తనూ ఆడుకుంటుంది కాని— అది తనకు పుత్రుడిమీద వున్న ప్రేమ! కాని ఇతర్లకు పరాయిబిడ్డలమీద ప్రేమేమిటి ? "జీవితంలో ఎప్పుడన్నా అతను ఇలాటి కొడుకును పోగొట్టుకున్నాడేమో?" అనుకుంది.

వాళ్ల ఆట చూస్తూ కూర్చుంది. కుఱ్ఱాడు నవ్వు ఆపుకోలేక నేలమీద పడి దొర్లుతున్నాడు.

వాడు లేచేప్పటికి వాడి గుడ్డలన్నీ పాడయినయ్. వాడు దీన్ని లెక్కచెయ్యకుండానే డ్రైవరుగడ్డం పట్టుకొని, అతని తలను అటూ ఇటూ ఆడిస్తూ ఆనందిస్తున్నాడు.

జడ్జీగారి కొడుకు సేవకుడైన డ్రైవరుతో ఆడుకోవటమేమిటి ?—ఒక్కసారిగా సమాజంలోని తన స్థానాన్ని ఆమె గుర్తించింది. ఈ సేవకులకు యీ విధంగా అలుసివ్వటం యెంతప్రమాదం...! ఒకపక్క నిలబడి యీవినోదాన్ని చూసి నవ్వుతూన్న దాసీదాని నవ్వుకూడా ఆమెఅభిమానాన్ని మేల్కొలిపింది. వెంటనే కుర్రాణ్ణి పిలిచింది.

వాడు తలెత్తి చూసి, "వస్తాలే—" అని తన ఆటలో జోరబడబోతున్నాడు.

"నీకే...ఇట్లా రారా!" అంది మళ్లీ.

"ఎందుకూ?" అన్నాడు వాడు సూటిగా ఆమె వైపు చూస్తూ.

"రమ్మంటే..." కల్పితకోపాన్ని కంఠానికి జతచేసి ప్రయోగించింది.

"వస్తాలే...కాసేపుండి—"

డ్రైవరు లేచి నిలబడి ఒకసారి ఆమెవైపు చూశాడు. ఆమె యీచూపును తప్పించుకోవాలని చూసింది. అతను అసలేమీ జరగనట్టే కుర్రాణ్ణి ఎత్తుకొచ్చి సావిట్లో దింపి, "అమ్మగారు పిలుస్తున్నారు...వెళ్లండి—" అని తను షెడ్డులోకి వెళ్లిపోయ్యాడు.

కుర్రాడు నిరుత్సాహంతో కోపాన్ని తెచ్చుకొని, చరచరా గదిలోకి వచ్చి, "ఎందుకమ్మా?" అన్నాడు.

ఆమె కోపంతో, "ఆ బట్టలన్నీ ఎందుకు పాడు చేసుకున్నావ్ ?" అంది.

"ఆడుకుంటున్నాను—"

"డ్రైవరుతో ఏం ఆట ?"

"అతను మంచివాడమ్మా!"

వాడికి కనిపించే మంచితనం తను కనుక్కో లేకపోయినందుకు విచారిస్తూ, "సరే...ఆగుడ్డలు విప్పి నీళ్లు పోసుకురా—పో—" అంది.

"కాసేపు ఆడుకొని..." అని వాడు మెల్లిగా తప్పించుకోవాలని ముందుకు రెండడుగులు వేశాడు.

కాని వెనుకనుంచి తల్లి కసురుకుంటూ, "నీక్కాదురా చెప్పేది ?—మళ్లీ షికారు వెళ్దాం—" అంది.

ఈ చివరిమాటకు వాడు లొంగిపోయ్యాడు. చప్పున తయారయేందుకని పరుగెత్తాడు. వాడు వెళ్లగానే కల్యాణి దాసీని పిలిచి, "డ్రైవరు ఏంచేస్తున్నాడు?" అంది.

"ఇప్పుడే కారు తీసుకొని కోర్టుకు వెళ్లాడమ్మా"

కల్యాణి మాట్లాడకుండా సాలోచనగా అటూ ఇటూ చూడసాగింది.

౨

కుర్రాడు షికారుదుస్తులు వేసుకొని సిద్ధమై, "అమ్మా! వెళ్దాం—పా" అని తల్లిదగ్గర మారాం చెయ్యసాగాడు.

"కారు లేదు; నాన్నగార్ని తీసుకొచ్చేందుకు వెళ్లింది...రానీ!" అని కల్యాణి వాణ్ణి ఎలాగో ఊరుకోబెట్టింది.

కారురాకకోసం కిటికీలోంచి ఎదురుచూస్తూ ఆ బుల్లిబుర్రతో వా డేదో ఆలోచించుకుంటున్నాడు. కల్యాణికూడా ఇంకోదిక్కు చూస్తూనే తన మామూలుసమస్యలోకి వెళ్లిపోయింది. ఇతను కనిపించిన మొట్టమొదటిక్షణంనుంచీ ఆమెకు అనేకఇతర వస్తువులమీది శ్రద్ధ తగ్గిపోయింది. కారణం ఆమెకే తెలియదు.

ఈ కుర్రాడు ఒక గంటలో డ్రైవరుతో స్నేహం సంపాయించగలిగాడు. వాళ్లిద్దరి ఆశయాలూ, యీడూ, వ్యక్తిత్వమూ—ఏదీ ఒకటి కాకపోయినా, ఒకే మెట్టుమీద ఇద్దరూ సర్దుకొని పిచ్చిఆటలోని ఆనందాన్ని అనుభవించగలిగారు. కాని యీవ్యక్తిని చూసిన మొట్టమొదటి క్షణానే అతనిమీద గంపెడు

అనుమానం తనకు ఎందుకు కలగాలి? లోకంలోని వ్యక్తుల్లో కొందరిని మొట్టమొదట చూడగానే పెద్ద అభిమానం కలుగుతుంది; మరికొందరిమీద గొప్ప అసహ్యభావం కలుగుతుంది. మొదటివారు చేసిన మేలూ లేదు; రెండోవారు చేసిన కీడూ లేదు. మరి యీ కారణంలేని అభిప్రాయం కలిగేందుకు ఏమన్నా కారణ ముందా? ఆమె తన కున్న విజ్ఞానంతో యీవిషయాన్ని తెలుసుకోలేకపోయింది. ఇంతకుపూర్వం అనేకమంది ఇలాంటి అనుమానంతో బాధపడి చివరకు ఏకారణాన్నీ కనుక్కోలేక విసిగి, వదులుకున్నారని ఆమెకుమాత్రం తెలియదు!

కాని ఒకటిమాత్రం నిజం...ఈ డ్రైవరుమీద తనకు కలిగిన అభిప్రాయం తను బుద్ధిపూర్వకంగా తెచ్చుకున్నది కాదు. తనకు తెలియకుండా, తన అనుజ్ఞ లేకుండా అది తనంతతానే తనలో ఒక స్థానాన్ని ఏర్పరుచుకోగలిగింది. అందుకనే యీ అభిప్రాయాన్ని తను పోగొట్టుకునేందుకు ప్రయత్నించి తప్పకుండా జయించవచ్చుకూడాను. 'నిజమే — ఇది వట్టి భ్రమ! తన నీడను చూసి తను భయపడటంలాటిది! పాపం — అతను తన కేం హాని చేశాడు? ఎంతో గౌరవంగా 'అమ్మగారూ!' అని పిలుస్తాడు. తమ సేవ చేసుకొని బతికే ఇంతమంది సేవకులమీద తనకు కలిగే దయకు అతనుమాత్రం ఎందుకు దూరమవ్వాలి? బీదరికం అసహ్యించుకునే వస్తువే అయితే—ముందుగా తన పుట్టింటివారిమీద తనకు అంతులేని అసహ్యత కలిగితీరాల్సింది!

కారుమోత వినగానే కుర్రాడు సంతోషంతో కేకవేసి నాట్యం చేయసాగాడు. ఈ చప్పుడుకు ఆమె ఆలోచనాసముద్రంలోంచి మేల్కొనేప్పటికే ప్రసాద్ కుర్రాణ్ని ఎత్తుకొని తన ఎదుట నిలబడి ఉన్నాడు.

కుర్రాడు, "నాన్నా! షికారు వెళ్దాం ... అమ్మా, నేనూ వెళ్తున్నాం. నువ్వుకూడా రా—" అని కారు తనదైనట్టూ, అందులోని కొంతభాగాన్ని తను యీతండ్రికి బహూకరిస్తున్నట్టూ ఆహ్వానించాడు.

"షికారా?— ఏం కల్యాణీ! అట్లా ఉన్నావే?"

తన స్థితి ముఖంలో ప్రతిఫలించేటంతవరకూ వచ్చినందుకు ఆమె నొచ్చుకుంటూ, వెంటనే బలవంతాన ముఖకళను మార్చి నవ్వుతూ, "ఎట్లా వున్నాను?...ఇందాకా బజారువెళ్లి బట్టలు తెచ్చుకున్నాం" అని మాటలధోరణిని మార్చగలిగింది.

"ఊఁ" అని తలవూపి, వంటవాడు సిద్ధంచేసిన టీ తాగుతూ ప్రసాద్ అన్నాడు: "డ్రైవరు చాలా యోగ్యుడులా గుంది. చాకచక్యంతో కారు నడపగలడు. అణకువకూడా వుంది—"

భర్తకూ, కొడుక్కూ కనిపించే ఆ యోగ్యత తను కనుక్కోలేకుండా చేసిన తన బలహీనత్వమేమిటో ఆమెకు అర్థమవటం లేదు.

"మంచివాడు నాన్నా! చాలా మంచివాడు—అతని గడ్డం ఇంకా పెరుగుతుంది!"అన్నాడు కుర్రాడు.

కల్యాణి బలవంతాన తన అభిప్రాయాన్ని వెంటనే మార్చుకొనే గట్టి ప్రయత్నపు మొట్టమొదటి మెట్టుగా, "అవును...చాలా మంచివాడు" అంది.

కుర్రాడుమాత్రం తన పాతపాటను వదలలేదు. "నాన్నా! షికారు!" అని ఎత్తుకున్నాడు.

ప్రసాద్ నవ్వి, "వా డంతగా అడుగుతూంటే షికారు వెళ్లరాదూ!" అన్నాడు భార్యతో.

"ఏం షికారురా ? కాసేపు ఆడుకోరాదూ?" అంది కల్యాణి, కోపాన్ని నటిస్తూ.

కుర్రాడు నిరుత్సాహపడి తండ్రిసహాయం కోసం దీనంగా చూశాడు.

"వెళ్లి రా—నడవాలా ఏమన్నానా ? కాళ్లకు మట్టి కాకుండానే తల్లీకొడుకులు షికారు వెళ్లిరాగలరుగా!"

భర్తమాటను ఆమె కాదనలేకపోయింది. కొంత చల్లగాలి తగులుతే తనలో అనవసరంగా రేగిన యీ తుఫానుకు సంబంధించిన వేడికూడా తగ్గవచ్చు. అదీకాక తను ఒప్పుకోక కారణాల్ని చెప్పాల్సివస్తే భర్తముందు బైటపడటంకూడా అవుతుంది. ఐనా అంది: "మీరుకూడా రండి."

"నాకు చాలా పని వుంది... నువ్వూ, వాడూ వెళ్లిరండి."

తను కాపరానికి వచ్చిన మొట్టమొదటి రోజు నుంచీకూడా ఆమె కొక పెద్ద అనుమానం వుంది. గవర్నమెంటువారు తన భర్తజీవితంలోని రోజుల్లో కొద్దిభాగాన్నే తమ పనులకోసం కొన్నారా, లేక అతని జీవితాన్నే కొన్నారా అనే సంశయం! ఎందుకంటే, ప్రసాద్‌కు ఎప్పుడూ ప్రత్యేకమైన గది ఒకటి వుంది. గదిలో చుట్టూ వున్న బీరువాల్లో అన్నీ లా పుస్తకాలే. మధ్య ఒక టేబిలు, కూర్చుని చదువుకునేందుకు ఒక రివాల్వింగ్ కుర్చీ, గదిలోనే ఒకపక్కన అతను పరుండే మంచమూ అమర్చబడివుంటయ్. ప్రసాద్ ఇంటిదగ్గర ఉండేకాలంలోని అత్యధిక భాగాన్ని ఆగదిలోనే గడుపుతూంటాడు. రాత్రులు చాలా సేపటివరకూ మేలుకొంటాడు. ఒక రాత్రివేళ మెలకువ వస్తే లేచి కూర్చొని మళ్లీ లాపుస్తకాలు తిరగేస్తూంటాడు. ఆగదిలోనే తన జీవితరహస్య మంతా దాచబడినట్టూ, తన ఆశయసిద్ధికై ఆ సమాధికన్న ఇంకోమార్గం లేదన్నట్టూ అతను ప్రవర్తించటం ఆమెకు కొత్తకాదు. అలాంటి తన భర్తకు తీరుబడి వుంటుందని ఆమె ఎలా అనుకోగలదు ?

"మేం వెళ్తాం" అంటున్నాడు కుర్రాడు.

మొదటినుంచీకూడా తనకు ఏవస్తువైనా కావాలంటే, ఏకోర్కయినా తీరాలంటే—తన మామూలు పాటను ఎక్కువగా పాడి, యీ మొత్తని తలిదండ్రుల దగ్గర్నుంచి ఏవిధంగా పొందాలో కుర్రాడికి బాగా తెలుసు. అందుకనే, ఇక విధిలేక, ఆమె "సరే ... వస్తాను, ఉండు" అని లోనికి వెళ్లింది.

ఆమె తిరిగివచ్చేప్పటికి కుర్రాడు గదిలో లేడు. బైటికి రాగానే ఆమె ఆశ్చర్యపడ్డది. కుర్రాడు డ్రైవరుభుజాలమీద ఎక్కి, హారన్ వాయిస్తూ, స్టీరింగు తిప్పుతున్నాడు.

ఆమె కోపంతో "సరిగ్గా కూచోలేవూ ?" అంది.

కాని వేణు తన స్థానాన్ని చూడమన్నట్టు, డ్రైవరుభుజాలమీద సవారీచేస్తూ నవ్వుతున్నాడు.

"నీకే. చెప్పేది!"

ఆ 'నీకే' అనే మాటను ఆమె ఎవరిపరంగా ఉపయోగించిందో కాని, డ్రైవరుమాత్రం దానికి వెంటనే చలించి, కుర్రాణ్ని ఎత్తి వెనుక సీటులో కూర్చోపెట్టాడు.

ఆమె ఏమనేందుకూ సాహసించలేక, పెదిమలు బిగపట్టుకొని కుర్రాడిపక్కనే కూర్చుంది.

"ఎక్కడికి అమ్మగారూ?"

"బీచికి—" విసురుగా సమాధానం చెప్పి, ఆమె పక్కకు చూడసాగింది. కారు బయలుదేరింది. ఆమె భరించలేనంత వేగంతో కారు పోతూన్నా, అతనితో మాట్లాడాల్సి వస్తుందని, ఊరుకుంది.

కారు సముద్రతీరాన ఆగింది. కాని మనుషులు పోగై, రేడియో వింటూనో, పప్పులు తింటూనో — గాలి పీలుస్తూ ఆనందించే మామూలు స్థలం కాదది. ఊరిబైటగా వున్న సముద్రతీరప్రదేశం. కారు ఆగగానే ఆమె ఉలిక్కిపడి, "ఫానీ—" అంది.

"ఇదే బీచ్"

ఈమాట వినగానే కుర్రాడు సంతోషంతో సముద్రం ఒడ్డుకు పరుగెత్తుకువెళ్లి ఒక్కడూ పిచ్చికగూళ్లను కట్టే సన్నాహంలో ఉన్నాడు.

ఆమెకు అతని సమాధాన మేమీ బాగుండలేదు. అంది: "ఇదా? ఇక్కడ మనుషు లెవరూ లేరే?"

"మనం మనుషులం!"

ఆమె నివ్వెరపోయింది. అత నన్న మాటకన్న అతని కంఠధ్వనే ఆమెకు కఠోరంగా వుంది.

"ఏమిటీ?" అంది, ఆశ్చర్యాన్ని తగ్గించుకుంటూ.

"మనం మనుషుల మేగా?"

తనను ఇంత తేలిగ్గా తీసుకునే ధైర్యం అతనిలో వుంటుందని ఆమె కలనైనా ఊహించలేదు. తనతోటా సరసం? అతనికి మతేమన్నా పోయిందా? పిచ్చివాడా? తనదగ్గర నెలజీతానికి పడివున్న డ్రైవరు—తన మాటను ఆజ్ఞగా శిరసావహించాల్సిన ఇతను ఇలాగా మాట్లాడటం ?

ఆమె ఎంతో కోపాన్ని తెచ్చుకోవాలని ప్రయత్నిస్తోంది. కాని, ఆమెకోపంకన్న ముందుగానే అతని మాటలు బైటపడినయ్.

"నన్ను గుర్తుపట్టావా కల్యాణీ?"

ఆశ్చర్యంతో ఆమెవాక్కు మూగవోయింది.

"నేను...శర్మను; నా పెద్దపేరును కత్తిరించి నువ్విచ్చిన చిన్నపేరునే వ్యవహరించుకుంటూన్న నీ పాతస్నేహితుణ్ని! పన్నెండుసంవత్సరాల వెనుక... ఒక వ్యక్తిని–ఇంకా గుర్తురాలేదా?"

ఆమె కొన్నినిమిషాలవరకూ శిలాప్రతిమ అయిపోయింది. అతను పైవిగంగా మాట్లాడేందుకు కారణం ఆమెకు అర్థమవసాగింది. మెల్లిగా పన్నెండేళ్ల నాటి చరిత్రను జ్ఞాపకంచేసుకునేందుకు ప్రయత్నించింది. ఔను...పన్నెండేళ్ల నాటిమాట: ఆస్నేహితం తనెల్లా మరిచిపోగలిగిందోకూడా ఇప్పుడు తనకు ఆశ్చర్యంగానే వుంది...శర్మవైపు ఒక్కసారి పరీక్షగా చూసింది—ఎంత మారిపొయ్యాడు! ఆనాడు- మర్నాడు తన వివాహమనగా విశాలప్రపంచంలోకి, ఎవరికీ తెలియకుండానే వెళ్లిపోయి యీనాడు ఇంతమార్పుతో ఇక్కడ తేలాడు! కాని మళ్లీ తన జీవితంలో అతను ఎదురౌతాడని ఎన్నడూ ఊహించనైనాలేదు.

జీవితంచేత ఓడించబడి, నిరాశలకు కుంగికూడా, ఏదో చెప్పుకోలేని, కనీసం ఊహించుకోలేని ఆశలతో లోకం ఒత్తిళ్లకు వాడిన అతని ముఖం! ఆరోగ్యం కూడా చెడినట్టు సాక్ష్యమిచ్చే అతని కళ్లు! 'బతకటం దేనికి?' అన్నట్టు పరుసుగా చూసే అతని చూపు!—ఎంత మార్పు?

ఇంతవరకూ యీశర్మమీద ఆమెకు కలిగిన నిర్లక్ష్యతంతా ఎగిరిపోయింది. కారణంలేని ఆమె భయంకూడా పోయి, దాని స్థానంలో సకారణమైన కొత్తభయ మొకటి లోతుగా పాతుకుపోయింది.

ఒకనాడు అతను–తన జీవితపుటాశలన్నింటినీ తన చేతిలో చిక్కించుకొని, తనకు అందని కొమ్మకు వెళ్లిపొయ్యాడు. తనెలా బతకాలో అర్థంకాక బాధపడ్డ ఆ నాలుగుసంవత్సరాలూ ఎలా గడిచయ్యోకూడా ఇప్పుడు చెప్పలేదు...కాని అది తనకు కనిపించకుండా ఎక్కడో ఆహృదయంలోనే రహస్యంగా దినదినాభివృద్ధయి–ఈక్షణాన ప్రదర్శించిన ఆ భయంకర రూపమే ఆమెభయానికి కారణం.

ఆమెగుండె తను లెక్కపెట్టలేనంత వడిగా కొట్టుకోసాగింది. ఆ హోరు సముద్రుడిదో, తన హృదయానిదో కూడా ఆమెకు తెలియటంలేదు.

"జ్ఞాపకం లేదా?" అన్నాడు శర్మ మళ్లీ.

ఆమె యీలోకంలోకి దిగి, మెల్లిగా తలెత్తి చూసింది. కాని, సమాధానం చెప్పే ధైర్యం ఆమెకింకా కలగలేదు.

"ఎందుకు జ్ఞాపకముంటుందీ? ఒకనాడు నా పాదాలదగ్గర పడి, ప్రకృతి లిఖించిన ప్రేమభిక్షకోసం వేడుకున్నదానివి! ఇప్పుడు నేను నీ పాదాల దగ్గరి సేవకుణ్నయ్యాను...రోజు లెంతపని చెయ్యలేవు! ఈ అత్యున్నతస్థానాన వున్న నీకు, అధఃపాతాళాన వున్న నేను కనిపిస్తానా?"

నవ్వుతున్నాడు—నిర్లక్ష్యంగా. ఆనవ్వు ఆమె శక్తులన్నింటినీ కదిపింది. పన్నెండేళ్లనాటిజ్ఞాపకాలన్నీ ఆమెకళ్లల్లో మెరిసి, మూలమూలలనుంచి తను ఎనిమిదేళ్లుగా ఎరగని కన్నీటిని కూడబెట్టుకొస్తున్నాయ్.

సముద్రంవైపు చూసింది — కుర్రాడు తయారుచేసిన పిచ్చికగూటిని సముద్రపుటల మింగేసింది. వాడు అంతటితో ఆశ వదలక కొంచెం ఇవతలికి వచ్చి మళ్లీ గూడు కట్టుకునే ప్రయత్నం చేస్తున్నాడు. తన జీవితం కూడా అలాటి ప్రమాదమైన సముద్రపుటొడ్డునే వుంది; ఒకనాడు సౌఖ్యపడదామని ఆ ఒడ్డున మేడలు కట్టుకుంది. కాని లోకమో, తన రాతో ఆ మేడల్ని మింగికూర్చుంది. ఆ సమయాన, ఆ విచారంలోకూడా ఆమె పట్టు విడవక ఇంకో ప్రదేశానికి మారి మళ్లీ ఆశాసౌధాల్ని నిర్మించుకుంది. ఇవి మొదటిసారికన్న జాగ్రత్తగానూ, అనుభవపూర్వకంగానూ కట్టుకున్నవనీ, వీటి కిక చలనం వుండదనీ ఆమె అపోహపడ్డది. కాని యీ క్షణానికి మళ్లీ యీశర్మ ఒక పెద్ద అలగా తయారై ఏళ్లపర్యంతమూ స్థిరంగా వున్న తన మనశ్శాంతిని బెదిరిస్తున్నాడు. ఎప్పటి కప్పుడు నిర్మించుకునే ఆశతో ఆమె వాటి భద్రతకు జాగ్రత్తపడాలి.

కుర్రాడికి విసుగుపుట్టి తల్లిదగ్గరికి పరుగెత్తు కొచ్చాడు. ఇప్పటికీ ఆమెకంటినుంచి నీరు కారు తోంది. కుర్రాడి రాకను ఆమె చూసినట్టయితే తన బాధను వాడికి తెలియకుండా చేసుకునేది.

వాడు ఇసుకచేతుల్ని దులుపుకుంటూ, "అమ్మా! ఏడుస్తావెందుకూ?" అని అడిగాడు. ఇంతవరకూ తల్లి ఏడవటాన్ని వాడు చూడలేదు. ఏడు పనేది చిన్నతనంలో తనలాటి కుర్రాళ్లు కుండాల్సిన లక్షణమనీ, పెద్దవాళ్లు ఎన్నడూ ఏడవనే ఏడవరనీ వాడి అభిప్రాయం.

ఆమె చప్పున తేరుకొని, కన్నీళ్లు తుడుచు కుంది. తల్లి సమాధాన మివ్వకపోవటం చూసి, కుర్రాడు సాలోచనగా డ్రైవరువైపు చూశాడు. కాని డ్రైవరు మొహంతిప్పించి, సముద్రుడు ఆకా శంతో స్నేహం సంపాయించుకోగలుగుతూన్న ప్రదేశంవైపు చూస్తున్నాడు.

"ఏమమ్మా?" అన్నాడు కుర్రాడు మళ్లీ.

దుఃఖంతో పూడుకుపోయిన గొంతును సరిచేసు కుంటూ, "ఏం లేదు నాయనా! కంట్లో ఇసుక పడ్డది — ఇక వెళ్దామా?" అంది.

కుర్రాడు యీ మాటను నమ్మాడు. తల్లి కేదో కష్టంగా వుందని చప్పున కారెక్కి కూర్చొని "పోనీ" అన్నాడు. కారులో కల్యాణి కుర్రాణ్ణి తన ఒళ్లో కూర్చోపెట్టుకొని, వాడి తలమీద తన గడ్డాన్ని ఆనించి కళ్లతో ఎవర్నో, దేనికో ప్రార్థి స్తోంది. కారు ఇంటికి వచ్చేటంతవరకూ శర్మేమీ మాట్లాడలేదు కాని, ఆమె బాధపడట మంతా ముం దున్న అద్దంలో చూస్తూ అర్థం చేసుకుంటూనే వున్నాడు.

కల్యాణి బాగా చీకటిపడేవరకూ భర్తఎదుట పడకుండా ఎలాగో తప్పించుకు తిరగగలిగింది.

3

ఆ రాత్రి ఆమె పడుకుందన్నమాటేకాని, ఆ పక్కలో మెత్తదనమే లేదు. ముళ్లమీద పడు కున్న ట్టనిపించింది. చాలాసేపటివరకూ అటూ ఇటూ దొర్లి, తరువాత పక్కలో లేచి కూర్చొని తరగని ఆలోచనలో పడ్డది.

శర్మ! ఒకనాటి తన ప్రియుడు శర్మ! లోకమూ, విధీ అనుకూలంగా వున్నట్టయితే, తను యీడ్రైవరు భార్యకావాల్సింది! ఆశర్మ మళ్లీ తనకు ఎదురయ్యాడు. విధి ఎంత కఠినమైంది! అసలు అతను తనకు జీవితంలో కనిపించకపోయినట్టయితే—మృత్యువువాత పడివున్న ట్టయినా తన కీబాధ తప్పేది! కనిపించినవాడు తనను తాను ఎరుకపరుచుకోకుండా వున్నా సరిపో య్యేది. కాని అతను సరిగ్గా తనేవిషయమై బాధ పడగలదో—ఆవిషయాన్నే అమితగురితో కొట్టాడు.

పన్నెండేళ్లలో శర్మ ఎంత మారిపోయ్యాడు! ఏరోజు కారోజు తనకు తెలియకుండానే తనుకూడా పూర్తిగా మారిపోయిందేమో? ఈనాడు అతనిపైన తను ఎంత అధికారాన్ని చలాయించింది! ఏమను కున్నాడో? బాధపడ్డాడుకాబోలు! ఇంకా బాధ పడుతూనేవున్నాడేమో? తన హృదయంలో తన ఎరుక లేకుండానే ఎంత కరుకుదనం అణిగివుంది!

ఆరోజులు - సంవత్సరాల వెనుకటి రోజులు - అవి తన జీవితంలో మధురతమదినాలని భ్రమపడ్డ రోజులు! ఆ వెన్నెలరాత్రులు — నిద్రాముద్రిత లోకాన్నంతట్నీ మోసంచెయ్యగలిగాననే ధీమాతో, అనధికారంగానైనా సౌఖ్యాన్ని అనుభవించగలుగు తున్నాననే తృప్తితో — పరిణామమేమో ఆలో చించేందుకైనా వ్యవధిలేని సంతోషంతో నిండిన హృదయంతో గడిపిన కమ్మటి రాత్రులు! బీద రికానికీ, సౌఖ్యానికీ లంకె లేదనే న్యాయాన్ని గ్రహించిన ఆరోజులు ఎలా మరిచిపోగలిగింది తను?

"శర్మ మంచివాడు" అనీ, "శర్మ అందమైన వాడు" అనీ, "శర్మ బాగా పాడగలడు" అనీ ఇరుగు పొరుగు అమ్మలక్కలు అనుకుంటూంటే తను విని ఆనందపడ్డ రోజు లవి! శర్మమినహాగా లోకమే లేదనే అభిప్రాయపడ్డ దినా లవి! అప్పుడు అంత ప్రేమపాత్రుడైన శర్మ నిజంగా యీనాడు తన కన్నెరకు ఎలా గురికాగలిగాడు? నిజంగా అతన్ని తను ప్రేమించిందా? ప్రేమించగలిగిందా? ప్రేమిం

చకపోయినట్టయితే - ఒకనాడు కాదు, రెణ్ణాళ్లు కాదు — నాలుగువసంతాలపాటు అహోరాత్రాలూ తన ఆశలన్నీ ఇంకిపోయినట్టు ఎలా బాధపడ్డది! జీవితం ఎంత వింతవస్తువు!

అతను మాయమైనప్పటినుంచీ, తను కాపరానికి వచ్చిన ఆర్నెల్లలోనూ, తన ప్రియసఖులు, తన మూలానే శర్మ పిచ్చివాడై దేశాలపాలయ్యాడని అనటాన్ని అనేకసార్లు తను విన్నది. ఒకప్రాణిజీవితాన్ని — తనహృదయాన్ని అర్పించుకున్న మానవుడి బతుకును పాడుచేసిన తన రాక్షసత్వాన్నిగూర్చి ఆమె ఆడిపోసుకుంది. శర్మఅభివృద్ధికై వేయిదేవుళ్లకు మొక్కుకున్న రోజులు అనేకం వున్నయ్.

అలాంటి జీవితాన్ని కాలచక్రం తనకు తెలియకుండానే మెల్లిగా వెనక్కు నెట్టేసి, తనకు బదులు ఆనందాన్నిచ్చి మనశ్శాంతిని ప్రసాదించింది. కాని యీనాడు ఘట్టబలవంతాన ఆతలపుల్ని ఎంత తొక్కిపెడదామన్నా ఆమెకు సాధ్యమవటం లేదు. అనుకోకుండా జరిగేవి అనుకుంటే జరగవుకాబోలు!

ఈ ఆగని ఆలోచనలు ఆమెవెచ్చనికన్నీటిని పరీక్షించుకుంటున్నయ్. బాధతో కార్చినకన్నీ రెరిగి ఆమెకు ఎనిమిదిసంవత్సరాలైంది! మళ్లీ అది యీనాడు!— తనెందుకు బాధపడటం? ఎవరికోసం? ఇన్నివసంతాల వెనకటి జీవితాన్ని మరిచిపోతే ఎంత బాగుండును!

గడియారం పన్నెండుగంటలు కొట్టింది. ఆమె చప్పున ఆశబ్దంతో తన స్థితిని తెలుసుకొని, ఇలా ఆలోచించటం అనవసరంగా తనకు తను బాధను కొనితెచ్చుకోవటమే అవుతుందని ఎలెక్ట్రిక్ లైటు ఆర్పి గట్టిగా కళ్లు మూసుకొని పడుకుంది. కాని ఆమెకది కష్టంగా తోచి, వెంటనే కన్ను తెరిచింది. గదినంతట్నీ ఆక్రమించుకున్న చీకటిలో ఆమెకు భయం వేసింది. ఎవరో తనను కనపడని తావుల్నుంచి ఒత్తిడిచేస్తూన్నట్టనిపించింది. పైని కప్పుభారమంతా తనే మోస్తూన్నట్టనిపించింది. ఆస్థితిని భరించలేక, వెంటనే మళ్లీ లైటువేసింది.

ఇక తను నిద్రకు నోచుకోలేదు. జీవితంలో అనేకకష్టాలకు గురై, అన్ని ఆశల్నీ వదులుకొని, జీవితంమీద రోతపుట్టి, మృత్యుదేవత శాంతినిమాత్రమే మానవుడు కోరకుండా - ఈచిన్ననిద్రలో ఆబాధల్ని కొంతవరకూ మరిచిపోగలిగేట్టు చేస్తే, తెల్లారగానే మళ్లీ తనతోడి ఆటకు కొత్తగా తయారౌతాడని విధి ఏర్పరిచిన యీనిద్ర! కాని తన శర్మనుగూర్చి ఆలోచించేందుకూ, నిద్రకూ పొత్తు పొసగదు. మరీ యీశర్మ తన కళ్లఎదుట తారట్లాడుతూంటే అతన్ని గూర్చి ఆలోచించకుండా ఉండటం ఎలా సాధ్యం? మరి తన కర్తవ్యం?

ఈశర్మను ఇక్కణ్నుంచి వెళ్లగొడితే? పాపం-తిండికై ఇక్కడకు, తమపంచన జేరినవాణ్ని ఇంకోచోటు చూసుకోమనటం! ఐనా తను అతనిలాంటివాళ్లమీద ఎంతమందిమీద తన దయను చూపగలదు? కాని అతను యీప్రదేశంలో లేకపోతే ఎప్పటివలెనే తన మనశ్శాంతి మళ్లీ ఏర్పడుతుంది. అతను వెళ్లకుండా ఇంకేఉపాయమూకూడా లేదాయె. కాని అతన్ని ఏతప్పుమీద, ఏవంకమీద వెళ్లగొట్టగలదు? ఈసాయింత్రమే అతన్నిగూర్చి మంచి అభిప్రాయాన్ని భర్తముందు బైటపెట్టింది. తండ్రీకొడుకులకుకూడా అతనిపైని అభిమానం ఏర్పడ్డది. మరి ఇంకేకారణాన్ని తను చూపాలి?

“ఇంకా నిద్రపోలేదా?”

ఆమె ఉలిక్కిపడ్డది. భర్తవైపు తిరుగుతే వెలవెలపోతూండే తన ముఖాన్ని అతను గుర్తిస్తాడేమోననే భయంతో, వేరొకదిక్కు చూస్తూ సమాధానం ఇచ్చింది: “లేదు...తలనెప్పిగా వుంది—మీరో?”

“నేను రాసుకుంటున్నాను...మందేమీ వాడలేదా?”

“వాడాను—తగ్గుతోంది. కాస్త ఆగి పడుకుంటాను”

భర్త తిరిగిపోతూన్న అడుగులచప్పుడు వినేదాకా వెనక్కు తిరిగిచూసే ధైర్యం ఆమెకు కలగలేదు. పక్కనే మంచంమీద కుర్రాడు, తన కీలోకంతో యీసమయంలో ఏమీ పట్టనట్టు హాయిగా

నిద్రపోతూన్నాడు. తనను "ఎందు కేడుస్తున్నావమ్మా?" అని అడిగిన ఏకైకప్రాణి! జీవితంలో పెద్దఏప్పుల సమయాలున్నయ్యాని వాడి కింకా తెలియదు. తన తల్లిఅందమైన పెద్దకళ్లు తన ఆటల్ని చూసి ఆనందించేందుకని భ్రమపడుతున్నాడుకాని, హృదయారాటాన్ని వెలిబుచ్చుకునే కన్నీటికని వాడు ఎరగడు. ఎంత అమాయకుడు!

తనకు కావాల్సింది సాధించేందుకు కాస్సేపు తల్లిదండ్రులదగ్గర రాగాలాపన చేస్తే వాడి కోరిక తీరుతుంది. కాని తను, తనలాటి నిర్భాగ్యమానవులు — ఆవిధిముందు బతుకంతా ఏడుస్తూ కూర్చున్నా జీవితంలో కావాల్సింది రాదనే సంగతి వాడసలు ఊహించగలడా? —

ఇప్పటికి దాదాపు తెల్లవారుజామయింది. కుర్రాణ్ని తనపక్కమీదికి లాక్కొని, నీటిలో పడ్డ వ్యక్తి చేతికి దొరికిన కర్రను వదలనట్టు వాడిమీద చెయ్యి వేసుకొని, లైటుతీసే ధైర్యం లేక అలాగే పడుకుంది. ఎప్పుడు నిద్రపట్టిందోకాని, తెల్లారి కుర్రాడు లేచి "లైటు వెలుగుతోందమ్మా!" అనేదాకా ఆమెకు తెలివి రాలేదు.

౭

తానెవరో కల్యాణికి తెలియపరుచుకున్న క్షణం నుంచీ శర్మకూడా అనేక కొత్తసమస్యల్ని ఎదుర్కొన్నాడు. ఆమెకన్న అతను తక్కువగా మనశ్శాంతిని పోగొట్టుకున్నాడనేందుకూడా వీల్లేదు.

కల్యాణి! ఏ మధురమూర్తిని భార్యగా చేసుకొని, జీవితమంతా సౌఖ్యపడదామని ఓడిపొయ్యాడో, ఏ ఓటమిత్తో తను దారంతెంచుకొని గాలికరుణకు వదలబడ్డ గాలిపటంలాగు లోకంలో ఒకమూలనుంచి ఇంకోమూలకు తరుమబడుతున్నాడో, ఏస్త్రీకోసం తనను తను గుర్తించుకోలేక లోకులు కనిపెట్టలేని పిచ్చివాడయ్యాడో—ఆకల్యాణి యీనాడు తనకు యజమానురాలు! పూర్వం తను ఆరాధించింది యీకల్యాణినే. కాని ఆమెహృదయంలో స్థానాన్ని ఏర్పరచుకొని ఇద్దరి మధ్యా భేదం లేదనే గాఢనమ్మకంతో పూజించిన స్త్రీ ఆమె! కాని యీమెను, విలువైన దుస్తులున్నంతమాత్రాన, తనను పోషిస్తూన్న వంకమీద, తన సేవను తనకు ఇష్టంలేకున్నా దబాయించి పుచ్చుకోగల మనిషిని ఆరాధించవలసివచ్చింది. తనతోడి స్నేహాన్ని ఆశించి, ఇంత విశాలప్రపంచంలో తనొక్కడే అర్హుడయినట్టు, తన వ్యక్తిత్వ మొక్కటే తను కోరే జీవితపు కోర్కెఅయినట్టు ప్రవర్తించిన ఆడుదాని దగ్గర సేవ! విధి ఇంతకన్న కఠినరూపాన తనకు కనపడలేదేమో?

కల్యాణికీ, తనకూ మధ్య వున్న ప్రతి చిన్న భేదమూ అతన్ని బాధించసాగింది. ఆమెగౌరవమూ, ఆమె హాయిగా బతకటమూ, ఆమెఐశ్వర్యమూ, చివరికి ఆమెస్త్రీత్వమూకూడా అతనికి భరించరానిదైంది. దీని ఫలితంగా ఆమెమీది ప్రేమంతా వెంటనే రంగు మార్చుకొని ఈర్ష్యరూపాన తయారైంది. తనకే పరిస్థితులు అనుకూలించినట్టయితే — కనీసం యీఒక్క కల్యాణి తనమాటను తోసేసిఉండకపోయినట్టయితే— ఆమె ఈసరికి తన భార్యఅయి తనతోడి అదృష్టాన్నో, దురదృష్టాన్నో పంచుకొని, తన రాకకోసం ఎదురు చూస్తూ, తన అడుగులకు మడుగులొత్తుతూ చచ్చిపడివుండాల్సింది. ఆకుర్రాడితో తనకు యీనాడు కలిగిన ఆ ఆనందమంతా తన స్వపుత్రుడిమీద కలిగివుండాల్సింది! ఈకల్యాణి తనకు మాయమైనట్టే కనిపించి, యీనాడు అందనికొమ్మన కూర్చొని తన మొహంలో నవ్వినట్టనిపించింది.

రాత్రంతా ఆమెగదివైపే చూస్తూ కూర్చున్నాడు. ఆమె గట్టిగోడలవెనుక పడే బాధను అతను ఊహించలేకపోయ్యాడు. ఆమె ఎందుకు బాధపడుతుంది? చావు అనేదానికికూడా తనకు నివాసయోగ్యమైన స్థానాలు తెలుసు. ఆకప్పుకింద తన జీవితాన్నే స్వర్గంగా మార్చుకుంటూ బతుకుతోంది. తన సంగతే ఆమె తలిచిఉండదు. ఆ అవసరంమాత్రం ఆమెలాటి ఉత్తమవంశ్యురాలికి ఎలా వుంటుంది? తన జీవితాన్ని నేలపాలు చేసిన కల్యాణి! ఇన్నాళ్లుగా తను గ్రహించలేని విషయమంతా అతనికి కల్యాణిలో యీరోజున స్పష్టంగా కనిపిస్తోంది. కాని తను మాన

వృద్ధై — ఏమీ చేతకాని దద్దమ్మలాగు ఉండగలదా? ఆమెను — తన అందానికి, తన సౌఖ్యానికి గర్వపడుతూన్న ఆమెను—తనతోపాటే కిందికిలాగి బాధించాలి! అంతవరకూ తనకు మనశ్శాంతి ఉండటం కల్ల! ఆమె సౌఖ్యంకోసం ఒకనాడు తను చేసిన, చెయ్యగలిగిన త్యాగం తన కెంత నష్టమయిందో, ఆమెకు ఎంత లాభమయిందోకూడా ఆమె తలచలేని స్థితిలోకి వచ్చింది.

ఆ రాత్రంతా మేలుకొని శర్మ ఆలోచించిన దానికి ఫలితం—బుసలుకొడుతూ కల్యాణివెంట పడి, తను అనవసరంగా ఇన్నాళ్లూ పడిన బాధలకు ప్రతిఫలంగా ఆమెను తన అదుపాజ్ఞల్లోకి లాక్కోవాలనే నిశ్చయంగా తయారైంది.

మర్నాడు మధ్యాహ్నం—

కల్యాణి ఎందుకోగాని కిటికీలోంచి ఒకసారి కారుషెడ్డువైపు చూసింది. శర్మ దాసీదాని పైట పట్టుకొని లాగుతున్నాడు. అది నవ్వుతూ, నసుగుతూ వేళాకోళ మాడుతోంది. తరువాత ఇద్దరూ కారు షెడ్డులోకి మాయమయ్యారు.

ఆమెఒళ్లు మండింది. శర్మ ఎంత చౌకబారు మనిషిగా తయారయ్యాడు! ఎంత నీచుడు! లోకంలో ఏకాకై బతుకుతూకూడా, లోకాన్ని చూసి భయపడకపోవటమేమిటి? తన శర్మ—అంతకన్న గొప్ప పురుషుడు తనకీ భూమిమీదనే దొరకడనుకున్న శర్మ— ఇలా మారుతాడని తను కలనైనా తలవగలదా?

—కాని తనకు అతనిమీద యీ క్షణాన కోప మెందుకు రావాలి? లోకంలో అనేకమంది ఇతర్ల కళ్ల ఎదుట, కనీసం ఇతర్లకు తెలిసేట్టయినా చేసే నీచ కార్యాల్ని గూర్చి ఆలోచించేవాళ్లయినా లేరే! మానవుడు చేసే పనినే ఈ శర్మ చేస్తే తన కెందుకు యీ బాధాకరమైన ఆలోచన రావాలి? శర్మ ఎవరో, తనెవరో— అతనిమీద తన కెందుకు ఈ యీర్ష్యతో కూడుకున్న జాలి? ఆమెకు ఎంత ఆలోచించినా యీ ప్రశ్నకు సమాధానం తెలియలేదు.

ఏది ఎట్లా వున్నా శర్మను వెళ్ల గొట్టటం చాలా ఉత్తమమైన పని. అందుకు యీ దాసీదాన్ని అడ్డం పెట్టి పన్నాగం పన్నితే? కాని శర్మ తనకు కనబరిచిన నీచతను ఇతర్లకు చూపటానికి ఆమెకు ఎందుకోగాని మనస్సు ఒప్పలేదు. శర్మను డ్రైవరురూపాన జీతానికి కుదుర్చుకున్నారు కాని, ఆ మిగిలిన అతనిలోని మనిషితో తమకు సంబంధం అనవసరమే! అదీ కాక, శర్మ ఇంట్లో అందరి అభిమానాన్నీ సంపాయించగలిగాడు. తను కిందిసాయంత్రమే శర్మను మంచివాడుగా భర్త యెదుట పేర్కొంది; ఈనాడు మళ్లీ తన సిద్ధాంతానికి విరుద్ధంగా మాట్లాడటం తనను తను పిచ్చిదానిగా చేసుకోవటమే! భర్త తనను ఒక్కసారిగా నమ్మలేడేమో కూడా! కుర్రాడు మామూలుగా తన ఆబల్ని డ్రైవరుతో సాగిస్తూన్నా, శర్మకు భయపడి ఆమె వాణ్ణి పిలవటంకూడా మానుకుంది.

పోనీ, తనే కొన్నాళ్ల పాటు యీ ప్రదేశం వదిలిపెడితే? వదిలి ఎక్కడికి వెళ్లేట్టు? ఈ వూరు వచ్చేముందే రెండు నెలలపాటు పుట్టింట్లో గడిపి వచ్చి, మళ్లీ ఇప్పుడే అక్కడికి వెళ్తానంటే అర్థముండదు. అసలు ఇంత సౌఖ్యానికి అలవాటుపడ్డ తన ప్రాణికి ఆ బీదకొంపలో హాయికూడా లేనిమాట నిజం.

ఆ సాయంత్రం—

భర్తబలవంతంమీద, అతనితోపాటే షికారు వెళ్లింది. కారు కిందటిసాయంత్రం ఆగిన ప్రదేశాన్నే ఆగింది. ఆ ప్రదేశాన్ని చూసేప్పటికే ఆమెకు గతించిన బాధాకరమైన ఆలోచనలన్నీ ఒక్కసారి జ్ఞాపకమొచ్చినట్టయింది అప్రయత్నంగా ఆమె లోలోన ఒణకసాగింది.

ఆమెకు శర్మవైపు చూసే ధైర్యంకూడా లేదు. భర్త చెయ్యి పట్టుకొని తన నెవరో లాక్కుపోతారన్నట్టు, ఎంతసేపటికీ అతని దృష్టిలోనే సంచరించేందుకు ప్రయత్నించింది. కుర్రాడు కట్టే పిచ్చికగూళ్ల అందాన్ని భర్తలాగు తను గ్రహించలేకపోయింది. ఆమెలో పనిచేసే ప్రశ్న ఒక్కటే: "శర్మను గూర్చి నే నేం చెయ్యాలి?"

ముగ్గురూ మళ్లీ తిరిగి వచ్చేప్పటికి శర్మ స్టీరింగుమీద తలవాల్చి నిద్రపోతున్నాడు. మూసి

వున్న అతని కళ్లనుంచి రెండుమూడు నీటిబిందువులు కింద పడేందుకు సిద్ధంగా ఉన్నయ్.

ప్రసాద్ ఇది చూసి, భార్యనూ కొడుకునూ అవతలికి తీసుకువెళ్లి, "అతను లేచేదాకా, కాస్సేపు కూర్చుందాం" అన్నాడు. కుర్రాడు మళ్లీ తన ఆట ప్రారంభించాడు.

ప్రసాద్ ఒకసారి జాలిగా కొరువైపు చూసి, "నిర్భాగ్యుడు! ఒకప్పుడు బాగా బతికినట్టున్నాడు. ఏనాటి ప్రియురాల్నో తలుచుకొని ఏడుస్తున్నట్టుంది." అన్నాడు.

కల్యాణి యీ మాటకు తనకు తెలియకుండానే కంపించింది. భర్తకుకూడా తన రహస్య మేమిటో తెలిసిపోయిం దనే కొత్తభయ మొకటి ఆమెకు కలిగింది. వెంటనే ప్రసంగం మార్చేందుకు, "చదువు లేక కుర్రాడు చెడిపోతున్నాడు –" అంది.

"ఔను ... నేనూ అదే ఆలోచిస్తున్నాను. త్వరలోనే ప్రైవేటుమాష్టర్ని కుదర్చాలి."

ఆ విధంగానన్నా కుర్రాడు శర్మబారినుంచి బైటపడతా డనే ఆమె కొక తృప్తి! నీలాకాశం అంతులేని సముద్రపునీటిలో తన పాపను చూసుకుంటూన్నా, ఆమెకు ఆనందం కలగలేదు.

౫

పసిపట్టి అతిప్రయాసకు ఓర్చి చాలా దూరంనుంచీ తరుముకువచ్చి తన ఆహారంకోసం ఆత్రుతపడుతూ కాచుకుకూర్చున్న వన్యమృగంలాగు–శర్మ కల్యాణితో మాట్లాడే సందర్భంకోసం ఎదురుచూడసాగాడు. ఆమె ఇదివరకులాగు బైటకనిపించటం మానేసింది. రోజులో హఠాత్తుగా ఎప్పుడో రెండు మూడుసారులు మెరుపు మెరిసినట్టు కనిపించీకనిపించకుండానే మాయమయ్యేది. కుర్రాడుమాత్రం ఆటలకు విడువకుండా వస్తున్నాడు. తన కసలు ఆ ఆటలమీది ఉత్సాహం క్షీణించినా, కుర్రాడిద్వారా కొంత ఇంటిగుట్టు తెలుస్తుందనే అభిప్రాయంతో శర్మ ఉత్సాహాన్ని నటించసాగాడు.

మధ్య మధ్య, "అమ్మగారు కోప్పడతారు" అనేవాడు—ఆ 'అమ్మగారు' తన కెంత ముఖ్యమో తెలియజేస్తున్నట్టు.

"ఫర్వాలేదు."

"అమ్మగారు ఏం చేస్తున్నారు?"

"చదువుకుంటోంది" అనో, "పడుకుంది" అనో సమాధానం వచ్చేది. ఇంతకన్న విడమర్చి యీ కుర్రాడిద్వారా తెలుసుకోవాల్సిందికూడా శర్మకు కనిపించలేదు.

పోతే, దాసీదానిద్వారా తనకు అందే వార్త – "కూర్చున్నారు; ఏదో ఆలోచిస్తున్నట్టున్నారు". ఆ ఆలోచన దేన్నిగూర్చో తెలుసుకోవాలని శర్మకు వుందికాని, గట్టి శరీరం వొకటి అడ్డమవటంవల్ల అది సామాన్యమానవుడైన శర్మకు అతీతమైంది.

దాసీదానిదగ్గర్నుంచికూడా తన గుట్టు బైట పడకుండా ఇంతకన్న విశేషాలు లాగటం శర్మకు సాధ్యపడటం లేదు. రాత్రిళ్లుమాత్రం ఆమె గదివైపే చూస్తూ కూర్చునేవాడు. బాగా పొద్దుపొయ్యేవరకూ గదిలో లైటు వెలుగుతూనే వుండేది. లోపల జరిగే నాటకాన్ని అతను తన ఊహకు తోచినట్టుగా ఆలోచిస్తూండేవాడు. ఆ గట్టిగోడలవెనక వున్న ఆ లైటే తనకు అందరాని వస్తువయినట్టు, దానితోపాటే తనూ మేలుకోవటం నేర్చుకున్నాడు. పిచ్చిశర్మకు గదిలోంచి నవ్వు వినిపిస్తూన్నట్టనిపించేది. ఆమె ఆనందిస్తోందన్న తలపు వచ్చినప్పుడల్లా అతని గుండె మండిపడేది. వెంటనే తన జీవితంలో ముప్ఫయి నాలుగు వసంతాలు గడచిపోయినసంగతి ఇప్పుడే తెలుసుకున్నట్టుండేది. తనకు ఏ మంచి అనుభవమూ లేకుండానే జీవితం పూర్తికాబోతోంది కాబోలు! ఇప్పటికైనా తను మేలుకోకపోతే – ఇక లాభంలేదు! ఒకొక్కసమయాన ఐనా కిటికీదాకా వెళ్లి గదిలోకి ఒక్కసారి చూద్దా మనిపించేది! కాని శర్మకు దమ్ములు చాలేవికావు!

శర్మ రాత్రిళ్లుకూడా కొరుషెడ్డులోనే పడుకుంటున్నా డన్నసంగతి తెలుసుకున్నప్పటినుంచీ

కల్యాణి తనకు కనపడని దయ్యమేదో తనను ఎల్లవేళలా వెన్నాడుతూన్నట్టు భయపడసాగింది.

ఒకనాటిసాయంత్రం మెల్లిగా యీప్రస్తావనను భర్తదగ్గర తెచ్చింది.

"అతనికి ఇల్లు లేదా?"

"ఎవరికీ?"

"డ్రైవరుకు"

"ఏమో—నేనాసంగతి అడగలేదు. ఇల్లుంటే, పాపం, ఇక్కడెందుకు పడివుంటాడు? జీవితంలో పెద్ద దెబ్బ తిన్నట్టున్నాడు—పాపం!"

ఈవిధమైన సానుభూతి అన్నివైపులనుంచీ శర్మ సంపాయించుకోగలగటం ఆమెకు ఏమీ ఇష్టంలేదు. కాని భర్తతో ఏమన్నా గట్టిగా చెప్దామన్నా ఆమెకు నోరాడడం లేదు.

వారంరోజులు గడవకముందే కల్యాణి బాగా మారిపోయింది. తల తిరిగిపొయ్యేటంత ఆలోచనాభారమంతా ఆమెముఖంలో ప్రతిఫలించేది. రాత్రిళ్లు ఎక్కువసేపు మేలుకుంటూండటంవల్ల ఆమెమెరిసే కళ్లలో ఎరుపురంగు గొప్పస్థానాన్ని ఆక్రమించుకుంది. దుస్తులు ధరించటంలోనూ, తల దువ్వుకోవటంలోనూ, ఇతరకాలకృత్యాల్లోనూ ఆమెకు శ్రద్ధ తగ్గింది. జీవితంలో ఏ ఇతరవిషయమూ తనదగ్గర ప్రాముఖ్యతను సంపాయించుకోలేదనే అనుమానం ఆమెకు కలగటంలోకూడా ఆశ్చర్యం లేదు. ఎప్పుడూ నిర్లక్ష్యంగా, అన్యమనస్కంగా తన భార్య తిరుగుతూఉండటం ప్రసాద్‌కూడా కనిపెట్టాడు.

ఒకనాడు అడిగాడు: "నీ ఆరోగ్యం సరిగ్గా లేదా?"

"లేకేం?" అంది—తనకు చేతనైనంతగా నటిస్తూ.

"ఎప్పుడూ పరాకుగా ఉంటావేం?"

"ఏం — లేదు"

"నీ కిక్కడ బాగా లేదు—"

"బాగానే వుంది"

"మరి—?"

ఆమె మాట్లాడలేదు. సమాధానం ఎలా చెప్పాలో ఆమెకు తెలియలేదు.

"ముఖమంతా పాలిపోయింది. కళ్లలో చలాకీతనమే లేదు. బహుశా నీ కీనీళ్లు పడలేదేమో?"

"పడకేంచేస్తాయ్—కొత్తలో కాస్త ఇదిగా వున్నా—?"

ప్రసాద్ దీనికి కాస్త సమాధానపడ్డాడు. కాని ఏదో బాధతో కల్యాణి మనసు చెడగొట్టుకుంటోందనే అతని అనుమానం తీరలేదు. ఇంతకన్నా నొక్కి అడగటానిక్కూడా అతనికి మనసొప్పలేదు.

"ఎప్పుడూ ఇంట్లో కూర్చుంటావేం? సాయంత్రం కుర్రాణ్ని తీసుకొని షికారు వెళ్లరామూ?"

తన మనసు బాగుచేసే సాధనాల్లో ఇదొకటని భర్త నమ్మాడు. కాని ఇది తనకు ఎంత బాధాకరమో, ఎందువల్ల తను దీనికి ఒప్పుకునే పరిస్థితుల్లో లేదో ఆమె ఎలా చెప్పుకోగలదు? గత ఐదారేళ్లనుంచి షికారువెళ్లే తన అలవాటునుకూడా భర్త ఆధారంగా తీసుకున్నాడు.

"ఆ సముద్రపుగాలి నాకు బాగుండదు" అంది. దాంతోపాటే తనకు ఇంకా బాగుండనివి ఉన్నా లేనట్టే నటించాలి. జీవితంలో ఎంత నటన వుందో ఆమెఅనుభవంలోకి మరోసారి వస్తోంది.

"పోనీ, సినిమాకు వెళ్లరాదూ? ... సినిమాకు వెళ్లి చాలారోజులైందిగా—ఇవ్వాళ వెళ్దామా?"

ఆమెకూడా తన మనశ్శాంతికోసం కొన్ని కృత్రిమసౌఖ్యాల్ని నిర్మించుకోవాలనే చూస్తోంది. ఇప్పుడు భర్తతో కలిసి సినిమాకు వెళ్లటమంటే ఆమెకు లేనిధైర్యం వచ్చింది. 'సరే' నన్నట్టు తల తిప్పింది.

"సాయంత్రానికి ఇద్దరూ సిద్ధంగా ఉండండి" అని చెప్పి ప్రసాద్ కోర్టుకు వెళ్లిపొయ్యాడు.

సాయంత్రానికల్లా ఆమె కుర్రాడితోపాటే సిద్ధమై, భర్తరాకకోసం ఎదురుచూడసాగింది. ప్రపంచంలో తనకు లేని సంతోషాన్ని ఇతర్ల ముఖాన

చూసి, తనుకూడా ఆ లేని సంతోషాన్ని నటించి కొంతవరకూ మనశ్శాంతి సంపాయించటంకూడా సంభవమే ననే ఊహ ఆమెను వదలలేదు.

మామూలువేళకన్న ఆలస్యంగా వచ్చి, ప్రసాద్, "సిద్ధంగా ఉన్నారా?" అన్నాడు. తల్లీకొడుకు లిద్దరూ ఒక్కసారే తలతిప్పారు.

"కాని...నేను వచ్చేందుకు వీల్లేదు కల్యాణీ! రేపటికల్లా తయారుకావాల్సిన రికార్డు చాలా వుంది... ఐనా ఆశాభంగం లేదులే! నువ్వూ, కుర్రాడూ వెళ్లి రండి" అన్నాడు.

చీకట్లో వెళ్లేందుకు—కాదు, శర్మతోపాటు ఒకేకారులో వెళ్లేందుకు ఆమె భయపడ్డది. అసలు ఒంటరిగా ఈగోడలు అడ్డంఉండబట్టి తనకు తనే బాధపడుతోందికాని, బైటనైతే ఇతర్ల బాధకూడా తనను వేధించేదేమో?

"పోనీండి, రేపు వెళ్లవచ్చు; తొందరేం?"

"ఎందుకూ? ఇంత సన్నాహమూ చేసి, ఇప్పుడు ఆగటం దేనికి? నీ కేంభయం? ఇదివరకు నువ్వు ఒక్క తెవ్వూ ఎన్ని సినిమాలకు వెళ్లలేదు?"

కుర్రాడుకూడా ధైర్యం చెప్తూన్నట్టు, "పోనీ, మనం వెళ్దామే!" అని తల్లికొంగు పట్టుకొని లాగ సాగాడు.

విసుగ్గా కుర్రాడివైపు చూసి, "ఏం—రేపు వెళ్లకూడదా?" అంది.

"ఇవ్వాళైతే నేం?"

"బద్ధకంగా వుంది" అని వంకచెప్పింది.

ప్రసాద్ నమ్మనట్టు నవ్వి, "హాల్లో ప్రవేశంతో అంతా పోతుంది" అన్నాడు.

ఆమె సమాధానంకోసం మాటల్ని వెతుక్కుం టోంది; ఒకొక్కసమయాన మాటలకుకూడా కరువంటూ వుంటుందికాబోలు! కుర్రాడు ఇప్పటికే బిక్కమొగం వేసి యీ చిన్న ఆశాభంగానికి బాధపడసాగాడు.

ప్రసాద్ కుర్రాడిచెయ్యి పట్టుకొని, "పోనీ, అబ్బాయికోసం వెళ్లిరా" అన్నాడు.

కుర్రాడిముఖం చూస్తే ఆమెకు జాలి కలిగింది కాని—శర్మను చూస్తే కలిగే భయంమాటేమిటి?

"వెళ్లు—ఇప్పటికే ఆలస్యమైంది" అని ప్రసాద్ తొందరచేశాడు.

ఆమెనరాలన్నీ లాగుతున్నయ్. తలవనితలం పుగా వచ్చిన యీసంఘటనకు అనుకూలంగా ఎలా మారాలో ఆమెకు అర్థమవలేదు. భర్తనూ, కొడుకునూ సంతోషపెట్టేందుకైనా వెళ్లాలి! ఒకవిధంగా తనకు తనే ధైర్యం చెప్పుకోసాగింది. ఇంతా ఏడుస్తే శర్మ తనకింద జీతానికి పనిచేసేవాడు; ఈమాటను లోక మంతా అవునంటూ తనపక్షాన పలికేందుకు ఎప్పుడూ సిద్ధంగానేవుంది. అతను తన్నేం చేస్తాడని, అతన్ని చూసి-తన నీడకు తనే భయపడ్డట్టుగా—భయపడాలి?

ఈధైర్యంతోనే భర్తవెనకాలే వెళ్లి కారులో కూర్చుంది. ప్రసాద్ "థియేటర్‌కు పోనీ" అని చెప్పి, ఇంట్లోకి వెళ్లిపొయ్యాడు.

కారు బయలుదేరగానే ఆమెను మళ్లీ క్రమంగా భయం ఆవరించసాగింది. అతని కళ్లు! వాటిల్లో సూదంటురాయిగుణ ముంది. అది ఒక్క స్త్రీలనే కాదు, పురుషుల్నికూడా ఆకర్షించగలదు. ఇందుకు తన భర్తా, కుమారుడే ప్రత్యక్షనిదర్శనాలు. ఇన్నాళ్లూ శర్మంటే ఒక పెద్ద అయిష్టతను కల్పించుకోవాలని ప్రయత్నిస్తూనే వుంది. కాని అది తన శక్తులకు సాధ్యమవటం లేదు. మరీ వెనుకటి ఘట్టాలు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా అతనిపైని తను కోరని—కోరకూడని ఇష్టత అతివేగంతో తన హృదయమంతటా వ్యాపించ సాగింది...ఇతనితో వెళ్లటంలో తను సమానబలం గల ఇంకో వ్యక్తితో జీవితసమస్యే తీరే పోట్లాటకోసం వెళ్తూన్నట్టనిపించింది. హాలు చేరేదాకా ఆమె మనస్సు మనస్సులో లేదు.

బాల్కనీలో కూర్చొని హాయిగా సినిమా చూస్తూన్న ఇతర్లవలె ఆమె ఏ ఆనందమూ పొందలేకపోయింది. అసలు ఇంతమంది తమ జీవితంలోని విచారాన్నంతట్నీ యీ కాస్సేపూ మరిచిపోగలిగి, యీ వెధవ సినిమాలో ఎలా ఆనందాన్ని సంపాయించగలుగు

తున్నారో ఆమెకు అర్థమవలేదు. పూర్వం తను ఎలా ఆనందాన్ని అనుభవించగలిగిందో ఆమె ఊహించలేక పోయింది ... కాని, తను పొరపడుతోందేమో? జీవితంలో ఎంత నటన ఉన్నా, ఒక్కో సమయానైనా అది మాయమవుతూవుండాలి. అసలు నిజంగా ఆనందాన్ని అనుభవించే వ్యక్తులుకూడా లోకంలో వున్నారు! అది తనకు దొరక్కపోవటంవల్లనే తనకు ప్రపంచమంతా విచారమయంగా కనిపిస్తోందేమో?

సినిమామీద ఆమెకు దృష్టే లేదు. మనశ్శాంతి డబ్బుతోనే కొనగలిగేదైతే ఎంత బాగుండేది! సగం ఆట అయేప్పటికల్లా కుర్రాడు గాఢనిద్రకు ఉపక్రమించాడు. ఇక యీ సినిమా తనకు తలనెప్పికూడా తెప్పించేట్టుంది. త్వరగా ఇంటికి వెళ్లి ఒంటరిగా మామూలుగా బాధపడటమే ఆమెకు మేలనిపించింది.

బాల్కనీఇవతలికి వచ్చి బైటికి చూసింది. శర్మ కారుమీద కుడికాలు మోపి తన మామూలు దృష్టితోనే ఎదుట వున్న ఎలెక్ట్రిక్ లైటుమీదికి సిగరెట్ పొగ వదుల్తున్నాడు. పాపం! అతని జీవితంలో ఎంత నిర్లక్ష్యత ఏర్పడ్డది! తనకు తెలియని దేనికో బతుకుతున్నట్టుగానూ, తనకీ లోకం చేసిన అన్యాయానికి చేతకానితనాన్నే దీన దృష్టుల్తో చెప్పుకుంటూన్నట్టూ ఆమెకు తోచింది.

మళ్లీ మామూలుమనిషవగానే, కల్యాణి,అతన్ని ఎలా పిలవాలో, ఏవిధంగా మాట్లాడాలో అర్థంకాక అక్కడే నిలబడ్డది. ఐదారు నిమిషాలు కాగానే శర్మ ఉన్నట్టుండి తల ఆమెవైపు తిప్పాడు. వెంటనే సిగరెట్ పారేసి ఆమెవైపు పరుగెత్తసాగాడు. శర్మ చూసిన చూపుకు వెంటనే లోపలికి పోదామని ఆలోచిస్తూన్న కల్యాణి—అప్పుడే తన ఎదుటకు వచ్చి ఆమెఆజ్ఞకోసం వేచి కూర్చున్నవాడిలాగు నిలబడ్డాడు. తనకు శర్మ ఇంత విధేయత చూపటంకూడా ఆమెకు కష్టంగానే వుంది.

తనెందుకు క్షణక్షణానికీ యీ శర్మను చూసి భయపడాలి? అతను తనకు అంత దగ్గరగా నిలబడ్డాక—దూరంగా ఉన్నప్పుడు అతను కలిగించే భయంలో ఇప్పటిది ఒక భాగమే ననేది స్పష్టమైందీ.

పన్నెండేళ్లకూ, ఇప్పటికీ జరిగిన మార్పుల్ని బట్టే నడుచుకోవాల్సిన—కనీసం నటించాల్సిన మానవుల్ని గూర్చి తను ఆపోహపడటంలోకూడా అర్థం లేదేమో!

"ఇంటికి వెళ్దాం... కుర్రాడు నిద్రపోతున్నాడు—" అంది మెల్లిగా, వేరో దిక్కు చూస్తూ.

శర్మ లోపలికి వెళ్లి కుర్రాణ్ణి భుజాన వేసుకొని వచ్చి, వెనుకసీటులో పడుకోబెట్టాడు. కారులో ఎక్కేప్పటికే ఆమెహృదయం మళ్లీ బరువెక్కసాగింది. కారు బయలుదేరే ముందు—ఎన్నాళ్లనుంచో బిగపట్టుకున్న ఊపిరిని వదుల్తూన్నట్టు శర్మ విడిచిన ఆ పెద్దనిట్టూర్పు ఆమెను— ఎందుకనో— మామూలుకన్న ఎక్కువగా భయపెట్టింది.

కారు బయలుదేరింది. కొంతదూరం వెళ్లేదాకా, ఆమెకు అది ఇందాకా వచ్చిన త్రోవలాగులేదు. ఆమెకు ఇంతవరకూ వేస్తూన్న అనుమానమే ఆమెజాగ్రత్తను కాపాడుకోసాగింది.

"ఇంటికి వెళ్లాలి—" అంది కోపంతో కూడిన అధికారస్వరంతో.

కాని ఆమెమాటలకు యీసమయంలోమాత్రం విలువ లేకపోయింది. శర్మ అసలు ఏమాటల్నీ విననట్టే కారు వేగంగా నడుపుతున్నాడు.

ఆమె మళ్లీ మాట్లాడేందుకు శక్తి కూర్చుకునేప్పటికల్లా కారు జనసమ్మర్దప్రదేశాలన్నింటినీ గడిచిపోయింది.

"ఇదెక్కడికి?" అందామె గొంతెత్తి.

"నీతో మాట్లాడాలి" అన్నాడు శర్మ, వెనక్కు తిరక్కుండానే.

ఆమె భయంతో ఒణుకుతూ, లేచి నిలబడేందుకు ప్రయత్నిస్తూ అంది: "ఇప్పుడు కాదు – తరువాత మాట్లాడవచ్చు"

కాని శర్మ వినిపించుకోలేదు. కారువేగం క్షణక్షణానికీ ఎక్కువౌతూనేవుంది:

"జాగర్త – అరుస్తాను" అందామె.

"అరుపా? ఇక్కడ నీ కెవరు పలుకుతారు?"

ఈమాటల్తోపాటే కారుకూడా ఆగింది. తను ఎక్కడ వుందో ఆమెకు తెలియలేదు. కారుముందున్న లైట్లుమాత్రం ముందున్న చెట్లగుంపుల్లో తమకు శక్తి వున్నంతవరకూ వెలుగును చూపుతున్నయ్. అటూ ఇటూ గాంఢాంధకారం ఆవరించివుంది. ఆకాశంలోని నక్షత్రాలూ, కిందిగడ్డిలోని అక్కడక్కడ మెరిసే మిణుగురుపురుగులూ చీకటితో పోట్లాడ లేకపోతు న్నాయ్. ఈ భయంకరప్రదేశంలో ఆమె ప్రాణాని కూడా భయపడ్డది. ఏం చేద్దామన్నా ఆమెకు పాలు పోవటంలేదు. అతనా– తనకన్న బలవంతుడు. తనా– తన కున్న శక్తినంతట్నీ తప్పనిసరిగా దాచుకోవాల్సిన అబల! ఎవరిదగ్గరా ఏమీ చెప్పుకునేందుకైనా వీలులేని పరిస్థితుల్లు! అసలు ఒద్దనుకుంటూనే తను యీ వెధవసినిమాకు ఎందుకు రావాలి? ఇలా తనను అగౌరవించటంలో అతని ఉద్దేశ మేమిటి? తను అరుస్తే ఏమన్నా ప్రయోజనం వుంటుందా? కుర్రాణ్ని లేపటం మంచిదా?...ఇన్ని ఊహలూ కలిసి ఆమెను రెండుమూడు నిమిషాలపాటు నిర్జీవప్రతిమను చేసినయ్.

"నేను నిన్నేమీ చెయ్యను...నువ్వు భయపడ క్కర్లేదు"

ఆమె మాట్లాడలేదు. భయపడి లాభం లేదని తేలిపోయింది. తనకు తనే ధైర్యం చెప్పుకునేందుకు ప్రయత్నిస్తోంది. తీరా నీళ్లల్లోకి దిగాక మాయమయ్యే చలిలాగు, ఆపద ఇంత సమీప మయ్యేప్పటికి, ఆమె భయంకూడా క్రమంగా క్షీణించమొదలిడింది.

"నన్ను మరిచిపొయ్యావ్ కదూ?" అన్నాడు.

ఎంత మధురంగా అడిగాడు! తన బాధకు దేనికో అతను కనిపెట్టిన మందులాగుంది ఆ కంఠం!

ఆమె తనకు తెలియకుండానే మాట్లాడసాగింది: "మరిచిపొయ్యానా? మరిచిపొయ్యానా?...మరిచి పోలేకపొయ్యాను"

"అది చాలా పూర్వపుకథ!"—నవ్వాడు.

"ఔను...మొదటనే! నీకోసం ఎంత విచారించాను!...ఇప్పుడు ఇంతక్రూరంగా నిన్ను మరిచినందుకు నన్ను నేను ఎంత దూషించుకున్నాను!".

ఇవి శర్మకు నమ్మదగ్గ మాటలుగా కనిపించలేదు.

వ్యంగ్యంగా అన్నాడు: "అలాగే యీభర్తతో హాయిగా కాపరం చేస్తున్నావ్?"

"అంతా అయ్యాక ఏం చెయ్యను? ఎవర్ని దూషించుకొని ఏం లాభం? నేను అనుకున్న విధంగా జీవితం నడవలేదు; జీవితమే నన్ను నడిపే యంత్రమైంది. తప్పనిసరిగా ఎదురొక్కన్న సమస్యలకు ఓడిపోయి, యీభర్తతోనే సరిపెట్టుకొన్నాను...ఈఐశ్వర్యాన్ని చూసి, యీకారును చూసి, ఈవిలువైన దుస్తులతోపాటే శరీరాన్ని ఆవరించుకున్న గర్వాన్ని చూసుకొని సంతుష్టిచెందాను. ఇలాంటి బదులుసౌఖ్యాలతో మనశ్శాంతి సంపాయించేందుకు ప్రయత్నించాను. ఒకనాడు కాదు రెణ్ణాళ్లు కాదు, నాలుగు సంవత్సరాలకుకాని నేను నెగ్గలేదు...వీడు – యీ కుర్రాడు పుట్టినవాటినుంచీ నా అనురాగాన్నీ, ఆశల్నీ, జీవితసర్వస్వాన్నీ వీడిమీద కేంద్రీకరించుకొని, నా జీవితానికల్లా చిక్కిన ఏకైకసౌఖ్యముల్లే భావించుకొని మనశ్శాంతి పొందాను—"

శర్మకు కోపం వచ్చింది. ఆమెమనశ్శాంతి మాట వినగానే అతను ఎక్కడలేని యీర్ష్యకూ గురి అయ్యాడు. కాని వెంటనే ఉన్నది ఉన్నట్టుగా వెలిగక్కకుండా, "నువ్వు అబద్ధ మాడుతున్నావ్" అన్నాడు.

"నేనా?...అబద్ధాలా? ... శర్మా! నా కుర్రాడితోడు – నేను నిజం చెప్తున్నాను!" అంది, దుఃఖం క్రమంగా ఆవరించుకుంటూన్న గొంతుతో.

"నువ్వు నీకై యీజీవితాన్ని కోరుకున్నావ్; నీతోపాటే నన్నుకూడా నాశనంచేశావ్. నేను – ఇల్లు వదిలాను. ఐనవాళ్లందర్నీ వదిలాను. లోకంలో ఒక్క మిత్రు డనేవాడుకూడా లేకుండా జీవయాత్ర సాగించాను. ఏకాకిగా జీవితాన్ని ఎదుర్కొన్నాను –"

అతని మాట పూర్తికాకముందే ఆమె అంది: "అంతా నాతప్పేనా? నే నేం చేశాను? నీ నేం చేశాను? జీవితం నేను చెప్పినట్టుగా విన్నదా? నా కోర్కె ప్రకార మేమన్నా నడిచిందా? జీవితమూ, మనుషులే నన్నూ, నాశక్తుల్నీ కట్టేసి నడుపుకున్నారు.

నీకు తెలియదా శర్మా! ఇంటిపరిస్థితుల ఒత్తిడివల్ల యీ పెళ్లికి ఒప్పుకున్నాను; సంతానానికల్లా పెద్దదాన్నవటంవల్ల. అప్పుడే ఏమనుకున్నానో తెలుసా? నాశరీరంలో రక్తమాంసాలతో తయారుచేయబడ్డ హృదయమే నశించినట్టనుకున్నాను. ఒక్క త్యాగంతో — ఒక్క ప్రాణిబాధతో నన్నాకుటుంబాన్నంతట్నీ బాగుచెయ్యవచ్చని తలిచాను. భగవంతుడి దయవల్ల యీ వివాహంతో నాపుట్టిల్లు బాగుపడ్డది. ముసలి తల్లిదండ్రులకు మనశ్శాంతి లభించింది. చదువుకున్న తమ్ముళ్లిద్దరికీ ఉద్యోగాలు దొరికినయ్. నాచెల్లెలికి మంచి సంబంధం దొరికింది ... నాకు ఎవరిమీదా కోపం లేదు శర్మా! నేను ఒక్క విషయాన్ని గట్టిగా నమ్ముతున్నాను. మన అదృష్టానికి కానీ, దురదృష్టానికి కానీ — సౌఖ్యానికి కానీ, కష్టాలకు కానీ ఇతర్లను కారకులుగా తీసుకొని తృప్తిపడటంకన్న అవి మన తప్పులుగానే భావించుకోవటం మంచిది; న్యాయంకూడానేమో? అందుకనే నేను అనుభవించిన బాధకు నిన్ను కారకుడిగా తీసుకొని ఏం లాభం? నీ జీవితానిక్కూడా నేను జవాబుదారీ కాదు. అదృష్టవంతుడ్ని చెరిచేవాడూ, దురదృష్టవంతుణ్ని బాగుచేసేవాడూ లేడుగా! విధి నాకు ప్రసాదించిన సౌఖ్యాన్ని అనుభవించటంకన్న, ఇంతకన్న సౌఖ్యం లేదే అని విచారిస్తూ — ఉన్నదాన్ని కూడా పాడుచేసుకోవటం ఏం లాభం?"

ఆమెకంటివెంట నీరు కారుతోంది. శర్మ అంతా విన్నా ఒక్క మాటనుకూడా అర్థంచేసుకోలేదు. అసలు అతని ఊహలే వేరు. ఆమెనోటివెంట — ఇప్పటికైనా — తనే తన దైవమనటాన్ని వినాలని కూర్చున్నాడు. ఆనాటి స్నేహమే ఇతర అడ్డంకులు లేకుండా యీనాటివరకూ పెరిగినట్టయితే ఆమె ఏ విధంగా మాట్లాడివుండేదో — ఆ రకం మాటల్ని వినాలని ఎదురు చూస్తున్నాడు.

అన్నాడు: "సరే ... చాలా వేదాంతాన్ని చెప్పావ్. ఇప్పటికన్నా నువ్వింతవరకూ వదులుకున్న సౌఖ్యాలకై ఎందుకు ప్రయత్నించవు?"

"ఎట్లా?"

"ఎట్లాగా? ... ఇప్పటికీ నేను కావాలా?"

"నువ్వు లేకపోతే యీ జీవితమే లేదు; నువ్వు పీల్చి వదిలే గాలి లేకపోతే నా శ్వాసే ఆగిపోతుంది" అని ఆమె అంటుం దనుకున్నాడు!

కాని ఆమె యీ ప్రశ్నకు వెంటనే సమాధానం చెప్పలేకపోయింది. ఒక్క నిమిషం శూన్యంలోకి చూసి, శర్మవైపు చూడకుండానే అంది: "అది నన్ను అడగొద్దు శర్మా! ఆ కలలో బాధనే అనుభవించామో, సౌఖ్యాన్నే అనుభవించామో ఇవాళ ఆలోచిస్తూ బాధపడటంకన్న, ఇవాల్టి సౌఖ్యాన్నే అనుభవించటం ఉత్తమం —"

"అందుకనే —"

శర్మమాటకు అడ్డువచ్చి, "ఆ మాట లేమీ వద్దు. నిజం చెప్తున్నాను. నేను జీవితంలో తిరిగి నిన్ను చూడగోరలేదు. అందుకనే, నువ్వు ఎదురైన నాడు నావిధిని దూషించుకున్నాను —" అంది.

శర్మ గట్టిగా కోపంతో నవ్వి, "నామీద ఇష్టం లేనట్టు యీ మాటలే చెప్తున్నయ్" అన్నాడు.

"కాదు శర్మా! నేనిలా ఎందుకు కోరానను కున్నావ్? నువ్వు మళ్లీ కనిపిస్తే హృదయంలో అడుగున పడిపోయిన అనేక పాతవిషయాలన్నీ జ్ఞాపకమొచ్చి బాధపడతానని. ఇంతదూరం జీవితంలో ముందుకు సాగాక వెనుక నడిచిన దారిని చూడటం ఎంత బాధావహమో నీకు తెలియదూ?"

శర్మ మాట్లాడలేదు. ఆమె చెప్పిన మాటల్ని జీర్ణించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. మళ్లీ ఆమె అందుకుంది:

"నువ్వు పనిలో చేరిన ఆసాయంత్రంనుంచీ — నేను గత పన్నెండేళ్లనుంచీ బతుకుతూన్న కల్యాణిని కాదు! — జీవితరాక్షసిబరువైన హస్తం అప్పుడే మీద పడగా, పెద్దనిద్దురనుంచి మేల్కొన్న కల్యాణిగా మారాను. నామనశ్శాంతంతా భంగమైంది. రాత్రులు నిద్రే లేదు. జీవితంలో నన్ను ఆనందింపజేసే ప్రతివస్తువూ తన పనిని మానుకుంది. నిన్ను చూడటమంటేనే భయంగా

వుంది. ఇలా మరికొద్దిరోజులు సాగుతే, పిచ్చి కూడా ఎక్కుతుందనే భయంగా వుంది. ఇది నిజం - నమ్మవా!"

ఆ చివరిమాట శర్మమీద బాగా పనిచేసింది. మాటకన్న ఎక్కువగా ఆమెకంఠమే అతన్ని నమ్మించింది. కొద్దిరోజులనుంచీ అతనిలో పనిచేస్తూన్న దుష్టపు తలపులన్నీ దూరదూరాలకు తరుమవేయబడినయ్. పెద్ద ఆత్మవిశ్వాసంతో పోరాటానికి దిగి, అనుకోకుండా ఓడిపోయిన పెద్దశస్త్రాదులాగు శర్మ నిశ్చేష్టుడై నిలబడిపొయ్యాడు.

"నాజీవితానికి కుర్రాడుతప్ప ఇంకేమీ అక్కర్లేదు. నామనశ్శాంతి అంతా వాడిమీదనే ఆధారపడి వుంది. నన్నూ, వాణ్నీ కరుణించు...నేను నీనుంచి కోరేది ఒక్కటే—"


"ఏమిటే?" అనగలిగాడు శర్మ. ఇప్పటికే ఆమె కన్నీరు అతని హృదయాన్ని తాకకుండానే కరిగించివేయగలిగింది.

"నువ్వు సాధ్యమైనంత త్వరలో యీప్రదేశాన్ని వదలివెళ్లిపో. నన్నూ, నాకుమారుణ్నీ, భర్తనూ ఎప్పటిలాగు బతకనీ. ఉన్న సమస్యలకు — నువ్వు ఎదురుగా ఉండి ఇచ్చే సమస్యే ఎక్కువైపోయింది. ఆబాధను నాలాటి సున్నితజీవితానికి అలవాటుపడ్డ మానవప్రాణి భరించలేదు ...... నువ్వు వెళ్లిపో — ఎక్కడికైనా సరే! ఈమాటను నేను ఏ అధికారంతోనూ అనటంలేదు. మానవుడు మానవుడినుంచి కోరదగ్గ సానుభూతికోసం, దయకోసం నిన్ను ప్రార్థిస్తున్నాను—"

ఈరకంమాటల్ని శర్మ ఇక వినదలుచుకోలేదు. ఇప్పటికే అతని శక్తు లన్నీ కట్టివేయబడినయ్. అతని హృదయం కొట్టుకోవటాన్ని అతను స్పష్టంగా వినగలుగుతున్నాడు. ఈ ఓడినప్రదేశాన అత నింక ఉండదలుచుకోలేదు. చప్పున కారు స్టార్టుచేశాడు.

ఆమె అంది: "ఇలాంటి సంఘటనలు ఇంక వద్దు. నన్ను విడిచిపో. ఈ క్రూరురాల్ని నీకళ్లఎదుట ఎందుకుంచుకుంటావ్?"

అతను సమాధానం చెప్పలేదు. అసలు ఇంతవరకూ ఏమీ జరగనట్టుగానే, మామూలుకారుడ్రైవరు మొహంతో ఎలాగో కారును ఇంటిదాకా లాక్కురాగలిగాడు!



కొన్ని రాజకీయవిధానములు

బలమగు కేంద్రప్రభుత్వముయొక్క ప్రాముఖ్యత

= శ్రీ చావలి వెంకట హనుమంతరావు =

హిందూదేశ రాజకీయవాతావరణము ప్రస్తుత సమయమందు అతిక్లిష్టముగానున్నది. దాని భావిపరిణామ మెట్లుండునో, ఎట్లు పరిణమించునో ఊహించుట కష్టము. కాని ఈమధ్య రెండు విధానములు భారతదేశ రాజకీయ సమస్యాపరిష్కరణార్థము ప్రచురింపబడినవి. వాటిని పరిశీలించినచో ఈసమస్యను గురించి మన ముఖ్యరాజకీయపక్షములలో కొన్ని ఏవిధముగా ఆలోచించుచున్నదియు తెలిసికొనుటకు అవకాశముండును. ఈ విధానములలో ఒకటి ప్రస్తుతము వైస్రాయి కార్యనిర్వాహకవర్గమందు డిఫెన్సుశాఖ సభ్యుడుగానున్న సర్ ఫిరోజ్ ఖాన్ నూన్‌గారు ఆలీఘర్ విశ్వవిద్యాలయమందు ప్రసంగించుచు ప్రతిపాదించిరి. రెండవది హిందూమహాసభ కార్యనిర్వాహకవర్గమువారు తమ ఢిల్లీసమావేశమునందు చేసిన తీర్మానమునందిమిడియున్నది. సర్ ఫిరోజ్‌ఖాన్ నూన్‌గారు ప్రతిపాదించిన ప్రణాళిక కొన్ని విషయములలో రెండేండ్ల క్రిందట సర్ సికందర్ హాయత్‌ఖాన్‌గారు ప్రచురించిన ఏడుపరగణాల విధానము ననుసరించుచున్నది. వీటి రెండింటికిని ముఖ్యభేద మేమన, సర్ సికందర్‌గారి ఏడుపరగణాలకు బదులు నూన్‌గారి ప్రణాళిక భారతదేశమును అయిదు డొమినియనులు (Dominions) గా విభజించుటకు పూనుకొనినది. నూన్‌గారి అయిదు డొమినియనులును ఈ క్రిందివిధముగా ఏర్పాటు చేయబడును. (౧) పంజాబు, పశ్చిమోత్తరప్రాంతము, సింధు, (౨) బొంబాయి, (౩) సంయుక్తపరగణాలు, బీహారు, మధ్యపరగణాలు, (౪) మద్రాసు, (౫) బెంగాలు, అస్సాము, ఒరిస్సాలు. ఈ అయిదు డొమినియనులును వాటి ఆంతరంగిక విషయములలో స్వాతంత్ర్యము కలిగియుండును. కొన్ని ముఖ్యమగు అఖిలభారతవిషయములను పరిపాలించుటకై కేంద్రాధికారము ఏర్పాటుచేయబడును. దేశరక్షణ, విదేశాంగశాఖ, కరెన్సి, రైలుమార్గములు మొదలగు శాఖలు ఈకేంద్రాధికారమువారు పరిపాలింతురు. ఈ కేంద్రాధికారవర్గమునకు పైన చెప్పబడిన అయిదు డొమినియనులును ప్రతినిధులను పంపుట కధికారము కలిగియుండును. కేంద్రప్రభుత్వము నుండి తొలగిపోవుటకును, తిరిగి దానియందు పాల్గొనుటకును ప్రతిడొమినియనుకును అవకాశ మీయబడును. ఇదియుకాక శేషాధికారములు (Residuary powers) డొమినియనులయందే ఇమిడియుండును.

పైన వివరింపబడిన విధానమును ప్రతిపాదించుటలో నూన్‌గారి ప్రధానోద్దేశ్యము హిందూ మహమ్మదీయ సమస్యాపరిష్కరణమున కది తోడ్పడుననియు, దానికి ప్రథమసోపానముగ నుండుననియు. రెండవది

హిందూదేశమును స్వతంత్ర డొమినియనులుగా విభజించుటవలన ఆయాప్రాంతములందలి ప్రజలు సంతోషింతు రనియు, దానిమూలముగా భారత దేశమందలి వివిధమతస్థులమధ్య ఐక్యత, సామరస్యత ఏర్పడుననికూడ ఆయన ఉద్దేశ్యము. హిందూ - ముస్లిమ్‌సమస్య పరిష్కరింపబడుట మన ప్రధానావశ్యకతలలో ఒకటి యని ఎల్ల రంగీకరింతురు. మనదేశపు రాజకీయచరిత్రను పరిశీలించినచో రాష్ట్రీయ స్వాతంత్ర్యసిద్ధాంతములో ఎట్టి లోపము కాని యున్నట్లు కనిపించదు. కాని నూన్ ప్రణాళికను కొంత సూక్ష్మదృష్టితో పరిశీలించిన యెడలవిశదమగున దేమన, పాకిస్థాన్‌సిద్ధాంతమును వెనుకద్వారమునుండి ప్రవేశపెట్టుటయే ఆయనప్రధానోద్దేశ్యమని. అయిదు డొమినియనులలో చేర్చబడు ప్రాంతములను మరొక్కసారి గమనించినచో ఈఅభిప్రాయములోని సత్యము స్పష్టమగును. బెంగాలు, అస్సాము రాష్ట్రములు ఒకప్రక్కను, పంజాబు, పశ్చిమోత్తరప్రాంతము, సింధురాష్ట్రములు వేరొకప్రక్కను ముస్లిమ్‌లీగులాహోరుతీర్మానముప్రకారము పాకిస్థాన్ రాజ్యములలో చేరును. నూన్‌గారి ప్రణాళిక ఆమోదింపబడినచో ఆతీర్మానముయొక్క ఉద్దేశ్యము సఫలమగు ననుటకు సందేహము లేదు.

రెండవ విషయ మేమన, నూన్ ప్రణాళికప్రకారము ఏర్పడు కేంద్రాధికారముయొక్క రూపమును పరిశీలించినచో, అది చెలాయించగల నిజాధికారము చాల తక్కువయనియు, ఏసమయమునందైనను ఏ ఒక్క డొమినియనుకాని కేంద్రప్రభుత్వమును త్రోసిపుచ్చుటకవకాశము కలదనియు స్పష్టమగును. వివిధడొమినియనులకు కేంద్రాధికారముక్రిందకు వచ్చుటకును, దాని నుండి విడిపోవుటకును అవకాశము సమకూర్చుట కేంద్రాధికారమునకు మొదటినుండియు ఒక బండకొయ్య మెడకు తగుల్చుటయే. లేక ఒక కత్తిని దాని మెడకు సూటిగా పెట్టుటయే. ఏ రాజకీయవిధానమునందుగాని ఒక ప్రభుత్వశాఖకు దాని బాధ్యతను పూర్తిగా నిర్వహించుటకు తగు అవకాశము నిచ్చుట ప్రధానవిషయము. అట్లే హిందూదేశమం దేర్పాటుకాబడు ఏ కేంద్రప్రభుత్వముకాని దాని బాధ్యతను నిర్వహించుటకు అవసరమగు పరికరములను కలిగియుండుట ముఖ్యము. నామమాత్రమునకు కేంద్రప్రభుత్వము ఏర్పాటుచేసి, సర్వకాలసర్వావస్థలయందును, సర్వవిషయములందును డొమినియనులపై ఆధారపడియుండునట్లు చేయుటవలన ఎట్టి లాభమును లేదు. అట్టి కేంద్రాధికారమువలన దేశమున కెట్టిలాభముగాని చేకూర దనుట స్పష్టము. భావికాలమందు హిందూదేశపు గొప్పతనము నిలువబెట్టుటకును, దేశక్షేమమును కాపాడుటకును కేంద్రాధికారమునకు నిజమగు అధికారముల నిచ్చుటయు, వివిధరాష్ట్రములకు వీలైనంత స్వాతంత్ర్యము నిచ్చుటయే కాని, కేంద్రాధికారమునందు చేరుటకును విడిపోవుటకును అవకాశములను కల్పించకుండుటయు ముఖ్యమగు విషయము. రష్యాలోను, మరి ఒకటిరెండు ఇతరదేశముల రాజ్యాంగ విధానములలోను అట్టి అవకాశములు కల్పింపబడిన వనుట నిజమేకాని ఆ దేశపరిస్థితులకును, హిందూదేశపరిస్థితులకును ప్రధాన భేదములు కలవు. రష్యాలో వివిధభాషలను మాట్లాడు ప్రజ లుండినప్పటికిని, ఒక ప్రాంతమందలి ప్రజలకును, ఇంకొకప్రాంతమందలి వారికిని కొన్ని అంతర్గతభేదము లుండినప్ప

టికిని, రష్యాదేశము వారి మాతృదేశ మనియు, దాని ఐక్యత నిలువబెట్టుట వారి గొప్ప బాధ్యతలలో ఒకటియనియు అన్ని మతములవారును, అన్ని జాతులవారును గాఢముగా నమ్ముచున్నారు. ఇక హిందూ దేశమునందన్ననో- ఒక ముఖ్యమతశాఖకు చెందిన ప్రజలు దేశమునందు అధికసంఖ్యాకులగు వేరుజాతికిని, మతమునకును చెందిన ప్రజలతో తమ కెట్టి సంబంధమును లేద నియు, తాము అధికసంఖ్యాకులుగా నున్న కొన్ని ప్రాంతములలో స్వతంత్ర రాజ్యముల నేర్పాటు చేసుకొనుటకు స్వయంనిర్ణయ సిద్ధాంతము ననుసరించి అవకాశములు కల్పింపబడవలెననియు ఈ మధ్య కొంత కాలమునుండి తీవ్రాందోళనచేయుచున్నారు. ఈ పరిస్థితులలో వారు తమకు చేతనైనంత వరకును కేంద్రాధికారము వట్టి నామమాత్ర ముగా నుండునట్లుకాని, దానిని వీలైనంత త్వరలో అంతమొందించుటకు కాని ప్రయ త్నింతు రనియు తలంపవచ్చును. ఇది పాకి స్థాన్ కాక వేరేమో చెప్పుట కష్టము.

పైన సూచించినవి కాక కొన్ని ఇతర లోపములుకూడ నూన్‌గారి ప్రణాళికయందు కలవు. వీటిలో ప్రధానమైనది — దాని ప్రకారము స్వదేశసంస్థానము లేవిధముగా భారతరాజకీయములందు పాల్గొనుటకు వీల గునో తెలుసుకొనుట కష్టము. ఈ సంస్థాన ములను వదలివేయు ఏప్రణాళికయైనను ప్రజా సమ్మతి బడయు ననుటకు వీలులేదు. రెండ వది— వేర్వేరు డొమినియనులలో చేర్చబడ వలసిన ప్రదేశములు అట్లు చేరుట కంగీక రించునా? అంగీకరించినను అవి ఎంతకాలము కలసిమెలసి యుండగలవు? వాటిలోవాటికి, భేదాభిప్రాయములు, విభేదములు లేకుండ యుండునా? అను ప్రశ్నలకు నూన్‌గా రెట్టిసమాధానమును ఇచ్చియుండలేదు.


రాష్ట్రములకు వీలైనన్ని అధికారముల నిచ్చుటకును, వాటికి ప్రత్యేకముగా ఈయ బడిన అధికారములలో కేంద్రప్రభుత్వము కలుగచేసుకొనకుండయుండుట కంగీకరించుట కును ఎట్టి అభ్యంతరముగాని ఉండకూడదు. రాష్ట్రీయస్వాతంత్ర్య(Provincial Autonomy) సిద్ధాంతమును హిందూదేశస్థులు 30 సంవ త్సరములకు పైగా అంగీకరించి, ఆచరణయం దుంచుటకు సమ్మతించియున్నారు. ఆ సిద్ధాం తము నిప్పుడు తిరుగత్రోయుటకు ప్రయత్నిం చుట ఈకాలములో మన రాజకీయదృక్పథ మునందు కలిగిన మార్పుల నన్నింటిని మర చిపోవుటయే యగును. కాని ఈ సందర్భ ములో జ్ఞాపక ముంచుకోవలసిన విషయము వేరొకటి కలదు. ఎప్పుడు కేంద్రాధికారము మన దేశమందు బలహీనమైన అప్పుడు దేశ స్వాతంత్ర్యమునకును, దేశ సంరక్షణకును తీరని నష్టము వాటిల్లినదని ఈ దేశచరిత్రను పరిశీలించిన విశదమగును. బలమగునట్టి, అన్ని ప్రాంతములును, అన్ని జాతుల వారును అంగీకరించు కేంద్రప్రభుత్వముండుట ఈ దేశపు ప్రధానావసరమని స్పష్టముగా మన మంగీకరింపక తప్పదు. ఈ అతిప్రాముఖ్య మగు సిద్ధాంతమును నూన్ ప్రణాళిక అంగీకరింపకపోవుటచే దానియొక్క ఉప యోగము చాలవరకు తగ్గిపోయిన దని తలంపవలసియున్నది. భారతదేశ రాజకీయ సమస్యను సరియగు పద్ధతులపై పరిష్క రించుట కది తోడ్పడ దని నా ఉద్దేశ్యము. దేశమున కంతకును ఒకే కేంద్రప్రభుత్వ మున్నచో తమహక్కులకును, తమమతము నకును నష్టము చేకూరు నని మహమ్మ

దీయులు నిజముగా భయపడుచున్నచో ఆ భయమును తొలగించి, వారి మనస్సు దిట్టముచేయుటకై ఇతర పద్ధతులు కలవు; ఇతరమార్గముల నన్వేషింపవలసి యున్నది. అల్పసంఖ్యాకుల భయమును తొలగించుటయు, వారి హక్కులను నిలువబెట్టుటయు అధికసంఖ్యాకుల బాధ్యతలలో ఒకటి యని ఎల్ల రంగీకరింతురు. అట్లంగీకరింపకపోయినచో ఏ రాజకీయవిధానము గాని ఆచరణలో విఫల మగుననుట నిజము. మహమ్మదీయ మతస్థుల యొక్కయు, ఇతర అల్పసంఖ్యాకుల యొక్కయు హక్కులను గురించి రాజకీయవిధానమునందు (Constitution) అవసరమగు రక్షణ షరతులు (Safegaurds) ప్రవేశ పెట్టవచ్చును. ఏ విధమగు రక్షణ షరతు లవసరమో, ఎంతవర కవి సమంజసములైనవో వివిధ మత రాజకీయ కక్షుల ప్రతినిధులు కలుసుకొని నిర్ణయించుకోవచ్చును. దాని కెట్టి అభ్యంతరమును ఉండరాదు. కాని మతసంరక్షణ పేరుతో అనేక శతాబ్దములనుండి ఒకే ఖండముగా ఉన్న ప్రాచీన భారతదేశమును వివిధ స్వతంత్రరాజ్యములుగా విడగొట్టుటకు మాతృదేశప్రేమకల ఏ భారతీయుడును అంగీకరింపడు. ఈవిషయమును సర్వకాలసర్వావస్థలయందును జ్ఞాపక ముంచుకొనుటవలన ఎంతేని లాభము కలదు.

హిందూమహాసభ కార్యనిర్వాహక సంఘమువారు ఆగస్టు చివరివారములో ఢిల్లీలో కలుసుకొనినప్పుడు భారతదేశభావి రాజ్యాంగమునుగురించి ఒక చిత్తువిధానమును తీర్మానరూపకముగా ఆమోదించిరి. ఈవిధానము దేశమందలి అత్యధికసంఖ్యాకుల ఆమోదన బడయుననితలంపవచ్చును. కాంగ్రెసుసంస్థ అభిప్రాయములకును, హిందూమహాసభవారి తీర్మానమునందలి అభిప్రాయములకును ప్రధానవిషయములయందెక్కువ భేదము కనపడదు. హిందూదేశము వెంటనే స్వతంత్రదేశముగా ప్రకటింపబడవలె ననియు, ఆ స్వాతంత్ర్యసిద్ధాంతమునకు లోబడి దేశమందలి అన్నిపక్షములవారి అంగీకారమును పొందునట్టి ప్రణాళికను తయారుచేయుటకు యుద్ధానంతరము ఒక కాన్స్టిట్యూయెంటుఅసెంబ్లీ ఏర్పాటుకాబడవలె ననియు ఆతీర్మానమునందలి మొదటి విషయము. అదియుకాక భారతదేశభావి రాజకీయవిధానము ఫెడరల్పద్ధతి ననుసరించి యుండవలె ననియు, ఫెడరల్ కేంద్రప్రభుత్వము నిజమగు అధికారము చెలాయించు సంస్థగా ఉండుటయేకాక శేషాధికారములు (Residuary powers) కూడ కేంద్రమునకే చెందవలె ననియు ఆ తీర్మానము యొక్క ఉద్దేశ్యము. అల్పసంఖ్యాకులకు మత, రాజకీయకక్షుల హక్కులను సంరక్షించుటకై కాన్స్టిట్యూయెంటు అసెంబ్లీయందు అవసరమగు మార్పులు ప్రతిపాదించుట కవకాశ ముండును. హిందూమహాసభ విధానముప్రకారము స్వదేశసంస్థానములకు అఖిల భారతరాజకీయములందు పాల్గొనుటకు తగు అవకాశము లుండుటయేకాక, హిందూదేశమును వివిధడొమినియనులుగా బద్దలుకొట్టుటకును, దాని ఏకత్వమునకు స్వస్తిచెప్పుటకును కొంతమంది చేయుచున్న ప్రయత్నములకు విరామము కూడ చెప్పవలసి యుండును.

పైన వివరింపబడిన విధానము ఇంతవరకును భారతదేశరాజకీయములు నడుచుచున్న మార్గము ననుసరించియున్నదని

నా అభిప్రాయము. రాష్ట్రీయ స్వాతంత్ర్య సిద్ధాంతమును 30 సంవత్సరములకు పైగా మన మందరము నామోదించుచున్నామని పైన వ్రాసియున్నాను. ఆసిద్ధాంతము ననుసరించియే ఇప్పుడుకూడ వివిధరాష్ట్రములలో అధికసంఖ్యాకులుగా నున్న మతశాఖీయులు వాటిని తమ అభిప్రాయముప్రకారము పరిపాలించుచుండుట. మనము చూచుచునే యున్నాము. మహమ్మదీయులు అధికసంఖ్యాకులుగా నున్న పంజాబు, సింధు, బెంగాలు, అస్సామురాష్ట్రములలో అన్నిమతములవారును వారిలో వారు కలసిమెలసి రాజ్యాంగ విషయముయలందు పాల్గొనుచున్నారు. అట్లే ఇతరరాష్ట్రములలో బాధ్యతాయుతప్రభుత్వము ఆచరణయందున్నంతకాలము హిందువులు, మహమ్మదీయులు, ఇతరులును కలసిమెలసి పనిచేయుచు వచ్చిరి. ముస్లిమ్‌లీగు సభ్యులు ఇటీవల కాంగ్రెసు పార్టీవారి నిరంకుశ్వతముక్రింద వివిధరాష్ట్రములందలి మహమ్మదీయులు అనేకకష్టముల కోర్చుకోవలసివచ్చెనని ప్రకటింప మొదలిడినప్పటికిని ఆ అభిప్రాయము నిజము కాదనుట కనేకనిదర్శనములు కలవు. ఈ విషయమును జ్ఞాపకముంచుకొనినచో "మహమ్మదీయులు ప్రత్యేకజాతి (Nation) కి చెందియున్నారు. వారికిని, ఇతరభారతీయులకును ఎట్టిసంబంధమును లేదు" అను కేకలు ఎంత బూటకములో తెలుసుకోవచ్చును. వీటినన్నింటిని బట్టి తేలున దేమన, హిందూదేశభావిరాజకీయవిధానము ఫెడరల్ పద్ధతి ననుసరించి యుండవలె ననుటలో ఒక గొప్ప సత్యమిమిడియున్నదని. [22–9–42]



తిరస్కారము

= శ్రీ చుక్క కృష్ణమూర్తి =

★

కుహుకుహుమంచు జక్కవలు గూయ ద్వితీయపుయామమందు లే
చి, వలపు లొల్క నిన్గొలువ, చెక్కుల గంధ మలంది, చక్కగా
పువు లొక కొన్ని ముడ్చి, నవభూషలు వింత నలంకరించి, నీ
భవనపు వాకిలిం దెఱచి వచ్చిన నన్ను నిరాకరింతువే?

పతి వెత గ్రుంగిపోవు నపవాద మవశ్యము వచ్చు నంచు నా
మతి యతి పోరువెట్టి పలుమాఱులు వద్దని చెప్పుచున్న నా
గతి యెటు లున్న నట్టు లగుగాక యటంచు, తెగించిరాగ, నీ
గతి నను ద్రోసిపుచ్చితి వగమ్యవిషాదపయోధిగర్భమున్ !

రాతిరి నిద్రపోక, చతురత్వపుబూతల-క్రొత్తక్రొత్తకై
సేతలనింతదాక గడచెఁగద కాల మటంచు కుందుచుఁ
కౌతుక ముల్లసిల్లఁగ చకాచక వచ్చిన, త్రోసిపుచ్చితే
రాతికినైన గల్గునో? విరాగుని మానసకర్కశత్వముల్ !

మాట యొకింతయే వినక, మాఱుమొగం బిడు దేలొకో? మతే
నీటుమిటారినేని యెద నిల్పి, భ్రమఁ వివశత్వ మందుదో?
గాటపుటల్క లెందులకు?— కొంత తనంతట గోర, చుల్కనై
వాటిలు నిట్టు లం చెద రవంతయు నెంచగనైతి ధూర్తుడా !

కోయిలకుత్తుకం దెగడు కోమలమైన మదీయకంఠముఁ
గోయుగ నెంచితే?— యతివౌకో..? మది నింద్రియముల్ జయింపగా
బోయెదా? బేలనైతి, పతిపొంతనె యుండక, లేనిపోని యీ
తోయపుదారి ద్రొక్కుమని త్రోసినదుర్విధి నాడిపోయుదుఁ !

భారతీయ సమస్యా పరిష్కారము

అమెరికనుల కర్తవ్యము*

= శ్రీ పండిత జవహరలాల్ నెహ్రూ =

భారతదేశమును ప్రస్తుత మావరించియున్న ప్రధాన సమస్యలను గురించి మీ పత్రికకు వ్రాయు నవకాశము కల్పించుట నాకు చాల ఆనందము నిచ్చినది. ఈ సమస్యలు ఇకముందు మా ఒక్కరికిమాత్రమే సంబంధించినవి కావు. ఇవి యావత్ప్రపంచమునకును సంబంధించినవి. అంతర్జాతీయ స్థితిగతులనే ఇవి యిప్పుడు తారుమారు చేయుచున్నవి. భావికర్తవ్య నిర్ణయమునకుగూడ ఇవి అడ్డుతగులుచున్నవి. ఈ సమస్యలను మనము వర్తమాన ప్రపంచక్షోభదృష్టితో చూచినను, లేక యుద్ధపరిణామములైన ఆర్థిక, రాజకీయ, వాణిజ్య స్థితిగతులనుబట్టి చూచినను — ఎటు చూచినను ౪౦ కోట్లప్రజల భవిష్యత్తు ప్రధానస్థాన మాక్రమించక తప్పదు. కోట్లకొలదిగాగల ఈ ప్రజలు ఇదివరకువలె ఇకముందు తమ వ్యవహారముల నన్నిటిని భగవదిచ్ఛాధీనములుగా వదలివేసి, చేతులు నలుపుకొనుచు, పరాయివారి పంచలో, వారి దయాధర్మముల కాసించుకొని కాలక్షేపము చేయువారు కారు. వారిలో చైతన్యశక్తి చెలరేగినది. పరాక్రమసాహసములు మేలుకొన్నవి. తమ భవిష్యత్తును గురించిన భారమంతటిని తామే భరించి, తమ యిచ్ఛానుసారముగా దాని రూపురేఖలు తీర్చుకొనుటకు వా రువ్విళ్లూరుచున్నారు.

స్వాతంత్ర్యముకొరకును, ప్రజాస్వామ్యముకొరకును భారతీయులు కావించుచున్న పోరాటము అమెరికాలో చాలమంది సానుభూతిని సంపాదించ గలిగినది. కాని, ఆసానుభూతికి తగినట్లు ఈచిత్తక్షోభ ఎంత జరూరుగా తొలగిన ఉభయులకును అంత మంచిది. ఈప్రధానసమస్యలను సావధానముగా గమనించి, ప్రయోజనాపేక్షతో, నిష్పక్షపాతముగా పరిశీలించి, పరిష్కరించుటకు యత్నింపవలసియున్నది. లేనియెడల, సంగతి సందర్భములను బట్టి చూడగా, ఇవి మనచేతులకు మించిపోగలవని తోచుచున్నది. చరిత్ర నేర్పిన గుణపాఠమే ఇది. కాని, మనము దానిని మరచిపోవుచున్నాము. కావున, దయాంతఃకరణదృష్టితో మాత్రమేకాక — దయాంతఃకరణదృష్టి మంచిదే, కాదనుటలేదు — శాస్త్రీయప్రయోజనాకాంక్షతో చూచినను ఈసమస్యలకు సరియైన పరిష్కారము చూడకతప్పదు.

అమెరికనుల శతాబ్దము

రానున్న శతాబ్దము అమెరికనులదని అనుచున్నారు. మున్ముందు అమెరికా మిక్కుమిక్కిలి ప్రధానపాత్ర వహింపబోవుచున్నదనుట రూఢియైన విషయము. అది మంచి పరువప్రాయములోనుండి, జీవశక్తిగలిగి, వర్ధమానలక్షణములతో విరాజిల్లుచున్నది. యూరపులో క్రిక్కిరిసిపడియున్న చిన్నచిన్న రాష్ట్రములకు నిత్యకలహములతో, నిత్యయుద్ధములతోనే సరిపోవుచున్నది. అవి యికమీద ప్రపంచమును నిగ్రహించిపెట్టుకొను స్థితిలో లేవు. యూరపు సాధించినది చాల కలదు. దానినిగురించి ఆ దేశము నిజముగా గర్వపడవచ్చును. కాదనువా రుండరు. కాని, దానితోపాటుగా వచ్చిన ఇతరులమీది పెత్తనము తొలగిపోయినప్పుడే ఆ సాధించినదేమో కొల్లూని నిలువగలదు; వీలయినచో చిలవలు పలవలుగా వృద్ధి చెందుటకును చక్కని అవకాశ మేర్పడును.

---

* క్రిప్సు రాయబారానంతరము పండిత జవహరలాలు నెహ్రూగారు మార్చి 7-వ తేదీనాడు ఢిల్లీ నుండి Fortune అను అమెరికను పత్రికకు పంపి, ఆపత్రిక ఏప్రిలు సంచికలో ప్రకటింపబడిన వ్యాసమున కిది అనువాదము.

రాబోవు శతాబ్దము అమెరికనులదే కాబోవు పక్షమున, అది ఆసియా శతాబ్దముకూడ అయితీరగలదు. ప్రాచీనవిజ్ఞానసంస్కృతులతో ప్రోదిసెట్టబడి, ఆధునికశాస్త్రజ్ఞానమును ఆకళించుకొని, నవనవలాడు జీవశక్తితో కూడి ఆసియా నేడు వెలుగుచున్నది. దాదాపు రెండువందలయేండ్లుగా యూరపు పెత్తనములో ఉండి భౌతికముగాను, పారమార్థికముగానుకూడ అన్ని బాధలననుభవించినది కాబట్టి ఆసియా వెనుకబడిన దేశమనియు, అధోగతిపట్టిన దేశమనియు మన మనుకొనుట యుక్తమే. కాని, అది రాజకీయముగాను, ఆర్థికముగాను, వైజ్ఞానికముగాను దర్పముతో వెలిగిన రోజులను మనము మరచిపోవుచున్నాము. ఆ మహోచ్ఛదశలో ఈ రెండువందలయేండ్లు ఎన్నవవంతో చెప్పలేము. అందులో ఇది అణుమాత్రము. అది కూడ కడగట్టిపోవుచున్నది. వెనుకటి మంచిరోజులు వచ్చుచున్నవి. అలనాడు వెలిగినట్లే మరల మహోజ్జ్వలప్రతిభతో వెలుగగల రోజులు ఆసియాకు వచ్చినవి.

ఇండియా, చైనాలు రెండును పెక్కుమార్లు అధోగతిపాలై పెక్కుమార్లు తిరిగి ఉద్ధరింపబడినవి. వేలాదియేండ్లనుండి అవి తమ అనూచానమైన సంప్రదాయముల్లను విడువకుండ కాపాడుకొనుచు వచ్చుచున్నవి. ఈ చరిత్రోదంతము నిజముగా ఆశ్చర్యము గొల్పుచున్నది. నాడు ఇవి అపారమైనబలముతో విర్రవీగుచుండెను. గ్రీసునాగరికత మొగ్గలుతొడిగి వికసించునాటికే ఇండియా దశదిశలకును ఘుంఘుమ్మని తావులు వెదజల్లుచు వికసించియుండెను. ఈ రెండు దేశములకును సన్నిహితసంబంధము గాఢముగా ఏర్పడియుండెను. ఇండియాపైన గ్రీసుప్రాభవముకంటె గ్రీసుమీద ఇండియాప్రాభవమే విశదముగా గోచరించుచుండెను. ఆ గ్రీసునాగరికతకూడ వెలిగినన్నిరోజులు వెలుగలేదు. త్వరలోనే, తన వంశగౌరవమునుమాత్రము నిలువబెట్టి, మాసిపోయెను. కాని ఇండియామాత్రము తన నాగరికతను యథాక్రమముగా నిలువబెట్టుకొనుచు వచ్చినది. పైపెచ్చు భారతీయసంస్కృతి అడుగడుగునను విస్తరిల్లుచునేవచ్చినది. చీనాదేశమువలెనే ఇండియాదేశముకూడ మంచి నిగ్రహశక్తి కలిగియుండెను.

ఇతరుల అనుగ్రహముకొరకుగాని, దయకొరకుగాని ఆసియా ప్రాకులాడుటలేదు. అన్ని విషయములలోను సంపూర్ణసమానత్వమును హక్కుగా కోరుచున్నది. ఇతరులతోబాటుగా ఆధునికప్రపంచమునందు తన స్థానమును తాను నిలువబెట్టుకొనగలనన్న ధైర్యము దానికి పూర్తిగా కలదు. ఇటీవల భారతదేశమునకు చియాంగ్‌కైషేకుదంపతుల ఆగమనము చారిత్రకవైలక్షణ్యము సంపాదించుకొనుటతోబాటు తమ క్షేమమునకును, ప్రపంచక్షేమమునకునుగూడ ఇండియా చీనాలు ఏకమయినప్పుడు ఆ భవిష్యత్తు ఎట్లుండగలదో మనకు చూచాయగా తెలిపినది. ఇంకొక గొప్ప సత్యాంశముకూడ చియాంగ్‌కైషేకు తెలివిడిచేసిపోయెను. 3000 కిలోమీటర్ల పరిమితిగల నేలసరిహద్దు పొత్తుగా ఉండికూడ ఇండియా చీనాలు రెండును వేయియేండ్లపాటు ఒకరిమీద ఒకరు దురాక్రమణకు దిగక శాంతముగా కాలము గడపుకొనివచ్చిరనియు, యుగయుగములుగా పరస్పరము వైజ్ఞానిక, సాంస్కృతిక, వాణిజ్యసంబంధములను బాఢముగా నిలుపుకొని వచ్చిరనియు ఆయన స్పష్టముగా ప్రకటించెను. ఈ యంశమొక్కటే చాలు—మహోన్నతమైన ఈరెండు నాగరకతలయొక్క శాంతశీలమును చాటుటకు.

ఈ విషయముల నన్నిటిని మనసులో ఉంచుకొని చూచినచో భారతదేశము బ్రిటనుసామ్రాజ్యములో తదేకతానముగా బంధింపబడి యుండవలెనను సిద్ధాంతము ఎంత అసహజము, ఎంత అభూతవిషయమో విశదము కాగలదు. భారతదేశము మాతృదేశము. అది యిదివరలో ఆసియాయందలి అనేక జాతులపైన, అనేక వర్గములపైన తన ప్రాభవమును చలాయించినది. అలనాడు దాని నంత ఉచ్ఛస్థితిలో ఉంచిన వైజ్ఞానికసంపదను భారతదేశము ఇప్పటికిని కోలుపోలేదు. దానిని తదేకప్రక్రియగా నిలుపుకొని వచ్చుచున్నది. అందుతోపాటు దానిని మహోన్నత జాతిగా ప్రతిష్ఠింపగల ప్రకృతిసంపదయు, శాస్త్రీయ సాంకేతిక పారిశ్రామిక ఆర్థికబలములును భారతదేశమునకు తరిగిపోనన్ని యున్నవి. ప్రస్తుత భీకరయుద్ధోపద్రవములోకూడ అది తన పాత్రను తాను యథోచితముగా నిర్వహింపగలిగియున్నది. తగిన అవకాశమే

లభింపజేసినయెడల భారతదేశము తనకుగల అపారమైన మనుష్యబలముతోపాటు, పారిశ్రామికబలమును కూడ బహుళముగా చేకూర్చుకొని యుద్ధములో గొప్పపాత్రను నిర్వహించితీరును.

ప్రపంచమహావిప్లవము

ప్రపంచమందంతటను నేడు జరుగుచున్న మహావిప్లవములోని ఒకభాగమే నేటి ప్రపంచసంగ్రామము. కేవలము సైనికపరిభాషతోమాత్రమే మనము దీనిని పరిశీలించుట వర్తమానపరిస్థితులలోని వైలక్షణ్యమును గమనింపకపోవుటయే యగును. కారణములు లోతుగా పాతుకొనిపోయియున్నవి. ఏ ఒకరిద్దరో వ్యక్తులయొక్కగాని, ఏ ఒకటి రెండో ప్రజావర్గములయొక్కగాని దురాశాదురభిమానములే నేటి మనకష్టములకన్నిటికిని కారణ మనుకొనుట చాల పొరపాటు. ఆ ఒకరిద్దరు వ్యక్తులును, ఆ ఒకటి రెండు ప్రజావర్గములును దుష్టబుద్ధులకును, పైశాచిక ప్రవృత్తికిని ప్రాతినిధ్యము వహించి యుండవచ్చును. కాని, నిలుకడ కోలుపోయినట్టియు, అధికసంఖ్యాకప్రజా మోదమును పోగొట్టుకొన్నట్టియు విధానము మారిపోయి నూతనవ్యవస్థ యేర్పడవలెనని వారుకూడ కోరుచున్నారను అంశమును మన మంగీకరింపక తప్పదు. ప్రస్తుత దురాక్రమణకర్తల ప్రాబల్యమునకు మూలకారణము నిజముగా వారి పాతపద్ధతులపై సవాలు చేయుటయే. తప్పనిసరియైన ఈ మార్పులను ప్రతిఘటించి, పాతపద్ధతులకే అంటిపెట్టుకొనియుండి, వాటికోసమే ప్రాకులాడుచుండినచో అది విప్లవక్షేత్రమున శత్రురాజ్యములకు లొంగిపోవుటయే యగును. ఈ దురాక్రమణకర్తలు ఇదివరకున్నవానికంటె ఘోరమైన హింసలను పెట్టుటకే ఉద్యుక్తులయినారనియు, కావున వారిని తప్పక ప్రతిఘటించితీరవలెననియు విజ్ఞులు బాగుగా ఎరుగుదురు. వారికి లొంగిపోవుట హీనాతిహీనమైన పతనమును కొనితెచ్చుకొనుటయే; సైనికాపజయముకన్నను కనాకష్టమయిన పారమార్థికపతనమును చేతులార తెచ్చుకొనుటయే. విషీఫ్రాన్సులో ఏమయినదో మన మెరుగనిదికాదు. మధ్యయూరపులోను, ఉత్తర చైనాలోను ఏమి జరిగినదో కూడ మనకు తెలియును. కాని, ఇంతకంటె మహత్తరమైన ఉపద్రవము రాబోవుచున్నదని చెప్పినంతమాత్రమున చాలదు. ప్రజ లంతమాత్రముచేతనే దిగులుపడరు. వారు తమ ప్రస్తుతస్థితితో చాల అసంతృప్తి చెందియున్నారు. ప్రస్తుత స్తబ్ధత్వమునుండి తప్పింపగల విముక్తికోసము వారు పరితపించుచున్నారు. వెంటనే యుద్ధములోకి దిగుటకు తగిన కారణమునకై వారు తాపత్రయపడుచున్నారు. ముందేదో మహోపద్రవము రాగలదని ప్రస్తుత దైన్యమునకు అభిమానముగల యేవ్యక్తియు అంగీకరింపడు.

కనుక ఇప్పుడు ముఖ్యముగా కావలసిన దేమనగా, ఒక నైతిక – విప్లవయుతనాయకత్వము. పాతపద్ధతులుపోయి, వానిస్థానే ప్రజాస్వామ్య, స్వాతంత్ర్యములపై ఆధారపడిన నూతనవ్యవస్థ యేర్పడినదన్న విశ్వాసమును ప్రజలలో కలిగించగల నాయకత్వము కావలెను. భవిష్యత్తును గురించిన వట్టి వాగ్దానములతో లాభములేదు. అరగొర కృషికూడ నిరుపయోగము. పైగా, వర్తమానమే మనకు కావలసినది. అదియే మనకు ముఖ్యము. ఈ యుద్ధములో గెలుచుటయో, ఓడుటయో ఈవర్తమానములోనే కదా! నేటి వర్తమానమే రేపటి భవిష్యత్తుకు రూపమేర్పరచునది. ఈభవిష్యత్తును గురించియు, నాలుగు స్వాతంత్ర్యములను గురించియు రూజ్వెల్టు అధ్యక్షుడు స్పష్టముగా చెప్పియున్నాడు. ఆయనమాటలు కోటానుకోట్ల ప్రజల హృదయములలో ప్రతిధ్వనించినవి. కాని ఆ మాటలు విశదముగా లేవు. పైగా ఆచరణకు రానే లేదు. అట్లాంటిక్ ప్రణాళిక రవంత ఆశాజనకముగానే యున్నది. కాని ఉత్సాహజనకముగా మాత్రము లేదు. అదికూడ ఇండియాకు వర్తించదనుచున్నాడు చర్చిలు ప్రధాని.

ఈ నైతిక – విప్లవయుత నాయకత్వమే గనుక అంగీకరింపబడి ఆచరణకు తేబడినయెడల శత్రువులు తోకముడుచుకొనిపోవలసినదే. వారి బండారము దానితో బయటపడిపోవును. వారి దుశ్చర్యలు, కుతంత్రములకు స్వస్తి యేర్పడును. వారిని చీల్చి చెండాడగల ఒక మహత్తరశక్తి విజృంభించును. నేడు నాజీలనీడలోనున్న యూరపుప్రజలుకూడ అప్పుడు మారిపోగలరు. కాని, ఆసియా ఆఫ్రికాఖండములలో అత్యద్భుతమైన ఫలితములు పుట్టింపవచ్చును. దానితో

యుద్ధగమనములోనే ఒక నూతనాధ్యాయము పొడ సూపగలదు. ఒక్క-స్వాతంత్ర్యము, ఆ స్వాతంత్ర్యము కొరకే తాము పోరాడుచున్నామను ఒక్క-భావము-ఇవియే భారత ప్రజలను నేడు చీనా రష్యాప్రజలవలె పోరాడునట్లు చేయగలవు.

రెండున్నరసంవత్సరములు వృథాగా పోయినవి

ఆసియాఖండము చిరకాలముగా బ్రిటిషువారి బాధాయుతమైన పెత్తనమునకు ఆహుతి అయిపోయినది. భారతదేశమునకును, తదితర ఆసియారాష్ట్రములకును ఏదో త్రవ్వితలకెత్తిశామని బ్రిటను అనుకోవచ్చును. చాటుకోవచ్చునుగూడ. కాని భారతీయులును, తదితర ఆసియావాసులును అట్లనుకొనుటలేదు. మీదు మిక్కిలి తద్భిన్నముగా అనుకొనుచున్నారు. ఏది యేమైనను, ఎవరెన్ని చెప్పినను మే మనుకొనుచున్న దేదో అదియే ముఖ్యమైనది. భూతకాలపు ఆ బాధలను, ఘర్షణలను మరచిపోవుట చాలకష్టమే. కాని ఇప్పటికైనను అవి అంతరించి, నూతనవ్యవస్థవచ్చినచో అదికూడ సుసాధ్యమేయగును. అప్పుడే ప్రజలలో యుద్ధ సుముఖతను, సహకారబుద్ధిని కలిగింపవచ్చును.

ఈ యుద్దేశ్యముతోనే నేషనల్ కాంగ్రెసు ౧౯౩౯ సెప్టెంబరులో ఒకదీర్ఘప్రకటనను చేసెను. బ్రిటను యుద్ధాశయములేవో వెల్లడింపగోరెను. ఫాసిస్టు నాజీతత్వములను, జపాను ఇటలీ జర్మనీల దురాక్రమణలను కాంగ్రెసు ఎన్నాళ్లగానో ఖండించుచునేయున్నది. తిరిగి ఇప్పుడుకూడ ఖండించి, ప్రజాస్వామ్య, స్వాతంత్ర్యరక్షణలకొరకై సహాయము కూడ చేసెదనన్నది. కాని, ఒక్క-సంగతిని మట్టుకు స్పష్టముగా విప్పి చెప్పినది. ఇప్పటి సామ్రాజ్యవిధానమును, వలసదేశాల బానిసస్థితిని రక్షించుకొనుటకు మాత్రమే ఈ యుద్ధమయితే మట్టుకు భారతదేశము దానితో ఏలాటి ప్రమేయమును పెట్టుకోదని స్పష్టముచేసినది. అట్లుకాక ఈ యుద్ధము ప్రజాస్వామ్యముకొరకును, ప్రజాస్వామ్యముమీద ఆధారపడు ప్రపంచ వ్యవస్థకొరకును అయితేమట్టుకు భారతదేశము తప్పకుండ జోక్యము కలిగించుకొనితీరును. ఈ ప్రజాస్వామ్యరక్షణ, విస్తరణముల కొరకే బ్రిటను పోరాడుచున్నయెడల ముందు తన అధీనరాజ్యములలో సామ్రాజ్యవాదమును వదలుకొని భారతదేశములో సంపూర్ణప్రజాస్వామ్యమును నెలకొలుపవలెను. ఇతరుల జోక్యములేకుండ తమ రాజ్యాంగ విధానమును తాము ఒక ప్రజాప్రతినిధి పరిషత్తు ద్వారా నిర్మించుకొనగల హక్కు వారికి కల్పింపవలెను. స్వతంత్ర-ప్రజాసత్తాక భారతదేశము శత్రుదురాక్రమణలనుండి పరస్పర రక్షణకును, ఆర్థికసహకారమునకును ఇతర స్వతంత్రదేశములతో సంతోషముగా చేరి పనిచేయగలదు.

కాంగ్రెసుకోరికకు నిరాకరణ

ఈప్రకటనచేసి అప్పుడే రెండున్నర సంవత్సరములు గడచిపోయినవి. తరువాతకూడ అనేకసార్లు ఈ విషయములే వేరువేరు రూపములతో ఉద్ఘాటింపబడినవి. బ్రిటను ఈకోరికను నిరాకరించినది. నిరాకరించుటలోకూడ భారతీయుల క్రాగ్రహము కలుగునట్లుగా నిరాకరించినది. వెనుకటిపద్ధతులు తప్పవనినది. వీలైనంతవరకు వర్తమానభవిష్యత్తులుకూడ ఆ భూతమునే పోలియుండుననినది. మూటికి ముమ్మాటికి ఇదియే తన నిర్ణయమని అసంశయముగా ప్రకటించినది. మాసమస్యలను మరింత క్లిష్టపరచి, పరిస్థితులను ఇంకింత విషమింపజేసిన కడచిన రెండున్నరసంవత్సరముల విషాదచరిత్రను పునరుద్ఘాటించుట ప్రయోజనములేనిపని. ప్రపంచమందంతటను సంఘటనల వెనుక సంఘటనలు ప్రచండవేగముతో వచ్చి పడుచున్నవి. ఇటీవల కొద్ది నెలలలోనే బ్రిటిషు సామ్రాజ్యములోని కొన్ని భాగములు బ్రిటను చేతులనుండి జారిపోయినవి. ఇన్ని జరిగినప్పటికిని బ్రిటిషువారి దృక్పథములోగాని, వారివిధానములోగాని అణుమాత్రమును మార్పుకలుగలేదు. బ్రిటిషు రాజతంత్ర ప్రవీణులు ఇప్పటికిని ౧౯-వ శతాబ్దములో మాట్లాడిన ధోరణిలోనే మాట్లాడుచున్నారు. విదేశాల దురాక్రమణనుండి భారతదేశమును రక్షించవలెనను ఆతురత మాకు లేకపోలేదు. కాని, అందుకు ప్రజలలో ఉత్సాహము పెంపొందవలెను. ప్రజాధికారముక్రింద. వారి సంపూర్ణసహాయము సమకూడవలెను.

యుద్ధావసరములు ఎంతగా కోరుచున్నప్పటికిని మేము మా ప్రధానపరిశ్రమలను అభివృద్ధి చేసుకొనుటకు వీలులేదు. అట్టి వీలు కలిగించినచో యుద్ధానంతరము భారతదేశము బ్రిటనుతో పోటీపడునేమో యని బ్రిటిషువారికి భయము. అందుచేత మా పరిశ్రమాభివృద్ధికి వారు అంతరాయములు కల్పించుచున్నారు. యుద్ధకాలములో అత్యవసరమైన మోటారునిర్మాణము, విమానోత్పత్తి, నౌకానిర్మాణము మొదలైనవాటిని సాగించెదమని ఎంతకాలమునుండియో భారతీయపారిశ్రామిక ప్రముఖులు ప్రయత్నించుచున్నారు. ఈప్రయత్నములన్నియు ఏరీతిగా ఆటంకపరుపబడినవో అది ఒక ఆశ్చర్యకరమైన కథ. నేషనల్ ప్లానింగు కమిటీకి నేను అధ్యక్షుడను. భారతదేశ పారిశ్రామిక సమస్యలపట్ల నాకు చాల అభిమానము. ఈ కమిటీలో వివిధ శాస్త్రములలో విశేష నైపుణ్యము గల భారతీయ పారిశ్రామికులు చాలమంది ఉన్నారు. పరిశ్రమ, వ్యవసాయము, సంఘసేవ—ఈ మూటిని సమన్వయపరచి, భారతదేశీయ సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన ఒక కార్యకలాపమును, ఒక ప్రణాళికను మేము తయారుచేసితిమి. ఈ కమిటీయొక్కయు, దీని పెక్కు సబ్‌కమిటీలయొక్కయు కృషి ఈ యుద్ధసమయములో ఎంతో ఉపయోగపడి యుండెడిది. ఈ సదవకాశమును ఉపయోగించుకొనకపోవుట పోగా దీనిప్రయత్నములకును, దీని కార్యకలాపమునకును ప్రభుత్వము ఎన్నో ఆటంకాలు కల్పించినది.

భారతీయుల ఆశ

రెండున్నరసంవత్సరముల క్రిందట నేటి ప్రపంచ నాటకములో మేమును ఒక ప్రముఖపాత్రను నిర్వహింపగలమని ఆశించియుంటిమి. మా సానుభూతి యంతయు ఒక వంకనే యుండెను. మా ఆశయములు కూడ దానితో పొందికగా పొందుపడెను. ఇంతకును మా ముఖ్యసమస్య హిందూ-ముస్లిము సమస్య కానే కాదు. క్రమబద్ధమైన పరిశ్రమాభివృద్ధి, విస్తారమైన ఉత్పత్తి, న్యాయమైన పంపకము, ఉన్నతమైన ప్రమాణము, తద్వారా-ప్రజలను పీల్చి పిప్పిచేయుచున్న దారిద్ర్య నిర్మూలనము — ఇవియే మా ప్రధాన సమస్యలు. యుద్ధప్రయత్నములలో ఒకటిగా దీనిని "పరిగణించి, రెండు దేశాలకును సహకారమునుకూర్చి, శత్రు దురాక్రమణ నెదిరించుటకు భౌతికముగాను, మానసికముగానుకూడ భారతదేశమును బలిష్ఠముగా చేయుటకు వీలుండెను. కాని, ఆ వీలు స్వాతంత్ర్యముద్వారానే సమకూరగలిగియుండెను. మహోపద్రవము మన ముందు ప్రత్యక్షమై కూర్చున్నది. అందుకు తయారగుటకు ఇదివరలోవలె మాకిప్పుడు తగిన కాలవ్యవధికూడ లేదు. ఈసమయములో వృథాపోయిన ఆ వెనుకటి రోజులనుగురించి ఆలోచించి లాభములేదు. ఈ ఉపద్రవము నెదుర్కొనుటకు మే మిప్పుడు క్రొత్తపంథాను అవలంబింపవలసియున్నది. ఏమయిననుసరే, ఎట్టి సందర్భములోకూడ మేము దురాక్రమణకు లొంగిపోము.

స్వతంత్రభారతదేశము తన సమస్యలను తాను పరిష్కరించుకోగలదు

యుద్ధకాలములో అధికారమును చేతులు మార్చుట ప్రమాదకరమని యందురు. నిజమే, ప్రమాదకరమే. కాని, మార్పుచేయకపోవుటవల్ల అంతకన్న ఎక్కువ ప్రమాదములు తటస్థించును. నేడు దురాక్రమణకుదిగిన రాజ్యములు విధితో జూదమాడగల ధైర్యము తమకు గలదని పెక్కుసార్లు ప్రకటించుకొన్నవి. ఇంతవరకును ఆజూదములో గెలుచుకొనుచు వచ్చినవికూడ. మనము ప్రమాదములను ఎదుర్కొనక తప్పదు. ఒకటిమాత్రము నిజము. భారతదేశములో నేడు పొడసూపుచున్న వ్యవహార పరిస్థితులు దారుణముగా ఉన్నవి. ప్రజల తోడ్పాటు లేకపోవుట మాత్రమే కాక చేతకానితనముకూడ ఈ పరిస్థితులకు కారణమని చెప్పవలెను. వైట్‌హాలు నుండియు, ఢిల్లీనుండియు ఇండియాలోని వ్యవహారములను చక్కబెట్టుచున్న ప్రభువులకు భారతదేశపరిస్థితులను చక్కబెట్టి పరిష్కరించుట చేతగాదు సరికదా, అసలు ఇండియాలోపల ఏమి జరుగుచున్నదోకూడ వారు అర్థముచేసుకోలేరు.

సిరియా.దేశపు స్వాతంత్ర్యము గుర్తింపబడినదనియు, కొరియా త్వరలోనే స్వతంత్రదేశము కాబోవుచున్నదనియు విన్నాము. కాని, ఆధునికసామ్రాజ్యవాదయాత్రబద్ధమైయున్న భారతదేశము మాత్రము ఇంకను బ్రిటిషువారి అదుపు ఆజ్ఞలలోనే ఉండిపోవలెను! ఈసందర్భములోనే టోకియో, బాంగ్‌కాక్, రోము, బెర్లిను రేడియోలు అక్షరాజ్యాలు భారత

దేశము స్వతంత్రదేశము కావలెనని కోరుచున్నట్లు అనుదినము హిందూస్థానీలో ప్రకటనలపైన ప్రకటనలు చేయుచున్నవి. ఇది యెంత అసంబద్ధమయినదో బుద్ధిమంతులయినవారూహింపగలరు. వారు ఈ ప్రకటనలను నమ్ముటలేదు. కాని, ఆ ప్రకటనలను వినుచున్న చాలమంది బ్రిటిషువారు మాటలలో చెప్పుచున్న దేమియో, చేతలలో చేయుచున్న దేమియో సమన్వయించి చూచుకొనుచున్నారు. ఈ ప్రచారము యొక్క ఫలితములను మనము మలయాలోను, బర్మాలోను ప్రత్యక్షముగా చూచినాము. భారతదేశము రాజకీయముగా అంతకంటె చాల అభివృద్ధి చెందియున్నది. అందువల్ల ఇటువంటి ప్రచారములను మరింత విజయవంతముగా ఎదిరించగలదు. చైనా యెడల భారతదేశమునకు చాల ఆదరాభిమానములు కలవు. రష్యనుల అప్రతిమానమైన ప్రతిఘటననుగూడ భారతీయులు బహువిధములుగా శ్లాఘించుచున్నారు. అమెరికావారి ప్రజాస్వామ్యాశయములను ఈ దేశము స్నేహపుచూపుతో చూచుచున్నది. ఇట్లుండియు తనకు తాను అసహాయస్థితిలోనే యుండి, తన ప్రస్తుతస్థితికి కారకులైనవారియెడల కొరకొర చూపులు చూచుచున్నది.

హిందూ - ముస్లిం సమస్య

మా భారతీయులనావరించియున్న సమస్యలలో కొన్ని మాయంతకు మేము కల్పించుకొన్నవి; కొన్ని బ్రిటిషువార్లు కల్పించినవి. ఆ సమస్యలకు బాధ్యులెవరయినను సరే, మేము వానిని పరిష్కరించుకొనవలసియున్నది. ఈ సమస్యలలో గొప్పదిగా పేర్కొనబడుచున్నది హిందూ-ముస్లింసమస్య. హిందువులవలెనే ముస్లిములు కూడ భారతదేశస్వాతంత్ర్యమును కోరుచున్నారను విషయము తరచుగా విస్మరింపబడుచున్నది. వారిలో కొందరు (కొంచెముమాత్రమే) ఈ దేశపు వాయవ్యప్రాంతములో ఒక ప్రత్యేకరాష్ట్రమును కోరుచున్నారు. కోరుట కేమో కోరుచున్నారుగాని తమకోరిక నిదమిత్థముగా వారు నిర్వచింప లేకున్నారు. చిన్నచిన్న రాష్ట్రము లన్నియు మరుగున పడిపోయి, ఒక మహత్తరమైన సమాఖ్యలో భాగములుగా ఉండిపోవలసిన ఈ రోజులలో వారి ఈకోరికను ఎవరో కొంతమంది మాత్రమే కాని ముఖ్యముగా పరిగణించుటలేదు. హిందూ-ముస్లింసమస్య ఆ సమాఖ్యతో తేలిపోగలదు. అయితే, భారతీయ వ్యవహారములలో బ్రిటిషువారి జోక్యము తొలగినప్పుడే ఆ పరిష్కార మేర్పడగలదు. మూడవపక్షమువారు జోక్యము కల్పించుకొని, ఉభయపక్షములలోను తగాదాలు పెంచుచున్నంతవరకును పరిష్కారము కుదరదు. స్వతంత్రభారతదేశము ఈ సమస్యను నూతనమార్గమున ఎదుర్కొని, దానిని పరిష్కరింపగలదని నేను నిస్సంశయముగా నమ్ముచున్నాను.

మా కిప్పుడు కావలసిన దేమి? మహత్తరమైన సమాఖ్యలలో ఇతర దేశములతో సహకారమును కాంక్షించునట్టి స్వతంత్ర - ప్రజాసత్తాక - ఫెడరల్ భారతదేశము మాకు కావలెను. ముఖ్యముగా మా హిందూదేశము ఇరుగుపొరుగు దేశములైన చైనా రష్యలతోను, అమెరికాతోను సన్నిహితసంబంధములను పెట్టుకో గోరుచున్నది. మాలోని అల్పసంఖ్యాకవర్గములకును, విజ్ఞానార్థిక విషయములలో వెనుకబడియున్న వర్గములకును సాధ్యమైనంతమట్టుకు రక్షణను, ప్రాచీని, సహాయమును ఇవ్వవలసియున్నది.

ఇప్పుడు మనకర్తవ్య మేమి?- ఇది అంతసులభసాధ్యమైన ప్రశ్న కాదు. ఏలనగా, నేడు సాధ్యమైనది రేపు కష్టసాధ్యము కాగలదు. రెండేండ్లక్రిందట మనము చేయగలిగియుండినపని ఇప్పుడు చేయుటకు మనకు వ్యవధి లేదు. కాని, ఈ యుద్ధము ఇంతలో ముగియు లక్షణములు కనిపించుటలేదు. హిందూదేశములో జరుగుచున్న సంఘటనలు ఏదో ఒక గొప్పమార్పును తెచ్చిపెట్టకతీరదు. యుద్ధతంత్రము ప్రజల తోడ్పాటును, త్యాగమును క్రియారూపమున కోరుచున్నది. అది కోరు త్యాగము ఒక్క ప్రాణముల త్యాగమే కాదు, తరగతివిభేదములు, జాతివిభేదములు, వర్ణవిభేదములు, రాజకీయార్థికములందు ఇతరుల పెత్తనము, ఇతరుల అభివృద్ధి అభ్యుదయములకు ఆటంకపరచునట్టి అల్పసంఖ్యాక-హక్కులు మొదలైన అనేకాంశముల త్యాగమును కోరుచున్నది.

ఏ మేమి చేయవలసియున్నదో అది యంతయు ఇప్పుడే చేయవలసియున్నది. వర్తమాన మొక్కటే మన కిప్పుడు లెక్కకు వచ్చునది. యుద్ధానంతరము ఏమి జరుగునో ఎవరికిని తెలియదు. అంతవరకును దేనిని గాని వాయిదావేయుట మంచిదిగాదు. అది అనర్థములను కొనితెచ్చుకొనుటయే యగును.

మాకు కావలసిన ప్రకటన

అమెరికా, బ్రిటను నాయకులకు నే నొక సూచన చేయుచున్నాను. వారు వెంటనే ఈ క్రింది అంశములు గల ఒక ప్రకటన చేయవలెనని వారిని నేను కోరుచున్నాను. ఒకటి: కొన్ని అంతర్జాతీయ నిబంధ

నలకు లోబడి తన రాజ్యాంగవిధానమును తాను నిర్మించుకొనుటకును, సంపూర్ణస్వాతంత్ర్యము ననుభవించుటకును ప్రతి దేశమునకును హక్కుగలదు; రెండు: ఈసూత్రము ప్రస్తుతము బ్రిటిషుసామ్రాజ్యమునందున్న అన్ని దేశములకును పూర్తిగా అన్వయించును. హిందూదేశము యొక్క స్వాతంత్ర్యమే కాక ప్రజాప్రతినిధిసభ ద్వారా తన రాజ్యాంగవిధానమును తాను నిర్ణయించుకొనుటకు దానికిగల హక్కుగూడ గుర్తింపబడును; మూడవది: అన్ని వర్గములవారును, అన్ని జాతులవారును సమానముగా చూడబడవలెను. అభివృద్ధి అభ్యుదయములకు వారికిగూడ ఇతరులతో సమానమైన అవకాశము లివ్వవలెను. వ్యక్తులును, వర్గములును భిన్నముగా నుండిన నుండవచ్చును. వారిలో కొందరు బుద్ధిలోను, ప్రజ్ఞలోను తదితరులకన్న మిన్నలై యుండవచ్చును. కాని అభ్యుదయద్వారముమాత్రము సర్వేసర్వత్ర అందరికిని తెరువబడియుండవలెను. అపరిణతప్రజ్ఞులైనవారికి నిజముగా తగిన సహాయప్రోత్సాహములు తప్పక లభింపవలెను. నాజీపరిపాలనపైన ప్రజలకు ద్వేషభావము పుట్టుట ఈ జాతివైషమ్యమువల్లనే. ఇటువంటి జాతివైషమ్యము దాస్యదేశాలయందన్నిటను ఇప్పటికిని ప్రబలముగా గోచరించుచున్నది.

ఇటువంటి ఒక ప్రకటనను వారు వెంటనే చేయగలిగినయెడల అంతతో ప్రపంచమునందు సామ్రాజ్యవాదము నశుసిపోగలదు. నాజీ ఫాసిస్టుతత్వములు రెండును కరుడుగట్టిన సామ్రాజ్యవాద తత్వస్వరూపములే కాబట్టి యీప్రకటన నాజీ ఫాసిస్టు తత్వములకు ఒక పెద్దదెబ్బ కాగలదు. ఇతర సైనికవిజయములకంటె ఇదియే వారిపాలిటికి బ్రహ్మాస్త్ర మగును. స్వాతంత్ర్య ప్రశ్న అప్పుడు ప్రపంచమునకు విశదమగును.

నిజమైన మార్పు కావలెను

ఈ ప్రకటన ఒక్కటే చాలదు. వట్టి వాగ్దానములను నమ్మి కూర్చొనుకాలము పోయినది. వాగ్దానములను నమ్మువా రిప్పు డెవ్వరును లేరు. భవిష్యత్తుకొరకు అఱ్ఱులు చాచి చూచుచు వేచియుండగలవారు అంతకంటెను లేరు. కావున ఆప్రకటనను వెంటనే 'అక్షరాలా' ఆచరణలో పెట్టవలెను. సంపూర్ణమైన మార్పు ప్రస్తుతము వెంటనే సాధ్యము కాకపోవచ్చును. కాని వెంటనే చేయదగినదికూడ చాలకలదు. వెంటనే, ఆలస్యము చేయకుండ, న్యాయశాస్త్రప్రతిబంధకములుగూడ ఏవియు లేకయే హిందూదేశమునందు ఏతత్క్షణములో కొన్నిమార్పులు చేయుటకు కావలసినంత అవకాశ మున్నది. దీనినిగురించి బ్రిటిషుపార్లమెంటువారు నిబంధనలు చేసినను చేయవచ్చును; లేదా మానినను మానవచ్చును. మేమే భవిష్యత్తులో అటువంటి నిబంధనలను స్వయముగా చేసుకొనగలము. తాత్కాలికముగా ఒక జాతీయప్రభుత్వమును నిర్మించి, దానికి నిజమైనఅధికారమునిచ్చుటకు వెంటనేపూనుకొనవచ్చును. ఈపని ప్రస్తుతరాజ్యాంగవిధానమునకు లోబడియేచేయుటకవకాశ మున్నది. కాని ఒక్కసంగతి జ్ఞప్తియందుంచుకొనవలసియున్నది. అప్పుడు ఈరాజ్యాంగవిధానము నామమాత్రముగా మాత్రమే యుండును. ఈ తాత్కాలిక జాతీయప్రభుత్వము బ్రిటిషుప్రభుత్వమునకుగాని, రాజప్రతినిధికిగాని బాధ్యత వహింపజాలదు. దేశీయప్రజలకు మాత్రమే ఇది బాధ్యత వహించును. అయితే, బ్రిటిషు ప్రభుత్వమునకును, దాని అనుమతిపొందిన ఏజెంట్లకును తగిన సహకారము చేయుటకుమాత్రము అది వెనుదీయదు. ముమ్ముందు ఎప్పుడైనను అవకాశము కలిగినయెడల కాన్‌స్టిట్యూయెంటు అసెంబ్లీద్వారా మరికొన్ని మార్పులు జరుగవచ్చును. ఈలోగా ప్రస్తుత కేంద్రశాసనసభమూలసూత్రములను కొంచెము విశాలపరచి, దానిని ప్రాతినిధ్యసభగా చేయవచ్చును. అప్పుడు ఆసభకు ఈజాతీయప్రభుత్వము బాధ్యత వహించుట కాక్షేపణ లేదు.

కేంద్ర ప్రభుత్వములో ఈమార్పు జరిగినయెడల రాష్ట్రములలో ప్రజాహితప్రభుత్వములు ఏర్పడి పని చేయుట బహు సులభమైన పని. ఈ రాష్ట్రీయప్రభుత్వము లేర్పడుటకు ప్రత్యేకపుమార్పు లేవియు చేయనవసరము లేదు. పరిపాలనాక్రమవిధాన మంతయు సర్వసిద్ధముగా ఉన్నదే కావున తన్నిర్మాణ నిర్వహణముల విషయమై అంతగా యోచింపవలసినదే లేదు.

అసలు రాజ్యాంగనిర్మాణవిధానము నేమియు తలక్రిందులు చేయనవసరము లేకయే ఈమార్పులు చేయవచ్చును. కాని ఇందుకు బ్రిటిషువారి చిత్తవృత్తిలో అత్యద్భుతమైన ఒక ముఖ్య – మార్పు కావలెను. కావలసినదే అది. ప్రజామోదమును పొందుటకును, ప్రజాసహకారము సంపాదించుటకును అంతకన్న వేఱుమార్గము లేదు. నిజమైన ఈ మార్పు వచ్చి, పాత పద్ధతులుపోయి స్వాతంత్ర్యము లభించినదన్న విశ్వాసము –ఆత్మతృప్తి ప్రజలలో ఏర్పడగానే వారు అహమహమికతో నడుములు కట్టి, సంతోషముతో, మనసార కార్యరంగములోనికి దుముకగలరు. సర్వనాశనమవుచున్న ఈ

ప్రళయవేళలోనే ఆస్వాతంత్ర్యము రానున్నది. తప్పదు. అయితే, ఈ బాధ్యతను పూనుకొని వహించుటకు ఎట్టివారికైనను నిజముగా దుర్భరమే యనుటలో సందియము లేదు. కాని, ఎన్ని ప్రమాదములు రానున్ననుసరే, వానిని ఎదుర్కొనక తీరదు. బాధ్యత వహింపకయు తీరదు.

పైన సూచించిన మార్పులే గనుక యేర్పడినచో ఈ దేశమునకు స్వతంత్ర దేశములతో సమానమైన ప్రతిపత్తి యేర్పడగలదు. అటుపిమ్మట బ్రిటను భారతదేశముల భవిష్యత్సంబంధములనుగూర్చిన యేర్పాట్లు ఉభయదేశముల ప్రతినిధులును కలిసి చేసుకొనవచ్చును. అధినివేశప్రతిపత్తి యనుమాట చాల పాతగిల్లిపోయిన మాట. అసలా అభిప్రాయమే చాల పాతపడిపోయినది. అది ఎక్కడగాని ఉండుటకు వీలులేదు. ముఖ్యముగా, దానిని భారతదేశమునకు అన్వయించుటకు అసలే వీలులేదు. కాని, సామ్రాజ్యవాదతత్వపుజాడలు సాఫీగా తుడిచివేయబడినవెంటనే భారతదేశము బ్రిటను, తదితర దేశములతో సమాన — ఫాయాలో సహకరించుటకు నిరాక్షేపముగా ఉత్సహింపగలదు.

భారతసేనల భవిష్యత్తు

భారతదేశపు స్వాతంత్ర్యము గుర్తింపబడిన పిమ్మట వెంటనే యేదో వ్యవహారమంతయు తల్లక్రిందులగునని యెంచ నక్కరలేదు. వెనుకటి యేర్పాట్లును, ఒడంబడికలును చాలవరకు యథాపూర్వముగానే కొనసాగుచుండును. పరిపాలకబృందముకూడ, ఏవో కొన్ని వ్యక్తిగతసందర్భములలో తప్ప, దాదాపు యథాపూర్వముగానే యుండును. అయితే, నూతన పరిస్థితుల కనుగుణముగా కొన్ని మార్పులుమాత్రము చేయబడును. భారతసేన తప్పనిసరిగా జాతీయసేనక్రింద మారిపోవలెను. భవిష్యత్తులో ఎప్పుడైనను ఏదైనను ఒక బ్రిటిషు ప్రతిష్ఠాపన ఒకవేళ జరుగవలసివచ్చుచో, అది క్షణక్షణపరిణామములైన అనేకాంశములపై ఆధారపడియుండగలదు. ఇదివరకువలె పరతంత్ర సేనగా మాత్రము అది ఇకముందు ఉండుటకు వీలులేదు. మిత్రరాజ్యసేనగా అది ఒక ప్రత్యేకమైన స్థానము నేర్పరచుకొనగలదు.

నేను సూచించిన ఈ మార్పులను అంగీకరించినయెడల భారతదేశము ఇతరమిత్రరాజ్యములతోపాటు శత్రుదురాక్రమణను పూర్తిగా ఎదిరించి పోరాడితీరగలదు. ఆ పోరాటమునకు ఏయే పద్ధతులు ఎక్కువ ప్రయోజనముగా ఉండునో, ఏయేపద్ధతులు అవలంబింపబడునో ప్రస్తుతము చెప్పుటకు వీలులేదు. ఈ దేశపుసరిహద్దులకవతల పెట్టియున్న సైనికరక్షణ ఉపయోగపడక పోయినచో క్రొత్త సైనికపరిస్థితి యేర్పడగలదు. అది మరింత కష్టసాధ్యమైయుండును. దానికి మరికొన్ని పద్ధతులు అవలంబింపవలసియుండును. మనముకూడ శత్రుదురాక్రమణను ప్రతిఘటించి తీరవలెననియు, శత్రువునకెవరికిని సుతరాము లొంగిపోగూడదనియు ఇతరులవలెనే గాంధీమహాత్ముడుకూడ స్పష్టముగా ప్రకటించినాడు. కాని ఆయనప్రతిఘటనపద్ధతులే వేరు. అవి జగమెరిగినవి. పశుప్రవర్తనాభూయిష్ఠమైన ఈయుద్ధప్రపంచమునందు ఆ శాంతపద్ధతుల నవలంబింపదలచుట స్థూలచక్షువులకు విపరీతముగానే కనబడవచ్చును. కాని, కొన్ని సందర్భములనుబట్టి చూచినచో అంతకన్న వేరుమార్గము లేక అవే మనకు శరణ్యములు కావలసియున్నది. ఏది యెట్లున్నను శత్రుదురాక్రమణకు లొంగిపోగూడదను ప్రధానవిషయములో భిన్నాభిప్రాయములేదు.

ఒక విషయముమాత్రము నిజము. ఈ యుద్ధపరిణామము చివర కేమయినను, భారతదేశము తనమీద ఇతరులపెత్తనపు ప్రయత్నములనన్నింటిని ప్రతిఘటించితీరును. భారతదేశసమస్యను పరిష్కరించని శాంతి చిరకాలము నిలువనేరదు. ఈ బాధ్యత ముఖ్యముగా బ్రిటనుపైన ఉన్నది. కాని, దీని ఫలితములుమట్టుకు ప్రపంచవ్యాప్తములై, ఈ యుద్ధక్రమగతికే అంతరాయము కాగలవు. కావున భారతదేశపు వర్తమాన భవిష్యత్తులను ఏదేశముగాని ఉపేక్షింపజాలదు. ముఖ్యముగా అమెరికా. దానిపైననే ఈ బాధ్యతాభారమంతయు కేంద్రీకరింపబడియున్నది. ప్రపంచచరిత్రలోకెల్ల విషమాతివిషమమైన ఈ ప్రస్తుతఘట్టమునందు సరియైన నాయకత్వము వహించుటకై ఆదేశమువైపు కోట్లకొలది ప్రజలు ఆశాదృష్టులు బరపి శుభావసానమునకై ప్రతీక్షించియున్నారు.

వేదాంతదర్శనము: సమన్వయ వాదము

= శ్రీ పూర్ణానంద =

మహదాఖ్యః స్వయంభూ ర్యో జగదంకుర ఈశ్వరః,
సర్వాత్మనే నమ స్తస్మై విష్ణవే సర్వజిష్ణవే. —సాంఖ్యసారము.

ప్రవేశిక :

ప్రసిద్ధులగు సాంఖ్యమతాచార్యులలో విజ్ఞానభిక్షు వొకడు. ఈయన తదితరగ్రంథములవలె బ్రహ్మసూత్రములకుగూడ నొక భాష్యమును విరచించెను. దాని పేరు 'విజ్ఞానామృతభాష్యము.' ఇందు సాంఖ్య వేదాంతముల సమన్వయ మొనర్చుటకాయన విశేషముగా ప్రయత్నించెను. ఫలితముగా విచిత్రమగు నూతన మతవాద మొకటి నిలబడెను. 'భిక్షు' వను విశేషణ ముండుటవలన ఈయన బౌద్ధభిక్షువేమో యనిపించును. కాని వాస్తవమున కీయన సాంఖ్యమతావలంబి. విశేషమేమనగా, ఈయన సాంఖ్యు లంగీకరింపని ఈశ్వరుని గూడ గ్రహించినాడు. సామాన్యముగా సాంఖ్య దర్శనము నిరీశ్వరమత మనియే ప్రథ. కాని ఈయన అభిప్రాయము: "బ్రహ్మమీమాంస (వేదాంతదర్శనము), యోగ దర్శనముల ముఖ్యోద్దేశ్యము ఈశ్వర ప్రతిపాదన. సాంఖ్యదర్శనోద్దేశ్యము ప్రకృతి-పురుష వివేకము. కనుక, సాంఖ్యులనిరీశ్వరవాదము వ్యావహారికము. యోగవేదాంతముల ఈశ్వరవాదము పారమార్థికము" (చూ: సాంఖ్య ప్రవచన భాష్యము).

మఱియు, ఈయన సాంఖ్యసార, యోగసార, ప్రవచనభాష్యములయం దీశ్వరనమస్కృతి నొనర్చి, తన ఈశ్వరవిశ్వాసమును ప్రకటించియున్నాడు.

ఈ పండితవర్యుని జీవితవిశేషము లన్నియును కాలగర్భమున విలీనములు. క్రీ. శ. ౧౬-వ శతాబ్ద శేషభాగ మీయనజన్మకాల మని ఊహింపవచ్చును.

గ్రంథవివరణి :

'విజ్ఞానామృతభాష్యము'ను ఈయన గురుదక్షిణగా విరచించెను. 'శ్రుతిస్మృతిన్యాయవచఃక్షీరాబ్ధి మథనమున ఈ జ్ఞానామృతము' ఉద్భూతమైనది ఇదియే ఈయన రచించిన గ్రంథములలో లభించు ప్రథమ గ్రంథము. ఈ గ్రంథమున సాంఖ్యప్రవచనభాష్యము పేర్కొనబడినది.

'ఉపదేశరత్నమాల' యను గ్రంథమును ఈయన సూత్రభాష్యమున పేర్కొనియున్నాడు. * కాని, ప్రస్తుత మది అలభ్యము. ఇట్లే, ఈయన రచించిన 'గీతాభాష్యము' లభించుట లేదు. 'ఉపనిషద్భాష్యము' వ్రాతప్రతి యున్నదికాని, అచ్చుకాలేదు.

'సాంఖ్యప్రవచనభాష్యము' అను గ్రంథమువలననే విజ్ఞానభిక్షువు పండితసమాజమున ప్రసిద్ధికెక్కియున్నాడు. ఈగ్రంథము నీయన విజ్ఞానామృతరచనానంతరము విరచించెను.౧ కపిలుని సాంఖ్యసూత్రములకు పూర్వము అనిరుద్ధభట్టు (క్రీ. శ. ౧౫౦౦?) రచించిన వృత్తి యుండెను కాని, అది సంక్షిప్తము. విజ్ఞాన

---

* "అధికం తూపదేశరత్నమాలేఖ్యప్రకరణే ద్రష్టవ్యమ్"
— విజ్ఞానామృతభాష్యమ్.

౧. "అధికంతు బ్రహ్మమీమాంసాభాష్యే
ప్రపంచిత మస్మాభిరితి"
సాం. ప్ర. భా. భూమిక.

భిక్షుని భాష్యమే సూత్రహృదయమును చక్కగా వివరించుచున్నది.

'సాంఖ్యసారము' అను ప్రకరణగ్రంథమునుగూడ విజ్ఞానభిక్షువు విరచించెను. ఇందు మొత్తము తొమ్మిది ప్రకరణము లున్నవి. అందు మొదటిమూడును గద్యమునను, తక్కినవి శ్లోకములతోడను సమకూర్పబడినవి. ఈగ్రంథము ప్రవచనభాష్యానంతరకృతి. ౧

'యోగవార్తికము' అను గ్రంథము పతంజలి యోగసూత్రములకు వ్యాసుడు వ్రాసిన భాష్యమునకు టీక. ఇదికూడ సాంఖ్యప్రవచనభాష్యమువలెనే కడుం గడు ప్రసిద్ధము.

'యోగసారము' అను గ్రంథము యోగశాస్త్ర ప్రకరణగ్రంథము. ఈసంక్షిప్తగ్రంథమున యోగమతము వివరింపబడినది.

ఈగ్రంథము లన్నియు ప్రస్తుతవ్యాసప్రయోజనమునకు బహిర్భూతములు. కేవలము 'విజ్ఞానామృత భాష్యము' నాధారపరచుకొనియే ఏతదాచార్యుని వేదాంతనిరుక్తిని వివరింతును.

బ్రహ్మము, లేక ఆత్మ:

ఆత్మ కేవలము; ఈశ్వరపదవాచ్యము. సృష్టికి పూర్వము అది యొక్కటియే యుండెను. మాయ ఈశ్వరుని శక్తి. ఈశక్తిబలముననే ఈశ్వరుడు సర్వేశ్వరుడు. ఈయన క్లేశకర్మవిపాకాదులవలన అసంస్పృష్టుడు. సశక్తికుడైనను నిర్గుణుడు. అంతస్థప్రకృతిపురుష సాహాయ్యమున నీయన మహదాదులను సృష్టించుచున్నాడు. ఊర్ణనాభితంతువిస్తృతిని బోలునది ఈ సృష్టి. సేవ, అపరాధముల ఫలములను రాజొసగునట్లు ఈయన కర్మఫలముల నొసగుచున్నాడు. ప్రళయ సమయమున జీవజగత్తులను తనలోనికి ఉపసంహరించుకొని అద్వితీయు డగును. సముద్రమున తరంగబుద్బుదములు లీనమగునట్లు జగత్తు ఈయనలో లీనమగుచున్నది. అప్పు డన్నియును ఇంద్రజాలసమములై, వాచారంభణమాత్రములే యగును.

జీవులు:

జీవు లందఱును సూర్యకిరణములవలె బ్రహ్మము యొక్క అంశములు. ప్రకృతి, తద్గతగుణములు, జీవులు, తత్సత్త, తత్స్ఫూర్తి ఈశ్వరాధీనములు. ప్రకృతి, గుణములు, జీవులును స్వప్నవిషయములవలె దృశ్యములు. వీనికి స్వతఃసిద్ధత్వము లేదు—పారమార్థిక సత్తావిహీనములు. జీవుని చైతన్యాంశము బ్రహ్మముతో సమానము. ఈశ్వరుడే పంచవింశతితత్త్వముల ఆత్మ. జీవుని జీవాంశము—చేతనాంశము విడువ మిగులునది—జడమను అనాత్మ. నిఖిలవేదాంతవాక్యప్రతిపాద్యమగు ఈ పరబ్రహ్మమును 'సమహాత్మేతి', 'సోహమితి' అని జీవుడు గ్రహించును. జీవమాయాదులనుండి వేరగు ఆత్మ నిట్లు గ్రహించి, అవిద్యాకామకర్మాదులు క్షయముకాగా దుఃఖము లన్నిటినుండి ఈజీవితముననే విడివడును. జీవబ్రహ్మముల అంశాంశిభావము అగ్ని—స్ఫులింగములవలె. జీవునకును, ఆకాశాదులకును విభుత్వము, అనగా వ్యాపకత్వము లేదు. పితాపుత్రన్యాయముగా జీవబ్రహ్మముల అవిభాగము గ్రహణీయము.

మోక్షధర్మములలో వ్యాసదేవుడు పురుషబహుత్వమును అంగీకరించియు, బహుపురుషుల జన్మకు ఒకే పురుషుడు కారణమైనట్లు విశ్వయోనియగు పురుషునొక్కనినే పితాపుత్రన్యాయమున సూచించియున్నాడు. 'మాయాంతు ప్రకృతిం' (శ్వే. ఉప), 'యథా సుదీప్తాత్ పావకాత్' (ముం. ఉప) 'వాలాగ్రశతభాగస్య' (కఠ. ఉప) అను శ్రుతులును ఈ అంశాంశిభావమునే దృఢపరచుచున్నవి. ఈ అంశాంశిభావము భేదప్రతిపాదనా ఫలకము. ఉత్సర్గబలమున అంశిఅంశముల ఏకరూపత, జీవుని అసంసారిత్వ, విభుత్వ, సర్వాధారత్వములు నిర్దిష్టములు. భేదాభేదము అవిభాగపరము.

భేదాభేదము:

కేవలము తత్త్వమస్యాది వాక్యప్రోక్తమగు అభేదజ్ఞానమువలననే ముక్తి చేకూరదు. భేదజ్ఞానముకూడ అవసరము. 'పృథగాత్మానం' (క. ఉప) అను శ్రుతి భేద

౧. "సాంఖ్యభాష్యే ప్రకృత్యాదేః
స్వరూపం విస్తరాన్మయా,
ప్రోక్తం తస్మాత్తదప్యత్ర
సంక్షేపాదేవ వక్ష్యతే."
— సాంఖ్యసారము.

జ్ఞానఫలమునుగూడ ముక్తియనుచున్నది. భేదజ్ఞాన మనగా ఈశ్వరుని నుండి వేరుగా గ్రహించుట. అందువలన ఈ భేదజ్ఞానము అవిద్యానివర్తక మై మోక్షహేతు వగుచున్నది. 'సత్యేన లభ్య స్తపసా' (ముం. ఉప) 'తతో మాం తత్త్వతో జ్ఞాత్వా' అను శ్రుతిస్మృతు లీ విషయమున ప్రమాణములు. మఱియు,

"ప్రధానపురుషవ్యక్త
కాలానాం పరమం హి యత్,
పశ్యంతి సూరయః శుద్ధం
త ద్విష్ణోః పరమం పదమ్"
అను శ్లోకముగూడ గమనింపనగును.

అభేదవాక్యములు సాక్షాత్ అవిద్యానివర్తకములు కావు. కాని, ఈ వాక్యములను బ్రహ్మాత్మతా బోధక వాక్యశేషములుగా పరిగ్రహింపనగును. అభేదజ్ఞానము 'అహం దుఃఖీ' ఇత్యాదిలక్షణమగు అవిద్యను తొలగింపజాలకున్నది. ఒకేఆకాశమున శబ్దము తదభావముల ఉనికి అసంభవమైనట్లు, ఒకే ఆత్మయందు భావాభావము లసంభవములు. కనుక, భేదవాక్యములు వివేకపరములు, అభేదవాక్యములు అవిభాగ (ఏకత్వ) నిర్దేశకములు. ప్రతిబింబ, అవచ్ఛేదకవాక్యబలమున ముక్తి సంభవము కాదు. వివేకజ్ఞానమే ముక్తి. ఐక్యజ్ఞానము కాదు.

జగత్తు :

బ్రహ్మము జగత్తుయొక్క అధిష్ఠానకారణము. ప్రకృతి బ్రహ్మమునుండి అవిభక్తము. బ్రహ్మము స్వావిభక్తములగు ప్రకృత్యాదుల సాక్షిస్వరూపముగ ఉపష్టంభకము. కనుక, బ్రహ్మము జగత్కారణ మైనను నిర్వికారము. ప్రకృతిపురుషాదులు సృష్టికి పూర్వము లేకుండుటవలన సాక్షిత్వము వానియందు ప్రసజ్యము కాదు.[3] అధిష్ఠాన కారణ మనగా: ఎద్దానియందు అవిభక్తముగా వెలయుచు, దేని బలమున ఉపష్టబ్ధమై, ఉపాదానకారణము కార్యాకారమున పరిణత మగుచున్నదో అది. సృష్టికి పూర్వము పృథివీతన్మాత్ర జలమున అవిభక్తముగా నుండి, తద్ద్వారా ఉపష్టబ్ధమై, పృథివిగా పరిణామము నందుచున్నది.[4] ఇట్లే, చిన్మాత్రబ్రహ్మమున జగత్తుయొక్క ఉపాదానత్వ—అభేదత్వములు ఉపపన్నము లగుచున్నవి.[5]

బ్రహ్మము జగత్తుయొక్క సమవాయి, అసమవాయి, లేక నిమిత్తకారణములలో ఏ ఒక కారణము కాదు. వీటికంటె వేరగు అసమవాయికారణము. ఇట్లే వైశేషికులుగూడ అధిష్ఠానకారణము యొక్క నిమిత్తకారణత్వమును గ్రహించుచున్నారు. తదితర వ్యాఖ్యాత లభివర్ణించిన కారణత్వముకంటె కారణమగు తన కారణవ్యాఖ్యనుబట్టించి విజ్ఞానభిక్షువే ఇట్లు వచించియున్నాడు :

"సంభవ త్యవిరోధే సృష్టిప్రక్రియాయాం వైశేషికసాంఖ్యయో రుభయో స్తత్ర విరోధా న్నాచిత్యాదితి. వైశేషికాదిభిర పీదృశం బ్రహ్మణః కారణత్వ మిష్యత ఏవ. పరంతు తై రిదమపి నిమిత్తకారణతేతి పరిభాష్యతే. అస్మాభిస్తు సమవాయ్యసమవాయిభ్యా ముదాసీనం నిమిత్తకారణేభ్యశ్చ విలక్షణ తయా చతుర్థ మాధారకారణత్వమితి"

ఈశ్వరుడు :

విద్యారణ్యులు 'విశుద్ధసత్త్వప్రధాను' డని చెప్పిన ఈశ్వరునితో "క్లేశకర్మవిపాకాశయైః అపరామృష్టః" అను పతంజలిఈశ్వరుని కలిపి, పైన 'సశక్తిక' విశేషణమును వైచి విజ్ఞానభిక్షువు తన

3. "బ్రహ్మణశ్చ స్వావిభక్త ప్రకృత్యాద్యుపష్టంభకత్వం సాక్షితామాత్రేణేతి జగత్కారణత్వేపి న బ్రహ్మణో వికారిత్వం, నహి ప్రకృతిపురుషాది వ్యతిప్రసంగః"

౪. "తదేవాధిష్ఠానకారణం కార్యాకారేణ పరిణమతే, యథా సర్గాదౌ జలాఽవిభక్తాః పార్థివ సూక్ష్మాంశా స్తన్మాత్రాఖ్యాః జలేనై వోపష్టంభాత్ పృథివ్యాకారేణ పరిణమంత ఇత్యతో జలం మహాపృథివ్యా అధిష్ఠానకారణ మితి"

౫. "అత ఏవావికారి చిన్మాత్రత్వేపి బ్రహ్మణో జగదుపాదానత్వం జగదభేద శ్చోపపద్యతే."

— విజ్ఞానామృతభాష్యము.

ఈశ్వరుని సృష్టించుకొనినాడు. ఈయన అచింత్య రచనాత్మకుడు. ఈ రచన యన్నదో షడ్విధ భావ వికారములతో గూడుకొనినది. ఇయ్యది ఆయనయం దంతర్లీనమైన ప్రకృతి-పురుషులవలన కలుగుచున్నది.౬

సాధన :

ఈయన జ్ఞానకర్మ సముచ్చయవాది. కర్మవిశిష్ట మగు జ్ఞానమోక్షసాధనత్వమును అంగీకరించినాడు. శ్రుతి "ఆత్మక్రీడః ఆత్మరతిః క్రియావా నేష బ్రహ్మవిదాం వరిష్ఠః" అని ఆత్మారాముడగు విద్వాంసుని యొక్క క్రియనుగూడ దర్శించుచున్నది. మఱియు, "అంధంతమః ప్రవిశంతి" (ఈ. ఉప.)" విద్యాంచా విద్యాంచ" (ఈ. ఉప) అను శ్రుతులును,

"జ్ఞానినాఽజ్ఞానినా వాపి
యావ ద్దేహస్య ధారణమ్,
తావ ద్వర్ణాశ్రమప్రోక్తం
కర్తవ్యం కర్మ ముక్తయే."
జ్ఞానేనైవ సహితాని
నిత్యకర్మాణి కుర్వతః,
నివృత్తఫలతృ ష్ణస్య
ముక్తి స్తస్య కరే స్థితా"

అనుస్మృతులును మోక్షసాధనముగా సముచ్చయమును ఉపదేశించుచున్నవి.

ముక్తి :

ఈశ్వరునితో నేకీభావము పొందుట ముక్తి కాదు. ముక్తపురుషులకు ఈశ్వరునితో సమముగ ముక్తి లభింపదు. మహాపురుషులు ఈశ్వర-సమాన భోగమును పొందుదురు. ఈశ్వరసాయుజ్య మనగా, సమానభోగము. "సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితేతి", "సయైథైతాం దేవతాం సర్వాణి భూతా న్యవంతి ఏవం హైవంసం సర్వాణి భూతా న్యవంతి తేన ఏతస్యై దేవతాయై సాయుజ్యం సలోకతాం జయతీతి" అను శ్రుతులీ విషయమునే తెలుపుచున్నవి. కనుక, సృష్ట్యధికారము కేవల మీశ్వరున కొక్కనికే యున్నదని గ్రహింపవలెను. సాయుజ్య మనగా, ఉపాస్యమున ప్రవేశించి దానితో ఏకీభావరూపమగు భోగము ననుభవించుట. కార్య బ్రహ్మమును బొందువారి అపునరావృత్తి ఔత్సర్గికము; కారణబ్రహ్మమును బొందువారి అపునరావృత్తి నియతము. జీవన్ముక్తి సంభవము. -

అనుశీలన :

సాంఖ్యవేదాంతసిద్ధాంతములను గలిపి, విచిత్ర మగు ఈ సిద్ధాంతములను విజ్ఞానభిక్షువు ప్రతిపాదించినాడు. విజ్ఞానభిక్షువు వేదాంతుల 'అధిష్ఠానము'ను గైకొని దానియందు సాంఖ్యుల ప్రకృతి అవిభక్తముగ నుండునని చెప్పియున్నాడు. సాంఖ్యుల ప్రకృతి ఆత్మ నుండి వేరు. విజ్ఞానభిక్షుని ప్రకృతి బ్రహ్మముయొక్క శక్తి. సాంఖ్యుల సాక్షిత్వమే ఉపష్టంభకమైనది. ఇట్లు ఈతడు జగత్తుయొక్క సత్యత్వము, బ్రహ్మముయొక్క నిర్గుణత్వమును ప్రతిపాదింపచూపిన కారణములు విచిత్రములు.

పతంజలిఈశ్వరుడు ఉదాసీనుడు. ఆయనకు జీవులతో నేమియు సంబంధము లేదు. వేదాంతుల ఈశ్వరుడు అంతర్యామి. ఈవేదాంతుల ఈశ్వరునకు విజ్ఞానభిక్షువు సాంఖ్యుల వేషమును అలంకరించినాడు. మఱియు, ఈయన జీవేశ్వరుల సంబంధమును నిర్ణయించిన రీతిని జూచిన, నింబార్క - భాస్కరుల భేదాభేదసిద్ధాంతము గుర్తుకురాగలదు. ఇది వేదాంతాకరణమున సాంఖ్యమన్న దోషము లేదు.

వాదవైఖరి ఎట్లున్నను, ఈయనయొక్క సమన్వయప్రచేష్ట ప్రశంసనీయము.

౬. అస్య జగతో నామరూపాభ్యాం వ్యాకృతస్య చేతనాచేతనరూపస్య ప్రతినియతదేశకాల సంస్థాన వ్యాపారాదిమతోఽచింత్య రచనాత్మకస్య జాయతేఽస్తి వర్ధతే విపరిణమతేఽపక్షీయతే వినశ్యతీత్యేవం రూపం జన్మాదిషట్కం యతః పరమేశ్వరా దంతర్లీన ప్రకృతి పురుషా దఖిలశక్తికాత్ స్వతశ్చిన్మాత్రాద్విశుద్ధసత్త్వాఖ్యామయోపాధికాత్ క్లేశకర్మ విపాకాశయై రపరామృష్టా చ్చేతనవిశేషాద్ భవతి ఇ౬"

—విజ్ఞానామృతభాష్యము.

కలగూరగంప

రాముడు ఏకపత్నీవ్రతుడా, బహుపత్నీకుడా?

శ్రీ సురవరము ప్రతాపరెడ్డిగారు ఇటీవల వెలువడిన 'విభూతి'సంచికలో 'రామాయణ విశేషములు' అను శీర్షికతో వ్రాసిన వ్యాసమునుండి యిది యుద్ధరింపబడినది:

"దశరథుని బహుభార్యాత్వము సువ్యక్తమే కాని రామాదిసోదరులకును పెక్కుభార్యలుండిరా లేదా అని విచారింతము. పారంపర్యముగా వచ్చు, హిందువులభావనలో శ్రీరాముడును, అతనిసోదరులును ఏకపత్నీవ్రతులై యుండిరి. అయితే రామాయణములో మూడుతావుల రామభరతులకు బహుభార్యలుండినట్లు అనుమానము కలుగుచున్నది. వ్యాఖ్యాత లది కాదన్నారు. మంథర కైకేయి కిట్లు బోధచేసెను: "రాముడు అభిషిక్తుడైనచో అతని యుత్తమస్త్రీలు ఆనందింతురు. నీభరతునికి దుర్గతికలుగును. నీకోడండ్రందరును ఆనందరహిత లగుదురు" (అయో. ౮–౧౨) దీనినిబట్టి రామునికి సీతయేకాక ఇతర భార్యలును ఉండిరనియు, భరతునికి చాలామంది భార్యలుండిరనియు అర్థమగుచున్నది. సుందరకాండలో సీతాదేవి హనుమంతునితో రాముని కిట్లు సందేశ మంపెను:

"పితుర్నిదేశం నియమేన కృత్వా
వనాన్నివృత్తశ్చరితవ్రతశ్చ,
స్త్రీభిశ్చమన్యే విపులేక్షణాభి
స్త్వం రంస్యసే వీతభయః కృతార్థః"

(నాగతియేమో ఇల్లయినది. రాముని కేమి కొదువ? అతడు తన వనవాసకాలానంతరము తన ఉత్తమస్త్రీలను పొంది రమించుచు సుఖముగా ఉండగలడు.)

అని సీత యన్నది.

లంకకు దారి కోరినవాడై సముద్రుని ప్రసన్నునిగా చేసికొనుటకై రాముడు దర్భశయ్యపై పరుండెను. అప్పుడు తన దక్షిణబాహువును తలగడగా చేసుకొని పరుండెను. ఆబాహువు "ఉత్తమస్త్రీలచేత బహువిధాల ఆలింగనము చేయబడియుండినట్టిది" (భుజైః పరమనారీణా మభిసృష్ట మనేకధా) అని కవి వర్ణించినాడు. ఈమూడువాక్యాలను వ్యాఖ్యాత లిట్లు సమన్వయించుచు "ఉత్తమస్త్రీ లనగా పరిచారిక లని అర్థము చేసుకొనుడు. లేదా భూలక్ష్మ్యాదు లనియైనా సరిపెట్టుకొనుడు" అని వ్రాసినారు. రాముడు ఉత్తరకాండలో యజ్ఞముచేసెనని తెలిపినారు. యజ్ఞకర్తకు నలుగురుభార్య లుండవలెను. ఈవర్ణన లన్నియు ప్రక్షిప్తము లనవలెనా? లేక వ్యాఖ్యాతల అభిప్రాయముప్రకారము సమన్వయించుకొనవలెనా? చెప్పజాలము. ఎట్లయితేనేమి, పారంపర్యముగా వచ్చు జనాభిప్రాయప్రకారము రామసోదరులు ఏకపత్నీవ్రతు లనుటకే ఎక్కువప్రమాణము లున్నవనుటలో సందేహము లేదు."

రామాయణములో చదరంగము

ఇదికూడపై 'విభూతి'లోని ప్రతాపరెడ్డిగారి రామాయణ వ్యాసమునుండియే గ్రహింపబడినది :

"(రామాయణకాలమున) నగరాలలో జనులు జూదమాడుచుండిరి. "చిత్రా మష్టాపదాకారాం..."

(బాల. ౫–౧౬) అని వర్ణించినారు. ఇందు 'అష్టాపదం' అంటే జూదమాడెడిపీట అని వ్యాఖ్యాతలు వ్రాసినారు. ఈపీట యెట్టిదో, ఇదెట్టిజూదమో తెలుపలేదు. ఇది చతురంగపుఆట ఆడు పలక అని నేననుకొంటాను. చతురంగపుపీటలో ఎనిమిది ఇండ్లు—ఎనిమిది పంక్తులు, ఒక్కొక్క పంక్తిలో ఎనిమిదిండ్లు ఉండును. శబ్దకల్పద్రుమములో 'అష్టాపదం' అనుపదానికిట్లర్థము వ్రాసినారు: "పంక్తౌపంక్తౌ అష్టౌపదాని యస్యేతివా." కావున ఇది చతురంగపు ఆట అని నేను భావించుచున్నాను. ఇది సరియగు ఊహయగుచో చతురంగ ప్రాచీనత ఇందు స్పష్టమగుచున్నది. చతురంగమునకు భిన్నమై జూదముగా భావింపబడిన ఆటకు అక్షము అనుచుండిరి. అది నింద్యముగా భావింపబడుచుండెను. ఇదే రామాయణమందు భరతుడు కౌసల్యతో తాను రాముని అడవికి పంపుట కంగీకరించినచో మద్యపానము, పరస్త్రీసంగమము, అక్షఖేలనము (జూదము) చేసినపాపము పొందుదునుగాక అని శపథము చేసెను. (అయో. ౭౫–౪౧)."

మగన్ దీపము


'కృషి'పత్రికలో దీని వివరము లిట్లు తెలుపబడియున్నవి:

"హిందూదేశమందు దొరకని పదార్థాలలో కిరసనాయిలు ఒకటి. ఈ రోజులు కిరసనాయిలు కరవు రోజులు. ఏ దేశమునుంచీకూడా మనకు కావలసిన కిరసనాయిలు రావడంలేదు.

ఎలెక్ట్రిసిటీ దేశమంతటా ఇంకా ప్రాకలేదు. ఉన్న ఊళ్లలోనే ఉపయోగించుకొనేవారు బహు తక్కువ. వెనకటిరోజులలో ఎలెక్ట్రిసిటీకంటె కిరసనాయిలు చవుక. ఇప్పుడు కిరసనాయిలుకంటె మనిషి రక్తం చవుక.

దీపాలులేక—కిరసనాయిలు కొనుక్కోలేక—దొరకక...ప్రజలు అల్లాడిపోతున్నారు. రోజల్లా పనిమానుకొని రెండురోజుల కూలి పెడితేనే గాని పావుశేరు కిరసనాయిలు సంపాయించుకోవడం కష్టమవుతున్నది.


ఇటువంటి అత్యవసరసమయంలో 'మగన్‌దీపం' కనిపెట్టబడింది. జె. సి. కుమారప్పగారు దీనితయారును గురించి, పనిచేసే విధానాన్ని గురించి ఒక పెద్ద వ్యాసాన్ని ప్రచురించినారు. అఖిలభారత గ్రామపారిశ్రామికసంఘంవారు ఈ లాంతర్లను విరివిగా తయారు చేయించి ప్రజలకు అందుబాటులో ఉంచితే చాలా మంచిది.



ఇప్పటి హరికేన్ లాంతరు

ఇది కిరసనాయిలులాంతరులాగే ఉంటుంది. అదే లాంతరును 'మగన్‌దీపము'గా తయారు చెయ్యవచ్చు. కిరసనాయిలును వత్తి క్రిందనుంచి పీల్చుకొంటుంది. మగన్‌దీపములో ఏనూనె నయినా ఉపయోగించ

వచ్చును. మామూలు నూనెలను వత్తి పీల్చుకొనదు. కాబట్టి నూనె వత్తిదగ్గరకు ప్రవహించవలెను. అందు



మగన్ దీపము

చేత వత్తికంటె ఎత్తయిన స్థలములో నూనె 'టాంకు' ఉండవలెను.

కిరసనాయిలుటాంకు స్థలము ఖాళీగానే ఉంటుంది. లాంతరును పట్టుకునేటందుకు ఉపయోగించే రెండు స్తంభాలలోను ఒకటి టాంకుగా ఉపయోగపడుతుంది. ఆ స్తంభము, ఎక్కువనూనె పట్టేటందుకు, పెద్దదిగా చేయబడివుంటుంది. ఈ టాంకులోనుంచి ఒక చిన్న కాలువ వత్తిలోకి వెడుతుంది.

కిరసనాయిలుటాంకు అడుగుభాగము తీసివేసి బర్నరుకు అడుగున చిల్లులలోనుంచి గాలి వచ్చేటట్లు చేయవచ్చును.

ఈ మగన్ దీపానికి మనదేశములో పండే ఏనూనె అయినా పనికివస్తుంది. కాని ఖరీదు బాగా తక్కువై, మరొకందుకు పనికిరానినూనెలు వాడుకుంటేమంచిది. అవిసె, వేప, గానుగ, మద్ది, మొక్కజీడి, బ్రహ్మదండి, ఆవ, వావింట, ఇప్ప, గురివింద మొదలైన నూనె నిచ్చే గింజలన్నీ ఇప్పుడు ఉపయోగపడతాయి. వీటిలో చాలావాటిని మనము వృథాగా నేలపాలు చేస్తున్నాము. ఈగింజ లయిపోతాయనే భయములేదు. భారతదేశము నూనెగింజల పంటను ఎంతకావలిస్తే అంతా ఇవ్వగలదు.

ఈ 'మగన్ దీపము' కిరసనాయిలుదీపంకంటే తక్కువకాంతి నిస్తుంది. అలాగే నూనెకూడ అంతకంటె తక్కువగానే పీలుస్తుంది.

కటికచీకటిలో చిందులాడేకంటె, దొంగలబాధలు పడేకంటె, ఆకలితో అటమటించిపోయే కరువురోజులలో కిరసనాయిలు విపరీతమైన ధర ఇచ్చి కొనేకంటె ఈ మగన్ దీపాన్ని, కొంచెం కాంతి తక్కువయినా, ఉపయోగించడం మంచిది."

* * *

[ఇదేవైఖరితో 'రామదీప'మను పేరున ఇంకొకరకపు దీపమునుకూడ ఇటీవలనే వేమూరి విశ్వనాథ శర్మగారు తయారుచేసినారని తెలియుచున్నది. మద్రాసుప్రభుత్వమువారు దీనికి యథోచితమైన ప్రోత్సాహముకూడ ఇచ్చుచున్నట్లు తెలిసినది. ఒక విషయములో ఇది మగన్ దీపముకంటె మించినదని కూడ తెలిసినది. మగన్ దీపము విత్తునూనెలకే ఉపయోగపడును. నూనెతొట్టె దానికి పైతట్టుగానే ఉండును. రామదీపము విత్తునూనెలకును, కిరసనాయిలుకునుకూడ ఉపయోగించునట. ఏది లభ్యమైనప్పుడు దానినే ఉపయోగించవచ్చునట. అనగా, ఇది ఉభయథా ప్రయోజనకర మన్నమాట. దీనిలో నూనెతొట్టె పైతట్టుగా కాక క్రిందుగానే యుండునట.

ఏదో ఈయుద్ధపరిస్థితులనుబట్టియైనను ఇటువంటిదీపములు బయలువెడలి, విస్తారముగా వ్యాప్తి చెందినచో సాలీనా సుమారు ౧౦ కోట్ల ద్రవ్యము పరదేశాలకు పోకుండ మనరాష్ట్రములోనే మిగిలిపోగలదు. భారతజ్యోతికి ప్రకాశముకూడ బహుళముగా ఏర్పడగలదు.]

స్మృతివీథి

'స్వైరవిహారి'

లలితనవారవిందవిసరమ్మును శీకరపాళికాముహూ
ర్ములదతిలోకభంగము, విశాలసమున్నతసైకతమ్మునై
యలరెడునీరజాకరమునందునఁ గాంచెదువేళ దాని చా
యల నదియేమొ? తోఁచు భవదంఘ్రులె మత్స్మృతివీథిలోఁ బ్రభూ!

అలఁతియలంతిమబ్బుతెరలందు నణంగియున్నైన చిన్ని న
వ్వ్యలపువు లెన్నొ నేలపయిఁ బోసి విలాసము సూపి ఏడకో
వెలలుచు నింతవంత నిడి, వెంటనె తోఁచి హసించు నిందు జా
బిలిఁ గనునప్పుడెల్ల స్మృతి వీడదు త్వన్మృదుహాస మోప్రభూ!

గలగలలాడు నిర్ఝరముఁ గాంచెదువేళల— మేఘరాజు చం
చలదరిఁ జేరనేగు రథశబ్దము విన్నపు డెల్ల— మాగృహ
స్థలి కెపుడో కృపార్తిఁ బరితాపము వాపఁగ నీవు వచ్చిన
ట్టులె స్మృతివీథిఁ దోఁచుట లెటుల్ పొసఁగున్? పలుకాడవా ప్రభూ!

తలఁపులలోన సుంతయు వృథాభయమన్నది లేక స్వైర ని
ర్మలమృదుభావసంకలితమానసులై చరియించు చిన్ని పా
పలఁ గనునప్పుడెల్ల నొకపాటియు భేదములేక నిన్ను నేఁ
గలిసి యవేవొ ఆటలనె కాలము పుచ్చుట తోఁచు నోప్రభూ!

కలలను నిన్నొకింత కనఁగల్గుదు, చక్కఁగఁ జూచినంతఁ బూ
వులు, సెలయేళ్లు, తేనియలు, పుల్గులుమాత్రమె కానిపించు, న
వ్వాని కిటు చూపు దంచుఁ దలపోసిన మత్స్మృతివీథియందు నీ
వలఁతిగ నిట్టులీ ప్రకృతియందునె నిల్చుట తోఁచు నో ప్రభూ!

ఎన్నఁడు నిన్నుఁగూడి వసియించెడు పున్నెము నొందకున్న న
న్నెన్నఁడు నీవు వీడనటు లీ ప్రకృతిప్రభయెల్ల నీవె యౌ*
నన్నటు తోఁచు, నైన నసమగ్రమె దర్శనభాగ్య మయ్యె దీ
వ్యన్నిజమూర్తి సర్వము కృపార్తతఁ గాంచఁ గనీయవా ప్రభూ!



విమర్శనము

పరతత్త్వరసాయనము

ఈశ్వరభణిభట్టు విరచితము. సంపాదకులు: కోరాడ రామకృష్ణయ్య, ఎం. ఏ., శ్రీపాద లక్ష్మీపతి శాస్త్రిగార్లు, తెలుగుశాఖ, ప్రాచ్యపరిశోధన సంస్థ, మద్రాసువిశ్వవిద్యాలయము. వెల రూ. ౧-౮-౦.

సాహిత్యమును, తత్త్వశాస్త్రమును పాశ్చాత్య రచయితలలో పల్వురు వేఱుచేసినను భారతమహారచయితలు వాని యాశయములందు వ్యత్యాసములు లేవని తెలిపి, రెండింటిని ఆధ్యాత్మికదృష్టితో వీక్షించిరి. శృంగారసౌందర్యములను గ్రీకుకవులును, భారతకవులును ప్రత్యేకదృక్పథములతో విలోకించిరి. గ్రీకుసంప్రదాయము (**Hellenism**) విశేషించి శారీరకసౌందర్యము నగ్గడించినది. ఇంద్రియోద్రేకమే కవితోద్వేగమని తలచినది. కీట్సుప్రభృతు లీసంప్రదాయమునకు అంజలిఘటించిరి. భారతసంప్రదాయము హృదయసౌందర్యమునకును, దీని యుపాసనమునకును (**Mysticism**) ప్రాముఖ్య మొసగినది. ఈ యుపాసన మానందవ్రతమునకు మాఱుపేరైనది. సుఖ మైహికమైనదనియు, ఇంద్రియసముద్భవమైనదనియు, ఆత్మ ఆధ్యాత్మికమైనదనియు సౌందర్యవ్రతమున బద్ధదీక్షితులైనవా రెఱుగుదురు. హృదయసౌందర్యము ఆధ్యాత్మికసౌందర్యమునకు పర్యాయపదము. గ్రీకుకవులు పల్వురు సురాదేవత (**Bacchus**) ను ఆరాధించిరి. (ఉమార్‌ఖయామ్‌ప్రభృతులును పానపాత్రమును చేబూనిరి) భారతకవులు అమృతకలశము హృదయములం దిడికొనిరి. స్వీయరచనములందు పీయూషధారలను వెలారించిరి. వీరు జితేంద్రియులు. ఆధ్యాత్మికశక్తి సారథియై, మానసరజ్జువును చేబూని, దశేంద్రియహయములను క్రమపంథయందు ధర్మక్షేత్రమున నడపినది. ఉత్కృష్టక్రియాసఫలతకు జనయిత్రి కాజాలు భావశబలతను భారతకవులు సృష్టించిరి. ఈరీతిభావక్రియలకు మార్గదర్శకుడు శ్రీకృష్ణుడు. అతడు గీతాచార్యుడనియు, క్రియాక్షేత్రమున పార్థసారథి యనియు భువనము లెఱుగును. సనాతనసాహిత్యసంప్రదాయమునకు గీతాచార్యుడు ఘనతరప్రాభవమును చేకూర్చెను. మతశాస్త్ర తత్త్వశాస్త్ర సాహిత్యములు గీతయందు ముగురమ్మలట్లు అవార్యసంబంధమున గలసినవి.

శాస్త్రరచనమును, కళాసృష్టియును సాధారణముగా ప్రత్యేకరీతుల నడచుట నిక్కమే! కళకు గల మంత్రశక్తిచే ననుము, దండి తెలిపిన నైసర్గికశక్తిచే ననుడు- భారతకవులు కొందఱు ప్రత్యేకము లట్లు తోచు శాస్త్రమునకును, కళకును కావ్యసృష్టియందు చక్కని సమన్వయమును గలిగించిరి. సామాన్యకవు లీ కర్జమునకు పూనుకొనినయెడల అపజయము నందియుందురు. పాండితీవిజృంభణము కళాసౌందర్యమునకు ముప్పుదెచ్చితీఱును. ఇట్టి విజృంభణమును తల సూపనీయక (కళాకౌశలము ప్రధానముగ హృదయశక్తికి సంబంధించినది కావున) హృదయశక్తివెనుకనే మేధాశక్తిని నిలిపి, భారతమహాకవులు తాము తన్మయత్వము నంది, పఠితల హృదయములం దాధ్యాత్మికోద్వేగమును నింపిరి. ఆదర్శభారతకావ్యములను పరిశీలించినపుడు ఈయంశమును దృష్టాంతీకరించు ఘట్టములు మానసగోచరమగును. రామాయణమున వర్ణింపబడిన వనవాటికలును, కుంజవీథులును శృంగారరసప్లావితము లైనవి.

ఆంధ్రప్రబంధ రచయితలలో కొందఱు పూర్వోక్తసాహిత్య సంప్రదాయము ననుసరించిరి. కొందఱు (తమ్ము పోషించువారి ప్రకృతిపై కన్ను వేసి యనుడు, తమ చరిత్రలోని లోపముచే ననుడు) పచ్చిశృంగారమునకు చేయిచేసికొనిరి. మహిమోపేతమైన మొదటివర్గమునకు చెందినవారు ప్రబోధచంద్రోదయ-సీతారామాంజనేయసంవాదాది గ్రంథములను రచించిన భావోపాసకులు. ఈశ్వర ఫణిభట్టు వీరి బృందములోనివాడు. విష్ణుభక్తి సాంఖ్యయోగములు మనుజునకు ముక్తిని ప్రసాదించునని తెలుపుట ఈతని యాశయము. ఇట్లని మాకంటికి సనత్కుమారుడు తెలిపెనని ధర్మరాజునకు భీష్ముడెఱిగించెనని నైమిశారణ్యమున శౌనకాదిమహామునులకు సూతుడు తెలిపెను. గ్రంథకర్త వైష్ణవుడు; గురుదేవుడైన సదానందావధూత నారాయణుడే యని నమ్మెను. అర్థమును, ప్రాణమును, మనమును, కాయమును-చెప్పనేల, తన సర్వస్వమును ఆచార్యునకు సమర్పింప నుద్యుక్తుడైనాడు. ఈ గ్రంథము నాతనికే సమర్పించినాడు. తన గ్రంథమున తాత్త్వికాంశములను దెలిపియు జటిల పదప్రయోగ మొనరింపక పురాణశైలి ననుసరించి, ఫణిభట్టు తన రచనమును రసభరిత మొనరించినాడు. ప్రబంధయుగమున మనియుండుటచే యుగసంప్రదాయముపై మనసుంచి పురవర్ణనముతోడను, వివిధప్రకృతివర్ణనములతోడను తన గ్రంథమును సౌందర్యసంశోభిత మొనరించినాడు. మహాభక్తుడగుటచే పోతనదృష్టాంతమును మేలుబంతి జేసికొనినాడు. పెక్కుపద్యములందు భాగవత గ్రంథకర్తశైలి ననుకరించినాడు. ఈకవిశిల్పకౌశలమును, కళానైపుణ్యమును ప్రశంసనీయములు. ఈతని శైలి హృద్యమైనది. ఈ పంక్తులను పరిశీలింపుడు.

"పుష్పకోరక ఫలాంచితసాల లతానికుంజముల్
తావలమైన యాశ్రమము" (పుట ౨౨)

"నెఱికప్పు నెఱికొప్పు సరిబాపి చంద్రక
హరిచాపముల బర్హి జలధరముల
ముద్దుమోములయుద్ది సద్దు కొద్దిగ దిద్ది
యంకాళుల శశాంక పంకజముల
* * *
ప్రౌఢశిల్పప్రయాసవిభ్రమము జగతి
నెఱప జేసిన గొప్ప మానికపుబొమ్మ
లనగ నన్నగరాంగనాజనము దనరె" (పు. ౧౭)

"శారదపూర్ణిమానిశల
జంగురు డేగ బురంబు మేడలం
జేరుచ యుయ్యెలు బొంగులకు
జేపదునో పతి యంచు భీతిచే
గారియబడ్డ తత్సతుల
ఘర్మకణంబులొ నాగ నిండుకొం
తారచితోజ్జ్వలత్ప్రతిమ
లందులనీరము లుబ్బి గొబ్బునన్"
(పుటలు ౧౫, ౧౬)

"నిత్తమ్మిరాతక్కు మొత్తమ్ముల కడాని
చట్టుపట్టుల రాగచర్చికలను
జేజేలచేని రాజిల్లుమబ్బుల దోచు
పటికంపుగుమి చుక్కతుటుములమర
దెలిచాయ వలిరిగ్గు లలమ దిక్కులనెల్ల
జికిలివెన్నెల దోచు చకచకలను
మగరాల జిగితోడ నిగనిగల్ సొగయించు
వెండిరాచరులరే వెన్నెలలర
గరికరంబుల వెదురులు మురియనెరయు
కలుకుముత్తెల బెళకులకరములమర
సంజకడ దోచు పున్నమచందమామ
పగిది గన్పట్టె గైలాసనగవరంబు" (పుట౧౧)

"మృగమదచర్చి తాంగణను
మేదురమౌక్తికరంగవల్లికల్
దగ భుజగాండకాండమతి
దార్ఢ్యనగా గ్రసనేచ్ఛబోయి యం
దగణితపద్యజాలఖచి
తామలన్మాత్న విదూర ప్రభన్
బెగడుచు బాఱు నప్పురము
పెంపుడుబర్హిణు లగ్గసంస్థితిన్"
(పద్యము ౬౭)

"సుకపోతముఖఘాతవికలాయితానేక
ఫలగళద్రసజలప్రాయవహము

ఆళిడింభగరుదుంభితలతాంతధూళికా
పాండురత్తురు వరప్రాంగణంబు
కరిఘటోద్ధురకటస్ఫురదమందమదప్ర
వాహసచ్ఛాద్వల గ్రాహకంబు
గిరిదరీపరిసరఝ్ఝరసర స్తటమల్లి
కాసుమఘుమఘుమత్కటకభూమి
లసిత బిసరుహ బిసరసగ్రసనధిషణ
విహరదసమమరాళరాజిసరసీప
యోవిలాసవసన్మరుద్యోవతంబు
గణ్యమఖవాటి నైమిశారణ్యవాటి"
(పద్యము ౪౫)

అముద్రితమైయున్న గ్రంథమును పరిశోధించి, గ్రంథప్రాముఖ్యమును విశదమొనరించుచు, అమూల్యములైన పీఠికలతో దీనిని మదరాసు విశ్వవిద్యాలయ ప్రచురణములందలి పదవకుసుమముగా ప్రకటించిన ఆంధ్రమనీషులు బ్రహ్మశ్రీ కోరాడ రామకృష్ణయ్యగారును, బ్రహ్మశ్రీ శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారును వందనీయులు. ఈరీతిగ్రంథములను ప్రచురించి, ఆంధ్రభాషాసీమంతినికి ఈ విద్వాంసులు ఘనతర సౌందర్యమును చేకూర్చెదరుగాక!

జో. స.

వీరశైవమహాత్ములు

కర్త: పండిత కాశీనాథశాస్త్రిగారు. అనువాదకులు: మఠం సిద్ధి వీరయ్యగారు. ప్రకాశకులు: శివధర్మ గ్రంథమాల, సికంద్రాబాదు, దక్కన్. వెల ౦-౪-౦.

పండిత కాశీనాథ శాస్త్రిగారు కన్నడమున రచించినదానికి తెలుగుఅనువాదము ఇది. అతిప్రాచీనమై అనేకవిధాల గౌరవించదగిన వీరశైవమతము ఇటీవల నిద్రనుంచి లేచి మేలుకొంటున్నది. తమ పూర్వులను గురించి చేసిన విచికిత్సకు ప్రతిఫలము ఈ చిన్నకృతి. తన్మతస్థులకే కాక, తదితరులనుగూడ ఆకర్షించునట్టిదిగా ఇట్టిగ్రంథ ముండవలసినది.

ఇట్టి గ్రంథములు వ్రాయుటలోని చిక్కు-చిక్కడంటే - విషయము సశాస్త్రీయంగా రాయతగ్గది. కేవలం సశాస్త్రీయంగా రాస్తే అట్టే వ్యాప్తిలోకి రాదు- ఇదీ చిక్కు. సాహిత్యగ్రంథమువలె చదువుటకు అనువైనప్పుడు ఇట్టివి ఎక్కువగా ప్రజల అంతర్యములోనికి ఎక్కును. ఈగ్రంథము సులభసుందరమైన ధోరణిలో బహుక్లుప్తముగా నున్నది. ఇంకను రసవంతముగా విస్తరింపవలసి ఉన్నది.

రుమీా.

దయాశతకము

శ్రీమన్నిగమాంతమహాదేశిక ప్రణీత సంస్కృత మూలమును, నడాదూరు అమ్మాళ్ నరసింహాచార్యులుగారి ఆంధ్రపద్యటీకా తాత్పర్య విశేషార్థములును ఇందు గలవు. మూలములోని నిగూఢార్థములను తెలుసుకొనుటకు ఈ ఆంధ్రపద్యాదులు అనుకూలముగా నున్నవి. శ్రీ శ్రీనివాసుని దయావిషయము ఇందు చక్కగా ప్రతిపాదింపబడినది. ఈ గ్రంథప్రతులు మద్రాసు - ఆనంద ముద్రణాలయములో లభించును. వెల ౧౨ అణాలు. డిమ్మీసైజున ౧౬౪ పుటలు.

ఆనందవిద్యార్థివ్యాకరణము

గ్రంథకర్త: విద్వాన్ టి. ఆర్మగంపిళ్లెగారు. ప్రకాశకులు: ఆర్. వెంకటేశ్వర అండుకంపెనీ, మద్రాసు. వెల ౧ రూపాయి.

హైస్కూలు తరగతుల విద్యార్థులకొరకై ప్రభుత్వమువారు ప్రచురించిన ప్రణాళిక ననుసరించి యిది వ్రాయబడినది. బాల, ప్రౌఢవ్యాకరణములందలి విషయము లన్నియు ఆ తరగతుల విద్యార్థుల కనుకూలించునంతమట్టుకు ఈ పుస్తకములో సులభవిశదముగా తెలుపబడినవి. ఛందోవిషయములుకూడ ప్రముఖములైనవి సలక్షణముగా విస్తరింపబడినవి. చక్కని వ్యాసరచనకు తప్పనిసరిగా తెలుసుకొనియుండవలసిన రేఫశకటరేఫ ప్రకరణమును, అర్ధానుస్వారప్రకరణ

మును, వాడుకలోనున్న తెలుగు సామెతలును, లౌకిక న్యాయములుకూడ అనుబంధమున చేర్చబడియున్నవి.

నవయుగ

ఇది చిన్నయెత్తుతో, చిన్న ఆకారముతో తల యెత్తిన ఒకఫాసిస్టువిరుద్ధ వారపత్రిక. మొదటిసంచిక మొన్న ౨-వ తేదీనాడు వెలువడినది. క్రమభంగము లేకుండ ఇది తన ఆశయసిద్ధిని యథోచితముగా నెరవేర్చుకొనుగాక యని ఆశించుచున్నాము. సంపాదకులు డి. రామకృష్ణ పరమహంసగారు. పత్రికాకార్యస్థాన మేయూరనో మాత్రము ఈ ప్రథమసంచికలో ముద్రించినారుకారు. మరుసటి సంచికలో నైనను అట్లు చేయుదురుగాక.

తరణి

సారస్వతమాసపత్రిక : సంపాదకులు : చిల్లా సుబ్బరాయసిద్ధాంతిగారు. సాహిత్యపరిషత్తు యొక్క ఈ గణపతి నవరాత్రి సంచిక ఉపర్యుక్త మాసపత్రిక యొక్క ప్రథమసంపుటపు రెండవ నెంబరుగా వెలువడినది. సాహిత్య, ధార్మిక, యాత్రావిషయిక, జ్యోతిష, ఆయుర్వేద సంబంధముగల వ్యాసము లిందు గలవు. సాలుచందా రు. ౨-౦-౦. విడిపత్రిక మూడు అణాలు. కార్యస్థానము : సికిందరాబాదు.

గ్రంథస్వీకారము


నవరసగంగాధరము

[ప్రథమాననము]

శ్రీ జగన్నాథ పండితరాయల రసగంగాధరమునకు అనువాదము. అనువాదకులు : సాహిత్య విద్యాప్రవీణ జమ్ములమడక మాధవరామశర్మగారు, ఉపాధ్యక్షుడు, సంస్కృతకళాశాల, తెనాలి. ప్రకాశకులు : నవ్యసాహిత్య పరిషత్తు, గుంటూరు. ఫెదర్ వెయిటు కాగితములలో ౨౭౦ పుటలు. వెల 3 రూపాయలు.



Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St, Madras. Editor:— S. Sambhu Prasad.



అలకాపరి

[త్రివర్ణ చిత్రమునకు ప్రతికృతి]

చిత్రకారుడు : శ్రీ కుమారిలస్వామి